# ప్రకృతి పుత్రుడు

వసుంధర

నవల




కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల


www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 58



# ప్రకృతి పుత్రుడు – వీడికి నగరం జనారణ్యం

## వసుంధర



ఓ పెద్ద కథ అక్షరాల్లో ఇమిడితే అది నవల. ఆ కథలోంచి దృశ్యాలు పుడితే అది సినిమా. దృశ్యాల్లోంచి కథ పుడితే..? అదే నవలకీ , సినిమాకీ మధ్యాంతరంగా ఉండే సినీవల. సినిమాకోసం ఓ కథ అనుకుని, దానికి అనువైన సన్నివేశాలు కల్పించాక - అది దర్శకుడి చేతిలో సినిమా, రచయిత చేతిలో సినిమావల ఔతుంది. ప్రేక్షకుల వినోదం కోసం - క్రికెట్లో టెస్టు మ్యాచిల్లోంచి వన్డేలూ, వన్డేల్లోంచి ౨౦-౨౦లూ పుట్టుకొచ్చినట్లు, సాహిత్యంలో ఈ తరహా కొత్త ప్రయోగాలు పాఠకుల ఉత్సాహాన్ని పెంచుతూనే సాహిత్యానికి పుష్టినివ్వగలవని ఆశ. క్రికెట్‌తో పోలిక - ఆసక్తి పెంచడం వరకే - పరిమాణం చిన్నబోవడానికి కాదని మనవి. ఇక చదవండి - చూడండి.

– వసుంధర

**అప్పుడే స్నానం చేసిన** భారతి పువ్వులాంటి ఆ శరీరానికి రంగు రంగుల దుస్తులు చుట్టి సీతాకోక చిలుకగా మారింది. ఆ వెంటనే తలిదండ్రుల పాదాల మీద వ్రాలి తులసిదళమయింది. తండ్రి ఆమెను దీవించాడు.

తల్లి మాత్రం, "ముందు దేవుడికి మొక్కాలమ్మా" అంది.

భారతి లేచి నిలబడి, "నాకు మీరే దేవుళ్ళు. వేరే దేవుళ్ళను నేను నమ్మను" అంది.

తల్లి కలవరపడుతూ, "అలాగనకూడదు. అసలే ఈ రోజు నట్టింట్లో పాలొలికాయి. అపశకునం. శుభమా అని ఉద్యోగంలో జేరుతున్నావు. ఈ రోజుకి దేవుణ్ణి ప్రార్థించి వెళ్ళు" అంది.

"నేను శకునాలు నమ్మను" అంది భారతి.

తండ్రి ముచ్చటగా చూస్తూ, "వయసుకు మించిన తెలివి నీది. అందుకే ఓ చిన్న సలహా. నీ వ్యక్తిత్వానికో గుర్తింపు వచ్చేదాకా నీ తెలివితో ఎవర్నీ శాసించకు. లోకాన్ననుసరించు" అన్నాడు.

భారతి నవ్వి, "అమ్మ చెప్పిందే కదా, మీరూ చెప్పారు" అంది.

"అమ్మ మాటల వెనుక అజ్ఞానం, బానిస మనస్తత్వం ఉన్నాయి. మాటల వెనుక అనుభవం, త్యాగం ఉన్నాయి.ఆ తేడాయే లేకపోతే దెయ్యమూ, దేవుడూ కూడా ఒకటే - మా మాటల్లాగే" అన్నాడు తండ్రి.

భారతి ఇంటి గుమ్మం దాటుతుంటే పిల్లి ఎదురైె తన ఉనికిని గమనించలేదనో ఏమో మ్యావుమని కూడా అంది. అది గమనించిందేమో భారతి తల్లి కెవ్వుమంది.

ఇదంతా గమనించనట్లుగానే భారతి వెనుదిరక్కుండా చకచకా ముందుకు సాగిపోయింది.

✡ ✡ ✡

వివేకానందా పబ్లిక్ స్కూల్లో ఆరో తరగతి ఏ డివిజను. ఇంకా టీచరు రాలేదని పిల్లలందరూ ఎవరి ధోరణిలో వాళ్ళున్నారు. కొందరు కబుర్లాడుతున్నారు. కొందరు బొమ్మలేస్తున్నారు. కొందరు పాటలు పాడుతున్నారు. కొందరు తిట్టుకుంటున్నారు. కొందరు కొట్టుకుంటున్నారు.

అప్పుడు భారతి క్లాసులో ప్రవేశించింది. అదామెకు మొదటి క్లాసు.

"కొత్త టీచర్..." క్లాసులో గుసగుసలు. పిల్లలు సీట్లలో ఎవరి సీట్లలో వాళ్ళు సద్దుకున్నారు - ఒక్క భావన తప్ప. ఆమె సీట్లో కూర్చున్న సీతని జడపట్టుకు లాగుతోంది. సీత నొప్పితో కుయ్యోమంటోంది.

భారతి భావనని మందలిస్తూ సమీపించింది. భావన పట్టించుకోలేదు సరికదా, "నేను దీన్ని ఒక్కటే జడేసుకు రమ్మంటే రెండు జడలేసుకొచ్చింది. నన్నాపొద్దు టీచర్ - ఇలా చేస్తే కానీ దీనికి బుద్ధిరాదు" అంటూ సీత జడని మళ్ళీ బలంగా లాగింది.

"మర్చిపోయి రెండు జడలేసుకొచ్చాను. సారీ కూడా చెప్పానుగా" అంది సీత ఏడుపు గొంతుతో.

"నీ జడలు, నీ ఇష్టం. ఈ పాపెవరూ నిన్ను శాసించడానికి?" అంది భారతి కోపంగా.

"ఆ మాట దాన్ననమనండి" అంది భావన సవాలు చేస్తున్నట్లు.

సీత కథ తెలుసుకుందుకు ఎంతో సేపు పట్టలేదు భారతికి.

ఆ ఊళ్ళో ప్రముఖ వ్యాపారస్తుడు భుజంగరావు తన పాపాలు కడుక్కుందుకు అడపా తడపా కొన్ని మంచి పనులు చేస్తుంటాడు. సీతకు తెలివుంది. డబ్బులేదు. ఆమె తలితండ్రులాయనకి తెలుసు. సీత నాయన వివేకానందా పబ్లిక్ స్కూలంత మంచి చోట చదివిస్తానంటే వాళ్ళూ, సీతా కూడా మురిసిపోయారు. కానీ సీత అందంలోనూ, తెలివిలోనూ కూడా క్లాస్‌మేట్ భావనని మించడమూ, ఆ భావన భుజంగరావు కూతురు కావడమూ సీతని కష్టాల్లో పడేసింది.

భావన నోట్సులు సీతే రాసిపెట్టాలి. భావన పుస్తకాలు సీతే మొయ్యాలి. భావన ఎంగిలి చేసి వదిలాకే సీత తన టిఫిను బాక్సులో తిండి తినాలి. భావన ఎలా చెబితే సీత అలా మసలుకోవాలి.

సీత చిన్న పిల్ల, భావన ఆగడాలు భరించలేక తనకీ చదువు వద్దనుకుంది ఆరంభంలో. కానీ ఈ స్వతంత్ర భారతంలో సీతవంటివాళ్ళకి - భుజంగరావులాంటి వాళ్ళొప్పుకుంటే తప్ప - చదువుకోమనే స్వేచ్ఛ కూడా లేదు. తలిదండ్రులు సీతకు నచ్చజెప్పారు. సీత తన మనసుకు నచ్చచెప్పుకుంది.

ఈ దేశంలో ఎందరో జీవచ్ఛవాల్లా బ్రతుకీడుస్తున్నారు. సీత వారిలో ఒకతె అయింది.

"భావనా! సీతకి సారీ చెప్పు" అంది భారతి - సీత కథ తెలిసేక.

"సారీ చెప్పమని దాన్నడగమనండి - చెబుతాను" అంది భావన నిర్భయంగా.

సీత అడగదని భారతికి అర్థమయిపోయింది. అందుకని, "టీచర్ని - చెబుతున్నాను. సీతకి సారీ చెప్పు -" అంది.

"చెప్పను-" అంది భావన

"ఎందుకు చెప్పవు?"

"నేను భుజంగరావు కూతుర్ని"

భారతి తన్ను తాను అదుపు చేసుకుంది. ఇది తన మొదటి క్లాసు. ఇక్కడేం జరిగినా తల్లి దేవుడంటుంది. లేక పోతే పిల్లి అంటుంది.

భారతి తన సీట్లోకి వెళ్ళి శిష్యులందరికీ సర్వమానవ సమానత్వం గురించి నాలుగు మాటలు చెప్పి, "మీరది విద్యార్థి దశనుంచీ తెలుసుకోవాలనే క్లాసులో యూనిఫాం పద్ధతి ప్రవేశపెట్టారు. స్కూల్లో పేదా గొప్పా తేడాలుండకుండా అంతా ఒకే డ్రస్సు వేసుకుంటున్నారు కదా - అలాగే మీరంతా కూడా..." అని ఇంకా ఏదో అనబోతుండగా భావన లేచి నిలబడింది.

"సారీ టీచర్ - అందరివీ ఒకే డ్రస్సులు కావు. నావి కొత్తవి. అవి నేను మాత్రమే వేసుకుంటాను. నేను నాలుగు వారాలు కట్టి విడిచాక అవి సీత వేసుకుంటుంది..." అంది భావన.

క్లాసులో చాలామందే నవ్వారు. వందేమాతరం అన్న భారతీయుణ్ణి - మరో భారతీయుడు లాఠీతో కొడుతుంటే బ్రిటిషువాడు నవ్వినట్లుందా నవ్వు.

భారతిలో ఆవేశం రేగింది - "స్టాండప్ ఆన్ ది బెంచ్" అందామె.

"ఎక్కను" అంది భావన అధికారస్వరంతో.

"బెంచి ఎక్కేదాకా నా క్లాసుకి రాకు - గెటౌట్ -" అంది భారతి.

ఆమె మాటలింకా పూర్తికాకుండానే భావన క్లాసులోంచి వెళ్ళిపోయింది.

భారతి ఆవేశం నుంచి బయటపడ్డానికి ప్రయత్నం చేస్తుంటే పిల్లలమంతా పుస్తకాలు మూసేసారు. అది గమనించిన భారతి,"అలా పుస్తకాలు మూసేయకండి. ఈ రోజు నా మొదటి క్లాసు. ఎంతో కొంత పాఠం చెప్పి తీరుతాను" అంది.

"పాఠమేం చెబుతారు? మీకిప్పుడు ప్రిన్సిపాల్ పిలుపొస్తుందిగా" అందో విద్యార్థిని.

భారతి ఆ మాటకి స్పందించేలోగా ఆమెకి ప్రిన్సిపాల్నించి పిలుపొచ్చింది.

✡✡✡

"భావన పక్క రూంలో ఉంది. వెళ్ళి ఆమెకు సారీ చెప్పమ్మా" అంది ప్రిన్సిపాలు భారతితో.

భారతి దెబ్బతిని, "భావన మీకేం చెప్పిందో తెలియదు. మీరు నేను చెప్పేది వినరా" అంది.

"కురుక్షేత్ర యుద్ధాన్ని ఆదినుంచీ సంజయుడు దృతరాష్ట్రుడికి చెబుతూనే ఉన్నాడు. విని ఆయనేం చేశాడు? ఆయన మహారాజు. నేను ప్రిన్సిపాలు. విని ఊరుకోవడమే మా సంప్రదాయం -"

భారతి ఆవేశపడి. "భావన మాటమాటికీ తను భుజంగరావు కూతుర్నంటుంది. కానీ స్కూల్లో చేరాక ఆమె కూడా ఒక స్టూడెంటు. అంతే! ఆ విషయం ఆమె గుర్తించేలా చేయడం మన కర్తవ్యం" అంది.

"ప్రతి వంశంలోనూ ఓ మహాపురుషుడు పుట్టి పేరు తెచ్చుకుంటాడు. ఆ తర్వాత ఆ వంశం వాళ్ళు పేరు తెచ్చుకుందుకింకేం చేయక్కర్లేదు - ఆ మహాపురుషుడికి కొడుకో, కూతురో, కోడలో, అల్లుడో, మనుమడో మనుమరాలో అయితే చాలు అంత పేరూ, అంత హోదా, అంత గౌరవం, అంత ఆదరణా లభిస్తుంది. అది మన సంప్రదాయం -"

"కానీ పాఠశాల క్షీరసాగరం వంటిది, దీన్ని మథిస్తే..."

"ముందు హాలాహలంపుడుతుంది. దాన్ని భరించగల శక్తి నీకుండదు -"

"అయితే నేనేం చేయాలి?"

"టీచరంటే మేఘం. వర్షించడం నీ బాధ్యత. చిప్పలోన బడ్డ చినుకు ముత్యంబయ్యె, నీట బడ్డ చినుకు నీట కలిసె...."

"అలా ఉండడం నా వల్లకాదు. నేనీ ఉద్యోగానికి రాజీనామా చేస్తాను-" అంది భారతి.

"సీత చదువు మానాలనుకుంది. మానగలిగిందా? నువ్వూ అంతే - భుజంగరావుగారొప్పుకోకపోతే నువ్వు రాజీనామా చెయ్యలేవు. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తీసుకు రాకు. నా మాట విని భావనకి సారీ చెప్పు."

"చెప్పకపోతే?"

ప్రిన్సిపాలు విసుగ్గా, "ఎక్కువగా ప్రశ్నలేయకు. ఐదు నిముషాల్లో నా బల్ల మీద ఫోను మ్రోగుతుంది. ఈలోగా భావనకి సారీ చెప్పకపోతే - విషయం భుజంగరావుగారికి ఫోన్లో చెప్పాలి"

"మేడం - ఇలాంటి బెదిరింపులు నా కిష్టముండదు. నేను వెడుతున్నాను"

"చూడమ్మా భారతీ - నా మాటల వెనుక అనుభవం, లౌక్యం ఉన్నాయి. వాటి నర్థం చేసుకుందుకు నీ తెలివి చాలదు. గుడ్డిగా అనుసరించావా - అది నీకే మంచిది" ప్రిన్సిపాలు అనునయంగా చెప్పింది.

ఆ మాటలు వినగానే తండ్రి గుర్తుకొచ్చాడు భారతికి. ప్రిన్సిపాల్ని చూస్తే ఆమె చూపుల్లో తండ్రి కనిపించాడు.

భారతి ఆగింది.

అప్పుడే బల్లమీద ఫోను మ్రోగింది.

ప్రిన్సిపాలు కంగారుగా, "భుజంగరావుగారే - సందేహంలేదు. వెళ్ళమ్మా - భావనకి సారీ చెప్పు" అంది.

"కంగారుపడకండి, భుజంగరావుగారితో నేను మాట్లాడతాను" అంది భారతి.

ప్రిన్సిపాలు నవ్వి, "భుజంగరావుగారితో మాట్లాడ్డముండదు. ఆయన మాట్లాడుతుంటే వినడమే" అంటూ ఫోను తీసింది. ఓ క్షణం గడిచాక, "ఆమె ఇక్కడే ఉంది. ఫోన్ ఇస్తున్నాను" అంది.

భారతి ఫోనందుకని ఏదో మాటాడబోయి ఆగిపోయింది. అవతలనుంచి ఏమి వినబడుతోందో ఏమో క్రమంగా ఆమె ముఖం పాలిపోయింది.

ఆమె ఫోను పెట్టేస్తే - ప్రిన్సిపాలు ఆమెని జాలిగా చూసింది.

"ఆరో తరగతి ఏ డివిజన్‌కి, తరువాత క్లాసు కూడా నాదే - భుజంగరావుగారు చెప్పారు-" అంది భారతి.

"ఒకే - డన్" అంది ప్రిన్సిపాలు.

✡✡✡

క్లాసులో అందరూ బుద్ధిగా కూర్చున్నారు. వారిలో భావన కూడా ఉంది.

భారతి క్లాసులో ప్రవేశించింది. శిష్యులందర్నీ గంభీరంగా చూసింది. కళ్ళు చెమ్మగిల్లకుండా ఆపుకుంది. గొంతు తడి కాకుండా సవరించుకుంది. నెమ్మదిగా, "భావనా!" అంది.

భావన వినయంగా లేచి నిలబడింది.

"తప్పెవరు చేసినా తప్పే. జాతి మత కుల వివక్షత లేదు. పేదా గొప్పా తేడా లేదు. గురుశిష్యులన్న బేధం లేదు. నువ్విలారా" అంది భారతి.

భావన ముందుకు వెళ్ళింది.

"అలా కుర్చీలో కూర్చో!" అంది భారతి.

అది టీచరు కుర్చీ. భావన తటపాయించకుండా అందులో కూర్చుంది.

భారతి నెమ్మదిగా భావన సీటు వద్దకు వెళ్ళింది. నెమ్మదిగా బల్ల ఎక్కి నిలబడింది.

"తప్పు చేసాను కదా - అందుకని బెంచీ ఎక్కాను" అంది భారతి.

అలాంటిది చూడ్డం అదే మొదటిసారేమో క్లాసు క్లాసంతా నివ్వెరపోయింది.

భారతి పాఠం మొదలు పెట్టింది.

క్లాస్‌రూం ఎంట్రన్సు దగ్గర జర్నలిస్టుల కెమేరాలు కాబోలు తళుక్కుమన్నాయి.

✡ ✡ ✡

మర్నాటి ఉదయానికల్లా - భారతిని ఆదర్శ ఉపాధ్యాయినిగా అభివర్ణిస్తూ -

ఒకటి కాదు, రెండు కాదు, మొత్తం మూడు దినపత్రికలు ఆ సంచలన వార్తని ఫోటోతో సహా ఫ్రంట్ పేజీలో చదవరులకందించాయి.

రెండు కాదు. మూడు కాదు, మొత్తం టీవీ ఛానెళ్ళన్నీ ఆ దృశ్యాన్ని ప్రైం టైములో ప్రేక్షలకి అందించాయి. వార్తలో ఆదర్శం తళుక్కుమంటున్నా - భుజంగరావు కూతురితో జతపడ్డ ఆ వార్త ఎందరి హృదయాల్నో కలుక్కుమనిపించింది.

అలా కలుక్కుమన్న హృదయాలలో ఒక్కటి మాత్రం లేతది. అది వనజ అనే పన్నెండేళ్ళ పాపది.

వనజ వివేకానందా పబ్లిక్ స్కూల్లోనే ఎనిమిదో తరగతి చదువుతోంది.

ఆమెకి భావన తెలుసు. భావన పొగరూ తెలుసు. అందులో ఆశ్చర్యం లేదు. భావనతో కాస్త పరిచయమైతే చాలు ఆమె పొగరుతోనూ పరిచయమౌతుంది.

ఏం జరిగిందో వనజ ఊహించింది. ఊహలోని వాస్తవాన్ని అంచనా వేయడానికామె ఒక రోజంతా కష్టపడి ఆరాలు తీసింది. సేకరించిన సమాచారంతో - ఒక పత్రికా కార్యాలయానికి వెళ్ళింది. తనవద్ద సంచలనవార్త ఉందంటే ఆమెకు వెంటనే సంపాదకుడి ఇంటర్వ్యూ దొరికింది. ఐతే సంపాదకుడామె చెప్పింది విని, ''ఇది భుజంగరావుగారి పేపరు. ఇందులో నిజానికి మాత్రమే ప్రాధాన్యమిస్తాం'' అన్నాడు.

''నేను చెబుతున్నది నిజమే'' అంది వనజ.

''నిజమంటే ఆయనకు అనుకూలంగా ఉంటుంది. లేదా ఆయన ప్రత్యర్థులకి ప్రతికూలంగా ఉంటుంది'' అంటూ ఆయన ఆమె వయసుని కూడా పరిగణనలోకి తీసుకోకుండా నిజాన్ని నిర్వచించాడు.

''నేను చెప్పేది నిజమని నిరూపిస్తే?'' అంది వనజ వయసుకు మించిన ఆవేశంతో.

''నువ్వు నిరూపించేది నిజంకాదు. మేము ప్రచురించేదే నిజం'' అన్నాడు సంపాదకుడు.

వనజ మరో పత్రిక కార్యాలయానికి వెడితే, ''మా పత్రికలో బ్రతికున్న మనిషి మరణవార్త వేస్తే ఆ మనిషిని చంపేస్తాం తప్ప - వార్తను సవరించం'' అన్న సమాధానం లభించింది. మొదటి పత్రికంత కాకపోయినా ఈ పత్రికతోటి భుజంగరావుకి అంతో ఇంతో సంబంధముందని ఆమెకి తెలిసింది.

వనజ పట్టువిడలేదు. భుజంగరావుకే మాత్రం సంబంధంలేకుండా, అప్పుడప్పుడు ఆయనకి వ్యతిరేకంగా వార్తలు కూడా ప్రచురించే పత్రిక గురించి ఆరా తీసి ఆ సంపాదకుణ్ణి కలుసుకుంది. జరిగిన ఘోరాన్ని చెప్పి, ''భుజంగరావు భారతీ మేడమ్‌తో ఫోన్లో ఎంత అనాగరికంగా మాట్లాడారో తెలియదు. కానీ ఆయన చర్యని సహించడం అంతకన్నా అనాగరికం'' అంది.

''ఒక మామూలు టీచరుకోసం - భుజంగరావువంటి వాళ్ళకి ఎదురు తిరగలేం. నువ్వో పెద్ద రాజకీయనాయకుణ్ణి పట్టుకో. ఆయన రికమెండ్ చేస్తే మేమీ వార్త ప్రచురించగలం'' అన్నాడా సంపాదకుడు.

వనజ ఆవేశపడితే సంపాదకుడా ఆవేశానికి ముచ్చట పడి, ''నీలోని ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుకి నా అభినందనలు. ముందు డిగ్రీ దాకా ఐనా చదువు పూర్తి చెయ్యి. మా పత్రికకి రిపోర్టర్ని చేస్తాను -'' అన్నాడు.

"నాకు పత్రికల మీద నమ్మకం పోయింది. ఇక రిపోర్టర్నయ్యే ప్రసక్తే లేదు" అంటూ వనజ అక్కణ్ణించి లేచింది. సంపాదకుడు భారంగా నిట్టూర్చి, "నీకు కొన్ని మాటలు చెప్పాలనుంది కానీ నా హోదా అందుకనుమతించదు. పక్క గదిలో సీనియర్ రిపోర్టరు సత్యంగారున్నారు. వెళ్ళేముందోసారి ఆయన్ను కలుసుకో" అన్నాడు. వనజ ఆశ్చర్యంగా చూస్తే - ఆయన తలదించుకుని తన ముందున్న కాగితాలు చూస్తున్నాడు.

✡✡✡

నెరిసిన జుత్తు, ముడతల ముఖం. పీల శరీరం - వెరసి సత్యం.

సత్యం వనజ చెప్పినదంతా ఓపిగ్గా విని చిరునవ్వు నవ్వి, "ఎప్పుడైనా రోడ్డుమీద అడుక్కునే వాణ్ణి చూసేవా?" అన్నాడు.

"ఊఁ" అంది వనజ

"నా వయసున్న నా అంత బక్కప్రాణి రిక్షాలాగడం చూసావా?"

"ఊఁ"

"ఈ సమాజంలో వాళ్ళకేదో అన్యాయం జరిగిందని నీకు తోచలేదా మరి?" అన్నాడు సత్యం.

వనజ ఈ ప్రశ్నకు తెల్లబోయింది.

"టీచరు నీ సాటి మనిషి. అందుకే ఆమె కష్టానికి నీ మనసు స్పందించింది. నీకంటే తక్కువ స్థాయి మనుషుల గురించి నీ మనసు స్పందించదు. అలాంటప్పుడు భుజంగరావు వంటి వాళ్ళు తమకంటే తక్కువ స్థాయి టీచరు గురించి ఎందుకు స్పందించాలి?"

"అంటే?" అంది వనజ.

"పత్రికలు సమాజానికి దర్పణం. ఇప్పటినుంచీ వాటిమీద నమ్మకం పోగొట్టుకోకు"

"మరి భారతీ టీచర్కి జరిగిన అన్యాయాని అలా చూస్తూ ఊరుకోవలసిందేనా?"

సత్యం నవ్వాడు, "భారతీ టీచర్ అమ్మనడుగు. నేనప్పుడే చెప్పానే - పిల్లి శకునం వచ్చిందని - అంటుంది. ఆమె నాన్ననడుగు. మనిషి తెలివికి అనుభవం, లౌక్యం జతపడాలంటాడు. ఇక భారతీ టీచర్ విషయం. ఆమె బట్టలు పనిమనిషి ఉతుకుతుంది. గిన్నెలు పనిమనిషి తోముతుంది. ఆమె రిక్షా ఎక్కితే ఓ మనిషి ఆ బరువును లాగుతాడు. ఆమె సూట్ కేసు బరువుగా ఉంటే ఓ మనిషి దాన్ని మోస్తాడు. అలాంటి భారతి టీచర్ని భుజంగరావు బెంచీ ఎక్కించాడు. దాన్నేగా నువ్వన్యాయమంటున్నది!"

"మీరు నిజాన్ని పక్కదారి పట్టిస్తున్నారు..."

సత్యం తల అడ్డంగా ఊపి, "నాగరికత పెరిగిన కొద్దీ, విజ్ఞానం పెంపొందిన కొద్దీ - సామాన్య మానవుడికి నిజం చెప్పడం ప్రమాదమవుతుంది. అయితే సముద్రంలో బడబాగ్ని ప్రజ్వరిల్లినట్లు పత్రిఖాలోకంలోనూ 'కాంతి కిరణం' ఉంది. నిజాన్ని నిర్భయంగా ప్రకటించి మనగలిగిన శ్యామలరావు ఆ పత్రికా సంపాదకుడు. నువ్వయన్ని కలవడం నీకూ ఆయనకూ, బహుశా ఈ ప్రపంచానికీ కూడా మంచిది కావచ్చు" అన్నాడు.

"కాంతి కిరణం - ఆ పేపరు గురించి నేను వినలేదే!" అంది వనజ ఆశ్చర్యంగా.

"పత్రికాలోకంలో అంతగా ప్రాధాన్యం లేని కాంతి కిరణం గురించి తెలిస్తే ఆశ్చర్యపడాలి కానీ తెలియకపోతే ఆశ్చర్యమేముంది?" అన్నాడు సత్యం.

వనజ లేచి నిలబడింది.

"ఈ విషయాన్నింతటితో మరిచావో, అందరు సామాన్యులా నువ్వూ హాయిగా బ్రతకొచ్చు శ్యామలరావును కలిసావో - నీ జీవితానికి పెనుతుఫాను తప్పదు. ఆ తాకిడికి తట్టుకోగలవో లేదో ఆలోచించుకో"

వనజ ఆయనకు రెండు చేతులూ జోడించింది, "మీ మాటల్లో హెచ్చరిక కాదు - దీవెనలు వినిపిస్తున్నాయి"

✡✡✡

కాంతి కిరణం పత్రికా కార్యాలయం. విజిటర్సు హాల్లో గోడకు పెద్ద అక్షరాలలో వ్రాయబడిన సందేశ పటం వ్రేలాడుతోంది.

"నాగరికత మృగాన్ని మనిషిగా మార్చి కొండ గుహల్లోంచీ నగరాల్లోకి నడిపించింది. ఇప్పటికీ మనిషి కాలేని మృగాలు కొన్ని అబద్ధపు చీకట్లను సృష్టించి సామాన్యులను చాటు దెబ్బ తీస్తున్నాయి. మనుషుల మధ్య మృగాలను గుర్తించడానికి ఆవిర్భవించినదే కాంతి కిరణం."

అప్పుడే అక్కడ అడుగుపెట్టిన వనజ ఈ వాక్యాలు చదివి ఎంతో ప్రభావితురాలయింది.

ఆమెకు శ్యామలరావు దర్శనభాగ్యం తొందరగానే లభించింది. ఆయన ఆమె చెప్పిందంతా విని చేయిసాచి, "భావి భారత విలేకరీ - నీకు నా అభినందనలు -" అన్నాడు.

వనజ తన చేతిని ముందుకు చాపకుండా, "నేను చెప్పిన నిజాలు మీరు ప్రకటిస్తారా?" అంది.

"జవాబుకి రేపటి కాంతికిరణం చూడు -" గంభీరంగా అన్నాడాయన.

✡✡✡

## -2-

**మర్నాడు 'కాంతికిరణం'** మొదటి పేజీ చూస్తున్న వనజ కళ్ళు పెద్దవయ్యాయి.

అదే వార్త. మూడు పత్రికలు తిరస్కరించిన వార్త. పెద్ద పెద్ద అక్షరాలతో ఆకర్షణీయంగా సవివరంగా...

"భుజంగరావు బండారం బయటపడింది" అని ఉత్సాహపడిన వనజ మొదటినుంచి చివరిదాకా చదివి - నీళ్ళుకారిపోయింది.

వార్త చివర ప్రత్యేక విలేకరి రఘు పేరు, ఎంతో కష్టపడి - వివరాలు సేకరించినందుకు ప్రత్యేక అభినందనలు.

ప్రతిభ వనజది, ఘనత రఘుది. అసలు వార్తల్లో ఎక్కడా వనజ ప్రసక్తే లేదు.

మోసం... దగా.. దోపిడి...

వనజ ఆవేశం పట్టలేకపోయింది. టైము చూసుకుంటే అప్పటికింకా ఏడయింది.

బడి తొమ్మిదింటికి. మామూలుగా అయితే ఎనిమిదిన్నరకి బయలుదేరుతుంది - ఇంటి దగ్గర. ఆ రోజు మాత్రం వేరే పనుందని ఏడున్నరకే బయలుదేరింది వనజ.

✡✡✡

వనజ కాంతికిరణం కార్యాలయానికి చేరుకునే సమయానికి వెయిటింగు హాల్లో ఓ యువకుడు కనిపించాడు. ఎడిటరుగారు లేరట. అతడూ ఆయనకోసమే ఎదురు చూస్తున్నాడు.

వనజ నిట్టూర్చి తనూ అక్కడ కూర్చుంది. స్కూలు బ్యాగు పక్కన పెట్టింది.

ఆ యువకుడామె స్కూలు బ్యాగు, దానిమీద ఆమె పేరు చూసి, "సో - యూ ఆర్ మిస్ వనజ?" అన్నాడు.

వనజ అతణ్ణి ఆశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ చూసింది.

"నా పేరు రఘు"

ఉన్నట్లుండి వనజ ముఖం ఎర్రబడింది, "అంటే కాంతి కిరణం ప్రత్యేక విలేకరి."

రఘు తలూపాడు.

"యూ ఆరే చీట్" అంది వనజ చటుక్కున.

రఘు నవ్వి, "చీట్ ముందు ఏ వాడకూడదు. అది నిత్య బహువచనం" అన్నాడు.

వనజ ఉక్రోషంగా, "నా క్రెడిట్ నువ్వు కోట్టేసి ఇంకా నవ్వుతున్నావా? నీకు సిగ్గులేదు" అంది.

"బాబాయి చెప్పాడు. నీకు పేరు కాదు, నిజం బయటపెట్టడమే ప్రధానమని..." నెమ్మదిగా అన్నాడతడు.

"బాబాయి ఎవరు?"

"కాంతికిరణం ఎడిటర్ శ్యామలరావుని రిపోర్టర్సెవరూ సర్ అనం. బాబాయనే పిలుస్తాం"

"నాకు పేరక్కర్లేదు. కానీ నిజం బయటపెట్టడానికి ఎంత కృషి చేశాను? ఆ కృషికి తగ్గ గుర్తింపు రాకపోతే నాకు బాధగా ఉండదా?" అంది వనజ.

"నిండా పన్నెండేళ్ళు లేవు. అప్పుడే ఇంత కీర్తికాంక్షా?" ఎగతాళిగా అన్నాడు రఘు.

వనజకు ఉక్రోషం వచ్చింది. జవాబు చెప్పలేక ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రఘు అది గమనించి, "ఛీ - అలా ఏడవకూడదు పాపా! గుర్తింపు కోసం క్లాసులో ఫస్ట్‌రాంక్ తెచ్చుకో. ఆటల్లో మేటివి కా. అంతేకానీ ఇప్పట్నించీ పత్రికా విలేకరినే కావాలి అనుకోకు -" అన్నాడు ఓదార్పుగా.

"నాకు గుర్తింపు రావాలంటే పత్రికా విలేకరినే కావాలి" అంది వనజ పట్టుదలగా.

"ఏం? నీకు చదువులో తెలివిలేదా? ఆటల్లో ప్రావీణ్యం లేదా?" ఎత్తిపొడిచాడు రఘు.

ఉన్నట్లుండి వనజకి దుఃఖం వచ్చింది. కాసేపు ఆమె వెక్కివెక్కి ఏడ్చింది.

రఘు తెల్లబోయి, "ఈమె వయసు ఫుడు తెలుస్తోంది" అనుకున్నాడు.

వనజ తొందరగానే తేరుకుని, "అమ్మా నాన్నా ఉంటే పొగడ్తలకీ గుర్తింపుకీ లోటుండదు. నావంటి వాళ్ళకి స్వయంకృషి తప్ప మరో మార్గం లేదు. కానీ నాకృషి ఫలాన్ని నువ్వు కాజేసావు -" అంది.

రఘు ఆమెని జాలిగా చూసి, "నీకు అమ్మా నాన్నా లేరన్నమాట. కానీ నీ మాటల అర్థమేమిటి?" అన్నాడు.

అప్పుడు వనజ అతడికి క్లుప్తంగా తన కథ చెప్పింది.

ఆమెకి చిన్నతనంలోనే తలిదండ్రులు పోయారు. ఆర్థిక సమస్యల్లేని బంధువులామెను చేరదీశారు. వాళ్ళామెను నిర్లక్ష్యం చేయలేదు. ఆమెని చదివించి పెళ్ళి చేసి పంపేయాలని వాళ్ళ ఉద్దేశ్యం. అయితే వాళ్ళు వనజను అతిధిలా చూస్తారే తప్ప స్వంతమనిషిలా భావించరు. తమ పిల్లలకు ఫస్ట్ క్లాసు మార్కులొస్తే మహదానంద పడిపోతారు. వనజ క్లాసుకే ఫస్ట్‌గా వస్తే అలాగా అని విని

ఊరుకుంటారు. తమ పిల్లలు ఆటల్లో పాల్గొంటేనే విశేషం. వనజ చాంపియన్ అయినా పట్టించుకోరు. అందరి దృష్టినీ ఆకర్షించడానికి వనజ అన్నింట్లోనూ అందరికుంటే ముందుండాలని కృషి చేస్తోంది.

"మా ఇంట్లో నాకు స్థలముంది. స్థానం లేదు. 'కాంతి కిరణం'లోనూ అంతే - , నా మాటకి స్థలం దొరికింది. నాకు స్థానం దొరకలేదు" అంది వనజ.

సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చిన శ్యామలరావు ఈ మాటలు విని మెచ్చుకోలుగా చప్పట్లు కొట్టాడు.

రఘు గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డాడు. వనజ కోపాన్ని కూడా మరచి సిగ్గుపడింది.

"లోపలికి రండి" అన్నాడు శ్యామలరావు తను నడుస్తూ.

ముగ్గురూ ఆయన గదికి వెళ్ళారు. తమతమ స్థానాల్లో కూర్చున్నారు.

"అమ్మాయ్ వనజా! చాలామంది నన్ను అభిమానంగా బాబాయ్ అని పిలుస్తారు. కానీ ఈ రోజు నుంచీ నేను నీకు నిజంగా బాబాయిని, కూతురుగా నా హృదయంలో స్థానం సంపాదించుకున్నావు. సంతోషంగా ఉందా?" అన్నాడు శ్యామలరావు.

వనజ మాట్లాడకుండా రఘు వంక గుర్రుగా చూసింది.

శ్యామలరావు అది గమనించాడు, "చిన్నపిల్లవి, ఆడపిల్లవి. గుర్తింపు కోసం ప్రాకులావంటే నిజాన్ని వెలికితీయగల నీ శక్తి మొగ్గలోనే త్రుంచి వేయబడుతుంది. నీ పేరు మరుగున ఉండడం నీకే మంచిది. అందుకే నీ పేరు రఘుకి దక్కింది. ఇప్పుడే కాదు. ఇక ముందు కూడా అలాగే జరుతుంది అనీ -"

అప్పుడే రఘు ఆమె భుజం మీద చెయ్యి వేసి, "నాకు చెల్లెళ్ళు లేరు. ఈ రోజునుంచీ నువ్వు నా చెల్లివి. నిన్ను రక్షించాలనే బాబాయి సూచనకి ఒప్పుకున్నాను. ఇది నిజం" అన్నాడు.

వనజకి అసలు విషయం అర్థమైంది, "ఈ ఆప్యాయత చాలు నాకు. గుర్తింపు అక్కర్లేదు" అందామె.

"ఇది చెప్పడానికేనా ఇంతదూరం - పొద్దున్నే వచ్చావు" అన్నాడు శ్యామలరావు.

"లేదు బాబాయ్ - ఈ రోజు 'కాంతి కిరణం' చూడగానే నిన్న మీకు షేక్ హ్యాండివ్వలేదని గుర్తొచ్చింది" అంటూ చేయి ముందుకు సాచింది వనజ.

బల్లకి అటువైపున్న శ్యామలరావు ఆమెచేతిని బలంగా పట్టుకుని ముందుకులాగాడు. అప్రయత్నంగా ముందుకు వాలిన వనజ ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని మృదువుగా ఆమె నుదుటిమీద చుంబించాడు. వనజకప్పుడు అలౌకికానుభూతి...

✡✡✡

ఒక వారం తర్వాత..

క్లాసులో క్లాస్‌మేట్ లలిత మాటల సందర్భంలో తన గ్రామంలో జరుగుబోతున పెళ్ళి ప్రసక్తి తెచ్చింది. లలితకి సంబంధించి అది మరీ మామూలు కబురు.

చెట్టుకి కాసిన కాయ భూమీద పడితే లలితకి సహజం. న్యూటన్‌కీ కాదు, వనజకీ కాదు.

కాయ ఆకాశం వైపు మళ్ళదేం, పక్కలకెళ్ళదేం, భూమ్మీదే పడుతుందేం - అని న్యూటన్ ప్రశ్నలు

వనజ కూడా లలితని అలాంటి ప్రశ్నలే వేసింది. అప్పుడు వాటిలోంచి పుట్టుకొచ్చిందీ అద్భుత విశేషం.

ఆ ఊళ్ళో హిరణ్యారావున్నాడు. ఆ ఊళ్ళోనే భూత్‌నాథ్ ఉన్నాడు.

ఇద్దరికిద్దరూ ప్రముఖ రాజకీయ వాదులు. ఆగర్భశత్రువులు ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగుమటుంది.

ఇద్దరి పేరునా ఊళ్ళో నిత్యం కొట్లాటలు. వాళ్ళిద్దరి మధ్యా సఖ్యత ఉంటే ఊళ్ళో శాంతి నెలకొంటుందని - అంతా అనుకుంటారు. కానీ అలా అనుకునేళ్ళంతా అమాయకులని ఇప్పుడు వనజకు తెలిసిపోయిమి.

లలిత చెప్పిన పెళ్ళి హిరణ్యారావు చెల్లెలిది. వరుడు భూతనాథ్ తమ్ముడు. పెళ్ళిచూపులు లలిత ఊళ్ళో జరిగాయి. పెళ్ళికూడా అక్కడే జరుగనుంది. విశేషం ఏమిటంటే హిరణ్యారావు చెల్లెలి గురించీ, భూతనాథ్ తమ్ముడి గురించీ నగరంలో ఎవరికీ తెలియదు. వనజకీ కబురు తెలిసేక ఆవేశం కాదు, ఉద్రేకం - కట్టలు తెంచుకుంది.

హిరణ్యారావుకి, భూతనాథ్‌కీ ఈ శత్రుత్వమేమిటి? వారింట చాటుగా ఈ పెళ్ళేమిటి?

ఇది నిస్సందేహంగా రఘుని చేరాల్సిన సంచలన వార్త.

✡✡✡

వనజ కాంతి కిరణం ఆఫీసుకి వెడితే అక్కడ శ్యామలరావు లేడు."బాబాయ్ రఘుని చూడ్డానికి హాస్పిటల్‌కి వెళ్ళాడేమో" అన్నాడాఫీసులో ఓ వ్యక్తి.

"రఘు హాస్పిటల్లో ఉన్నాడా - ఎందుకు?"

ఆ వ్యక్తి నవ్వి, "కాంతికిరణం రిపోర్టర్లకని హాస్పిటల్లో ఎప్పుడూ ఓ బెడ్ రిజర్వై ఉంటుంది.ఎందుకంటే ఏం చెప్పను?" అన్నాడు.

వనజ అతడి వద్ద హాస్పిటల్ అడ్రసు తీసుకుంది.

"నీ కృషికి నేననుభవిస్తున ఫలం" అన్నాడు రఘు.అతడి తలచుట్టూ బేండేజి. కాలికి చేతికీ బేండేజి.

వనజ భోరున ఏడ్చింది.

"ఛీ - దెబ్బలు తిని నేను నవుతున్నాను. నన్ను చూసి నువ్వేడుస్తున్నావు. మరి నువ్వు నాకు చెల్లెలివికావా?" అన్నాడు రఘు.

"ఈ దెబ్బలు నావి. అందుకే నిన్నుకాక నన్ను బాధపెడుతున్నాయి" అందివనజ గొంతు సవరించుకుని.

"ఈ అన్న ఉండగా నీకు బాధలుండవు. నీ బాధల్నీ నావి. అదే మంచిది కూడా. ఎందుకంటే బాధలు నన్నేడిపించవు, నవ్విస్తాయి"

"నీకు మరో కొత్త విశేషం చెబుదామని వచ్చాను కానీ నిన్నలా చూసాక నా తప్పు నాకు తెలిసింది. నా పేరు కొట్టేయడంలో నీకు లాభముందనుకున్నాను. కానీ త్యాగముందని ఇప్పుడే అర్థమయింది -"

రఘు నవ్వుతూ, "నా నవ్వుకింకో కారణముంది. నన్ను కొట్టిన వార్త కాంతి కిరణంలో కూడా చోటు చేసుకోదు -" అన్నాడు.

"ఎందుకని?"

"ఈ దేశంలో సామాన్యుడు తినే దెబ్బలముందు ఈ దెబ్బలేపాటివి? సామాన్యుణ్ణి శత్రుదేశాలనుంచి రక్షించడానికి మన జవానులు సరిహద్దుల్లో చిత్రహింసలకు గుర్వుతున్నారు. సామాన్యుణ్ణి శత్రువులనుంచి రక్షించడానికి నా బోంటోల్లు నగరాల్లో ఈ దెబ్బలు తింటున్నారు. అయితే భుజంగరావు వంటివారికి శత్రువులన్న గుర్తింపు ఉండదు. అదొక పత్రికా రాజకీయం"

వనజ నిట్టూర్చి, "మనదేశం గురించి నాకొక్కటే అర్థమవుతోంది. మనకింకా స్వతంత్రం రాలేదు" అంది.

రఘు తల అడ్డంగా ఊపి, "స్వతంత్రం మనకు చిటారు కొమ్మన మిఠాయిపొట్లం. అందుకోవాలంటే అంతెత్తైనా ఎదగాలి. లేదా అంతెత్తుకు ఎగరాలి. మనం రెండూ చేయడం లేదు" అన్నాడు.

"ఏదేమైనా నువ్విక ఎగిరే ప్రయత్నం చేయకు. కిందపడి తగిలించుకున్న దెబ్బలు చాలు" అంది వనజ.

"అది సరే - నువ్వేదో విశేషం చెబుతానన్నావు..."

"నీకు చెప్పను -" అంది వనజ.

"చెప్పనంటే ఎలా? మనని అన్నా చెల్లెళ్ళని చేసిందే ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం. మర్చిపోకు."

"కావచ్చు. కానీ ఈ చెల్లికి అన్న దక్కాలంటే ఈ తరహా జర్నలిజానికి స్వస్తి చెప్పాలి. తప్పదు"

"ఈడుకి మించిన మాటలు. ఎక్కణ్ణించి నేర్చావు తల్లీ!" అన్నాడు రఘు.

"అమ్మా నాన్నాలేని ఏ పిల్లలైనా ఇలాగే మాట్లాడగలరు" అంది వనజ.

"సరే అసలు విషయం చెప్పు" అడిగాడు రఘు మాట మార్చుతూ.

వనజ చెప్పనంది. రఘు బ్రతిమాలాడు.

వనజకు చెప్పాలనే ఉంది కానీ రఘుకేమవుతుందోనని భయం. చివరికి రఘు, "నన్ను కొట్టిన వాళ్ళపై ఎదురు దెబ్బతీయడానికి ఇప్పుడు నాకున్న బలం చాలదు. కాబట్టి ఆ బలం చేకూరేదాక ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి స్వస్తి. నీమీద ఒట్టు, సరేనా!" అన్నాడు.

అప్పటికి వనజ తృప్తిపడి అతడికి హిరణ్యారావు, భూతనాధ్ రహస్య బంధుత్వం గురించి చెప్పింది.

"అబ్బ - భలే వార్త చెప్పావ్ తల్లీ" అన్నాడు రఘు ఉత్సాహంగా.

"నా మీద ఒట్టేసావ్ - గుర్తుంచుకో" వనజ హెచ్చరించింది.

✡✡✡

రెండురోజుల తర్వాత - "హిరణ్యారావు, భూతనాథ్‌ల శత్రుత్వంలో నిజమెంత?" అన్న శీర్షికతో కాంతి కిరణంలో ఓ చిన్న వార్త. ఆ పైన విలేకరి రఘు పరిశోధించి తెలుసుకున్న అద్భుత రహస్యాలు త్వరలోనే ప్రచురించగలమని పాఠకులకి వాగ్దానం.

వార్త చూడగానే - ఒట్టేసి తప్పాడని వనజకి రఘు మీద కోపమొచ్చింది.

"నేను నిజంగా చెల్లిని కాదుగా - నా మీద ఒట్టుకు విలువనివ్వడానికి?" అనుకుందామె. ఆ వెంటనే, "నా మీద వేసింది ఒట్టు మాత్రమే - కానీ ఈ వార్తవల్ల తన ప్రాణమే పోవచ్చుకదా - ఎందుకింత తెలివితక్కువ పనిచేశాడు?" అని కూడా అనుకుందామె.

ఏదేమైనా రఘుమీద కోపంతో నాలుగైదు రోజులు అతణ్ణి కలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదామె. ఆ తర్వాత మాత్రం ఉండబట్టలేక బయట్నించి కాంతి కిరణం ఆఫీసుకు ఫోన్ చేసి రఘు గురించి అడిగింది.

"నాలుగు రోజులుగా పత్తాలేడు. ఎవరైనా లేపాసారేమో-" అందవతలిగొంతు.

వనజకి గుండె గుభేల్మంది,"ఎంత సింపుల్‌గా అన్నారు? ఓ మనిషి ప్రాణం అంత చౌకగా ఉందా?" అంది.

"కాంతి కిరణం రిపోర్టరంటే బ్లడ్‌కాన్సర్ స్టేజి త్రీ పేషెంటే - బ్రతికి బట్టకడితేనే ఆశ్చర్యం కానీ..." అవతల వ్యక్తి ఫోన్ పెట్టేసాడు.

వనజకి మనసు మనసులో లేదు. వెళ్ళి నేరుగా శ్యామలరావునే కలుసుకోవాలనుకుంది. కానీ రఘు ఆ రోజు ఆమెని స్కూల్లోనే కలుసుకుని, "నా పరీక్షలైపోయాయి. ఇప్పట్లో ఈ ఊరు రాను. నీకు బై చెబుదామని వచ్చాను" అన్నాడు.

"నా మీద ఒట్టేసి ఇచ్చిన మాట తప్పావ్" నిష్ఠూరంగా అంది వనజ.

"తప్పలేదు.." అన్నాడు రఘు.

వనజ తన దగ్గర ఎప్పుడూ ఉంచుకునే చిన్న పర్సులోంచి - ఓ పేపర్ కటింగ్ తీసి అతడికందించింది.

"హిరణ్యరావు, భూతనాథ్‌ల శత్రుత్వంలో నిజమెంత?" అన్న హెడ్డింగ్ చూసి, "ఈ వార్త ప్రజలకోసం కాదు. ఆ ఇద్దరి కోసం. ఆ ఇద్దరూ నాకు డబ్బిచ్చి ఆ వార్తను కొనేసారు. ముమ్ముందు నేను తనకి సాయపడగలనన్న నమ్మకంతో బాబాయి ఆ వార్తను వాళ్ళకి అమ్మడానికి అనుమతించారు. నాకు డిగ్రీ పూర్తైంది. అన్యాయాల్ని ఎదుర్కొనే బలం సంపాదించడానికి వెడుతున్నాను. ఈలోగా నువ్వు జర్నలిజంలో కృషి చెయ్యి. నువ్వు లోక కళ్యాణానికి ఉద్భవించిన అవతారమూర్తివట - బాబాయి అంటాడు. ఆయన అన్నాడంటే అది నిజమే అవుతుంది. కాబట్టి గుర్తింపు, ప్రచారం వగైరాలతో నిమిత్తం లేకుండా నీవు నీ కృషి కొనసాగించు -" అన్నాడు.

వనజకి అతడి మాటలు తృప్తి కలిగించాయి. ఆమె అతడి అడ్రసు తీసుకుని వీడ్కోలు చెప్పింది.

మళ్ళీ కలుసుకుంటామన్న ధ్రుఢమైన నమ్మకంతో ఇద్దరూ విడిపోయారు.

వాళ్ళ అనుబంధం ముమ్ముందు దుష్ట శిక్షణకి అంకితమౌతుందనీ, వనజ వంటి అబల - తన మేథస్సే ఆయుధంగా - సమాజాన్నేలే బలగర్విత రాక్షస నాయకుల్ని వేటాడే సబల ఔతుందనీ అప్పటికా ఇద్దరికీ తెలియదు. కానీ తెలియకుండానే వారు కార్యదీక్షలో ఉన్నారు...

✡✡✡

## 3

**వనజ బియ్యే పాసయ్యింది ఫస్ట్‌క్లాసులో**. ఆశ్రయమిచ్చిన బంధువులామెను ముక్తసరిగా అభినందించి, పెళ్ళి సంబంధాలు చూడసాగారు.

వనజకి తన కాళ్ళమీద తను నిలబడకుండా అప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదు. ఆ విషయం బంధువులై తెలియకపోయినా శ్యామలరావుకి తెలుసు. అది న్యాయమైనదేకాక అందులో సమాజహితముందనీ తెలుసు. అందుకే ఆయన వనజకి డిగ్రీ పూర్తైన వెంటనే ఒక సమాజ సేవా సంస్థలో ఉద్యోగం ఇప్పించాడు.

వనజ మురిసిపోయింది కానీ ఆయన హెచ్చరించాడు.

పుస్తకాలు వ్యాపారం. సినిమాలు వ్యాపారం. క్రమంగా రాజకీయాలూ వ్యాపారమయాయి. ప్రస్తుతం వీటన్నింటినీ మించిన వ్యాపారం సమాజసేవ.

సమాజసేవకి నిధులుంటాయి. అవి దేశవిదేశాలనుంచి వస్తాయి. అవి ఎలా వస్తాయో, ఎలా ఖర్చవుతాయో అన్నది చిదంబర రహస్యం. సమాజసేవకులకి అన్నిరకాల సదుపాయాలూ, అంతో ఇంతో వైభవ జీవితమూ లభిస్తాయి. ఆ పైన సమాజంలో గుర్తింపు.

"ఈ సంస్థ - దేశ ద్రోహకర చర్యలేమీ చేయదని నాదీ హామీ. నువ్వు సంస్థ నీకప్పగించిన విధులు నిర్వహించు. నీ జీతం తీసుకో. సంస్థ కార్యకలాపాల లోతుల్లోకి వెళ్ళకు" అన్నది శ్యామలరావు సలహా, హెచ్చరిక కూడా. అయినంతటివాడిచ్చిన హామీకి వనజ తృప్తిపడింది. ఉద్యోగ విధానాలూ, అవసరాలూ తెలుసుకోవాలి. అడపా తడపా పేద శిశువులకి పాలపొడి వగైరాలు పంచి పెట్టాలి. ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలి. నోట్సు పుస్తకాలు, పెన్సిళ్ళు, వగైరాలు పేద విద్యార్థులకి పంచిపెట్టాలి. ఇలాంటివే ఎన్నో కార్యక్రమాలు సంస్థ వనజకో చిన్న బంగళా ఇచ్చింది. అందులో సగభాగం ఆఫీసు. సగం ఆమె నివాసం. వనజ కొన్ని పనులు స్వయంగా చేసేది, కొన్నింటికి వేరే మనుషుల్ని నియోగించేది.

ఆమెలోని ఇన్విస్టిగేటివ్ జర్నలిస్టును ప్రోత్సహించడానికి కూడా ఈ ఉద్యోగం బాగానే సహకరిస్తోంది.

ఇల్లు మారడం వనజకో విధంగా సంతోషమే. ఇప్పుడామె స్వతంత్రంగా బ్రతుకుతోంది. అంతవరకూ తన్నాదరించిన బంధువుల్ని వీలున్నప్పుడల్లా కలుసుకుని - చిరు కానుకులతోటీ, పెద్ద మాటలతోటీ సంతోషపెడుతోంది. కృతజ్ఞతాభావాన్ని ప్రకటించడంలోఆమెకి మరుపన్నది లేదు.

ఆదరించిన బంధువులకిప్పుడు ఆమె అంటే అభిమానం. ఆమెని చూస్తే సంతోషం. తనకప్పుడే పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం లేదని ఆమె నొక్కి చెబితే - ఆ విషయంలో ఆమెను బలవంత పెట్టాలనీ వారికి లేదు. ఆమెను పట్టించుకోరేమంటే చెప్పుకుందుకో సంజాయిషీ కావాలి. అది వనజ అందజేయనే చేసింది.

వనజ ఉద్యోగంలో చేరిన రెండు నెలలకి ఓ రోజు రాత్రి పదిగంటలకి కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తెరిస్తే పోలీస్ యూనిఫాంలో ఒక వ్యక్తి "యూ ఆర్ అండర్ అరెస్ట్ -" అన్నాడతడు.

వనజ అతణ్ణి పరీక్షగా చూసి, "ఓకే - అయామండర్ అరెస్ట్ -" అంది.

"గుర్తుపట్టేశావన్నమాట..." అన్నాడు రఘు నవ్వుతూ

"ఉత్తరాలలో ఎప్పటికప్పుడు నీ విశేషాలు తెలియబరుస్తూనే ఉన్నావు. వాటిలోంచే నీ రూపమూ ఊహకందింది నాకు. అయితే ఇప్పుడిలా వస్తావని మాత్రం నాకు తెలియదు. ముందుగా ఉత్తరం వ్రాయాల్సింది. మంచి రిసెప్షన్ అరేంజ్ చేసేదాన్ని" అంది వనజ.

"ఉత్తరం సంగతటుంచి. ఇకమీదట మనమిలా కలుసుకోం కూడా. కలుసుకున్నా అది రహస్యం. ఎందుకంటే నేనిప్పుడీ నగరానికి ట్రాన్సుఫరై వచ్చిన పోలీస్ ఇన్స్పెక్టర్ని" అన్నాడతడు.

"అయితే ఇప్పుడు మాత్రం ఎందుకొచ్చినట్లు?" అంది వనజ నిష్టూరంగా.

"చూసి ఏళ్ళైపోయింది. ఒక్కసారి చూడాలనుంటుందిగా. అదీకాక అప్పటికీ ఇప్పటికీ నీలో బోలెడు మార్పు. నీకు సాయపడాలంటే నిన్ను గుర్తుపట్టాలికదా" అన్నాడు రఘు నవ్వుతూ.

"అరే - గుమ్మంలోనే నిలబెట్టి మాట్లాడేస్తున్నాను" నొచ్చుకుని పక్కకి తప్పుకుంది వనజ.

"నువ్వు నిలబెట్టలేదు. పాత వనజే దృష్టిలో ఉందేమో - ఈ అపరంజి బొమ్మ నా చెల్లెలా అని నిశ్చేష్టుణ్ణయ్యాను. పోలీసు ట్రయినింగు కదా - ఐనా నీతో సంభాషణ కొనసాగిస్తున్నాను.." అంటూ లోపలికొచ్చాడతడు. ఇద్దరూ సోఫాల్లో కూర్చుని విశేషాలు చెప్పుకున్నారు. తర్వాత వనజ రఘుకి స్వీట్సు పెట్టి మంచినీళ్ళిచ్చింది.

"ఆడపిల్లకి సంసారమే అందం. నీకు మంచి వరుణ్ణి చూసి పెళ్ళిచేయడం నా బాధ్యత. కానీ..."

"ఊఁ కానీ"

"అనాధగా ఈ ఊళ్ళో అడుగుపెట్టాను. అడుగడుగునా అన్యాయాలూ, అక్రమాలూ చూసి ఆవేదన చెందాను. అప్పుడే నాకు కాంతికిరణం కనబడింది. శ్యామలరావు బాబాయిని కలిసి - నా కెవ్వరూ లేరనీ నేనేమైపోయినా ఫరవాలేదనీ సమాజంకోసం ఏమైనా చేస్తాననీ చెప్పాను. అప్పుడాయన చిన్నప్పుడు చందమామలో చదివిన ఓ కథ చెప్పాడు. పప్పులో వేసుకుందుకు - మొక్కనుంచి చింతచిగురు దూసుకుంటే మొక్క చచ్చిపోయిందట. మొక్కని చెట్టుగా ఎదగనిస్తే - అది ఏళ్ళ తరబడి చింతచిగురునిస్తూనే ఉన్నదట" - ఆగాడు రఘు.

"ఐతే?" అంది వనజ.

"మంచి చేయాలంటే - మనిషికి ఆశయం కంటే మనుగడ ముఖ్యం. నన్నాయన మొక్కనుంచి చెట్టుగా ఎదగమన్నాడు. అందుకే పోలీసు ఫోర్సులో చేరాను. ఈ ఊళ్ళో అణువణువూ నాకు తెలుసు. ఎక్కడ దుర్మార్గముందో, ఎక్కడ దుష్టులున్నారో తెలుసు. అందుకే నేనీ ఊరొచ్చాను"

"నువ్వనుకున్నది నీ వల్లనౌతుందా?" అనుమానంగా అడిగింది వనజ.

"బాబాయి మరో విషయం కూడా చెప్పాడు. ప్రపంచంలో మంచితనం ఎదిగినట్లు దుర్మార్గం ఎదగదు. అది సృష్టి రహస్యం. అందుకే అడవిలో సాధు జంతువుల సంఖ్య పెరిగినట్లు క్రూర జంతువుల సంఖ్య పెరగదు. సమాజంలో మంచివాళ్ళు మహావృక్షాలు కాగలరు కానీ దుష్టులు కలుపు మొక్కలుగానే మిగిలిపోతారు. సంకల్పం ఉంటే వారిని ఏరిపారేయడం ఎవరికీ అసాధ్యం కాదు - నీకూ, నాకూ కూడా!"

"ఐతే?"

"నా కాశ్రయమిచ్చిన ఈ నగరంలో కలుపు మొక్కల్ని ఏరిపారేయడమేనా జీవిత లక్ష్యం. అందుకు నాకు నీ సాయం కావాలి"

"ఒక పోలీసుకి ఆడపిల్ల సాయమా? మనూళ్ళో దుర్మార్గులు కలుపు మొక్కలు కాదు. మహా పర్వతాలు. వారినే ఎదిరించడం కొండను పొట్టేలు ఢీకొనడమే!" అంది వనజ.

"వాళ్ళు కొండ అయితే నువ్వు పొట్టేలువి కాదు. డైనమైట్‌వి" అన్నాడు రఘు.

"డైనమైట్..." అంది అప్రయత్నంగా వనజ.

"అవును - డైనమైట్"

వనజ ముఖంలో ఉత్సాహం, ఆవేశం. అలానే ఆమె చటుక్కున లేచి లోపలకు వెళ్ళింది. రఘు ఆశ్చర్యంగా చూస్తుండగా కొద్దిక్షణాల్లోనే చేతిలో నాలుగు ఫైల్స్‌తో వెనక్కొచ్చింది. వాటినామె రఘుకి అందించింది. అతడవి అందుకుని, "ఏమిటవి?" అన్నాడు.

"నేను కాదు - ఇవీ డైనమైట్స్" అంది వనజ.

రఘు చకచకా ఫైళ్ళు తిరగేస్తుంటే, "హైస్కూలు రోజుల్నుంచీ సేకరిస్తున్నానీ వివరాలు. బాబాయికి చూపిస్తే వీటి ప్రచురణకింకా సమయం రాలేదమ్మా అన్నారు. నేనలా సేకరిస్తూనే ఉన్నాను" అంది వనజ.

రఘు ఆ ఫైల్స్ చదివాక, "మైగాడ్ - ఇన్ని వివరాలు, ఇంత స్పష్టంగా సేకరించడం పోలీసులకే సాధ్యపడదు. నీకెలా వీలయింది?" అన్నాడు.

"పోలీసులు సామాన్యులు కారు. అదీ సమస్య. లేకుంటే సామాన్యుల మధ్య సామాన్యంగా తిరిగితే చాలు, ఇంతకంటే అసామాన్య విశేషాలు ఎన్నో బయటపడతాయి" "అయితే ఈ క్షణంనుంచే మన ఆపరేషన్ ప్రారంభం" అన్నాడు రఘు ఉత్సాహంగా.

"ఎలా?"

"ఈ వివరాలిప్పుడు కాంతి కిరణంలో వస్తాయి. విలేఖరిగా నీ పేరూ బయట పడుతుంది. అప్పుడు నీ వార్తా బాధితులైన లంచగొండి ఉద్యోగులు, కల్తీ వ్యాపారస్తులు, అక్రమ రవాణా దారులు, నీ మీదకి గూండాల్ని పంపుతారు. పోలిసులా గుండాల్ని పట్టుకుంటారు. వాళ్ళు నేరస్తుల ఆగడాలకు ప్రత్యక్షసాక్షులవుతారు"

"అంటే విలేఖరిగా నా జీవితం ప్రారంభంకానున్నదన్నమాట" ఉత్సాహంగా అంది వనజ.

"అదెప్పుడో ప్రారంభమయింది. కానీ నలుగురికీ తెలిసేది మాత్రం ఇప్పుడే!" అన్నాడు రఘు.

"అన్నయ్యా - ఉత్సాహం పట్టలేకపోతున్నాను" అంది వనజ.

"అలా ఉద్రేకపడకు. ఇక ముందు నీకు అన్నీప్రమాదాలే"

"భయపెడుతున్నావా?"

రఘు తల అడ్డంగా ఊపి, "హెచ్చరిస్తున్నాను" అన్నాడు.

"ప్రతి ఊరికీ నీలాంటి వాడొక్కడుంటే ఎంతబాగుండునన్నయ్యా!" అంది వనజ.

"అందుకే నీకు మా పోలీసు శాఖ కనిపించని రక్షణకవచంగా ఉంటుందని నాదీ హామీ" అంటూ లేచి నిలబడి, "వస్తాను. ఈ క్షణం నుంచీ మనం అపరిచితులమని గుర్తుంచుకో" అన్నాడు రఘు.

✡✡✡

వనజ బస్ స్టాపులో నిలబడి ఉండగా ఓ యువకుడామె పక్కకొచ్చి, "నీ పేరు వనజ కదూ!" అన్నాడు.

"ఔను. నువ్వెవరు?" అంది వనజ.

"నేనెవరో చెప్పాలా - కాంతి కిరణానికి వార్తలు తెలుసుకునట్లే - తెలుసుకోలేవా?" అన్నాడా యువకుడు.

అతడి ఉద్దేశ్యం మంచిది కాదని అర్థమై, "వెధవ పనులు చేయి. తెలుసుకుంటాను" అంది వనజ.

ఆ యువకుడామెకి రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇరుకు సందు చూపించి, "అందులోకి రా, నిరభ్యంతరంగా వెధవ పనులు చేస్తాను" అన్నాడు.

అప్పుడు వనజ ఆ యువకుణ్ణి మరింత పరీక్షగా చూసింది. దుస్తులు హుందాగా ఉన్నా, ముఖంలో సంస్కారంలేదు. కళ్ళల్లో కుటిలత్వం తొంగి చూస్తోంది.

"ధైర్యముంటే చేసేదేదో ఇక్కడే చెయ్" అంది వనజ.

యువకుడు నవ్వి, "ధైర్యముంటే చాటుగా వార్తలు సేకరించడమనుకునే నీకు - నాతో సందులోకొచ్చే ధైర్యం లేదా?" అన్నాడు సవాలు చేస్తునట్లు.

వనజ  ఆ సవాలుని స్వీకరించి, "పద" అంది వెంటనే.

ఇద్దరూ సందులోకి దారి తీసారు. ఆ సందు ఇరుగ్గా ఉంది. అంత ఇరుకులోనూ కుళ్ళుకాలువ మాత్రం విశాలంగా ఉంది. అందులో పొర్లుతున్న పంది కూడా చాలా పెద్దది.

యువకుడు తననే చూస్తుంటే, "వెధవ పనులు చేస్తానన్నావు" గుర్తుచేసింది వనజ.

"చేస్తాను. కానీ ముందో మంచిపనిచేశాక..."

"ఏమిటది?"

"కాంతికిరణానికీ నీకూ ఏ సంబంధంలేదనీ, అందులో నీ పేరున వచ్చిందంతా తప్పుడు సమాచారమనీ - వ్రాసిన ఓ కాగితం నా దగ్గరుంది. నువ్వు సంతకం పెట్టావంటే ఆ వివరాలు నీ ఫోటోతో సహా మూడు పత్రికల్లో వేయిస్తా" అన్నాడా యువకుడు.

"అందుకు నేనొప్పుకోకపోతే?"

"నీ చెయ్యి పట్టుకుంటాను"

"అప్పుడేం జరుగుతుందో తెలుసా?"

యువకుడు నవ్వి, "చెంప ఛెళ్ళుమనిపించాలనుకుంటున్నావేమో - అప్పుడు నాకు చేతలే కానీ నీకు చేతులుండవు" అన్నాడు.

వనజ కూడా నవ్వి, "నా సంగతి సరే - అటు చూడు" అంది.

యువకుడు వెనక్కి తిరిగితే అప్పుడే అటునుంచి ఆ సందులోకే సుమారు అరవై ఏళ్ళ వృద్ధుడు ప్రవేశించాడు. మనిషి సన్నగా పీలగా ఉన్నాడు. గెడ్డం మాసి ఉంది.

"చూశాను" అన్నాడు యువకుడు.

"ఈ ప్రపంచంలో దుర్మార్గులకంటే దుర్మార్గాన్ని సహించని వారే ఎక్కువ. నువ్వు నా చెయ్యి పట్టుకుంటానని ఆయనకి చెప్పు. నీ చెంప ఛెళ్ళుమనిపిస్తాడు. అప్పుడాయనన్నేమైనా చేయగలిగితే - తర్వాత నన్నేమైనా చేయగలవని నమ్ముతాను" అంది వనజ.

అంతలోనే వృద్ధుడు వాళ్ళని సమీపించి, "ఏం జరుగుతోందిక్కడ!" అన్నాడు. వనజ చెప్పింది. అంతే - వృద్ధుడు యువకుణ్ణి చెంప ఛెళ్ళుమనిపించాడు.

వనజ కిలకిలా నవ్వి, "థాంక్స్ తాతగారూ" అంది. తర్వాత ఆమె అక్కడిక ఆగలేదు. అక్కడేం జరిగిందో పట్టించుకోలేదు. రఘు తనకి రక్షణ కవచం కప్పాడనీ ఆ యువకుడు పోలీసులు పాలు కాక తప్పదనీ ఆమెకు పూర్తి నమ్మకముంది.

✡ ✡ ✡

వనజ, రఘుల మొదటి ఆపరేషను విజయవంతమైంది. కాంతికిరణంలో మొదటిసారిగా వనజ ఫోటో కూడా పడింది. ఆమెని కలుసుకుందుకు ఔత్సాహికులు, పత్రికా విలేఖరులు, విద్యార్థులు వగైరాలెందరో వచ్చారు. పిన్న వయసులో మేటి సాహసానికి పూనుకున్న వనజ - నేటి యువతరానికి గొప్ప ఆదర్శమంటూ అభినందనలతో ముంచెత్తారు.

"మనకి ఉనికినిచ్చిన - ఈ సమాజానికే ఉనికి లేకుండా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. వారినాపడానికి మనం చేయగలిగినంతా చేయాలి. సమాజం పట్ల నా బాధ్యతను నిర్వహించడం గొప్పైతే - పొగడ్తలు కావు - నన్ననుసరించడం మాత్రమే నాకు అభినందన" అంది వనజ ఆ అభినందనలకు బదులుగా.

వనజకి నిజంగానే ఆ అభినందనలు సంతోషాన్నివ్వలేదు.

కాంతికిరణానికి తానందించిన వార్తకి స్పందనగా ఓ యువకుడు నడిరోడ్డుమీద తనతో అసభ్యంగా మాట్లాడాడు. సందులోకి తీసుకెళ్ళి చెయ్యి పట్టుకోబోయాడు. రఘు తొడిగిన రక్షణ కవచం లేకపోతే తనా సవాలు నెదుర్కోగలిగేదా? సమాజంలో ప్రతి ఒక్కరూ తనకిలా, రఘుకిలా ఆలోచిస్తే - ఆ యువకుల్లాంటి కలుపు మొక్కలు ఎప్పుడో ఏరివేయబడేవి కదా!

కానీ మంచికైనా, చెడుకైనా నాయకులు కొందరు - అనుచరులే అందరూ! ఆ కొందరు నాయకులందరి ముఖాలకీ - మంచే ముసుగు. ఆ ముసుగు చాటున పొంచి ఉన్న చెడు ఎవరి అంచనాలకీ అందదు.

ఒక్కొక్కరే వచ్చి అభినందించి వెళ్ళిపోతూంటే వనజ ఆలోచనలో పడింది.

అప్పుడొచ్చాడో యువకుడు. ఆరడుగుల విగ్రహం. పచ్చని ఛాయ. రణబీర్ కపూర్‌లా చాక్లెట్ బాయ్‌లా ఉన్నాడు. జాన్ అబ్రహాంలా హుందాగా ఉన్నాడు. ఏ పురాణ పురుషుడో ఆధునిక దుస్తుల్లో భువికి దిగినట్లున్న ఆ యువకుడు, "మేడం - అయాం ప్రహ్లాద్" అంటూ తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

ఉలిక్కిపడిన వనజ చటుక్కున అతణ్ణి చూసి,

"ఎస్ ప్లీజ్ -" అంది.

"అయాం డాం ఇంప్రెస్డ్ విత్ యూ -" అన్నాడతడు.

"థాంక్యూ"

"నేను మిమ్మల్ని ఆరాధిస్తున్నాను"

"థాంక్యూ - థాంక్యూ వెరీ మచ్"

"ఐ రియల్లీ మీన్ ఇట్ మేడం" అన్నాడతడు.

"ఐతే?" అంది వనజ. అతడి ఆంతర్యం అర్థంకాక.

"మిమ్మల్ని రొటీన్‌గా అభినందించకూడదనే అందరూ వెళ్ళేదాకా ఆగాను. కానీ మీరు నాకు థాంక్యూ అని బదులిచ్చినప్పుడల్లా చాలా రొటీన్‌గా అనిపిస్తోంది" అన్నాడతడు.

అప్పటికి అభినందనల ప్రపంచం నుంచి బయటపడి వాస్తవంలోకి వచ్చి చూస్తే - అక్కడ తను, అతడు - ఇంకెవ్వరూ లేరు, "మీ పేరు?" అందామె

"చూసారా మేడం - నేను చెప్పేదంతా రొటీన్‌గా విన్నారనడానికింతకంటే సాక్ష్యం ఏం కావాలి? నా పేరు మళ్ళీ చెబుతాను - ప్రహ్లాద్"

"ప్రహ్లాద్ - బాగుంది మీ పేరు"

"అది భక్తికి మారు పేరు. ఇప్పుడు నేను మీ భక్తుణ్ణి"

వనజ మొహమాటపడింది. అతడు మర్యాదగా మాట్లాడుతుండడం వల్లనేమో ఆమెకు కోపం మాత్రం రాలేదు, "సారీ - నేను వరాలిచ్చే దేవతని కాను"

"నాకు వరాలొద్దు మేడం"

"మరేం కావాలి?"

"పరీక్ష - నా భక్తికి పరీక్ష కావాలి"

ఆశ్చర్యంగా చూసింది వనజ అతడి వంక - "ఎందుకు?"

"భక్తుడికి అదే తృప్తి!"

"మిష్టర్ - మీరిలా మాట్లాడ్డం నా కిబ్బందిగా ఉంది" అంది వనజ ఏమనాలో తెలియక.

"నిజానికి మిమ్మల్నభినందించాలనొచ్చాను. కానీ మిమల్ని చూడగానే ఆరాధనాభావం కలిగింది. అందుకే మీతో ఏకాంతంలో మాట్లాడాలని ఆగిపోయాను"

"ఐతే?"

"భగవంతుడికంటే భక్తి గొప్పదంటాయి మన పురాణాలు. మీ వల్లకాని పనుంటే చెప్పండి. అది చేయడానికి భక్తుడు సిద్ధం"

"థాంక్స్ - అవసరమైనప్పుడు మీ సాయం తప్పక తీసుకుంటాను"

"కాకితో కబురుపంపండి. హంసపై మీముందు వాలుతాను. ఇది నా కార్డు" అంటూ అతడో కార్డునందించాడామెకి. ఎరుపు రంగు కార్డుమీద ఆకు పచ్చటి అక్షరాలు. యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్న అతడి చిరునామా మాత్రం ఇంకా తండ్రిదే

అతడి తండ్రి పేరు చదివిన వనజ ఉలిక్కిపడింది. అదామెకు బాగా పరిచితమైన పేరు.

"హిరణ్యారావు" ఆ అక్షరాలు ఆమె మెదడులో గింగురుమంటున్నాయి.

ప్రహ్లాద్ వెళ్ళిపోయాడు.

✡✡✡

## 4

**"చెల్లాయ్ - నేనే రఘుని - ఏమిటి విశేషం?"**

"నీ కోసం మూడు సార్లు మూడు నెంబర్లు చేయాల్సొచ్చింది" నిష్ఠూరంగా అంది వనజ.

"అంతా మనమంచికే - ఆ ఏర్పాట్లు నేనే చేశాను. విశేషాలు చెప్పు"

వనజ అతడికి ప్రహ్లాద్ గురించి చెప్పింది.

"అంటే హిరణ్యారావు తన కొడుకు ప్రహ్లాద్‌ని నీ మీద ప్రయోగించేడన్నమాట. అఖండుడులే" అన్నాడు రఘు.

"మధ్య ఆయనకేమయింది?"

"మనం తీగలాగుతున్నాం. మరి డొంక ఆయనే కదా - కదలకేం చేస్తాడూ?" అన్నాడు రఘు.

"నేనిప్పుడేం చేయాలి?"

"అడుగడుగునా ప్రహ్లాద్ తెలివిగా నీకు అడ్డుతగులుతుంటాడు. నువ్వతణ్ణి ఎప్పటికప్పుడు తెలివిగా కట్ చేసేస్తుండాలి"

"అతడు నాకెలా అడ్డుతగులుతాడు - నేనేం చేయాలి?" అంది వనజ ఇంకా అర్థంకాక.

"అతడు నీలో ప్రేమవిత్తులు నాటుతుంటాడు. నువ్వు వాటిని మొలకలోనే పీకి పారేయాలి -"

"అసలు మొలకెత్తనివకపోతే?"

"అదే జరిగితే సృష్టిలోఆడదాని ఉనికికి అర్థమే లేదు"

ఉలికిపడి, "ఏమన్నావ్?" అంది వనజ.

"ప్రహ్లాద్ విషయలో జాగ్రత్తగా ఉండు. అతడు శత్రువుల మనిషి" రఘు ఫోన్ కట్ చేసాడు.

"అదే జరిగితే సృష్టిలో ఆడదాని ఉనికికి అర్థమేలేదు" - రఘు మాటలు వనజ చెవుల్లో గింగురుమంటున్నాయి. అంటే - తను ప్రహ్లాద్ మాయలో పడిపోయి అతణ్ణి ప్రేమిస్తుందని రఘు ఉదేశ్యమా? అంటే తన తెలివి, ధైర్యం, సాహసం, ఆశయం, లక్ష్యం - అన్నీ ఆడది అన్న పదంతో ముడిపడి మరుగునపడిపోతాయా? అప్పుడు వనజ ప్రహ్లాద్‌ని గుర్తు చేసుకుంటే -

ముఖంలో అందం, చూపులో అమాయకత్వం, గొంతులో నిజాయితీ, ప్రవర్తనలో సంస్కారం.

అది నిజంగా తనపట్ల ఆరాధనా - లేక హిరణ్యారావు ప్రయోగమా?

చివరికి, "రఘుది అంతా పోలీసు బుద్ధి, అందరిమీదా అనుమానమే" అనుకుందామె.

"అసలు విత్తును మొలకెత్తనివ్వకపోతే?" అందామె రఘుతో. కానీ ఇప్పుడామె హృదిలో మొలకలు లేస్తున్నట్లే తోస్తుంది.

✡ ✡ ✡

అది హిరణ్యకశిపుడి దర్బారులా ఉంది. అందులో హిరణ్యారావు హిరణ్యకశిపుడిలాగే ఉన్నాడు. ఆయన్ని చూడవచ్చిన వారంతా దేవతల చేతుల్లో చావుదెబలు తిన్న రాక్షసుల్లా ఉన్నారు. వాళ్ళ మాటలు హాహాకారాల్లా ఉన్నాయి. వాళ్ళు తెచ్చిన వివరాలు హిరణ్యారావుక్కూడా ప్రమాదాన్ని సూచిస్తున్నట్లున్నాయి. ఐతే వాటికాయన ఇచ్చే సమాధానాల్లో వర, బల, గర్వాహంకారాలు ధ్వనిస్తున్నాయి.

వచ్చిన వాళ్ళు తృప్తిగా వెళ్ళిపోయారు.

హిరణ్యారావు సాలోచనగా సోఫాలో వెనక్కువాలాడు వోకగా కనులుమూసుకున్నాడు.

"నాన్నా!" అన్న పిలుపుకాయన కళ్ళు తెరుచుకున్నాయి.

"ఊఁ" అన్నాడాయన.

"సమాజంలో చేరాల్సిన ఎత్తు చేరావు. మంచితనంలోనూ అదే ఎత్తు చేరుకో. నేరస్తులకు సాయపడడం మాని, నేరగాళ్ళని పట్టుకునేందుకు సహకరించు. ఇది నా రిక్వెస్ట్"

ఉలిక్కిపడి సరిగ్గా కూర్చున్నాడు హిరణ్యారావు. ప్రహ్లాద్‌ని గుర్రుగా చూసి, "నానించి నేర్చుకోవాల్సినవాడివి. నాకేంటో చెబుతావేంటి?" అన్నాడు చిరాగ్గా.

"ఇప్పటికే నేను నీ నుంచి చాలా నేర్చుకున్నాను. ఆ నేర్చుకున్నదే నీకు చెబుతున్నాను"

"ఏం నేర్చుకున్నావో చెప్పు, వింటాను" ఇంకా చిరాగ్గానే అన్నాడు హిరణ్యారావు.

"మనిషన్నవాడు, మనిషనిపించుకోవాలనుకున్నవాడు - ఎలా ఉండకూడదో తెలుసుకుందుకు నీకంటే ఎవరుంటారు? నా మాట విను. నువ్వేం చేస్తున్నావో, అవన్నీ మానేస్తేనే నువ్వు మనిషివి" అన్నాడు ప్రహ్లాద్.

"అవును. నేను నిన్నుపాలు పోసి పెంచుతున్నాను. అది మానేయాలి"

"ఒప్పుకున్నాను. అందుకు సహకరించడానికి నేనీరోజే ఇల్లు విడిచివెళ్ళిపోతాను" అన్నాడు ప్రహ్లాద్ తాపీగా.

హిరణ్యరావు గతుక్కుమని, "అఘోరించావులే - అలా కూర్చో ముందు" అన్నాడు.

"లేదు - నిలబడే ఉంటాను"

"ఏం, నా ముందు కూర్చునే అర్హత లేదనిపిస్తోందా?"

ప్రహ్లాద్ నవ్వి, "నేనిలా ఉంటే - నిటారుగా నిలబడ్డ న్యాయం ముందు, అన్యాయం చతికిలబడి పోయిందనిపిస్తోంది. అందుకే కూర్చోలేను" అన్నాడు.

హిరణ్యరావు చటుక్కున లేచి నిలబడి కొడుక్కి దగ్గరగా వచ్చి, "ఎందుకురా నన్నిలా మాటలతో హింసిస్తావు? నేను నీకు శత్రువుని కాదుకదా" అన్నాడు.

"నువ్వు రోగివి, నేను వైద్యుణ్ణి. నా మాటలు చేదుమందు. అందుకని నువ్వు నన్ను శత్రువనుకుంటున్నావు. ముందు వాడి చూడు. తర్వాత నేను నీకు చేసిన మేలు అర్థమవుతుంది -"

"నాకేం రోగంరా ఇప్పుడు?"

"నేరమొక జబ్బు. ప్రతినేరస్తుడూ ఒకరోగి!"

హిరణ్యరావు కొడుకు భుజం మీద చేయివేసి "ఈ ప్రపంచంలో నేరస్తుడు కానివాడెవడు? గాలి పీల్చితే సూక్ష్మ క్రిములు చస్తాయి. భోంచేయాలంటే చెట్టునో, మేకనో నరకాలి, మనిషి బ్రతకాలంటే జీవహింస తప్పదు. జీవహింస నేరం కాబట్టి ప్రతి మనిషీ నేరస్తుడే తెలివైనవాడు చేసిన నేరం గౌరవాన్నీ, పేరు ప్రఖ్యాతుల్ని ఇస్తుంది. బుద్ధిహీనుడు నేరం చేసి జైలుపాలవుతాడు.." అన్నాడు.

"పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చనంటారు" అన్నాడు ప్రహ్లాద్.

"ఎవరేమననీ - జీవితంలో సుఖపడాలంటే నేరం తప్పదు. నీతినియమాలు మనిషి దుఃఖహేతువు"

"నిజానిజాలు తెలుసుకునేందుకు అనుభవం కావాలి. నువ్వు కొన్నాళ్ళు నీతిగా ఉండి - అప్పుడీ మాటలు చెప్పు, నమ్ముతాను" అన్నాడు ప్రహ్లాద్.

"కొన్నాళ్ళేం - ఎప్పటినుంచో నేను నీతిగా ఉంటున్నా. ఎందుకంటే నేనేం చేస్తే అదే నీతి. ఆర్యుల పద ప్రయోగాలు గ్రాహ్యంబులు అన్నాడు చిన్నయ సూరి బాలవ్యాకరణంలో, అంటే గొప్పవారి కవిత్వంలో తప్పుల్ని వ్యాకరణం ఒప్పుచేసింది. గొప్పవారి అవినీతిని చట్టం ఒప్పు చేస్తుంది. ఇంకా నీకర్థంకాలేదంటే - పద - విజయశాలకు వెడదాం" అన్నాడు హిరణ్యరావు.

✡ ✡ ✡

ఆ ఇంట్లో ఓ పెద్ద గది ఉంది. చిన్నపటినుంచీ హిరణ్యరావు సాధించిన విజయ చిహ్నాలన్నీ పొందుపర్చడం వల్ల ఆ గది పేరు విజయశాల. ఆ గదిని ప్రహ్లాద్ చాలాసార్లే చూసాడు. కానీ తండ్రి పిలిచాడని మళ్ళీ వెళ్ళాడు. "ఈ గదికి చాలాసార్లే వచ్చినా - నా విజయశాల పొడువు, వెడల్పులే తప్ప లోతును చూడలేదు నువ్వు. అందుకే ఇప్పుడు నిన్నిక్కడికి తీసుకొచ్చా" అన్నాడు హిరణ్యరావు.

ఇద్దరూ ముందుగా ఓ వెండి కప్పు దగ్గిర ఆగారు. హైస్కూల్లో టెన్త్ క్లాసులో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నందుకు వచ్చిందది. "మొత్తం పరీక్ష కాపీ కొట్టాను" అన్నాడాయన.

తర్వాత వాళ్ళిద్దరూ - కాలేజీ యూనియన్ లీడర్‌గా ఎన్నికైనందుకు ఆయనకి సన్మానం జరుగుతున్న ఓ ఫోటో ముందాగారు. "బలమైన ప్రత్యర్థిని బలంతో భయంపెట్టి నామినేషన్ విత్‌డ్రా చేయించాను" అన్నాడాయన. తర్వాత హోటల్ హిరణ్య ప్రారంభోత్సవ కార్యక్రమం ఫోటో దగ్గర ఆగి, "యాభై గుడిసెల్ని నేల మట్టం చేశాను..." అన్నాడాయన.

ఒకటా, రెండా - ఎన్నో గొప్ప విజయాలున్నాయక్కడ. అన్నింటి వెనకా అంతటి బలమైన నేరాలూ ఉన్నాయి ఆయన మాత్రం అయిదారింటితోనే ఆగిపోయి, "ఈ సమాజం ఎన్నోమార్లు నన్ను సన్మానించింది. ఎన్నో పదవులిచ్చింది. నా అంతవాడు లేడని లోకం మెచ్చిన ప్రతి సంఘటన వెనుకా - నీ ఊహ కందని పెద్దనేరాలున్నాయని ఇంతవరకూ నీకు చెప్పలేదు. అర్థం చేసుకో" అన్నాడు. మరాయన నేరాల్లో హత్యలు, మానభంగాలు, దౌర్జన్యాలు ఎన్నో ఉన్నాయి. అవాయన నోరు విడిచి కన్నకొడుక్కి చెప్పలేడు. ప్రహ్లాద్ అర్థం చేసుకోవాలి! "ఇప్పుడెందుకు చెబుతున్నావ్?" అడిగాడు ప్రహ్లాద్.

"నేరం ప్రగతికి మెట్టు. ఎన్ని నేరాలు చేస్తే అన్ని మెట్లెక్కగలుగుతాడు మనిషి. నువ్వూ నాతోపాటు అవే మెట్లెక్కి శిఖరాగ్రం చేరుకో. సామాన్యుల్ని అక్కణ్ణించే అంత దూరాన్నించే చూడు. అప్పుడు నీకా సామాన్యులు చీమల్లా, దోమల్లా కనిపిస్తారు. గొప్పవాడు సామాన్యుణ్ణి అలాగే చూడాలి. నీకెప్పుడైనా ఓ సామాన్యుడు మనిషిలా కనిపించాడా? వాడికీ నీకూ మధ్య నేరాల మెట్లు పెంచు. ఎంతవరకూ అంటే వాడు చీమలా మారేంతవరకూ. అప్పుడీ ఇంట్లో నీకూ ఓ విజయశాల ఉంటుంది" అన్నాడు హిరణ్యారావు సానునయంగా.

ప్రహ్లాద్ తలూపి, "ఈ ఇంట్లో నాకూ కావాలో విజయశాల. అందులోకి నా కొడుకును తీసుకెళ్ళి ప్రతివిజయాన్నీ వాడితో పంచుకోవాలి. అయిదారింటి తర్వాత తటపటాయించకూడదు" అన్నాడు.

ఊహించని ఈ సమాధానానికి హిరణ్యారావు నిర్విణ్ణుడయ్యాడు.

"నేరం నా దారి కాదు. అవినీతి నా ఆశయం కాదు. నేను నిన్ననుసరించను. అనుసరించడానికి నిన్ను తప్ప ఇంకెవరినైనా వెతుక్కుంటాను. చిన్నవాణ్ణని నిర్లక్ష్యం చెయ్యక నే చెప్పేది విను. అన్యాయాఫలమైన నీ విజయం, సుఖం తాత్కాలికం. నా మాట విని వాటిని శాశ్వతం చేసుకో" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు ప్రహ్లాద్.

✡ ✡ ✡

"ఎందుకండీ, అనవసరంగా వాడి గురించి బాధపడతారు? నిజానికి మీరు బాధపడాల్సివచ్చింది మీగురించే" అంది హిరణ్యారావు భార్య లీల.

హిరణ్యారావు ఆమెనదోలా చూసి, "అంటే నువ్వూ వాడి పక్షమేనా?" అన్నాడు.

"వాడి పక్షమా అనడుగుతున్నారా? వాణ్ణిలా ప్రోత్సహిస్తున్నదే నేను" అంది లీల నవ్వుతూ.

"ఎంత మోసం? నా ఇంట్లో నాకు తెలియకుండా ఇంత కుట్రా?" అన్నాడు హిరణ్యారావు కసిగా.

"కుట్ర సంగతి అలాగుంచి - ఈ ఇంట్లో మీకు తెలిసిందేంటో ముందు చెప్పండి" అంది లీల.

"అంటే?"

"ఉదాహరణకి - నా గురించి మీకేం తెలుసు? మీరెప్పుడైనా నా మనసెరిగి ప్రవర్తించేరా?" అంది లీల.

హిరణ్యారావు దెబ్బతిని, "ఇప్పుడు - ఇన్నేళ్ళ తర్వాత - పాతికేళ్ళ కొడుకు తిరిగే ఈ ఇంట్లో - నువ్వీ మాట అంటున్నావా?" అన్నాడు.

"ఏం చేయను? ఈ నిజం మన పెళ్ళిరోజంత పాతది. ఇన్నేళ్ళైనా అది మారలేదు. ఇప్పుడు అవకాశమొచ్చింది, చెప్పాను" అంది లీల.

"నేను నీకు లోటేం చేసాను?" బాధగా అన్నాడు హిరణ్యరావు.

"మీతో పెళ్ళే నాకో పెద్దలోటు. మనపెళ్ళెలా జరిగిందో గుర్తుచేసుకోండి"

హిరణ్యరావు ఓ పెళ్ళిలో చూసాడామెని. ఆమె నచ్చింది. పెళ్ళిచేసుకుంటానని నేరుగా ఆమెతోనే చెప్పాడు..

"మీరు నాకు తెలుసు. మీ పద్ధతులు నాకు నచ్చవు" అందామె.

"నిన్ను ఐశ్వర్యంలో ముంచెత్తుతా. వైభవంలో వెలిగిస్తా" అన్నాడాయన.

"నాకు నచ్చేలా ఉంటే సామాన్య జీవితం చాలు" అందామె.

హిరణ్యరావు ఆమెకి బదులివ్వలేదు. ఆమె తండ్రిని కలుసుకున్నాడు. ఆడపిల్లల తండ్రులు ఆడపిల్లలకంటే ఘోరంగా డబ్బుకి అమ్ముడు పోగలరని ఆమె తండ్రి నిరూపించాడు.

తొలిరాత్రి హిరణ్యరావు ఆమెతో, "నాకు నీ మీద పగలేదు. నువ్వంటే నాకిష్టం. అందుకే నీ కోసం ఈ వజ్రాల హారం తెచ్చా, దీని మూల్యం ఎందరి రక్తమా అని ఆలోచించకు. నా రక్తం పంచుకు పుట్టబోయే బిడ్డకి తల్లివిగా - నీకిది నా కానుక" అన్నాడు.

అది పరిహాసమో, అపహాస్యమో లీలకి తెలియలేదు. కానీ ఆమె కూడా అతడి ధోరణిలోనే, "ఈ కానుక నాకానందాన్నివ్వదు. మనబిడ్డకి కోరిన పేరు పెడతానని వరమివ్వండి. నేను మీకు సహకరిస్తా" అంది.

హిరణ్యరావు వరమివ్వడమే కాదు, దానికి కట్టుబడ్డాడు కూడా.

"నేను మన బాబుకి ప్రహ్లాద్ అని పేరు పెట్టినప్పుడే మీరు నా ఉద్దేశ్యం తెలుసుకోవలసింది" అంది లీల.

***నరుడు తననేం చేయగలడు అనుకున్నాడు రావణుడు. చివరికి నరుడి చేతిలోనే హతమయ్యాడు. ఒక ఆడది తన్ను చంపగలదా అనుకున్నాడు మహిషాసురుడు. చివరకు ఆడదాని చేతిలోనే అంతమయ్యాడు.***

భార్య మాటలు హిరణ్యరావు ఆలోచనల్ని కదిలించాయి,

లీల మంచితనాన్ని ఉగ్గుపాలతో రంగరించి ప్రహ్లాద్‌ని పెంచింది.

ఆమెకి తెలుసు - ప్రహ్లాద్ ఆయన ప్రాణమని!

ఆమెకి తెలుసు - ఆయన నేరాలైనా మానగలడు కానీ ప్రహ్లాద్‌ని వదులుకోలేడని!

"సెభాష్ లీలా! బయట దేవుడైనా నన్ను కన్నెత్తి చూడలేడు. ఇంట్లో నువ్వింత కుట్రపన్నితే తెలుసుకోలేకపోయాను. ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడన్న సామెతని నిజం చేసావ్. ఐతే నువ్వూ ఓ విషయాన్ని గ్రహించాలి. ***మంచివాడైన భర్తని చెడు మార్గంలో పెట్టడానికి ప్రియురాలు చాలు. కానీ చెడ్డవాడైన భర్తని - మంచి మార్గంలో పెట్టడం మాత్రం భార్య తరంకూడా కాదు"***

"ఐతే?"

"ప్రహ్లాద్‌కి పెళ్ళి వయసొచ్చింది. వాడికి నీ ప్రభావం తొలగించి, నా ఆశయాల్ని మెప్పించే పిల్లతో పెళ్ళిచేస్తాను. అప్పుడు వాడు తనంతట తానే నా దారికొస్తాడు" అన్నాడు హిరణ్యరావు.

"మీ ప్రయత్నం మీరు చేయండి" అంది లీల ముక్తసరిగా.

"నాది ప్రయత్నం కాదు. మరో విజయగాథ. చెప్పాగా, ***చెడ్డవాణ్ణి మంచివాణ్ణి చేయడం కష్టం కానీ మంచివాణ్ణి చెడ్డవాణ్ణి చెయ్యడం ఏమాత్రం కష్టం కాదు - అందులోనూ ఆడదానికి!"***

"ఈ రోజు ఏదో విశేషముంది. చెడ్డవాణ్ణని పదేపదే ఒప్పుకుంటున్నారు...."

హిరణ్యరావు నవ్వి, "చెడ్డతనం గొప్పతనానికి కొలబద్దని నమ్మినవాణ్ణికదా" అన్నాడు.

"ఇంతకీ కాబోయే కోడలు పిల్ల మీ దృష్టిలో ఉందా? ఇంకా వెదకాలా?" అంది లీల మాట మార్చుతూ.

"ముందు మనవాణ్ణి నీ ప్రభావం నుంచి బయటపడేయాలి కదా - అందుకో ఉపాయం ఆలోచించాల్లే" అని గదిని చీకటి చేసాడు హిరణ్యరావు.

✡✡✡

## 5

**ఆ బంగళా ముందున్న** బోర్డు మీద "ది గ్రేట్ ఓరియంటేషన్ స్కూల్" అని తాటికాయంత అక్షరాలతో ఓ బోర్డు.

వాటి కింద సపోటా పళ్ళు సైజులో "ప్రిన్సిపాల్ అండ్ ఎవ్విరిథింగ్: సి. మార్క్" అన్న అక్షరాలు.

అప్పటికి ఉదయం ఎనిమిదిన్నరయింది. స్కూలు తొమ్మిదిన్నరకేమో - బంగళాలో ముందు గదిలో రివాల్వింగ్ చెయిర్లో చాలా తాపీగా కూర్చున్నాడు ప్రిన్సిపాల్ సి. మార్క్.

అప్పుడే ఆయన గదిలోకొచ్చిన వనజ, "నమస్తే - " అంది వినయంగా.

ఆమెని చూస్తూనే కుర్చీలో ఓసారి ఇబ్బందిగా కదిలి, "నమస్తే - రామ్మా, కూర్చో -" అన్నాడు మార్క్.

వనజ ఆయన ఎదుట కుర్చీలో కూర్చుంది, "పత్రికా విలేకరిని. మీ స్కూలు గురించి విని వచ్చా" అంది.

"వెల్ కం" అన్నాడు మార్క్.

"మీ స్కూలు పేరు విచిత్రం. మీ స్కూల్ని మీరే ది గ్రేట్ అనడం సొంతడబ్బా" అంది వనజ.

"ది గ్రేట్ అన్నది సొంత డబ్బా కాదు.. నా స్కూలు పేరే అది" అన్నాడు మార్క్.

"అయాం సారీ - మీ స్కూలు వివరాలు చెబుతారా?"

"మన విద్యావిధానంలో పెద్దలోపముంది. ఇక్కడ చదువుంది కానీ ఓరియంటేషన్ లేదు. ఇంజనీరింగ్ చదివిన వాడికీ ఉద్యోగం కావాలి. కామర్సు చదివిన వాడికీ ఉద్యోగం కావాలి. ఒక్కడూ చదువయ్యాక తన కాళ్ళమీద తను నిలబడలేడు. అందుకే.." ఆగాడు మార్క్.

"అయితే మీ స్కూలు స్వయం ఉపాధి పథకాలు నేర్పుతుందా?"

అనడిగింది వనజ కుతూహలంగా.

"తప్పుగా అర్థం చేసుకున్నావమ్మా - మా స్కూలుకీ స్వయం ఉపాధికీ సంబంధం లేదు. పరీక్షా ఫలితాలు రాగానే - ప్యాసైనా, తప్పినా అంటూ ఏవో కోర్సులకి అడ్వర్టైజ్ మెంట్లు పడవూ? అలాగే మా స్కూల్లో కూడా చదువుకున్నా, చదవకపోయినా ఓరియంటేషన్ కోసం చేరొచ్చు"

"ఓరియంటేషన్ దేనికి?"

"రాజకీయాలకి"

"రాజకీయాలకి - అంటే మీరు నేర్పేది పొలిటికల్ సైన్సా?"

మార్క్ నవ్వి, "అబ్బే నీ ఆలోచనంతా రాంగ్ రూటులో వెడుతోంది. రాజకీయాలకు ఓరియంటేషన్ కోర్సు అంటే వివరంగా చెబుతా, విను" అంటూ ప్రారంభించాడు.

"అసలు లోపం మన విద్యా విధానంలో ఉంది.

సత్యం పలకవలెను. దేవుని పూజింపుము. చిత్తశుద్ధితో మసలుము. దేశమును ప్రేమించుము. మనుషులంతా ఒక్కటే!

చిన్నతనం నుంచీ పిల్లల మనుషుల్ని కలుషితం చేసే - ఇలాంటి నీతి పాఠాలు వాస్తవంలో నిరుపయోగం.

అవనీతిని పాటించకుండా, కులద్వేషాలు పెంచుకోకుండా, మత కలహాలు రెచ్చగొట్టకుండా, దేశద్రోహానికి వెనుకాకుండా - ఔన్నత్యం సాధించడం మనిషికి వీలుపడదు.

అందువల్ల అటు సామాన్యుడిగా మిగల్లేక ఇటు ఔన్నత్యం సాధించలేక మనిషి మధనపడడం ప్రారంభిస్తాడు. అందుకని అటు చదువుకున్నవారికీ, ఇటు చదువురానివారికీ కూడా ఔన్నత్యానికి దారి చూపించగల రాజకీయాల్లో రాణించాలంటే - ఓరియంటేషన్ ఎంతో అవసరం."

"అర్థమైంది" అంది వనజ, "కానీ నాకు తెలిసి - ఔన్నత్యం సాధించిన రాజకీయనేతలెవ్వరూ అవినీతినీ, కుల తత్వాన్నీ, మతద్వేషాన్నీ, దేశద్రోహాన్నీ ప్రోత్సహించరు"

మార్క్ నవ్వి, "అందుకే మా ఓరియంటేషన్ కోర్సు. మాటలు అందరూ మెచ్చేలా చెప్పాలి, చేతలు మనని పైకి తెచ్చేలా ఉండాలి. హిపోక్రసీ - అందులో ఇక్కడ శిక్షణ ఇస్తాం" అన్నాడు.

"అసలే మన రాజకీయవాదులకు స్వయం ప్రతిభ ఎక్కువ. దానికి తోడు ఈ ఓరియంటేషన్ కోర్సు ఒకటా - అంటే ప్రజలకు గోరుచుట్టుపై రోకటి పోటు"

"మన ప్రజలకు గోరుచుట్టు కొత్తకాదు. రోకటి పోట్లూ కొత్తకాదు. ఎవరి కర్మ వారిది. ఇక రాజకీయవాదుల స్వయంప్రతిభ అంటావా? అది నీ రాంగ్ నోషన్. నిజమేమిటంటే - అంతా నా ట్యూషన్"

"అంటే?"

"మన రాష్ట్రంలో రాజకీయ ప్రముఖుల పేర్లు కొన్ని చెప్పు. వాళ్ళు వల్లించే శ్రీరంగనీతులూ, దూరిన దొమ్మరి గుడిసెలూ కూడా నేను ఏకరువు పెడతాను. నో ఎక్సెప్షన్సు. సరేనా?"

"సరేలెండి - అదంతా ఓపెన్ సీక్రెట్. ఎవరికి తెలియదు కనుక"

"ఓపెన్ కాని సీక్రెట్ ఒకటుంది. అదే నేను" ఆగాడు మార్క్, "ఆరంభంలో ట్యూషన్లు చెప్పేవాణ్ణి. వాటితోనే ఎందరో పైకొచ్చారు. ఏమయ్యారో చెప్పను. పదవి చెబితే చాలు, పేరు పట్టేస్తావు మరి. అదీ నా భయం. నా వల్ల పైకొచ్చిన వాళ్ళందరూ ప్రజల సొమ్ము తినడంలో క్షణం తీరిక లేక కొంత డబ్బు నాకిచ్చి నా చేత ఏకంగా ఈ స్కూలు తెరిపించారు"

"ఇప్పటికే పైకొచ్చిన వాళ్ళకి ఇంకా ఈ స్కూలుతో ఏం పని?"

"వాళ్ళ పిల్లల కోసం.."

"రాజకీయాల్లో తలిదండ్రుల్ని మించిన గురువులుంటారా?"

"ఉంటారు కానీ - నిండా రాజకీయాల్లో మునిగినవాళ్ళు, పెళ్ళాం బిడ్డలు ఏమడిగినా ఇవ్వగలరు - ఒక్క టైం తప్ప! అది నేనిస్తాను. అదీకాక పిల్లలు తలిదండ్రులకంటే గురువుల మాట వింటారు. ఆ పైన తలిదండ్రులు చెప్పలేని సున్నితమైన వివరాలు కూడా నేను చెప్పగలను."

వనజ చప్పట్లు కొట్టి, "మిమ్మల్ని అభినందించి తీరాలి. ఇలాంటి స్కూలు ప్రపంచ చరిత్రలోనే ఇదే ప్రథమం కావచ్చు" అంది.

మార్క్ తల అడ్డంగా ఊపి, "లేదమ్మా - ప్రాణ కాలంలో చండా మార్కుడు ఇలాంటి స్కూలొకటి నడిపాడు. ఆయనే నాకు ఇన్స్పిరేషన్. అందుకే పెద్దలు పెట్టిన చంద్రశేఖర్ అన్న పేరుని చండా మార్క్‌గా మార్చుకున్నా" అన్నాడు.

అప్పటికి సి. మార్క్ అంటే ఏమిటో వనజకు తెలిసింది, "మీ స్కూల్లో స్టాఫెంతమంది?"

"ఈ స్కూలుకు సర్వస్వం నేనే" అని, "ఇక పిల్లలు వచ్చేవేళయింది" అన్నాడు మార్క్.

వనజ లేచింది. ఆమె మనసు ఆలోచనలతో బరువెక్కింది.

దేశంలో ఎందరికో కట్టుగుడ్డ లేదు. తాగేనీళ్ళులేవు. కడుపు నిండా కూడు లేదు. కానీ - కడుపు నిండిన వారు, లేని వారిని దోచుకునేందుకు రోజుకో కొత్తసాధనం. రోజుకో కొత్త సదుపాయం.

మార్క్ ఆమెకో కాగితాన్నందించి, "చూడమ్మా - రాజకీయాల్లో ఇంటర్వ్యూ కూడా ఓ హిపోక్రసీ. నువ్వు నా నుంచి చాలా విశేషాలే తెలుసుకున్నావు. అవి నీకు తెలిసిన వాళ్ళకి చెప్పడం కోసం. పత్రికలో వేయడానికెలా బాగుంటుందో - ఈ పాంప్లెట్‌లో ఉంది" అన్నాడు.

వనజ ఆ కాగితమందుకుని చదివితే - దేశంలో నాయకులకి కరువొచ్చిందట. "పదవులు చేబట్టి, దేశాన్ని కొత్త శతాబ్దంలోకి నడిపించే సమర్థత కావాలంటే - ది గ్రేట్ ఓరియంటేషన్ స్కూల్లో శిక్షణ పొందాలట" వనజ ఆ కాగితం తీసుకుని బయటకొస్తే - బిలబిల్లాడుతూ జనం. అరవై దాటిన వృద్ధులూ, ఇరవై దాటని కన్యలూ. అందరికంటే వెనుకగా నెమ్మదిగా నడుస్తున్న ఓ అయిదేళ్ళ బాబు వనజని ఆకర్షించాడు.

"బాబూ నీకిక్కడేం పని?" అడిగింది వనజ.

"మంత్రినవుతా" అన్నాడా బాబు.

"అప్పుడేనా - ఇంకా నీకు వయసేది?"

బాబు ఆమెనదోలా చూసి, "మా నాన్న మంత్రి తెలుసా?" అన్నాడు.

"ఐతే?"

"నాకు అమ్మలేదు. అన్నలేడు. తమ్ముడు లేడు"

"ఐతే?"

"నాన్నకి వంట్లో బాగుండడంలేదు"

"ఐతే?"

"ఐతే ఏంటి - నాన్న పోతే నేనే మంత్రిని"

"ఎవరు చెప్పారు?"

"నాన్న పార్టీవాళ్ళు"

"కానీ నీకు వయసు చాలదు బాబూ -"

"అది ఎగస్పార్టీ వాళ్ళనే మాట"

వనజ ఆశ్చర్యంగా, "అమ్మో నీకు చాలా తెలుసే" అని ఆగి, "ఒకవేళ మీ నాన్న చనిపోకపోతే?" అంది.

"ఛీ- అన్నీ అపశకునం మాటలు" అంటూ ఆ బాబు ముందుకెళ్ళాడు.

వనజ మ్రాన్పడిపోయింది. చండామార్కుడి శిక్షణ సామాన్యమైనది కాదని ఆమెకు అర్థమైపోయింది. ఆమె బంగళా బైటకొచ్చేసరికి అక్కడ కారొకటి ఆగింది. అందులోంచి దిగాడు ప్రహ్లాద్.

ప్రహ్లాద్ వనజని చూశాడు. ఆమె అతణ్ణి చూసింది. ఒకర్నొకరు గుర్తుపట్టారు.

అతడు తడబడ్డాడు. ఆమె కూడా తడబడింది.

అంతలో కార్లోంచి హిరణ్యారావు దిగాడు. తండ్రీకొడుకులు లోపలకెడుతుంటే, "ప్రహ్లాద్ చాలా బాగున్నాడు" అనుకుంది వనజ అప్రయత్నంగా. అంతలోనే ఆమెకు సందేహం - అక్కడ అతనికేం పని!

"కాబోయే రాజకీయవాది కదా - ది గ్రేట్ ఓరియంటేషన్ స్కూల్లో శిక్షణ కావాలి. కానీ చాలా ఆలస్యం చేసాడెందుకో" అనుకుంది వనజ.

అప్పుడే ఆమెకి ప్రహ్లాద్ మీద దురభిప్రాయం ఏర్పడింది.

✡✡✡

ది గ్రేట్ ఓరియంటేషన్ స్కూల్ గురించి హిరణ్యారావుకి తెలుసుకానీ ప్రహ్లాద్‌కి తెలియదు. మార్క్‌కి హిరణ్యారావు తెలుసుకానీ ఆయన అప్పుడలా తన దగ్గరకొచ్చి కొడుకునప్పగించి వెడతాడని తెలియదు.

ముందాయన ప్రహ్లాద్‌ని క్లాస్ రూంకి పంపాడు. తర్వాత హిరణ్యారావు తన స్కూల్లో పాదం మోపడమే విశేషమన్నట్లు అతి వినయం అభినయించి ఆయన్ని గుమ్మందాకా సాగనంపి అప్పుడు తనూ క్లాసు రూంకి వెళ్ళాడు. క్లాసు రూంలో శిష్యులకి కుర్చీలు. వారికెదురుగా గురువుకి వేదిక ఉంది. వేదిక మీద రెండు బల్లలు. ఓ బల్లమీద టీవీ. రెండో బల్ల వెనక కుర్చీలో మార్క్.

మార్క్ పాఠం మొదలైంది, "మనందరికీ ఆదర్శపురుషుడైన శ్రీరాముడి కథ రాయడానికి ముందు, వాల్మీకి పెద్ద బందిపోటు దొంగ. అంటే - సామాన్యుల్ని దోపిడీనుంచి కాపాడే నాయకులు కావాలంటే ముందు సామాన్యుల్ని దోపిడి చేయాలి. అదీ మన రాజకీయ సంప్రదాయం. ఇప్పుడు మీరు రత్నయ్య కథ తెలుసుకోండి. ఆయన పరమ కర్కోటకుడిలా, కిరాతకుడిలా మసలుతూ - సామాన్యుడికి శాంతిలేకుండా చేసి ఇప్పుడు రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే హోం మంత్రి అయ్యాడు. ఆయన గురించి ఇంతకాలం ఎవరికీ తెలియని కొన్ని విశేషాలు మీకిప్పుడు చూపిస్తా" అంటూ ఆన్ చేశాడు.

పావుగంట సేపు టీవీలో మాటలకందని ఘోరాలు కనిపించాయి.

మార్క్ టీవీ ఆఫ్ చేసి, "ఇది మీలో ఒకొక్కరు ఒకో విధంగా స్పందించి ఉంటారు. అయితే ఇక్కడున్న వారిలో విద్యాధికుడు, స్కూలుకి కొత్త స్టూడెంటు అయిన ప్రహ్లాద్ ఎలా స్పందించాడో తెలుసుకుందాం. మీరంతా ప్రహ్లాద్ చెప్పినట్లు వినండి. మీరు ఫ్రీగా డిస్కస్ చేసుకుందుకుగానూ ఓ గంటసేపు నేను బయటకెడుతున్నా. నేను తిరిగొచ్చేసరికి మీరంతా రత్నయ్యమీద పాటలు కట్టి పాడుతుండాలి" అని బయటకెళ్ళాడు.

ప్రహ్లాద్ వేదికమీదకొచ్చి, "మరి మీరంతా నే చెప్పేది శ్రద్ధగా వినాలి" అన్నాడు.

"గురువుగారు చెప్పారు కదా - శ్రద్ధగా వింటాం" అన్నారు అంతా ఏక కంఠంతో.

"తను చెప్పిందానికి భిన్నంగా చెప్పాలనే గురువుగారు నాకీ బాధ్యత అప్పగించి తనిక్కణ్ణించి తప్పుకున్నారు. నేనాయన మనసు ననుసరించి నాలుగు మాటలు చెబుతాను" అన్నాడు.

శిష్యులందరూ నిశ్శబ్దంగా వినసాగారు.

"రామాయణం ఆదికావ్యం. వాల్మీకికి ముందు పుస్తకాలు రాసిన వాళ్ళులేరు. అందుకే వాల్మీకికి ఎలా మసలాలో తెలియక ఘోరాలు, నేరాలు చేశాడు. అలా చేసిన వారందరికీ ఏదో ఒక రోజున పశ్చాత్తాపం తప్పనిసరి. వాల్మీకి విషయంలోనూ అదే జరిగింది. చేసిన తప్పు మాయని మచ్చలాంటిది. ముమ్ముందు మనుషులు మంచి మార్గం తప్పకుండా కాపాడ్డానికి అవతారమూర్తులు నిత్యం ఉద్భవిస్తూనే ఉంటారు. ఇప్పుడు మన ఊళ్ళో మన మధ్య ఓ అవతార మూర్తి ఉంది. ఆమె పేరు వనజ. మీకు నేను ఆమె కథ చెబుతా, వినండి" అంటూ - భారతి టీచరుతో ప్రారంభించి ఇటీవలి వ్యవహారాల దాకా - చెడునెదిరించడానికి చిన్నప్పటినుంచీ చేసిన సాహసాలు ఒకొక్కటిగా చెప్పి, "ఈ వివరాలు చాలామందికి తెలియవు. నేను వనజ వల్ల ప్రభావితుణ్ణయ్యాను కాబట్టి, ఎంతో కష్టపడి ఈ వివరాలు

తెలుసుకున్నాను. మనస్సాక్షికి తృప్తి కలిగేలా ఎత్తుకి చేరాలంటే మనం అభిమానించి ఆరాధించాల్సిన మనిషెవరో ఇప్పుడుమీరు చెప్పండి'' అన్నాడు ప్రహ్లాద్.

''వనజ'' అన్నారు శిష్యులందరూ ఏకకంఠంతో.

✡✡✡

## 6

**మార్క్ తిరిగొచ్చేసరికి** క్లాసురూంలో వనజ భజన జరుగుతోంది. ఆయన కంగారుపడి వాళ్ళను ఆపి వనజ ఎవరని ప్రహ్లాద్ నడిగి తెలుసుకుని శివశివా అంటూ రెండు చెవులూ మూసుకుని, ''ఆ వనజ పేరు కూడా ఇక్కడ ఉచ్చరించకూడదు. ఆమె మనకీ, మన ఆశయాలకీ శత్రువు'' అన్నాడు.

''చెడ్డ మిత్రునికంటే మంచి శత్రువువల్లే ఎక్కువ ప్రయోజనం'' అన్నాడు ప్రహ్లాద్.

మార్క్ వెంటనే శిష్యులవంక తిరిగి, ''ప్రియ శిష్యులారా! ప్రహ్లాద్ వ్యవహారం తిరకాసుగా ఉంది. ఇతడు చెప్పినదంతా బుర్రల్లోంచీ తీసిపారేయండి. వనజ కాదు - రత్నయ్యే మనకాదర్శం'' అన్నాడు.

''నో'' అన్నారు శిష్యులంతా ఏకకంఠంతో.

''నేను మీ గురువుని. మీరు గురువు మాటలే వినాలి'' అన్నాడు మార్క్.

''గురువర్యా! రాజకీయాల్లో తండ్రిలేడు, తల్లి లేదు, అన్నలేడు, గురువులేడు - అదేకదా మీ మాట. ఆ మాటే మీ శిష్యులు పాటిస్తారు. వస్తా'' అంటూ ప్రహ్లాద్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

✡✡✡

ఫోన్లో ఆ కబురు విని, ''ఎవరీ వనజ?'' అంటూ హుంకరించాడు హిరణ్యారావు - భవనం దద్దరిల్లేలా.

ఏమయిందోనని కంగారుగా ఆయన గదిలోకొచ్చిన లీల ఆయన ముఖంలో కోపాన్ని చూసి తడబడింది. కానీ లీలని చూస్తూనే హిరణ్యారావు ముఖం ప్రసన్నంగా అయిపోగా, ''రా, నీతో మాట్లాడాలి'' అన్నాడాప్యాయంగా. భార్యాభర్తలు ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

''ప్రహ్లాద్ నాకెంతో నీకూ అంతేకదా -'' అన్నాడాయన.

''కాదు'' అంది లీల.

ముందు ఉలిక్కిపడ్డా - ఆమె మనోగతం అర్థంకాగా - ఆవేశాన్నెలాగో అదుపు చేసుకుని, ''నువ్వు నా అర్ధాంగివి. ఆ విషయం మరచిపోకు'' అన్నాడు శాంతంగా.

''మరచింది నేను కాదు, మీరు'' అంది లీల చటుక్కున.

హిరణ్యారావు క్షణంపాటు మౌనం వహించాడు. భార్య అర్ధాంగి అంటే తన వ్యక్తిత్వాన్ని ఆమెకు ఆపాదించాలని తన ఉద్దేశ్యం. ఆమె వ్యక్తిత్వంలో సగాన్ని తను ఆమోదించాలని ఆమె ఉద్దేశ్యం. ఏది రైటో స్పష్టమే!

అందుకే ఆయన మాట మార్చుతూ, ''మన ప్రహ్లాద్ బుర్రలో ఏమన్నా ఫర్వాలేదు - మన నీడలో ఉన్నంతవరకూ! కానీ వాడిప్పుడు ఎవరో వనజ అనే అమ్మాయి వెంటబడ్డాడు. ఆ దారినిండా ముళ్ళకంపలు, గాజు పెంకులు, తేళ్ళు, జెర్రెలు.. వాడు చూసుకోవడంలేదు'' అన్నాడు.

''మీరిక వాడి గురించి ఆలోచించకండి. వాడూ పెద్దవాడయ్యాడు. వెళ్ళిన దారి మంచిదీ - మంచిదే! చెడ్డదైతేవాడే అనుభవిస్తాడు'' అంది లీల.

ఆ మాటలు ఎవరినుద్దేశించి అన్నదో, ఏ ఉద్దేశ్యంతో అన్నదో హిరణ్యారావుకి అర్థమైంది. ఐనా వీలైనంత శాంతంగా, ''నా బాధ వాడి గురించి కాదు. ముళ్ళకంపలు, గాజుపెంకులు, తేళ్ళు, జెర్రెల గురించి. ఇంతకాలం నా దారి బాగు చేసుకుంటుంటే - అదే నీకు నచ్చలేదు. ఇప్పుడు వాడి దారి కూడా శుభ్రం చేయక తప్పదంటే - నీ మనసుకెంత కష్టం కలుగుతుందోనని - నా బాధ నీగురించే'' అన్నాడు.

మాటకి మాట బదులివ్వాలనే అనుకుంది లీల. కానీ ఆయన మనసులో ఉద్దేశ్యం చప్పున స్ఫురించడంతో ఉలిక్కిపడి, ''వద్దు, మీరా వనజ నేమీ చేయొద్దు. ఆమెని ప్రహ్లాద్ ప్రేమిస్తున్నాడు'' అందామె వనికిపోతూ.

''ఆహా, ఈ విషయం నీ నోట వినాలనే ఉవ్విళ్ళూరుతున్నాను. వాడు వనజని ప్రేమిస్తున్నాడా - అలాగని ఆమె కోసం ఏమైనా చేస్తాడా - మరి నేనూ వాణ్ణి ప్రేమిస్తున్నాను. వాడికోసం నేనూ ఏమైనా చెయ్యగలను''

''వాడికోసమే - మీరు వనజనేమీ చేయకండి'' అంది లీల.

''మాటతో నన్నాపగలననుకుంటున్నావా?'' దర్పంగా అన్నాడు హిరణ్యారావు.

''మీ మంచికే చెబుతున్నాను. వినకపోతే ఆ తర్వాత నన్నాపలేరు''

ఆమె అలాగంటుందని ఊహించని హిరణ్యారావు గతుక్కుమని, ''అంటే ఏం చేస్తావ్?'' అన్నాడు.

''మీరేం చేసినా నా దగ్గర విరుగుడుంది. అబ్బాయిని నా ప్రభావం నుంచి తప్పించడానికి తగిన కోడలి కోసం మీరు అన్వేషణ ప్రారంభిస్తే - మీకంటే ముందే నేను వనజని అన్వేషించాను'' అంది లీల.

''సరే - ఇదంతా నీ నిర్వాకమన్నమాట! ఐతే ఇప్పుడు దానికి నా విరుగుడు చూద్దువుగాని''

''ఏం చేస్తారు?'' కంగారుగా అడిగింది లీల.

''తినబోతూ కూరరుచి అడుగుతావేం?''

''తినబోనేమోనని భయం''

''ఆ భయం నీ కొద్దు. నేనంటే ఇష్టం లేకున్నా - నా బిడ్డకు తల్లివయ్యావ్. అలాగే కూరా తింటావ్'' అని నవ్వాడు హిరణ్యారావు. ఆ నవ్వు వికటాట్టహాసం కాదు. ఐనా భయంకరంగా ఉంది.

ఆ నవ్వుకు భవనం దద్దరిల్లలేదు. కానీ లీల గుండె దద్దరిల్లింది.

✡✡✡

వనజ బంగళాలో ఆఫీసు గది. వనజ తన సీట్లో కూర్చుంటే హిరణ్యారావు ఆమె కెదురుగా కూర్చున్నాడు.

''మీరెవరో నేను తెలుసుకోవచ్చా?'' అంది వనజ.

''మా ఆఫీసులో పేరు విన్నాకే కూర్చోమనడం ఆచారం. కానీ కూర్చున్నాక పేరడిగే నీ పద్ధతి బాగుంది. ఇది మా ఆఫీసులోనూ ప్రవేశపెట్టాలి'' అన్నాడు హిరణ్యారావు.

''మీరింకా పేరు చెప్పలేదు..''

''నెహ్రూగారు పోయి నలభైనాలుగేళ్ళైందేమో - అయినా నిన్న పుట్టిన పిల్లలు కూడా ఫోటో చూసి ఆయన్ని గుర్తుపట్టేస్తారు''

''మీ పేరు?'' నొక్కించింది వనజ.

''ఈ ఊళ్ళో నాకు నెహ్రూగారి కంటే పేరుంది''

"ప్లీజ్ - మీ పేరు చెప్పండి..."

"పేరెందుకులేమ్మా - ఎప్పుడైనా తెలుస్తుంది?" సర్ది చెప్పినట్లున్నాడు హిరణ్యరావు.

"ఎలా?" అర్థం కానట్లు అంది వనజ.

"నేను ఫలానా అని చెప్పుకోవడం నాకు అవమానం. కాబట్టి ఎంతడిగినా అది చెప్పను. ఇప్పుడు నీకో మాట చెప్పడానికొచ్చాను. కాబట్టి వద్దన్నా చెబుతాను. మాటంటే మాటకాదు. ఉద్యోగమే అనుకో"

"నాకుద్యోగముంది"

"ఇదేం ఉద్యోగమమ్మా - రోజుకు ఇన్ని గంటలని పనిచేసి నెలకోసారి జీతం తీసుకుంటావ్. నేనిచ్చే ఉద్యోగం అలాంటిది కాదు. అడిగినప్పుడల్లా అడిగినంతా జీతమిస్తా. ఉద్యోగం కూడా కష్టంకాదు. అప్పుడప్పుడు నువ్వేమైనా చెయ్యాలనుకుంటే - నేనొద్దంటాను, నువ్వు మానేయాలి. అంతే!"

"నా కర్థంకాలేదు"

"చాలా సింపుల్ - నువ్వో సినిమా చూద్దామనుకుంటావు. నేను వద్దంటాను, మానేయాలి. ఏమంటావ్!"

వనజ నవ్వి, "ఫర్ ఛేంజ్ - నేను వద్దంటాను - అదే.. ఉద్యోగం" అంది.

హిరణ్యరావు దెబ్బతిన్నాడు. అంతలోనే తమాయించుకుని, "ఉద్యోగమొద్దు సరే! పోనీ పదవి కావాలా?"

"అంటే?"

"ఉదాహరణకు మంత్రి పదవే అనుకో. నువ్వు రాష్ట్రానికే మంత్రివి అవుతావు. అదీ ఉద్యోగంలాగే - నేనొద్దన్నది మానేయడమే. సినిమా చూద్దామనుకున్నావనుకో, వద్దంటాను. మానేయాలి - అంతే!"

"అలా ఏ మంత్రీ ఉండడు" అంది వనజ చటుక్కున.

"మంత్రుల గురించి నాకు తెలిసింది నీకేం తెలుస్తుందిలే కానీ - నిజానిజాలు తెలుసుకుందుకేనా - ఓసారి మంత్రివి అవుతావా?"

వనజ ఈసారి కాస్త సీరియస్‌గా, "మళ్ళీ ఫరే ఛేంజ్ - నేను వద్దంటాను - అదే.. మంత్రి పదవి" అంది.

హిరణ్యరావు మళ్ళీ దెబ్బ తిన్నాడు. ఐనా త్వరగానే తేరుకుని, "డబ్బూ వద్దని, పదవీ వద్దని ఎలా బ్రతుకుతావమ్మా?" అన్నాడు జాలిగా.

"ఇప్పుడెలా బ్రతుకుతున్నానో - అలాగే" వ్యంగ్యంగా అంది వనజ.

"అయ్యో - ఎలా బ్రతుకుతావమ్మా అంటే నీకు అర్థమయినట్లు లేదు" జాలి పడ్డాడు హిరణ్యరావు.

ఆ జాలిలో హెచ్చరిక పసికట్టిన వనజ, "నాకు ప్రాణాలమీద తీపి లేదు" అంది చటుక్కున.

"ప్రాణాలమీద తీపి లేకపోవచ్చు. కానీ ఆ ప్రాణాలు చేదైపోతే ఏం చేస్తావ్? ఏ రోజేమౌతుందో ఎవరికి తెలుసు? బండిట్ క్వీన్ సినిమా మళ్ళీ తీయొచ్చు. అందులో ఫూలన్ దేవి వేషం నీకే రావచ్చు. షూటింగు నడి బజార్లో చేయొచ్చు" తాపీగా అన్నాడు హిరణ్యరావు.

ఉన్నట్లుండి, "మీ పేరు హిరణ్యరావు కదూ -" అంది వనజ.

"హమ్మయ్య - మొత్తం మీద చెప్పకుండానే నా పేరు తెలుసుకున్నావ్" హిరణ్యరావు కళ్ళలో గర్వం.

"చెప్పండి - మీకు నాతో ఏం పని?" నెమ్మదిగా అడిగింది వనజ.

"చెప్పానుగా - నేను వద్దన్న పని చేయకపోవడమే"

"చూడండి హిరణ్యరావుగారూ - నేను మీకోసం కాదు, సమాజం కోసం పని చేస్తాను. సమాజానికి పట్టిన దుమ్ముదులపడం, మురికి వదల్చడంలో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. నా విధి నిర్వహణలో - మీ మీద దుమ్ముపడ్డా, మీరు మురికి ఐనా నా బాధ్యతలేదు. ఆ విషయమ్మై మీరు నన్ను ఆశ పెట్టీ, భయపెట్టీ ప్రయోజనముండదు. కల్మషానికి దూరంగా ఉండండి. అప్పుడు నన్ను వద్దనే పని చేయాల్సిన అవసరమే ఉండదు" అంది వనజ. ఆమె గొంతులో దృఢ నిశ్చయాన్ని పసికట్టిన హిరణ్యరావు చప్పట్లు కొట్టాడు.

వనజ అతణ్ణి ఆశ్చర్యంగా చూసింది.

"నీ గురించి విని - నువ్వేమిటో తెలుసుకోవాలని వచ్చి - చిన్న పరీక్ష పెట్టా. నీ పట్టుదల, కార్యదీక్ష, చిత్తశుద్ధి అపూర్వం. నేనెంత రెచ్చగొట్టినా ఆవేశపడని నీ సహనం అనన్యసామాన్యం. దుష్టశక్తులకి వ్యతిరేకంగా మాత్రమే అపరిమితమైన నీ ఆవేశం అభినందనీయం"

వనజ నమ్మలేనట్లు, "మీరు నన్ను అభినందించడానికి వచ్చేరా?" అంది.

"లేదమ్మా - అది అప్రయత్నంగా జరిగింది. నేనొచ్చిన పనివేరు. మనూళ్ళో రంగారావనే వాడి ద్వారా - నకిలీ మందులు సరఫరా ఔతున్నాయి. అందువల్ల ఎందరో నష్టపోతుంటే - వాడు మాత్రం రెండు చేతులా అర్జిస్తున్నాడు. నువ్వు, కాంతికిరణం కలిస్తే వాడి పని సరి. ఇది చెప్పాలనే వచ్చాను" అన్నాడు హిరణ్యరావు.

ఆయన మాటలపై ఇంకా నమ్మకం కుదరని వనజ కొద్ది క్షణాలు తటపటాయించి, "ఇలా అడిగానని మీరేమీ అనుకోవద్దు. రంగారావు మీ అనుచరుడనే చెప్పుకుంటారు" అంది.

"అనుచరుడు కాడమ్మా - స్నేహితుడు. బాగా దగ్గర స్నేహితుడని నమ్మి వాడికెంతో సాయం చేస్తే ఇప్పుడింత వాడయ్యాడు. కానీ వాడు దారి తప్పడని తెలిసి - హెచ్చరించాను. వినలేదు. బెదిరించాను. ఎదురు తిరిగాడు. ఏం చేయాలి? నేనేమో ప్రజాస్వామ్యాన్ని నమ్మినవాణ్ణి. వాడేమో కిరాతకుడు. తన జోలికొచ్చిన వాళ్ళని క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా నలిపేస్తాడు. ఇప్పుడు వాడంటే నా అంతటి వాడికే భయం. వాడి ఆట కట్టించడం నీవల్లనౌతుందని మా అబ్బాయి ప్రహ్లాద్ నీ పేరు చెప్పాడు. అప్పుడాశ్చర్యపోయాను కానీ ఇప్పుడు నమ్మకంగా ఉంది. రంగారావుని దెబ్బతీసే నేర్పు, ఓర్పు, శక్తి సామర్థ్యం నీకే ఉన్నాయి"

"నిజంగా రంగారావును మీరేం చేయలేరా?" అనుమానంగా అంది వనజ.

"వాడి విషయంలో నేను చేయగలిగింది నేను చేశాను. అదే నీకు చెప్పడం -"

వనజ నవ్వింది, "మీరు ఏ ఉద్దేశ్యంతో నాకీపని అప్పగిస్తున్నారో తెలియదు కానీ ఇది నాకు నచ్చేపనే -"

"థాంక్స్" అంటూ లేచాడు హిరణ్యరావు.

✡✡✡

"హు హు హహ హ్హాహ్హాహ్హాహ్హా..." రంగారావు వికటాట్టహాసం చేసాడు.

"అదేంటి గురూగారూ - అలా నవ్వారు" అన్నాడాయన అనుచరుడు గంగారావు కంగారుగా.

రంగారావలా నవ్వితే అనుచరులక్కూడా భయమే!

"ఏం చేయనూ - నవ్వాల్సొచ్చింది" అన్నాడు రంగారావు.

రంగారావు చెప్పేదింకా అయిపోలేదని తెలిసిన గంగారావు చెవులు రిక్కించి కూర్చున్నాడు.

"నేను మేడకడితే అది రాజుగారి కోటలా ఉందని అంతా మెచ్చుకున్నారు. మెచ్చుకోనిదల్లా ఒక్కడే - హిరణ్యరావు"

ఇంకా వినాల్సి ఉందని గంగారావుకి తెలుసు. చెవులింకా రిక్కించే ఉంచాడు.

"నదీజలాలు కలిస్తేనే సముద్రం పుడుతుంది. తను సముద్రాన్ననుకోవడం హిరణ్యారావు తప్పుకాదు. కానీ నదుల్ని మర్చిపోతేనే ఇబ్బంది"

గంగారావు ఊఁ అనికూడా అనలేదు. ఊఁ అంటే రంగారావు ఆగినట్లు. తను ఆగేననుకోవడం రంగారావు కిష్టముండదు.

"నేను తియ్యగా ఉన్నానని చప్పరించాడు. తను మాత్రం నానాటికీ ఉప్పబడుతూనే ఉన్నాడు. వాడికి నన్ను చూస్తేనే ఏడుపు. కానీ నాకు మాత్రం వాణ్ణి చూస్తే... హుహు హ హ హ్హహ్హహ్హహ్హ.' మళ్ళీ నవ్వాడు రంగారావు. ఆ నవ్వు మరెక్కడో పిడుగైపడుతుందని రంగారావుకి తెలుసు, "హిరణ్యారావుకి మూడిందిసార్" అన్నాడు. "మూడింది వాడిక్కాదు, వనజకి" అన్నాడు రంగారావు.

వనజ ఎవరూ అని రంగారావడగలేదు, "పాపం - ఎవరో ఆడపిల్ల, వయసెంతో ఏమిటో కానీ - అప్పుడే నూరేళ్ళూ నిండాయి" అనుకున్నాడు.

✡✡✡

రఘుకి ఇంటర్నెట్లో ఈమెయిల్లో కనిపించింది వనజ పంపిన సందేశం. అందులో చాలా వివరాలున్నాయి. రంగా మెడికల్ స్టోర్సు నుంచి ధర్మాసుపత్రికి వెళ్ళేవన్నీ నకిలీ మందులే. ఆ మందుల్ని సప్లై చేస్తున్నది డాక్టర్ ప్రతాప్ అని తెలుసుకుని - వనజ ఆయన్ని కలుసుకుని నిలదీసింది.

ముందు ప్రతాప్ ఒప్పుకోలేదు. తర్వాత విషయం ఒప్పుకున్నా తప్పొప్పుకోలేదు.

"నేను శ్రీ శ్రీ భక్తుణ్ణి. ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి - అన్నాడాయన. అయినా అలాంటి వాళ్ళు చావడంలేదు. ధర్మాసుపత్రి ఆ విధంగా కొంతభూభారాన్ని తగ్గిస్తోంది" అన్నాడు డాక్టర్.

"సత్యభామ ఆదాయమంతా రుక్మిణి తులసి దళానికి తూగలేదు. భూభారం విషయంలో నువ్వూ ఆ తులసిదళానికి తీసిపోవు" అంది వనజ.

"ఐతే ఏమంటావ్?" నిర్లక్ష్యంగా అన్నాడు డాక్టర్.

"ఈ భూమ్మీంచి నిన్నూ నీలాంటి వాళ్ళనూ తప్పించాలి. అప్పుడిక భూభారం సమస్యే ఉండదు"

"చాలా ధైర్యంగా మాట్లాడుతున్నావ్. ఎక్కడుంది నీ బలం?"

"నా బలం హిరణ్యారావు. నేనాయన మనిషిని" అంది వనజ.

ఆ పేరుకే వణికాడు డాక్టరు. వనజ అబద్ధం చెబుతోందని అనిపించకపోయినా ఎందుకైనా మంచిదని ఓ సారాయనకి ఫోన్ చేస్తే, "నేను వనజ మీద ఈగ వాలినా సహించనంతే" అని బదులొచ్చింది.

డాక్టర్ డైలమాలో పడ్డాడు.

రంగారావు చిత్రహింసలు పెట్టగల మొనగాడైతే హిరణ్యారావు మొనగాళ్ళకు మొనగాడు.

వనజకీ విలేఖరిగా ఊళ్ళో అంతో ఇంతో పేరుండడంతో డాక్టరామెవైపు మొగ్గాడు. క్రమంగా వనజకి కావాల్సిన సమాధానాలు లభించాయి.

ఆ ఊళ్ళోనే ఉంది నకిలీ మందుల ఫ్యాక్టరీ. అది రంగారావుది. అందులో డాక్ట ర్ ప్రతాప్‌కి షేర్లున్నాయి.

"నాకా షేర్లమీద ఆశలేదు" అన్నాడు ప్రతాప్.

"మరి ఆశదేనిమీద?" అడిగింది వనజ.

"బతుకు మీద" అన్నాడు ప్రతాప్, "బతుకు మీద ఆశ ఉన్నవారెవరైనా రంగారావు చెప్పింది చేయక తప్పదు"

"బంగారానికైనా గోడ చేరువు అవసరం. మరి మసి బొగ్గుకి అవసరముండదా? వెధవపనులు చేసే వాళ్ళంతా అసహాయులమనే అంటారు. నేను ఆడపిల్లని. నాకంటే అసహాయుడివా నువ్వు?" అంది వనజ.

"అదేనమ్మా - నిన్నూ హెచ్చరిస్తున్నాను. నువ్వు హిరణ్యరావు మనిషివే కావచ్చు. రంగారావు ఆయన్నేమీ చెయ్యకపోవచ్చు. కానీ హిరణ్యరావు నిన్ను రంగారావు నుంచి కాపాడలేడు" అన్నాడు ప్రతాప్.

"నాకు ప్రాణభయం లేదు"

"చిన్నపిల్లవి, నీకు నూరేళ్ళాయుష్షుంది"

"ఆయుష్షుంటే బ్రతక్కుండా నన్నెవరాపగలరు? నువ్వూ ప్రాణభయం వదిలిపెట్టు. నూరేళ్ళూ బ్రతుకుతావు"

"నువ్వు జోస్యాన్ని నమ్మితే నేననుభవాన్ని నమ్ముతున్నాను. కాబట్టి నీకో హెచ్చరిక - నేను నీకు మొత్తం రంగారావు గుట్టంతా చెప్పేసి - నన్ను హిరణ్యరావు బారినుండి రక్షించుకున్నాను. ఇక ఇప్పుడు మొత్తం నీ గుట్టంతా రంగారావుకి చెప్పేస్తాను. ఆయన బారినుండి నన్ను రక్షించుకోవాలిగా"

"గుడ్ - రోగి కోరిందే వైద్యుడిచ్చాడు. అన్నట్లు నువ్వు వైద్యుడివి కూడానూ" అంది వనజ.

ఆ తర్వాత రంగారావుకి ఫోన్ చేశాడు ప్రతాప్ వనజ ఎదుటే....

ఆ తర్వాత వనజ ఈ మెయిల్ పంపింది - అన్ని వివరాలతోపాటు నకిలీ మందుల ఫ్యాక్టరీ చిరునామా, తనా రాత్రి ఒంటరిగా అక్కడికెళ్ళి ఫోటోలు తియ్యబోతున్నానన్న సమాచారమూ పొందుపర్చి.

ఆ వివరాలన్నీ చదివిన ఇన్స్పెక్టర్ రఘు, "వెల్ డన్ వనజా! నీ దారిని నిష్కంటకం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి -" అనుకున్నాడు.

✡✡✡

## 7

**రాత్రి పది** దాటాక బంగళానుంచి బయటకు వచ్చింది వనజ.

ఆమె భుజాన ఓ సంచి వ్రేలాడుతోంది. అందులో ఉన్నదొక కెమేరా.

వనజ రోడ్డుమీద చకచకా నడుస్తోంది. తననెవ్వరైనా అనుసరిస్తారేమోనన్న భయం ఏ మాత్రం లేనట్లు వెనక్కి తిరిగి చూడను కూడా చూడ్డం లేదు. అలా కొంత దూరం వెళ్ళి ఓ ఇరుకు సందులోకి తిరిగిందామె. కొంత దూరం వెళ్ళాక ఓ వ్యక్తి ఆమె దారికి అడ్డుగా నిలబడ్డాడు.

ఆరడుగుల పొడవు. నిగనిగలాడే నలుపు. మెలి తిరిగిన కండలు. రూపానికి రాక్షసుడు..

వనజ ఆగకుండా అతణ్ణి దాటుకుని ముందుకు వెళ్ళింది.

"ఏయ్ పిల్లా ఆగు" అన్నాడా వ్యక్తి.

వనజ వెనక్కి తిరగలేదు.  వ్యక్తి ఆమె దారికి అడ్డుగా నిలబడ్డాడు.

వనజ వెనక్కి తిరగలేదు. ఆ వ్యక్తి రెండడుగులు వేశాడామె వైపు. అంతే - ఉన్నట్లుండి బొక్కా బోర్లాపడ్డాడు. వనజ ఆ శబ్దం విని, "ఒకటి" అనుకుంది.

నకిలీ మందుల ఫ్యాక్టరీ చేరుకునేలోగా అలా ఆమె మొత్తం ఏడంకెలు లెక్కపెట్టింది.

"ఇన్స్పెక్టర్ రఘుకి ఆ ఏడుగురూ ఇచ్చే సమాచారంలో ఎన్ని విశేషాలుంటాయో" అనుకుందామె.

మందుల ఫ్యాక్టరీ మరీ పెద్దదేం కాదు. ఇంచుమించు తన బంగళా అంత స్థలమే. ఎటొచ్చీ రెండంతస్తుల మేడ. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ. ఆ గోడలో ఓ గేటు. గేటు ముందో దర్వాన్.

"అయాం వెరీ లక్కీ" అంది వనజ వెంటనే.

దర్వాన్ వెంటనే ఆమెకు సెల్యూట్ చేసి, "వెళ్ళండమ్మా" అన్నాడు.

డాక్టర్ ప్రతాప్ తనకి సరైన కోడ్ వర్డే చెప్పాడని సంతోషిస్తూ లోపలికెళ్ళింది వనజ.

ఆమె లోపలకెళ్ళిందో లేదో గేటు ముందు పోలీసు జీపు ఆగింది.

✡✡✡

మర్నాడు కాంతికిరణంలో నకిలీ మందుల ఫ్యాక్టరీ గురించి తాటికాయలంత అక్షరాలతో వార్త. దాని వెనకనున్న నగర ప్రముఖుల హస్తాల వివరాలు త్వరలో బయటపెట్టగలమన్న - ప్రకటన. నగరంలో పెద్ద సంచలనం. పత్రికలో రంగారావు పేరు మాత్రం ఎక్కడా లేదు.

✡✡✡

"హుహు హ హ్హా హ్హా హ్హా". అది రంగారావు నవ్వు.

ఈసారి గంగారావు ఆ నవ్వుకు భయపడలేదు, "అలా నవ్వకండి సార్" అన్నాడు.

రంగారావుకి కోపమూ రాలేదు, "టెస్టింగైపోయింది. వనజ హిరణ్యారావు మనిషే" అన్నాడాయన.

పాతికమంది అనుచరులు జైల్లో ఉన్నారు. ఓ ఫ్యాక్టరీ మూతపడింది. ఇదంతా టెస్టింగు - అందులోనూ వనజ అనే ఓ ఆడపిల్ల హిరణ్యారావు మనిషి అవునో కాదో తెలుసుకుందుకు గంగారావు చెవిలో పువ్వెట్టుకుని కూర్చోలేదు. ఐనా రంగారావంతటి వాడితో ఆ మాటనలేక, "చాలా కాస్టీ టెస్టింగు" అన్నాడు.

"కాస్టీయా - నువ్వొట్టి ఫూల్ వి" అన్నాడు రంగారావు.

ఫ్యాక్టరీ అయిదేళ్ళుగా నడుస్తోంది. అన్ని ఖర్చులూ పోనూ ఇప్పటికి దాని మీదొచ్చిన లాభం అయిదుకోట్లు. అదీ మూతబడిపోయిందని లెక్కేసుకున్నాక, లాభమంతా రంగారావుదే ఐనా, అది రంగారావు ఫ్యాక్టరీ అనడానికి పోలీసులకి ఒక్క ఆధారం దొరకలేదు. దొరికిన పాతికమందీ తప్పొప్పుకుంటారు తప్ప - ఫ్యాక్టరీ రంగారావుదని చెప్పరు. చెప్పినా ఋజువు చెయ్యలేరు.

"అసలీ ఫ్యాక్టరీ హిరణ్యారావు చెప్పాడని పెట్టాను. సలహా ఆయనదే కానీ రిస్కంతా నాది. అందుకే ఆయన కొక్క పైసా ఇవ్వలేదు. అక్కడే మా ఇద్దరికీ చెడింది"

"ఇంకో టెస్టింగు కూడా అయిందండి - చెడితే హిరణ్యారావు ఏం చేస్తాడో తెలిసింది" అన్నాడు గంగారావు.

రంగారావతణ్ణి చురుగ్గా చూసి, "ఎగతాళి కాదుకదా!?" అన్నాడు.

కాదన్నట్లు బుద్ధిగా అడ్డంగా తలూపాడు గంగారావు.

"అయితే మూడో టెస్టింగు గురించి చెబుతాను విను. వనజ మీద ఈగవాలితే సహించడట హిరణ్యారావు. మరి దాన్ని పాముకుడితే ఏం చేస్తాడో చూడాలి" అన్నాడు రంగారావు.

వనజ గురించిన టెస్టింగుకే కదా ఈ గతి పట్టిందీ అని గంగారావనలేదు. కానీ ఈసారి మనసులో, "పాపం ఆడపిల్ల. వయసెంతో ఏమో" అనుకోలేదు.

రంగారావది గ్రహించినవాడిలా, "చిన్నపిల్ల - ఆడపిల్ల - అని ఒకసారికి బెదిరింపుతో సరిపెట్టాను. ఇంక ఉపేక్షించను. ఈసారి నా ప్లానుకి తిరుగుండదు" అన్నాడు. గంగారావు నిట్టూర్చి ఊరుకుంటే, "అంతా నన్ను క్రూరంగారావంటారు. అయినా ఈ పూట ఎందుకో నాకా పిల్లమీద జాలేస్తోంది. దాని వయసెంతో నీకు తెలుసా?" అన్నాడు రంగారావు జాలిగా.

గంగారావు కూడా జాలిగా ముఖం పెట్టి, "గురూగారూ - ఇన్నేళ్ళుగా కలిసున్నాం. మీ వయసే నాకు తెలీదు. టైమొచ్చింది కాబట్టి అడుగుతున్నా. అదెంతో కాస్త చెబుతారూ?" అన్నాడు.

రంగారావు అదోలా చూసాడు. కానీ ఈసారి, "వేళాకోళమా?" అనడగలేదు. మనసులో మాత్రం, "ఇప్పుడు అసలు టెస్టింగు నాకేలా ఉంది" అనుకున్నాడు.

✡✡✡

ఆఫీసు రూంలో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తోంది వనజ.

కలియుగంలో పాపం పెరిగిపోతుందని పురాణాలు ఘోషించాయి కానీ ఏ యుగంలోనూ పాపాలకీ, పాపాత్ములకీ కొదవలేదు. కలియుగంలోనూ పుణ్యాలకీ, పుణ్యాత్ములకీ కొదవలేదు. జనాభా అప్పుడు లక్షల్లో ఉంటే - ఇప్పుడు కోట్లలో ఉంది. అంతే తేడా!

సామాన్యురాలైన తను సమాజానికి ఎంతో కొంత సాయపడాలనుకుంది. ప్రళయ భీకర కార్యం - తనకి నల్లేరుపై బండి నడకైంది. ఎలా?

అందుకు ఇన్‌స్పెక్టర్ రఘు. కానీ అతడూ సామాన్యుడే!

ఇద్దరు సామాన్యులు కలిసి అసామాన్య విశేషాలు సాధించారు. అంతం కాదిది ఆరంభం! తామిద్దరూ కలిసి ఇంకా ఎంత దూరం పయనిస్తారో - ఎన్ని ప్రళయాలనెదుర్కొంటారో?

"నమస్కారమమ్మా"

వనజ ఆలోచనల్లోంచి బయటపడి తలెత్తితే -

ఎదురుగా ఓ ముసలాయన. ముఖంలో ముడతల్లేవు కానీ వయసు యాభై దాటింది. ఖరీదైనవి కాకపోయినా ఉతికిన కాటన్ దుస్తులు ధరించాడు. విద్యావంతుడిలా ఉన్నా పల్లెటూర్నించి వచ్చేడనిపిస్తుంది.

"నా పేరు గణపతి. మా ఊరు గజపతి" అన్నాడాయన.

గజపతి ఆ నగరానికి పదికిలోమీటర్ల దూరంలో ఉండే కుగ్రామమని వనజకి తెలుసు. ఆ గ్రామ పౌరులు నాగరికతకి పదికంటే ఎక్కువే కిలోమీటర్లదూరంలో ఉన్నారంటారు. నగరంలో అనాగరికంగా, మోటుగా కనిపించేవారిని - గజపతి సరుకురా - అని ఎద్దేవా చేసే రివాజు కూడా ఉంది.

గణపతి మాత్రం చూడ్డానికి గజపతి సరుకులా లేడు. క్రమంగా అక్కడ కూడా నాగరికత పెరుగుతోందేమోననుకుంటూ, "చెప్పండి -" అంది వనజ.

"నీ గురించి విన్నానమ్మా - మా ఊరికి నీ అవసరముంది" అన్నాడు గణపతి.

"చెప్పండి" అంది వనజ.

"మా ఊళ్ళో ఎక్కువమంది పాముల్ని పట్టి జీవిస్తుంటారు. చాలా ప్రమాదకరమైన వృత్తి అని తెలిసినా మూఢాచారాలు నమ్ముతారే తప్ప ఆధునిక విజ్ఞానాన్నుపయోగించరు. పాముకాటుకి మందులు వాడరు. అందువల్ల కొందరు అర్ధాంతరంగా చస్తున్నారు. కొందరు శరీరంలో అవకరాలు తెచ్చుకున్నారు. వాళ్ళని నువ్వే మార్చాలి" గణపతి ఆగాడు.

"ఎలా?" అనలేదు వనజ. సమాజ సేవలో భాగంగా, చాలా ప్రాంతాల మూఢాచారాలు మాన్పించిన ఆమె, "సరే - రేపు ఉదయానికల్లా గజపతి చేరుకుంటాను" అంది.

గణపతి వనజకి చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు. బంగళా బయటకొచ్చాక అతడు చాలాసేపు రోడ్డు మీద నడిచాడు. తర్వాత ఓ హోటల్లో ప్రవేశించి టీ తాగి, బాత్ రూంకి వెళ్ళాడు. బాత్రూంలో ఎవరూ లేరని రూఢి చేసుకున్నాక మొబైల్ తీసి నంబర్లు నొక్కి, "బాస్! వనజ రేపు ఉదయం గజపతికి వెడుతుంది" అన్నాడు.

✡✡✡

ఆ రోజంతా వనజ చాలా బిజీగా ఉంది. పాములతో వ్యవహరించేటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందుకామె ఇద్దరు స్పెషలిస్టులను కలిసి - కొన్ని స్లైడ్స్, యాంటీ వెనమ్ ఇంజక్షన్సు సేకరించింది. రాత్రంతా కూర్చుని కొంత నోట్సు ప్రిపేర్ చేసింది. తన కోసం నాగకన్య తరహా కాస్ట్యూమ్స్ సంపాదించింది. స్లైడ్ ప్రొజెక్టర్ ఒకటి సిద్ధం చేసింది.

మర్నాడుదయం లేచి త్వరగా తెమిలింది. ఎనిమిది గంటలకి టాక్సీ ఎక్కి అరగంటలో గజపతి పొలిమేరలు చేరింది. టాక్సీ అక్కడ ఆపమంది. టాక్సీ దిగి, "రేపిదే టైముకి ఇక్కడికే రా" అని టాక్సీవాలాని పంపేసింది. అప్పుడు చుట్టూ చూస్తే - అది ఊరులా కాక అడివిలా ఉంది.

వనజ ఓ చెట్టు చాటుకి వెళ్ళి దుస్తులు మార్చుకుని నాగకన్యలా తయారైంది. భుజానికి సంచీ తగిలించుకుని, ప్రొజక్టరున్న సూట్ కేసు చేత్తో పట్టుకుని ఊళ్ళోకి నడక ప్రారంభించింది.

కొంత దూరం వెళ్ళేసరికి ఓ ఆడమనిషి ఎదురై చటుక్కున దణ్ణం పెట్టి, "నాగదేవతలా ఉన్నావమ్మా" అంది.

"నేను దేవతని కాను. మనిషినే - మీ ఇంటికి రావచ్చా?" అంది వనజ.

ఆ ఆడమనిషి పేరు నాగమ్మ. ఆమె దేవత వరం పొందిన దానిలా ఎంతో మురిసిపోయింది.

✡✡✡

నాగకన్యలా ఉన్న వనజని చూడ్డానికి పాములు పట్టేవాళ్ళ కుటుంబాలన్నీ వచ్చాయి.

అచ్చం నాగకన్యలా ఉందని కొందరన్నారు. కాదు నాగకన్యే అని కొందరన్నారు. వనజ ఎంతో సంతోషించింది. మూర్ఖుల్ని ఆకర్షించడానికి విలక్షణత్వం అవసరం. తనే నాగకన్య అని అనుకోకపోయినా వాళ్ళకి తనపట్ల కుతూహలం పుట్టింది. ఇప్పుడూ వాళ్ళు తనేం చెప్పినా నమ్మొచ్చు నమ్మకపోవచ్చు. కానీ వినడం గ్యారంటీ. ఇది తనకు సమాజ సేవ నేర్పిన పాఠం.

వనజ వాళ్ళకర్థమయ్యే రీతిలో పాముల గురించిన విజ్ఞాన విశేషాలు చెప్పింది. కొన్ని స్లైడ్స్ చూపించింది. శాస్త్రజ్ఞుల పరిశోధనలు గౌరవించాలనీ అందువల్ల మనకు మేలే జరుగుతుందనీ అక్కడి వాళ్ళ హృదయాలకి హత్తుకునేలా చెప్పింది. వాళ్ళకి పాము పాటలు వినిపిస్తూ, పాముల కథలు చెబుతూ, వాళ్ళతోటే లంచి కూడా చేసింది. చూస్తుండగా సాయంత్రమైంది.

"ఇక్కడ మీరుండలేరమ్మా - పట్నం వెళ్ళిపొండి" అని కొందరామెకు సలహా ఇచ్చారు.

"నేను మీకు పాఠాలు చెప్పాలనే కాదు, మీతో గడపాలనొచ్చాను. ఒక్క రాత్రి ఇక్కడుంటాను" అంది వనజ.

ఆమె పట్టుబట్టడంతో ఆతిధ్యానికి నాగమ్మ ముందుకొచ్చింది. ఆమె భర్త పని మీద పట్నం వెళ్ళాడట. రెండురోజులదాకా రాడట.

"ఆడి తోడుకంటే నాకు నీ తోడే బాగుంటుందమ్మా!" అంది నాగమ్మ.

✡✡✡

## 8

**అర్ధరాత్రి. టైం పన్నెండు గంటలు.**

నాగమ్మ గుడిసెలో ఒంటరిగా నులకమంచం మీద నిద్రపోతోంది వనజ. నేలమీద చాప పరుచుకుని దానిమీద నిద్రపోతుంది నాగమ్మ.

అప్పుడు దగ్గరగా వేసి ఉన్న గుడిసె తలుపులు తోసుకుని నెమ్మదిగా లోపలికి వచ్చాడు భీమన్న.

భీమన్న రంగారావు మనిషి.

అతడి చేతిలో బుట్ట, బుట్టలో త్రాచుపాము.

భీమన్న బుట్టమీద చేతితో తట్టి బుట్టని చెవి దగ్గర పెట్టుకుంటే లోపల్నుంచి బుస్ మంది త్రాచు.

భీమన్న మంచాన్ని సమీపించి ఆగి వనజని చూశాడు.

గుడిసెలో గుడ్డి వెలుతురులో కుడా వనజ ముఖంలోని అందం, ఆకర్షణ ప్రస్ఫుటమౌతున్నాయి.

భీమన్న మంచం మీంచి వంగి అవతల పక్క నేలమీద నిద్రపోతున్న నాగమ్మని చూసాడు.

ముఖాలు చూస్తే చాలు ఎవరు వనజో, ఎవరు నాగమ్మో తెలుసుకోవచ్చు. ఐనా భీమన్న రిస్కు తీసుకోలేదు. తనవల్ల చిన్న పొరపాటు కూడా జరక్కూడదని భీమన్నకి తెలుసు. ఎందుకంటే అది రంగారావు పని. ఆయన విషయంలో ఎవరికైనా పొరపాటు చేసే అవకాశం ఒక్కసారే వస్తుంది. రెండోసారికా మనిషుండడు.

భీమన్న మళ్ళీ నిటారుగా నిలబడి జేబులోంచి ఫోటో ఒకటి తీసి – దీపం దగ్గరగా వెళ్ళి ఫోటోని జాగ్రత్తగా చూశాడు. ఆ గుడ్డి వెలుతురులో కూడా వనజ ఫోటోలోని అందం, ఆకర్షణ ప్రస్ఫుటమౌతున్నాయి.

మంచం మీదున్నది వనజేనని రూఢి అయాక భీమన్న ఫోటో జేబులోకి తోసి మళ్ళీ మంచం వైపు నడిచాడు. చుట్టూ నిశ్శబ్దం. గుడిసెలో నిశ్శబ్దం. భీమన్నకి తన గుండె చప్పుడు తనకే వినిపించేటంత నిశ్శబ్దం. సరిగ్గా అప్పుడే పైన పురుగును పట్టబోతున్న బల్లికి పట్టు తప్పి – సరిగ్గా భీమన్న మీదే పడింది.

భీమన్నకి వళ్ళు జలదరించింది. కానీ అప్రయత్నంగా కూడా కెవ్వుమనలేదు. అతడు తన మనసుకిచ్చిన శిక్షణ అలాంటిది. కానీ ఉలికిపాటుకి భీమన్న చేతిలో బుట్టజారింది. వెంటనే రెండుగా విడింది. అందులోంచి త్రాచు సర్రున లేచింది. పడగ విప్పింది. భీమన్నని కాటేసింది.

అంతా క్షణంలో జరిగిపోయింది.

అప్పుడతణ్ణి ఏ శిక్షణా ఆపలేదు. కెవ్వుమన్నాడు భీమన్న.

అది అదురు కాదు, బెదురు కాదు – ప్రాణ భయంతో చేసిన ఆర్తనాదం!

కళ్ళు తెరిచేసరికి నులకమంచం మీద పడుకుని ఉన్నాడు భీమన్న.

గుడిసెనిండా జనం. గుడిసె బయట కూడా ఇంకా చాలామంది ఉన్నారనిపించేటంతగా జనం. భీమన్న వెంటనే కళ్ళు మూసుకున్నాడు. బాధతో కాదు, భయంతో!

తను వనజని చంపాలనొచ్చాడు. ఎవరికీ అనుమానం రాదని పాముకాటుతో ఆమెను చంపాలనుకున్నాడు. కానీ అనుకోకుండా ఆ పాము తననే కరిచింది.

తను గజపతి గ్రామం మనిషి కాదు. తనవద్దనున్న బుట్ట ఆ గ్రామస్తులది కాదు.

తనెందుకొచ్చాడో ఏం చేయాలనుకున్నాడో అందరికీ తెలుస్తుంది. వాళ్ళు తనని బ్రతకనివ్వరు. వాళ్ళు మూర్ఖులు. నాగరికుల కోపంకంటే మూర్ఖుల కోపం ప్రమాదకరమైనది.

పాముకాటు తనని క్షణాల మీద ప్రాణాలు తీస్తుంది. కానీ గ్రామస్తుల కోపం తనని చిత్రవధకు గురి చేస్తుంది. భీమన్న కళ్ళు తెరవడం లేదు కానీ ఎప్పుడు తెరవాల్సివస్తుందోనని భయపడుతున్నాడు.

''అతడికి మెలుకువొచ్చింది'' అంది వనజ.

జనంలో కోలాహలం.

''గొడవ చేయొద్దు. ఒక్కొక్కరే వచ్చి నెమ్మదిగా అతడి పాదాలు తాకి వెళ్ళొచ్చు'' అంది వనజ. ఈ మాటలు విన్న భీమన్న, ''వీళ్ళు నా పాదాలు తాకడమా?'' అనుకున్నాడు అనుమానంగా.

అతడు రంగారావు మనిషి. ఆ రంగారావు క్రూరరంగారావుగా ప్రసిద్ధుడు. ఆయన భాషలో రాముడంటే రాక్షసుడు. గాంధీ అంటే హింస. పాదాలు తాకడమంటే - కాళ్ళు విరిచేస్తారా?

భీమన్న కళ్ళు తెరవలేదు కానీ బాధననుభవించడానికి కాబోలు శరీరం బిగుసుకుంది.

అప్పుడు లభించింది - అతడి పాదాల స్పర్శ.

మృదువైన స్పర్శ అది. ఒకరు కాదు. ఇద్దరు కాదు. క్రమంగా ఒకరొక్కరే వచ్చి అక్కడున్న జనాలందరూ అతడి పాదాలు తాకివెడుతున్నారు.

''నేనెలా బ్రతికాను? ఇక్కడ జరుగుతున్నదేమిటి?'' భీమన్న బుర్రలో రెండే రెండు ప్రశ్నలు.

జవాబుకి మరో గంట పట్టింది. అప్పటికి జనమంతా వెళ్ళిపోయారు. వనజ నాగమ్మని కూడా బయటికి పంపి,

''నేను నీకు యాంటీ వెనమ్ ఇంజక్షన్ - అంటే విషానికి విరుగుడు - ఇచ్చాను'' అంది భీమన్నతో.

''కానీ ఈ జనాలంతా నా కాళ్ళకు మొక్కారేం?''

''వీళ్ళు మూర్ఖులు. మూఢాచారాలు వాళ్ళ మనసుకి జీడిపాకంలా అంటుకుపోయాయి. పాము విషానికి మంత్రం పనిచేయదనీ, మందు వాడాలనీ నేనెంత చెప్పినా వాళ్ళు గౌరవంగా విన్నారు కానీ నమ్మకంగా పాటించాలనుకోలేదు. వాళ్ళకి నమ్మకం కలిగించాలని నువ్వు నీ ప్రాణాల్ని పణంగా పెట్టి, పాము కాటుకి గురయ్యావ్. నేను నీకు ఇంజక్షన్ చేస్తే బ్రతికావ్. ఈ ప్రత్యక్షసాక్ష్యంతో వీళ్ళలో మార్పొచ్చింది. తమని మార్చడానికి ఇంత త్యాగం చేసిన నీలో వాళ్ళు దేవుణ్ణి చూస్తున్నారు. ఆ దేవుడికి నివాళులర్పిస్తున్నారు''

భీమన్న తెల్లబోయాడు. తనకి నివాళులా?

తనొచ్చింది వనజని చంపడానికి. ఆమె తనని చావకుండా కాపాడ్డమే కాక దేవుణ్ణి కూడా చేసింది. నిజానికామె దేవత. ఆ దేవతను కాదని ఈ జనాలు తనకు నివాళులిస్తారేం?

''ఇంతకీ నేనెవరో నీకు తెలుసా?'' అన్నాడు భీమన్న అపరాధభావంతో.

''నువ్వెవరో తెలియదు. కానీ రంగారావు మనిషివని ఊహించాను. ఎందుకొచ్చావో కూడా ఊహించాను'' భీమన్న ఆమెను చూస్తే ముఖభావాల్ని బట్టి ఆమెకంతా తెలిసినట్లే అనిపించింది,

''ఐతే నీకు తెలిసింది జనాలకి చెప్పలేదేం?'' అన్నాడు.

"నిజం తెలిస్తే వాళ్ళు నిన్ను చంపేస్తారు. నిన్ను రక్షించింది - జనాల చేతిలో చావమని కాదుగా" భీమన్న ఆమెని చంపాలని వచ్చాడు. భీమన్న చస్తాడేమోనని ఆమె భయపడింది.

భీమన్న లేచి కూర్చుని, "అమ్మా - నువ్వు మనిషివి కాదు, దేవతవి -" అన్నాడు.

వనజ నవ్వి, "అందుకేగా - నన్ను చంపాలనొస్తే నీ ప్రాణాల మీదకొచ్చింది!" అంది.

పశ్చాత్తాపం మనసుని దహించి వేస్తుంటే, "అమ్మా - నా ప్రాణాలు కాపాడ్డం వరకూ బాగానే ఉంది. కానీ నేను రాక్షసుణ్ణి. నన్ను దేవుణ్ణి చేయడం నరకయాతన పెడుతోంది" అన్నాడతడు.

"నీలో రాక్షసుణ్ణి పాము కాటేసింది. నీలో విషాన్ని నా ఇంజక్షన్ విరిచేసింది. ఇప్పుడు నువ్వు నిజంగానే దేవుడివి" అంది వనజ. భీమన్న తల అడ్డంగా ఊపితే తనే మళ్ళీ, "నువ్వు కాదన్నా గజపతి గ్రామస్తులొప్పుకోరు" అంది.

"ఎందుకొప్పుకోరూ? అసలు వాళ్ళకోసం ప్రాణత్యాగం చేయాల్సిన అవసరం నాకేమిటి? ఆ మాత్రం వాళ్ళూహించలేరా?" అన్నాడు భీమన్న.

"నువ్వు నా అనుచరుడివని వాళ్ళనుకుంటున్నారు" అంది వనజ.

అప్పుడు భీమన్నకి మొత్తం విషయం అర్థమైంది. చంపాలనొచ్చిన తనని అనుచరుణ్ణి చేసింది వనజ. రంగారావు అనుచరుడిగా రాక్షసుడైన తను వనజ అనుచరుడిగా దేవుడయ్యాడు. నాయకుల ఎన్నిక మనిషినింతలా మార్చేస్తుందా?

వనజ కొనసాగించింది, "నీ మనసులో ఏముందో నాకు తెలియదు. రంగారావు ఎక్కించిన విషం నీలో మళ్ళీ విజృంభిస్తుందేమో చెప్పలేను. కానీ ఒక్కమాట - నీ రాక ఈ జనానికెంతో మేలు చేసింది. అందుకని నేను నీకు కృతజ్ఞురాలిని. నేనొచ్చిన పని జయప్రదంగా ముగియడానికి నువ్వే కారణం. ఈ విధంగా నువ్వు దేవుడివి. ఈ గజపతి గ్రామంలో పొరపాటున కూడా రంగారావు అనుచరుడిలా ఉండకు. గ్రామస్తులకి నీమీద నమ్మకం పోయిందంటే అది వాళ్ళ జీవితాలనే బలి తీసుకుంటుంది. అందుకని నిన్ను వేడుకుంటున్నాను. నగరం చేరే దాకా రంగారావు అనుచరుణ్ణని మర్చిపో"

వనజ ఇంకా ఏదో అనబోతుంటే ఆపి, "నువ్వు మర్చిపొమ్మన్నా మర్చిపోలేని విషయమొకటుంది. ఈ క్షణం నుంచీ నేను రంగారావు అనుచరుణ్ణి కాదు. నీ అనుచరుణ్ణి" అన్నాడు భీమన్న. అది మాటలా కాక కృత నిశ్చయంలా ఉంది.

"హుం - వనజట, దేవతట! ఆమె జోలికెడితే పుట్టగతులుండవట. ఆఫ్టాల్ నా తొత్తు, కాలికింద చెప్పు - ఆ భీమన్నగాడు నాకు సలహా ఇచ్చే లెవెల్ కొచ్చేసాడు"

రంగారావు నవ్వలేదు, హుంకరించాడు. ఆ హుంకరింపుకు గదిలో కుర్చీ కూడా కదల్లేదు. ఎదురుగా ఉన్న గంగారావు కూడా చలించలేదు, సరి కదా చిరునవ్వులు చిందించాడు.

"ముందు భీమన్నని చంపేస్తా. వనజని చంపడానికి ఇస్మాయిల్ని పంపిస్తా" సాలోచనగా అన్నాడు రంగారావు.

"తర్వాత ఇస్మాయిల్ని చంపేస్తారు. అలా మనుషుల్ని చంపుకుంటూపోతే, చంపడానికి మనుషుల్లేక - ఏదో ఒక రోజున మిమ్మల్ని మీరే చంపుకోవాల్సుంటుంది గురూగారూ"

"గంగా - నువ్వూ రెచ్చిపోకు. నేను మరీ దిగజారిపోయాననిపిస్తుంది" అసహాయంగా అన్నాడు రంగారావు.

"నేను రెచ్చిపోవడంలేదు. హితవు చెబుతున్నాను. ప్రస్తుతానికి రెచ్చిపోతున్నది వనజ. ఆమెను రెచ్చగొట్టిందెవరు - హిరణ్యారావు!" ఆగాడు గంగారావు.

"ఊఁ చెప్పు-" అన్నాడు రంగారావు ఆసక్తిగా.

"హిరణ్యారావు తెలివిగా వనజని తన దారికడ్డురాకుండా తప్పించి మీమీదకి మళ్ళించాడు. వనజ పోయినా, మీరు పోయినా ఆయనకే లాభం"

"ఊఁ"

"ఆయన అండ లేకే - మీరూ బలహీన పడ్డారని నా అనుమానం"

"హుఁ" నీరసంగా హుంకరించాడు రంగారావు, "అయితే నేనెళ్ళి ఆ హిరణ్యారావు కాళ్ళట్టుకోవాలా?"

"కాళ్ళట్టుకోవడం మీకెలాగూ తప్పదు. అలాంటప్పుడు హిరణ్యారావు ఎందుకూ - ఆ వనజవే పట్టుకోవచ్చుగా!"

"ఏమన్నావ్?" అన్నాడు రంగారావు.

"గురూగారూ - నే చెప్పేది సావధానంగా వినండి" గంగారావు గొంతు సవరించాడు.

చంబల్ లోయలో బందిపోట్లు. ఏ బందిపోటుకైనా కాలపరిమితి మహా అయితే అయిదేళ్ళు. ఆ అయిదేళ్ళూ బందిపోటు పెద్దపులి. సమాజం లేడిపిల్ల. అయిదేళ్ళ తర్వాత సమాజం పిల్లి. బందిపోటు ఎలుక. బందిపోటుకి ఎలుక జీవితం నచ్చదు. పులిగా మారే అవకాశముండదు. అందుకని వినోబాబావే వంటి వారి కోసం ఎదురు చూస్తుంటాడు - సమాజంలో పునరావాసానికి.

అలాంటి పద్ధతిలో ఫూలన్ దేవి ఎమ్మెల్యే కూడా అయింది. ప్రజలకి బ్రతికి చెడ్డవారికంటే చెడి బ్రతికిన వారంటేనే ఆకర్షణ అని గ్రహించి - నేటి రాజకీయ నాయకులందరూ చెడి బ్రతకాలనుకుంటున్నారు.

ఇప్పుడు రంగారావు ఫూలన్ దేవి. వనజ వినోబాబావే.

"ఫూలన్ లొంగింది వినోబాజీకి కాదనుకుంటాను" అన్నాడు రంగారావతణ్ణి సరిచేయాలని, ఐతే ఆయనకి తెలుసు - గంగారావు కూడా ఆమె వినోబాజీకి లొంగినట్లు చెప్పలేదని.

"త్రేతాయుగంలో ఆంజనేయుడికీ, ద్వాపరయుగంలో కృష్ణుడికీ యుద్ధమైనట్లు చెప్పారు మన పురాణాల్లో, ప్రతి మనిషి జీవితమూ పురాణమే! అంతే మీరు తెలుసుకోవాల్సింది"

"అర్థమైంది గురూగారూ" అన్నాడు రంగారావు.

ఆయన తనని గురువన్నందుకు గంగారావు ఆశ్చర్యపోలేదు. పైగా ఆయనలాగే, "హు హు హ హహ హ్హా హ్హా హ్హా హ్హా హ్హా" అంటూ నవ్వాడు.

ఆఫీసు గదిలో సీట్లో కూర్చుంది వనజ. ఆమె కెదురుగా ఉన్న రంగారావు కూర్చోమన్నా కూర్చోకుండా, "ఒక్కసారి లేచి నిలబడి ఇలారామ్మా, చిన్నదానివైనా నీ పాదాలకి మ్రొక్కాలనొచ్చాను" అన్నాడు రంగారావు. వనజ ముందు తడబడింది. తర్వాత నెమ్మదిగా, "అలా చేస్తే నాకు ఆయుక్షీణమని మీరు నమ్మొచ్చు. కానీ నాకా భయంలేదు. ఐతే పెద్దైనా చిన్నైనా బంధువుకాని సాటి మనిషి మరో మనిషి కాళ్ళు మొక్కడం నేనొప్పను. కాబట్టి సారీ" అంది వనజ లేచి నిలబడకుండా.

"పోనీ నీమీద గౌరవాన్నెలా ప్రకటించాలో నువ్వే చెప్పు" అన్నాడు రంగారావు.

"పోలీసులకు లొంగిపొండి"

"అందువల్ల ప్రయోజనం? ఇప్పటికే నా తప్పులు సవరించుకున్నాను"

"తప్పు సవరించుకున్నారు కానీ నేరానికి శిక్ష అనుభవించలేదు"

"శిక్ష నేరానికే కానీ నేరస్తుడికి కాకూడదని సంఘ సంస్కర్తలంటారు. నేనిప్పుడు మారిపోయాను. జైల్లోకంటే బయటుంటేనే ఇప్పుడు నావల్ల సమాజానికి బోలెడు ప్రయోజనం"

వనజ నవ్వి, "ఆ మాట మీరనకూడదు" అంది.

"అయితే ఏం చేయాలో నువ్వే చెప్పు"

"పోలీసులకు లొంగిపొమ్మని ఇందాకనే చెప్పాను"

రంగారావు దెబ్బతిన్నాడు. అంతలోనే తమాయించుకుని, "నేను నేరస్థుడినన్న ఆధారాలేం పోలీసుల వద్ద లేవు. అయినా నీ మాటమీద పోలీసులకు లొంగిపోతా. అప్పుడేమౌతుంది? సమాజంలో నన్ను మించిన దుష్ట శక్తులు - వాటి రహస్యాలు బైటపెడతానన్న భయంతో నన్ను జైల్లోనే చంపే ప్రయత్నాలు చేస్తాయి. అందుకు కొన్ని పోలీసు శక్తులూ సహకరిస్తాయి. నీకు తెలియదమ్మాయ్ - సమాజంలో దుష్టశక్తుల నిప్పుకి పోలీసు గాలి సహకారమేం తక్కువది కాదు" అన్నాడు.

"దుష్ట శక్తులకి సహకరించడంలో పోలీసు గాలికి ప్రజల గాలికూడా ఏ మాత్రం తక్కువకాదు. ప్రజలు దుష్టుల్ని నాయకుల్ని చేసి అధికారం కట్టబెడుతున్నారు. పోలీసులు నాయకుల దౌష్ట్యానికి తలవంచుతున్నారు. ఇదంతా ఓ పెద్ద విషవలయం. మీరు మీ నేరాలొప్పుకుని పోలీసులకు కొంగిపొండి. తర్వాతేమౌతుందో చూద్దాం" నచ్చచెపుతున్నట్లుగా అంది వనజ.

"సరే - లొంగిపోతానమ్మా - కానీ ఈ నగరాన్ని శుభ్రం చేయాలనుకుంటే నీ ఒక్కదానివల్లా ఏం కాదు. నీకు నా సాయం కావాలి. అందుకే తటపటాయిస్తున్నాను"

"నేనొక్కతెనూ ఈ నగరాన్ని శుభ్రం చేస్తానని హామీ ఇస్తున్నా. మీరు పోలీసులకు లొంగిపొండి"

"హామీలివ్వడం సులభం. నిలబెట్టుకోవడం కష్టం. ఈ నగరం నడిబొడ్లో అనాధ శరణాలయముందా? అక్కడ ఘోరాలు జరిగిపోతున్నాయని తెలిసినా - చిన్న ఋజువు సంపాదించడం నా అంతటి వాడికే వీలుకాలేదు. నువ్వో ఋజువు సంపాదించు. అప్పుడు నేను సంతోషంగా లొంగిపోతాను"

అప్పటికామెకి రంగారావు ఉద్దేశ్యం అర్థమయింది.

ఆ అనాధ శరణాలయం హిరణ్యారావుది. రంగారావు ఆయనపై పగ తీర్చుకోవాలనుకుంటున్నాడు.

హిరణ్యారావు నకిలీ మందుల ఫ్యాక్టరీ గురించి తనకు ఉప్పందించాడు. రంగారావు బయటపడ్డాడు.

ఇప్పుడు రంగారావు అనాధ శరణాలయం గురించి ఉప్పందించాడు. అంటే అతడి శత్రువు హిరణ్యారావా?

"ఓకే డన్" అంది వనజ ఉత్సాహంగా.

"నా పెద్దరికాన్ని నిలబెట్టావ్. చాలా థ్యాంక్సమ్మా! నీ ఆశయం జయప్రదం కావాలని మనసారా దీవిస్తున్నా" అన్నాడు రంగారావు.

చేతులు జోడిస్తూ వచ్చి చేతులెత్తి దీవించి వెళ్ళబోతున్న రంగారావు తెలివిని మనసులోనే అభినందించి, "మీ దీవెన మిమ్మల్ని జైలుకి పంపించడానికే అని మరిచిపోకండి" అని నవ్వింది వనజ.

✡ ✡ ✡

మొబైల్ నంబరు చూసి, "చెప్పు రంగారావ్ - అంతా కులాసానేనా? అన్నాడు హిరణ్యారావు.

"అంతా నీ దయ. చాలా కులాసాగా ఉన్నా. చిన్న డౌటొచ్చి ఈ ఫోన్ చేస్తున్నా" అన్నాడు రంగారావు.

"సరే - అడుగు"

"నీకో అనాధ శరణాలయముంది కదా - ఎప్పుడైనా అందులో కెళ్ళి ఉన్నావా?"

"లేను" తాపీగా అన్నాడు హిరణ్యారావు.

''ఐతే నీదుంది కదా అని అలక్ష్యం చేయక, వేరే శరణాలయం వెతుక్కో. మరి నీ శరణాలయానికి మూడింది'' హిరణ్యరావుకిలాంటి ఫోన్లు కొత్తకాదు, ''ఏమైందిట?'' అన్నాడు నిర్లక్ష్యంగా.

''నువ్వు నా మీద ప్రయోగించావే - ఆ బాణాన్ని నీ మీదకి తిప్పి కొట్టాను. అదిప్పుడు రెట్టింపు వేగంతో నీ మీద కొస్తోంది''

అప్పుడర్థమైంది హిరణ్యరావుకి అసలు విషయం. ఆయనకి నోట మాట రాలేదు.

''ఇక నువ్వు మాట్లాడాల్సిందేమీ లేదు. నేను చెప్పాల్సిందీ లేదు. సెలవ్'' అన్నాడు రంగారావు.

## 9

**నగరం నడిబొడ్లో** ఉన్న అనాథ శరణాలయం గురించి - కాంతి కిరణంలో ఫోటోలతో సహా వచ్చిన వివరాలు - నగరంలో కలిగించిన సంచలనం ఇంతా అంతా కాదు.

మొదటిది శరణాలయంలో ఉన్న పిల్లలందరూ అనాథలు కారు.

రెండవది - శరణాలయానికెవరూ వెతుక్కుంటూ వెళ్ళరు. అక్కడున్న పిల్లలందరూ భూతనాథ్ సరఫరా చేసినవారే. తలిదండ్రులో అయినవాళ్ళో ఉన్న పిల్లల నాయన దొంగతనంగా ఎత్తుకొచ్చి అక్కడ సరఫరా చేస్తాడు. తర్వాత వాళ్ళనెంతలా బెదిరిస్తాడంటే - స్వయానా ఐనవాళ్ళే వచ్చినా గుర్తుపట్టడానికి భయపడతారా పిల్లలు. భూతనాథ్ చాలా తెలివైనవాడు. ఆయన లేని ప్రమాదం సృష్టిస్తాడు. ఆ ప్రమాదంలో లేని పిల్లలు చనిపోయినట్లు ఋజువు చేసి - అయినవాళ్ళని కూడా నమ్మిస్తాడు. అందువల్ల ఆయన ఎత్తుకుపోయిన పిల్లల కోసం పోలీసు రిపోర్టులుండవు. శరణాలయంలో చేరిన పిల్లల్ని పారిపోకుండా ఆపడానికీ, వాళ్ళని పూర్తిగా లొంగదీసుకోవడానికీ ఆయన అవలంబించే పద్ధతులు చాలా క్రూరమైనవి.

జాన్ స్టూవర్ట్ భూతనాథ్ కుడిభుజం. ఆయన మాదక ద్రవ్యాల స్పెషలిస్ట్. వాటి తయారీకి అతడు శరణాలయం పిల్లల్ని ఉపయోగించుకుంటాడు.

భూతనాథ్ మరో భుజం ఉస్మాన్ ఖాన్. ఆయన శరణాలయంలో వయసొచ్చిన ఆడపిల్లల శరీరాల్ని లక్షలార్జించడానికి వీలుగా మలిచి ప్రదర్శించగలడు. ఆయనంటే శరణాలయం బాలికలకి సింహస్వప్నం. వాళ్ళకి ప్రకృతి ఆడపిల్లకిచ్చిన సహజమైన సిగ్గులో లేశమంతైనా అతడి ముందు చూపే స్వతంత్రం లేదు.

ఇలా నడుస్తున్న శరణాలయం స్మగ్లర్సుకు నెలవైనా - అవినీతి, అత్యాచారం, దుర్మార్గం వగైరాలకక్కడ అదుపు లేకపోయినా ఆశ్చర్యం లేదుకదా!

శరణాలయం వ్యవహారాలతో సంబంధముందో లేదో తెలియదు, కానీ శరణాలయం మాత్రం హిరణ్యరావుది. ఈ వివరాలన్నీ వనజ పరిశోధనలో బయటపడ్డాయి. ఆ పరిశోధన విజయం వెనక ఇన్‌స్పెక్టర్ రఘు అదృశ్యహస్తమున్న విషయం మాత్రం ఇప్పటికీ రహస్యమే.

వనజ పరిశోధనల్లో కొన్నింటిని మాత్రమే బయటపెడుతూ, ''శరణాలయమొక మేడిపండనడానికీ వివరాలు మచ్చుతునక. సమయం వచ్చినప్పుడు మిగతా వివరాలు ప్రచురించగలం'' అన్నది కాంతి కిరణంలోని వ్యాసంలో చివరి వాక్యం.

హోటల్ ఆదిత్యలో ఫస్టుఫ్లోరు. ఏడో నంబరు గది. అందులో అడుగు పెట్టిన వనజని, "రామ్మా కూర్చో" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు హిరణ్యారావు.

ఆ గది వైభవం మాటలకందనిది. కాసిని నిమిషాల కబుర్లకోసం అంత పెద్ద గదిని బుక్ చేసిన హిరణ్యారావున చూసి, "ఇలాంటి వాళ్ళు నిరుపేదలకోసం కొద్ది క్షణాలు కేటాయిస్తే దేశమెంత ముందుకు పోయేదో" అనుకుంటూ ఆయన చూపిన సోఫాలో కూర్చుంది వనజ.

"నీతో మాట్లాడ్డం నాకు సేఫ్ కాదు. నాతో పోట్లాడ్డం నీకు సేఫ్ కాదు. ఈ రూం మాత్రం మనిద్దరికీ సేఫ్ - అందుకే మన సమావేశం ఇక్కడేర్పాటు చేశాను" అన్నాడు హిరణ్యారావు.

"మీతో పోట్లాడ్డం నాకెందుకు సేఫ్ కాదు?" అంది వనజ ఆ ఒక్క మాటకే అభ్యంతరం చెబుతున్నట్లు.

"నిప్పుతో చెలగాటం కదా - అందుకు" అన్నాడు హిరణ్యారావు.

"నాకు తెలిసి నిజమొక్కటే నిప్పు. నిజం నుంచి నాకెప్పుడూ ప్రమాదముండదు" అంది వనజ.

"నిజమూ నిప్పూ - ఇలాంటివన్నీ నాకు తెలియవు. నాకు తెలిసినవల్లా పొరపాట్లు. అవి అందరివల్లా జరుగుతాయి. ఐనా సరైన సమయంలో సరిదిద్దుకుంటే ఫరవాలేదు"

"నేను పొరపాట్లు చేయను" స్థిరంగా ఉంది ఆమె గొంతు.

"చిన్నపిల్లవి. అనుభవం లేదు. లౌక్యం తెలియదు. నీ పొరపాట్లు నీకు తెలియవు. అందుకని నీ శ్రేయోభిలాషిగా నిన్ను హెచ్చరించడం నా బాధ్యత. వింటున్నావా?"

"ఊఁ"

"కాంతి కిరణంలో వచ్చిన వార్త పొరపాటు. దాన్నా పేపరు రేపటి కల్లా దిద్దుకోవాలి" అన్నాడు హిరణ్యారావు.

వనజ తల అడ్డంగా ఊపి, "ఇది జరిగే పనికాదు, ఇంకో మాట చెప్పండి" అంది.

"ఎల్లుండి కాంతి కిరణంలోనే నీ ఫోటో పడుతుంది - ఆబిట్యువరీ కాలమ్‌లో"

వనజ నవ్వి, "థాంక్స్ - నా మరణ వార్త నేనే చదవాలని ఎన్నాళ్ళనించో నాకు సరదా. అది ఎల్లుండి జరుగుతుందన్నమాట!" అంది.

హిరణ్యారావు నివ్వెరపోయి, "నన్ను చూసి రాక్షసులే గడగడ వణుకుతారు. నీకు భయంగా లేదా?" అన్నాడు.

"అంటే - మీరు రాక్షసులతో డీల్ చేస్తారన్నమాట!" నవ్వింది వనజ.

హిరణ్యారావు ఆమెనే పరీక్షగా చూస్తూ, "నువ్వింకా రాక్షసులతో డీల్ చేసినట్లు లేదు. వాళ్ళకి భయపడకపోతే బ్రతుకు చావులా ఉంటుంది. చావు భయంకరంగా ఉంటుంది" అన్నాడు.

"భయం నాకెందుకు? బ్రతికుంటే సమాజ సేవ చేస్తా. చనిపోతే నాకేం నష్టం లేదు. నా సేవలు కోల్పోయిన సమాజానికి నష్టం"

"వండ్రఫుల్. నాతో చేయి కలుపు. ఇద్దరికీ కలిసొస్తుంది" నిట్టూర్చాడు హిరణ్యారావు.

"మీరు నాతో చేయికలపండి. మీ చేతికి విలువొస్తుంది" అంది వనజ.

అప్రయత్నంగా హిరణ్యారావు తన చేతివంక చూసుకున్నాడు. అయిదువేళ్ళకీ వజ్రపుటుంగరాలు. మణికట్టుకి బంగారు బ్రేస్‌లెట్. గది దీపాల వెలుగులో ధగధగ మెరిసిపోతోందా చేయి. వనజ చేయి చూస్తే - ఆ వ్రేళ్ళకి ఉంగరాలు లేవు. ఆ చేతికి బంగారు గాజులు లేవు. కానీ పచ్చని ఛాయతో ఆ చెయ్యే బంగారు కడ్డీలా మెరిసిపోతోంది.

అప్పుడాయన మళ్ళీ తన చేతివంక చూస్తే - ఆ చేతిలో మెరుపు కనబడలేదు.

"మీరు నాతో చేయికలపండి. ఆ చేతికి విలువొస్తుంది" అన్న వనజ మాటలు స్ఫురణకొచ్చి - "నిజమేనేమో" అని క్షణమాత్రం అనిపించిందాయనకి. అంతలోనే తేరుకుని - "రేపుదయానికల్లా నీ పొరపాటు సరిదిద్దుకో. లేకుంటే సప్తసముద్రాల అవతలున్నా నిప్పు నిన్ను వెంటాడుతుంది" అన్నాడతను వనజతో.

"సప్త సముద్రాలా ఎందుకు? నేను నా బంగళాలోనే ఉంటాను. నన్ను వెంటాడ్డానికి నిప్పుని మాత్రం వాడకండి. అదొక్కటే నన్నేం చెయ్యలేదు" అంది వనజ.

"పిల్లకి ధైర్యమెక్కువే. పాపం, ఆయువే లేదు" నిట్టూర్చాడు హిరణ్యరావు.

సరిగ్గా రెండు రోజుల తర్వాత - కాంతికిరణం మొదటి పేజీలో - వనజ ఫోటో పడింది.

ఫోటోలా కాక ఆత్మలా దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న - ఆ ఛాయాచిత్రం కింద ఆమె వివరాలు.

వంటగదిలో గ్యాసు సిలిండరు లీకై దుర్మరణం చెందిందన్న ఆ వార్తకి పాఠకుల స్పందనలు రకరకాలు. కొందరామెది దురదృష్టమన్నారు. కొందరు అదే విధంగా చనిపోయిన ఓ ప్రముఖ రచయిత్రిని గుర్తుచేసుకున్నారు. కొందరది హత్య అనుకుని - పెళ్ళికాకుండా, అత్తమామలు లేకుండా అదెలా జరిగిందీ అని ఆశ్చర్యపడ్డారు. శత్రువులాపని చేసుండొచ్చనుకున్న కొందరు మాత్రం ఆ మాట పైకి అనడానికే భయపడ్డారు. వనజతో పరిచయమైనాక ప్రహ్లాద్‌కి కాంతి కిరణం పట్ల ఏదో ఆకర్షణ. ప్రతి రోజూలాగే ఆ రోజూ పేపరు చదివితే అందులో వనజ ఫోటో కనబడింది. ఆసక్తిగా వివరాలు చదివాడు.

అంతే, కెవ్వున కేకవేశాడు.

ఆ కేక ఆర్తనాదమై భవనమంతా ప్రతిధ్వనించింది.

ఆ తర్వాత కాసేపటికి అతడు నర్సింగ్ హోంలో ఉన్నాడు.

"అబ్బాయెలా ఉన్నాడు డాక్టర్?" ఆత్రుతగా అడిగాడు హిరణ్యరావు.

"మెదడుకు బలమైన షాకేదో తగిలుండాలి. స్పృహ వస్తూపోతూ ఉంది. స్పృహ వచ్చినప్పుడు వనజా అని కలవరిస్తున్నాడు. ఆ వనజెవరో మీకు తెలుసా?" అంటూ హిరణ్యరావు ముఖం వంక చూస్తే ఆయనేం మాట్లాడలేదు. "ఆ వనజ కనబడేదాకా వైద్యం ప్రారంభించడం కష్టం" అన్నాడు డాక్టర్ మళ్ళీ.

"ప్లీజ్ డాక్టర్. ప్రహ్లాద్‌ని కలవరించనివ్వండి. కానీ మీరు మాత్రం ఆ వనజ గురించి నొక్కించకుండా మా వాణ్ణి బ్రతికించండి" అన్నాడు హిరణ్యరావు.

"మా ప్రయత్నం మేం చేస్తాం. కానీ రోగి మానసిక సహకారం లేందే మందులు పనిచేయవు. ఆ వనజెవరో వస్తే పరిస్థితి త్వరగా చక్కబడొచ్చు" అన్నాడు డాక్టర్.

"వాడడిగితే వనజొస్తుందని చెప్పండి డాక్టర్" అంది లీల.

డాక్టర్ తల అడ్డంగా ఊపి, "లాభం లేదమ్మా - అతడిప్పుడెవరి మాటలూ వినే స్థితిలో లేడు. స్పృహొచ్చినప్పుడల్లా అతడి చూపులు వనజని వెతుకుతున్నాయి. వనజ కనబడాలి. అదొక్కటే మార్గం" అన్నాడు.

"కనపడకపోతే?" అన్నాడు హిరణ్యరావు ఆత్రుతగా.

"అబ్బాయి మనకి దక్కకపోయినా ఆశ్చర్యం లేదు" అన్నాడు డాక్టరు.

"ఎందుకండీ దిగులుగా ఉన్నారు?" అనునయంగా అంది లీల.

"మన ప్రహ్లాద్" ఆ తర్వాత హిరణ్యరావు గొంతు రుద్ధమయింది.

"వాడికేమైంది - ఆ వనజ కనబడగానే మామూలు మనిషైపోతాడు"

"కానీ వనజ వాడికెలా కనబడుతుంది?"

"ఏం - ఆ అమ్మాయికి మానవత్వం లేదనుకుంటున్నారా?"

"అవును. చనిపోయిన వాళ్ళకి మానవత్వమెలా ఉంటుంది?"

"చనిపోయిందా - ఎవరన్నారు?" అంది లీల.

"నువ్వు పేపరు చూళ్ళేదా?"

"లేదు"

"మరి ప్రహ్లాద్ మెదడుకు షాకెందుకు తగిలిందనుకున్నావ్?"

"ఎందుకు?"

"వనజ చనిపోయినట్లు పేపర్లో పడింది. ఆ వార్త వాడు చూసాడు"

"అంటే మీరా వార్త నమ్మారా?"

"అవతల అబ్బాయి చావు బతుకుల్లో ఉన్నాడు. నీదేమో వితండవాదం" అన్నాడు హిరణ్యరావు విసుగ్గా.

"వితండవాదం కాదు. ఆలస్యం - అదీ మీ వల్ల...."

"దేనికి ఆలస్యం?"

"అబ్బాయి బ్రతకాలని మీకుంటే, వెంటనే మనింటికెళ్ళి అబ్బాయి కోసం వనజని తీసుకురండి"

"అబ్బాయి దెబ్బతో నీకూ మెదడు షాకై మతిపోయింది. చచ్చిన వనజని నేనెలా తీసుకొచ్చేది?"

"అసలు వనజ చనిపోయిందని మీరెందుకనుకుంటున్నారు?"

"పేపర్లో చూశాను.."

"ఎన్నింటికి?"

"ఉదయం ఆరింటికి"

"ఐతే వినండి. ఈ రోజు ఉదయం ఏడింటికి నేను వనజని చూశాను"

"ఎక్కడ?" హిరణ్యరావు ముఖంలో ఆశ్చర్యంలేదు. చిరాకు మాత్రం ఇంకా ఇంకా పెరిగిపోతోంది.

"మనింట్లోనే"

"మనింట్లోనా - అదెలా సాధ్యం?"

"వనజ జర్నలిస్టు కదా - ఆమెకో గొప్ప సమాచారమందిస్తానంటే వచ్చింది. రాత్రంతా మనింట్లోనే ఉంది"

"మనింట్లోనా?" హిరణ్యారావు ముఖంలో అపనమ్మకం.

"అవును మనింట్లోనే?" హిరణ్యారావు ముఖంలో అపనమ్మకం.

"అవును మనింట్లోనే ! తనకి ప్రాణప్రమాదముందని మనింట్లో అయితే సేఫ్ అని తనుకూడా అనుకుంది"

"మరామె ఇంట్లో!?"

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం - ముందు మీరు మనింటికెళ్ళి వనజని తీసుకురండి"

హిరణ్యారావుకంతా చిత్రంగా ఉంది. ఆయన క్షణాలమీద ఇల్లుచేరేసరికి, హాల్లో సోఫాలో కూర్చుని ఉంది వనజ. ఆమె చేతిలో కాంతికిరణం పేపరుంది.

అప్పుడే వచ్చిన హిరణ్యారావుని చూసి, "కమాన్ సర్ - పేపర్లో నా అబిట్యువరీ చదువుతున్నా" అంది. హిరణ్యారావుకి నోటమాట రాలేదు.

ప్రహ్లాద్ వనజని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాడని లీలకి తెలుసు. అందుకని ఆమె తన శక్తియుక్తులన్నీ ప్రయోగించి వనజనో కంట కనిపెడుతూనే ఉంది.

భర్త వనజపై పగబట్టాడనీ, అదామె చావుకు దారితీస్తుందనీ తెలిసిన లీల ఆయన్నూ ఓ కంటకనిపెడుతోంది. ఆ రాత్రి వనజ ప్రాణాలకి ముప్పుందని తెలిసి - లీల వనజని హెచ్చరించదనడానికి - వనజ పోలికలున్న ఓ అమ్మాయిని పురుషవేషంలో పంపింది.

లీల హెచ్చరిక అందింది. అప్పుడు తనకి హిరణ్యారావు ఇల్లే ఎక్కువ సేఫ్ అని భావించి - వచ్చిన అమ్మాయిని తనింట్లో ఉంచి - పురుషవేషంలో తను లీల ఇంటికి వెళ్ళి రాత్రంతా అక్కడే ఉంది.

లీల ఈ విషయాన్ని కొడుక్కి కూడా చెప్పలేదు. వనజ చావు ప్రహ్లాద్‌ని ఎంతో కొంత అప్సెట్ చేస్తుందనీ, అప్పుడు భర్త పశ్చాత్తాప పడతాడనీ, తర్వాత నెమ్మదిగా వనజ ఉనికి బయటపెట్టొచ్చనీ అనుకుందామె.

లీల తన బిడ్డ ప్రాణాన్నే కాదు. అతడి ప్రాణాలకి ప్రాణమైన వనజని కూడా రక్షించుకుంది.

వనజ రాకతో ప్రహ్లాద్ మామూలు మనిషి కావడానికి ఎంతో సేపు పట్టలేదు. డాక్టర్ హిరణ్యారావు భుజం తట్టి, "మీ ప్రహ్లాద్ ఈ అమ్మాయిని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాడు. మీ అబ్బాయి క్షేమంకోరి మీరీ అమ్మాయి రక్షణకి గట్టి ఏర్పాట్లు చేయాలి" అన్నాడు.

అది సలహాయే ఐనా హెచ్చరికలా తోచింది హిరణ్యారావుకి.

"డాక్టరుగారు చెప్పింది శ్రద్ధగా విన్నారు కదూ" అంది లీల. అది నిజంగా హెచ్చరిక!!!.

# 10

**వనజ లీలకి కృతజ్ఞతలు తెలుపుకుని సెలవడిగింది.**

"ఎక్కడికెడతావ్? ఇక నుంచి ఈ ఇంట్లోనే నీ మకాం" అంది లీల.

"ఇది నా ఇల్లు కాదే!" అంది వనజ అర్థంకానట్లు.

"మా అబ్బాయికి నువ్వంటే ఇష్టం. నాకూ నువ్వంటే ఇష్టం. మమ్మల్ని కాదని ఆయనేం చెయ్యలేరు. కాబట్టి ఈ ఇల్లు నీ ఇల్లనుకోవడం నీకూ మాకూ మంచిది" అంది లీల.

"క్షమించాలి. మీకు మంచిదనడం సరే - కానీ అది నాకు మంచిదెలాగౌతుంది?" అంది వనజ.

"నీ కోసం మా వారినే ఎదిరించాను. అది నువ్వు గుర్తుంచుకోవాలి"

వనజ నవ్వి, "అందుకే మీరు నాకు నచ్చారు" అంది.

లీలకి అర్థంకాకపోతే వనజ వివరించింది.

హిరణ్యరావామెను చంపాలనుకున్నాడు - ఎందుకు? ఆమెను తన ఇంటి మనిషి చేసుకోవాలని!

వనజ ఆ ఇంటి మనిషైతే ఆమెలోని జర్నలిస్ట్ చావాలి. అదీ వనజకి మరణమే!

"అందుకే మీవారే కాదు, మీరూ నాకు నచ్చలేదు" అంది వనజ.

"అనవసరంగా నన్ననుమానిస్తున్నావ్. ఆయన వేరు. నేను వేరు. నన్ను నమ్ము" అంది లీల.

"నాకు బదులు నా స్థానంలో మరో యువతిని పంపారు. నేను చావకూడదనుకున్నారు కానీ ఆమె విషయం ఆలోచించారా? ఆమెని కాపాడి ఉంటే నేను తప్పక మిమ్మల్ని నమ్మి ఉండేదాన్ని. నేనైతేనేం - ఆ అమ్మాయైతేనేం? హత్య హత్యే తెలిసి కూడా ఆ పిల్లని చావనిచ్చిన మీకూ మీ భర్తకీ తేడా ఏమిటి?" అంది వనజ.

ఇలా ఎప్పుడూ ఆలోచించలేదేమో లీల నివ్వెరపోయింది. తన ఆలోచనలు ప్రహ్లాద్ చుట్టూ తిరుగుతుంటే అతడి కోసం వనజని రక్షించుకుని తనకు తెలియకుండానే ఓ యువతి ప్రాణాలు తీసింది. వనజ స్థానంలో ఆ యువతి ప్రాణాలు పోయాయని తెలిసినా వనజ చెప్పేదాకా ఆ విషయమే పట్టించుకోలేదు.

వనజ మాత్రం తన ప్రాణాలు దక్కాయని సంతోషించక, తనకోసం బలైన యువతి కోసం బాధపడుతోంది. లీలలోని అపరాధభావానికి సంతృప్తి చెందిన వనజ నిశ్శబ్దంగా అక్కణ్ణించి కదిలింది. ఐతే హిరణ్యరావు నియోగించిన మనిషి ఆ యువతిని చంపడానికొచ్చి రఘు మనుషులచేత చిక్కాడనీ - ఆ యువతి చావలేదనీ వనజకి తెలుసు ఆ నిజాన్నామె లీలకి చెప్పాలనుకోవడంలేదు.

బలవంతులకీ, బలగర్వితులకీ కూడా బలహీనక్షణాలుంటాయి. వనజని కాపాడి ప్రహ్లాద్‌ని దక్కించినందుకు హిరణ్యరావు భార్యకి థాంక్స్ చెప్పాడు.

"కానీ ఏం లాభం? ఆ అమ్మాయి ప్రహ్లాద్ అంటే ఇష్టపడడం లేదు" అంది లీల.

"నాకే ఎదురు తిరిగిన నీకా అమ్మాయిని నీ వైపు తిప్పుకోవడం కష్టం కాదు. అందులోనూ ప్రాణాలు కాపాడేవన్న కృతజ్ఞత కూడా ఉంటుంది" ధైర్యం చెప్పాడు హిరణ్యరావు.

"లాభం లేదు. తాటి చెట్టు కిందున్నాను. నేను తాగేవి పాలని ఎవరూ నమ్మరు" అంది లీల నిట్టూర్చుతూ.

''ఆలస్యంగానైనా పనికొచ్చే నిజం తెలుసుకున్నావ్. మరి అందుకు తగ్గట్లే మసులు'' అన్నాడు హిరణ్యారావు.

''కొడుకంటే ప్రాణమంటారు. మరి మీరూ వాడి ప్రేమకి తగ్గట్లే మసలొచ్చుగా'' అంది లీల.

హిరణ్యారావుకి పరిస్థితి పూర్తిగా ఆకళింపుకొచ్చింది.

ప్రహ్లాద్ వనజని ప్రేమిస్తున్నాడు. ఆమె లేనిదే బ్రతకలేడు.

వనజ ఉంటే తనకి బ్రతుకులేదు. అందుకు తానేమేనేమైనా చెయ్యొచ్చు కానీ ప్రాణాలు మాత్రం తియ్యకూడదు. ఎందుకంటే తన బ్రతుకే ప్రహ్లాద్ కోసం!

వనజ ప్రహ్లాద్‌ని ప్రేమించడంలేదు. అతణ్ణి నమ్మడంలేదు కూడా. ప్రహ్లాద్ ఆమెను మెప్పించడానికి ప్రయత్నిస్తాడు తప్పితే ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా ఏమీ చెయ్యలేడు.

అంటే వనజకీ ప్రహ్లాద్‌కీ దూరం పెంచాలి. అందుకు ప్రహ్లాద్‌కి తెలియకుండానే అతణ్ణి వనజమీద ప్రయోగించాలి. వనజని పూర్తిగా అశక్తురాల్ని చేయాలి.

కర్ర విరగదు. పాము చావదు.

హిరణ్యారావు బుర్రలో ఏదో పెద్ద పథకమే రూపు దిద్దుకుంటోంది.

దిగులుగా మంచం మీద పడుకున్న ప్రహ్లాద్ - అప్పుడే గదిలో అడుగుపెడుతున్న తండ్రిని చూసి లేచి కూర్చుని నీరసంగా నవ్వాడు.

హిరణ్యారావతడి భుజం మీద చెయ్యేసి పక్కనే కూర్చుని, ''నువ్విలాగుంటే బాగోలేదురా'' అన్నాడు.

ప్రహ్లాద్ మృదువుగా తండ్రి చేతిని తనమీంచి తొలగించి, ''కానీ నేనిలాగుండడానికి నువ్వే కారణం'' అన్నాడు.

''కాదనను. భగవంతుడు ఒకో మనిషిని ఒకోలా పుట్టిస్తాడు. నేను నా పద్ధతులు మార్చుకోలేను. కానీ నిన్ను నీ పద్ధతులు మార్చుకోమనీ అనలేదు, నీ దారికీ అడ్డురాలేదు కదా - నన్నెందుకు తప్పుపడతావ్?'' అన్నాడాయన అనునయంగా.

''ముద్ర - నీ ముద్ర నా మీద పడింది'' అన్నాడు ప్రహ్లాద్ కటువుగా.

''మా  నాన్న ఉత్త అమాయకుడని పేరు పడ్డాడు. బోలెడాస్తి - హారతి కర్పూరంలా హరించుకుపోయింది. నా హయాం వచ్చేక మళ్ళీ ఎలా ఎదిగాం. మా నాన్న ముద్ర నా మీద లేదు కదా'' అన్నాడు హిరణ్యారావు. ప్రహ్లాద్ మాట్లాడలేదు.

''నాకు తెలుసు. నువ్వు వనజని ప్రేమిస్తున్నావ్. ఆ పిల్ల డబ్బుకి లొంగదు. బెదిరింపులకి భయపడదు. సాహసమే ఊపిరిగా జీవిస్తోంది. నీతి నిజాయితీలే అంగరక్షకులనుకుంటోంది. సమాజసేవే ధ్యేయమనుకుంటోంది. ఆమెని నువ్వు ప్రేమించావు. మీ ప్రేమకు నా ముద్ర అడ్డొస్తోంది. ఆ ముద్ర తుడిచేయ్. నీ మీద నీదంటూ ఓ ముద్ర ఉండేలా చూసుకో. అందుకు నా సాయం కావాలంటే చెప్పు. చేస్తా''

ప్రహ్లాద్‌కి తండ్రి మాటల్లో నిజాయితీ ధ్వనించింది. వనజ పోయిందని తను ఆస్పత్రి పాలైతే - తనకోసం ఎంతలా విలపించాడో అతడికి గుర్తుంది.

''నేనేం చేయాలో నువ్వే చెప్పునాన్నా!'' అన్నాడు ప్రహ్లాద్.

''వనజ దారిలో నడు. వనజ ఆశయాలు పాటించు''

''ఎలా?''

''ప్రజలు ప్రభుత్వాన్నెన్నుకున్నారు - చక్కగా పాలిస్తుందనీ, ప్రజల యోగక్షేమాలు చూస్తుందనీ! కానీ జరుగుతున్నదేమిటి? ప్రజలంతా దోపిడికి గురవుతున్నారు''

''నాన్నా - ఈ మాటలు నువ్వంటున్నావా?'' అన్నాడు ప్రహ్లాద్ ఆశ్చర్యంగా.

''ఎవరంటే ఏమిటి - ఉన్నమాటే కదా - ధరలు ఆకాశాన్నంటుతున్నాయ్. టమేటాలు కేజీ అరవై. ఉప్పు కేజీ ఇరవై. కదిపప్పు కేజీ వంద. ప్లేటిడ్లీ ఆర్రూపాయల్నించి పన్నెండైంది. రూపాయుండే మిరపకాయ బజ్జీ రెండు రూపాయలైంది. సామాన్యుడేమైపోతాడని ప్రభుత్వం పట్టించుకుంటోందా?''

''ప్రభుత్వం సంగతలా ఉంచి ముందు నువ్వేం చేస్తున్నావో చెప్పు?'' నిలదీసాడు ప్రహ్లాద్.

''నేను నాకు తోచింది చేస్తాను. అందువల్ల ప్రజలకన్యాయం జరగొచ్చు. కానీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోవచ్చా? ఎవరికి తోచింది వాళ్ళు చేసుకుంటూ పోతుంటే చూస్తూ ఊరుకోవడానికేనా ప్రభుత్వమున్నది?'' ఆవేశపడ్డాడు హిరణ్యారావు.

''సరే నాన్నా - ఇదంతా నాకెందుకు చెబుతున్నట్లు?''

''పెరిగి పోతున్న ధరల గురించి నాకంటే ఎక్కువ ఆవేశపడు. యువకిశోరానివై గర్జించు. అప్పుడు యువతరం యువసేనగా మారి నీ వెంట కదిలితే - ప్రభుత్వ సింహాసనమే కదులుతుంది''

''నువ్వేమంటున్నావో నాకర్థం కావడం లేదు'' అన్నాడు ప్రహ్లాద్.

''పెరుగుతున్న ధరలకి నిరసనగా బంద్ ఆర్గనైజ్ చెయ్యి. బంద్‌ని నేను విజయవంతం చేస్తాను. సమాజ సేవకుడిగా, ప్రజా నాయకుడిగా వనజ నిన్ను గుర్తిస్తుంది. అప్పుడు మీరిద్దరూ దగ్గరౌతారు''

ప్రహ్లాద్ ఉత్సాహంగా, ''నువ్వు నేను వనజకి దగ్గిరయే ఉపాయం చెబుతున్నావా - నమ్మలేకపోతున్నా'' అన్నాడు.

''ముమ్ముందు నా గురించి నమ్మలేనివింకా చాలా తెలుసుకుంటావులే. నేనేం చేసినా నీ కోసమే'' అన్నాడు హిరణ్యారావు.

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవలేదు. మంత్రి తల్చుకుంటే బంద్‌లకి కొరతలేదు.

చూస్తూండగా ప్రహ్లాద్ చుట్టూ యువకులు చేరడం, వాళ్ళు బంద్‌కి పిలుపునివ్వడం జరిగిపోయింది.

దేశాన్నేలే రాజకీయ పక్షం - నగరంలో వెలిగిపోతోందంటే అది హిరణ్యారావు మద్దతుతోనే, కానీ అధికారంలోకొచ్చాక ఆయన్నది కాస్త నిర్లక్ష్యం చేసేసింది. ఆ విషయమ్మై ఆయన హెచ్చరిస్తే దాన్నీ నిర్లక్ష్యం చేసింది. అందుకే హిరణ్యారావు బంద్‌ని ప్రభుత్వంపై సవాలుగా విసిరితే - నగరంలో ప్రభుత్వ పక్షం అనుచరులా సవాలు నెదుర్కొని హిరణ్యారావు పై తమ ఆధిక్యతను నిరూపించుకోవాలనుకున్నారు.

ప్రభుత్వం బంద్‌కి వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించింది.

చాపకింద నీరులా హిరణ్యారావు బయటపడలేదు. ఆయనకి బంద్ నెలా విజయవంతం చేయాలో తెలుసు. ఎవరినెలా బెదిరించాలో తెలుసు. సామదాన భేద దండోపాయాలకు సరైన టైమింగూ తెలుసు.

బంద్ విజయవంతమైంది.

నగరంలో అక్కడక్కడ అల్లర్లు జరిగాయి. పోలీసులు కొందర్ని అరెస్టు చేశారు. ఏమైతేనేం మధ్యాహ్నానికల్లా ఊరు నిర్మానుష్యమై సాయంత్రం ఆరు దాకా ఊపిరి కూడా పీల్చుకోలేదు.

సాయంత్రం ఆరున్నరకి జరిగిన అభినందన సభలో, ''ఇది ప్రజా విజయం'' అన్నాడు హిరణ్యారావు. అప్పటికే ముఖ్యమంత్రి స్వయంగా ఫోను చేసి ఉండడంతో ఆయన ఉత్సాహం పట్టలేకుండా ఉన్నాడు. అందుకే తన ఉపన్యాసంలో ప్రభుత్వాన్ని

దుయ్యబట్టకుండా, "ధరల సమస్యపై ప్రజల స్పందన ఎంత తీవ్రంగా ఉందో తెలియజేయడమే ఈ బంద్ లక్ష్యం. ఇప్పుడు ప్రభుత్వం వెంటనే తగిన చర్య తీసుకుంటుందనే నా నమ్మకం" అంటూ ఆయన పరోక్షంగా ముఖ్యమంత్రిని పొగిడాడు కూడా.

ప్రహ్లాద్ బంద్ విజయానికి మురిసిపోతూ, "ఇకమీదట ప్రతి సమస్యకీ ఓ బంద్ చేసి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూంటాను" అని సభకి హామీ ఇచ్చాడు.

మాట్లాడుతునప్పుడు కూడా ప్రహ్లాద్ ఊహల్లో వనజే కదులుతోంది. మల్లెలకన్నా తెల్లని దుస్తులు ధరించి వెన్నెల కన్నా చల్లగా నవ్వుతూ చేతులు సాచి అతణ్ణి ఆహ్వానిస్తోందామె.

బంద్ విజయం, యువకిశోరం ప్రతిభ సాయంత్రానికే మీడియాకి హాట్ టాపిక్కయింది.

మర్నాడు నిద్రలేస్తూనే కాంతి కిరణం కోసం చూసాడు ప్రహ్లాద్. ఊహించినట్లే బంద్ వార్త మొదటి పేజీలోనే ఉంది. విలేఖరి వనజ.

చదువుతూనే నీళ్ళు కారిపోయాడు ప్రహ్లాద్.

వార్తలోని మూడు ఫోటోల్లో - ఒక్కటీ మూసి ఉన్న దుకాణానిది కాదు. అభినందన సభది కాదు. అల్లర్లది కాదు. ఓ గుడిసె ముందు తలపట్టుకుని ఖాళీ రిక్షాలో కూర్చున్నాడో బక్కచిక్కిన మనిషి - "ఆటోలే కాదు. బంద్‌లూ మా కడుపులు కొడుతున్నాయి" అంటున్న రిక్షావాడి మాటలు ఫోటో కింద కాప్షన్.

ఓ ఇంటి అరుగు మీద గెడ్డం మూసిన యువకుడు. "ఇంటర్వ్యూలో నెగ్గడానికి రికమెండేషను లేదు. ఇంటర్వ్యూకి వెళ్ళడానికి దారిలేదు" అంటున్నది ఫోటో కింది కాప్షన్.

"మన దేశంలో, సామాన్యుడి కోసం ఆక్రోశించడం ఫ్యాషన్. రెక్కాడితే కానీ డొక్కాడని వాళ్ళు లెక్కకు మించి ఉన్న ఈ దేశంలో, ఊపిరి పీల్చుకునే వ్యవధి దొరికితే ఊపిరే ఆగిపోతుందనుకునే నిరంతర శ్రామికులున్న ఈ దేశంలో, ప్రతిక్షణం నిర్మాణాత్మకంగా ప్రజలంతా కలిసి కృషి చేయాల్సి ఉన్న ఈ దేశంలో - ఒకటి తర్వాత ఒకటిగా జరిగే ఈ బంద్‌లు - సామాన్యుడికి దేశాన్ని బందుల దొడ్డిని చేస్తున్నాయి -" అంటూ మొత్తం బంద్ వ్యవస్థనే తీవ్రంగా విమర్శించింది వనజ.

వ్యాసం చదువుతూంటే ప్రహ్లాద్ కళ్ళు తిరిగిపోయాయి.

బంద్‌లు చేసేవారు ప్రజాద్రోహులు. బంద్ గురించి తలపోసేవారు దేశద్రోహులు.

వనజ వాడిన మాట వాడకుండా బందుల్నీ, బంద్‌లు చేసే నాయకుల్నీ దుమ్మెత్తి పోసింది.

"అయ్యో! వనజ చెప్పేదాకా ఇవన్నీ నాకెందుకు తట్టలేదు?" అనుకున్నాడు ప్రహ్లాద్ బాధగా.

ఎలా తడతాయి? అతడిక్కావలసింది వనజ.. కానీ వనజక్కావల్సింది ప్రజలు.

"నాన్న నన్ను తప్పుదారి పట్టించాడు. నా దారి తెలుసుకోవాలన్నా నేను వనజనే అనుసరించాలి -" అనుకున్నాడు ప్రహ్లాద్.

కానీ - ఎలా? బహుశా ఇప్పుడు వనజ అతడి ముఖం కూడా చూడదు.

"నువ్వు నమ్మతగ్గ మనిషివి కాదు. ప్రజలనే కాక - నన్నూ వంచించావు. వనజ నాకు దూరం కావాలనే నా చేత బంద్ చేయించావు. ఔనా?" అన్నాడు ప్రహ్లాద్.

కొడుకు తనని నమ్మకపోతే హిరణ్యారావుకి బాధలేదు. కానీ అతడు మరీ అంత సూటిగా ఉన్నమాట చెప్పడం ఆయన్ని బాధపెట్టింది. ఎందుకంటే మనసులోని మాటను సూటిగా చెప్పడం రాజకీయం కాదు. ఏనాటికైనా కొడుకు రాజకీయవాది కావాలని ఆయన అభిలాష.

"వనజని కలుసుకుని మీ మధ్య దూరాన్ని తొలగించి నా నిజాయితీ ఋజువు చేసుకుంటాను" అన్నాడాయన.

"నాకు నీ మీద నమ్మకంలేదు. విషయం అమ్మకి చెప్పుకుంటాను" అన్నాడు ప్రహ్లాద్.

హిరణ్యారావు మనసు మళ్ళీ బాధపడింది. తన అనుచరుడు ప్రతిపక్షం వైపు మొగ్గుతున్నందుకా బాధ!

"మొత్తం మీద గొప్పదానివే! ఎంతో కష్టపడి నా కొడుకుని నేను బంద్‌కి ప్రిపేర్ చేస్తే - ఒక్క వ్యాసంతో వాడి మనసుని బంద్‌లకి వ్యతిరేకంగా విరిచేశావ్" అన్నాడు హిరణ్యారావు.

"సారీ సర్ - మీ నిజాయితీని నమ్మని నేను మీ పొగడ్తలూ నమ్మలేను" అంది వనజ ముక్తసరిగా.

"మామూలుగా ఐతే ఒకళ్ళని పొగిడే తత్వం కాదు నాది. అసలు నన్ను పొగడాలనుకున్న వాడికే ఓ పట్టాన నా అపాయింట్‌మెంటు దొరకదు. అదీ నా లెవెలు. అలాంటి నేను నీ ఇంటికొచ్చి మరీ పొగుడుతూంటే - ఏంటమ్మా - ఇలాగంటావ్?"

"మీ లెవెలు మీకే కాని నాకు తెలియదు. అందుకని మీ నిజాయితీని నమ్మలేదు. అందుకని మీ నిజాయితీని నమ్మలేదు. నా లెవెలు కూడా మీకే కానీ నాకు తెలియదు. కాబట్టి మీరు నన్నెందుకు పొగిడారో కూడా మీకే తెలియాలి" అంది వనజ వ్యంగ్యంగా. హిరణ్యారావు దెబ్బతిని, "మాటల్లో నిన్ను గెలవడం కష్టం. సరే నేను వచ్చిన పని చెబుతాను -" అన్నాడు.

"వినడం వరకూ అభ్యంతరం లేదు -" అంది వనజ.

"ఏదో వినడం కాదు. శ్రద్ధగా విను. ఇది నీ భవిష్యత్తునే మార్చే విశేషం" అన్నాడు హిరణ్యారావు, "నెహ్రూగారు దేశానికి ప్రధాని అయ్యాడంటే గాంధీగారు చెప్పారనే! ఇందిరమ్మ దేశానికి ప్రధాని అయిందంటే నెహ్రూ కూతురనే! ఆ తర్వాత రాజీవ్ అయినా ఇప్పుడు సోనియా అయినా ఇందిరమ్మ పేరు బట్టే కదా"

"ఊఁ"

"ప్రతిదానికీ టైముంటుంది. ఒకప్పుడు శిష్యుల యుగం. తర్వాత కూతుళ్ళ యుగం వచ్చింది. తర్వాత కొడుకుల యుగం. ఇప్పుడు కోడళ్ళ యుగం నడుస్తోంది. మనవళ్ళ యుగం కూడా ఎంతో దూరంలేదు"

"ఊఁ"

"పీవీగారెంత గొప్పగా దేశాన్నేలినా గుర్తించేవాళ్ళు సంగతటుంచు - గుర్తుంచుకునే వాళ్ళే లేరు. అది నువ్వు గుర్తుంచుకోవాలి. నువ్వు చాలా గొప్పదానివి. సందేహం లేదు. ఏమైనా చేయగలవు. అందుకూ సందేహం లేదు. కానీ నీ చేతలకు రాణింపుండాలంటే ముందు నువ్వో గొప్పింటి కోడలివి కావాలి. అందుకిప్పుడు అవకాశం వెతుక్కుంటూ వచ్చింది"

అవకాశం ఎక్కడుందా అన్నట్లు అటూ ఇటూ చూసింది వనజ.

"అలా అటూ ఇటూ చూస్తావేమిటీ - అవకశాన్ని నేనే! నువ్వు మా ఇంటి కోడలివి కావాలి"

వనజ బదులివ్వలేదు.

"ప్రహ్లాద్ అందగాడు. బుద్ధిమంతుడు. నా కొడుకని కాదు కానీ - ఏమాటకామాటే చెప్పాలి. వాణ్ణి భర్తగా పొందడానికి ఏ పిల్లయినా గత జన్మలో బంగారుపూలతో పూజ చేసుకుని ఉండాలి."

వనజ మందహాసం చేసింది.

"నిన్నంటే వాడు ఎగిరి గంతేసి ఒప్పేసుకుంటాడు కానీ - ముందు నేనొప్పుకోవాలికదా! నేనొప్పుకోవాలంటే నాకు తగ్గ కట్నం కావాలికదా-"

వనజ ఆయన్ని కుతూహలంగా చూసింది.

"కట్నమంటే నోట్ల కాగితాలు కాదు. ఫైలు కాగితాలు. శరణాలయం ఫైలు కాగితాలు" అన్నాడు హిరణ్యరావు అక్షరం అక్షరం నొక్కి పలుకుతూ.

"అవి కావాలంటే ఒక్కటే మార్గం. పోలీసులకి లొంగిపొండి" అంది వనజ తాపీగా.

హిరణ్యరావు పలువిధాలుగా ఆమెను కన్విన్సు చేయడానికి ప్రయత్నించాడు. ఫలించలేదు. చివరకు విసిగిపోయి, "సరే - నీ ఖర్మ! ఒప్పుకోనందుకు ఫలితమెంత తీవ్రంగా ఉంటుందో నీకు తెలియదు" అన్నాడు.

"దేనికైనా నేను సిద్ధం. నాకు భయంలేదు" అంది వనజ శాంతంగా.

"భయమెందుకూ? నా ప్రయోగం చాలా తియ్యగా ఉంటుంది. వయసులో ఉన్నావుకదా - అనుభవిస్తావు. నా ప్రయోగం నిండా రొమాన్సే" అంటూ అక్కణ్ణించి లేచాడు హిరణ్యరావు.

ఆయన మాటలకర్థమేమిటా అని ఆలోచనలో పడింది వనజ.

## 11

**ముందు ప్రహ్లాద్ తన** మనసులో బాధను తల్లికి చెప్పుకోవాలనే అనుకున్నాడు. కానీ ఆలోచిస్తే - తను వనజని ప్రేమించాడు. ప్రేమించడం నేరంకాదు.

వనజకి తనమీద అపోహలున్నాయి. కానీ అవి అపోహలే.

తను బాగా చదువుకున్నాడు. తెలివైనవాడు.

సూటిగా వనజతో మాట్లాడి తన ప్రేమనామెకి చెప్పుకుని అపోహలుంటే పోగొట్టాలి తప్ప - ఆమె విషయంలో మధ్యవర్తులెందుకు?

ఈ ఆలోచన బలపడగానే అతడామెకి ఫోన్ చేసి పార్కుకి ఆహ్వానించాడు. ఏ కళనుందో ఆమె వెంటనే ఒప్పుకుంది.

ఇద్దరూ పార్కులో ఓ గులాబీ పొద పక్కన కూర్చుని కబుర్లకుపక్రమించారు.

"పిలవగానే వచ్చినందుకు థాంక్స్" అన్నాడు ప్రహ్లాద్.

"పిలిచినందుకు థాంక్స్" అంది వనజ.

"అంటే మీరు నా పిలుపు కోసం ఎదురు చూస్తున్నారా?" అన్నాడు ప్రహ్లాద్ ఆశ్చర్యంగా.

"కొన్ని సంఘటనలు జరిగాయి. కలిపి ఆలోచిస్తే మీ నుండి పిలుపొస్తుందనిపించింది. పిలిస్తే నా ఊహ కరెక్ట్.

పిలవకపోతే బుర్ర బద్దలు కొట్టుకోవాలి కొత్త ఊహలకోసం. అందుకే మీ పిలుపు కోసం ఎదురు చూశాను"

"మీ ఆలోచనలు సరైన దారిలో నడిచాయి. నేనెందుకు పిలుస్తానని ఊహించారో చెబుతారా?"

"చాలా సింపుల్ - నాతో మాట్లాడాలని"

"ఏం మాట్లాడాలని?"

"అదింకా సింపుల్ - నన్ను ప్రేమిస్తున్నాని చెప్పాలని"

ప్రహ్లాద్ తెల్లబోయి, "మీరు నిజంగా అఖండ మేధావి" అన్నాడు.

"అఖండ మేధావుల్నర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నా. మరి నేనూ అంతో ఇంతో మేధావిని కావాలి కదా"

"ఇట్స్ టూ బిగ్గే కాప్లిమెంట్ ఫర్ మీ" మొహమాట పడ్డాడు ప్రహ్లాద్.

"సరే - నేనెంత వరకూ చెప్పానో వదిలిపెట్టి, ఆ తర్వాత నుంచి సంభాషణ ప్రారంభించండి -" అంది వనజ.

"వనజా - మనం పెళ్ళిచేసుకుందాం" అన్నాడు ప్రహ్లాద్ చటుక్కున.

వనజ నవ్వి, "సారీ - ఇదీ నేనూహించినదే ఇదీ నేను ముందే చెప్పేయాల్సింది" అంది.

"మీరింకా ఏమూహించారో చెప్పేయండి. ఆ తర్వాతే నేను మాట్లాడ్డం ప్రారంభిస్తాను" అన్నాడు ప్రహ్లాద్.

"నా ఊహలో ఆ తర్వాత మీకు మాటలు లేవు. అంతా నేనే మాట్లాడాను.."

"ఏం మాట్లాడేరు?"

"మీ మాటలు నేనూహించాను. నా మాటలు మీరూహించండి.."

"నాకంత తెలివి లేదు" అన్నాడు ప్రహ్లాద్.

"అయితే నేను చెప్పనా?"

"ఊఁ"

"మన పెళ్ళి జరగదు"

"ఎందుకని?" అన్నాడు ప్రహ్లాద్ ఉలిక్కిపడి.

"పెళ్ళంటే - పెద్దలు. పెద్దలతో మాట్లాడే విశేషం. మీకు పెద్దలున్నారు. నాకు లేరు"

"అయితే"

"ఏ కుర్రాడికి పెద్దలుండరో నేనా కుర్రాణ్ణి పెళ్ళి చేసుకుంటాను"

ప్రహ్లాద్ తెల్లబోయినా అంతలోనే తేరుకుని, "వనజా, మీరు పెళ్ళికొప్పుకుంటే నాకూ పెద్దలుండరు" అన్నాడు.

వనజ అతణ్ణి ఆశ్చర్యంగా చూసి, "మరి ఉన్న పెద్దలేమైపోతారు?" అంది.

"విడిచి పెట్టేస్తాను"

"నాన్న సంగతేమో కానీ, అమ్మని విడిచిపెట్టడం ఎవరివల్లాకాదు"

"నేను విడిచి పెడను"

"ప్లీజ్ - అలాగనొద్దు - అమ్మ మనిషికి పెద్ద వరం. అది అమ్మలేని నాకు తెలిసినంతగా మీకు తెలియదు"

"అమ్మ ప్లస్సు. నాన్న మైనస్సు. ఇద్దర్నీ గుణిస్తే మైనస్సే. నా కోసం అమ్మ నాన్నను విడిచి పెట్టదు. అందుకని అమ్మ నాకు వరం కాదు, శాపం. నాకిప్పుడు అమ్మకాదు - మీరే కావాలి. ఆ విషయం అమ్మ కూడా ఒప్పుకుంటుంది"

"అమ్మ నాన్ననీ విడిచిపెట్టదు, మిమ్మల్నీ విడిచిపెట్టదు"

ప్రహ్లాద్ క్షణం ఆలోచించి, "పోనీ ఈ విషయం అమ్మచేత చెప్పిస్తే చెబితే నమ్ముతారా?" అన్నాడు.

"ఊఁ"

అదే పార్కు. అదే చోటు.

వనజ తన స్థానంలోనే ఉంది. ప్రహ్లాద్ స్థానంలో లీల ఉంది.

"అదమ్మా నా కథ" అంటూ తన కథను ముగించింది లీల.

వనజ కళ్ళు తుడుచుకుని, "మీ కథని నమ్మడం కష్టం. కానీ మీ గొంతు, చూపులు నన్ను నమ్మిస్తున్నాయి" అంది.

"నా కథ ఎంత నిజమో, ప్రహ్లాద్ నిన్ను ప్రేమించడమూ అంతే నిజం" అంది లీల.

వనజ ఆమెని ఆశ్చర్యంగా చూసింది.

ఆమెలో అందమింకా చెరగలేదు. సిరులకామెకు లోటు లేదు. సమాజంలో పెద్ద హోదాలో ఉన్న ఆ నారీమణి తనని వేడుకుందుకొచ్చింది - తనను పెళ్ళాడమని!

"మీరు తలచుకుంటే ప్రహ్లాద్ కింతకంటే మంచి సంబంధం దొరుకుతుంది" అంది వనజ.

"నా బాధ చెప్పాను. నా ఆశయం చెప్పాను. ఇంకా అలాగంటావేమిటి?"

"ప్రహ్లాద్ నన్ను పెళ్ళిచేసుకుంటే మీ ఇల్లొదిలి నాతోనే ఉంటాడు. మళ్ళీ మిమ్మల్ని కన్నెత్తి చూడడు"

"నాకు అంగీకారమే"

"ఆ మాటనడానికి మీరే మాత్రం ఆలోచించలేదు. మాట తప్పనివారు మాటిచ్చేముందు కాస్త ఆలోచిస్తారు"

"అన్నీ ఆలోచించుకుని వచ్చినదాన్ని. ఇక్కడ నాకు కొత్తగా ఆలోచించాల్సిందేం లేదు" అంది లీల.

వనజ నవ్వి, "నేనూ మీకులాగే అన్నీ ఆలోచించుకునే వచ్చాను. ఈ పెళ్ళి జరగదు" అంది.

"ఎందుకని?" అంది లీల దెబ్బతిని.

"పెళ్ళైన ఆడది భర్తననుసరించడం మన సంప్రదాయం. దాన్ని ధిక్కరించడం చాలామందికి అసాధ్యం"

"కానీ నీకు అసాధ్యమనుకోను" అంది లీల.

"నేను నా గురించి కాదు. మీ గురించి మాట్లాడుతున్నాను" అని - లీల తెల్లబోయి చూస్తుంటే కొనసాగించింది వనజ, "పెళ్ళికి ముందు మీరు మీ భర్తని ద్వేషించి ఉండొచ్చు. కానీ ఆయన్ని పెళ్ళాడారు. ఆయనతో కాపురం చేశారు. ఆయన బిడ్డకి తల్లి అయ్యారు. ఆయన అంశ ఉందని తెలిసీ ఆ బిడ్డని ప్రేమిస్తున్నారు. ఆయన తన దారిలోనే బిడ్డ సుఖాన్ని కోరితే మీరు కాదనలేదని ఖచ్చితంగా చెప్పగలను"

"ఐతే ఏమంటావ్?"

"మీ భర్త నామీద రొమాంటిక్ ప్రయోగం చేస్తానన్నాడు. ఇప్పుడాయన ప్రహ్లాద్‌ని నా మీద ప్రయోగించాలనుకుంటే అందుకు మీరు సహకరిస్తున్నారంటాను"

"నిన్ను నేనెలా నమ్మించేదమ్మాయ్?" తల పట్టుకుంది లీల.

"ఒక ఉపాయం ఉంది" అంది లీల, "మీ భర్తకి సంబంధించిన అపురూపమైన రహస్యమొకటి మీరు నాకు చెప్పాలి. అదెలాంటిదంటే - బయటపడ్డ మరుక్షణం ఆయన ప్రాణాలకే ముప్పు రావచ్చు"

లీల ఆలోచనలో పడింది.

"ఆలోచించుకోండి - అబ్బాయా, ఆయనా?" అంది వనజ.

"అలాంటి రహస్యాలు నాకు తెలియవు"

"హిరణ్యరావు లాటి మనిషికి అలాంటి రహస్యాలు బోలెడుంటాయి. వాటిలో కొన్నైనా మీకు తెలియవంటే మీ చిత్తశుద్ధిని శంకించక తప్పదు"

"ఆయనకి ఊళ్ళో ఓ ప్రియురాలుంది. ఆమెకి బంగళా కొనిచ్చారు. తరచు వెళ్ళి ఆమెని చూసొస్తుంటారు. ఈ విషయం నాకు తప్ప ఇంకెవరికీ తెలియదు"

"ఎందుకని?"

"ఆమెకు భర్త ఉన్నాడు. బంగళాలో ఆమె భర్తతోనే ఉంటోంది. చూసేవాళ్ళంతా ఆయన అతణ్ణి చూడ్డానికి వెడుతున్నారనుకుంటారు"

"మీరూ అలాగే అనుకోవచ్చుగా"

లీల తడబడింది, "అలాంటి సందేహం నాక్కలగకూడదని ఆయన నన్నోసారి ఆ ఇంటికి తీసుకువెళ్ళారు. అక్కడేం జరిగిందో చెప్పను. కానీ వాళ్ళిద్దరి అక్రమ సంబంధానికి కనీసం ఆ రోజు నేను సాక్షిని"

వనజ దెబ్బతింది. లీల గొంతు రుద్దమవడం గమనించి ఆమె మనసులో నొచ్చుకుంది. కానీ అప్పటికీ లీలని అంత సులువుగా నమ్మదల్చుకోలేదామె.

"సాధారణంగా మగవాళ్ళు ఇలాంటివి భార్యలకు తెలియనివ్వరు. మీ మాటలు నేను నమ్మలేను"

"నేను తనకు ఎదురు తిరిగేనని ఆయన నా మీద పగబట్టారు. నా మనసుకు ఎంత కష్టం కలిగితే అంత ఆనందమాయనకి"

"పాపం అప్పుడు మీకు చాలా బాధ కలిగి ఉంటుంది"

"ఆయన నా మనిషన్న ఫీలింగ్ నాకు లేదు. అందువల్ల నాకప్పుడెలాంటి బాధా కలగలేదు. అయితే అసహ్యం భరించలేకపోయాను"

చెప్పాలంటే వనజకూ అసహ్యమేసింది. టాపిక్ మార్చాలని, "ఆయన రహస్యాలేం తెలియవన్నారు, ఇది ముందే చెప్పొచ్చుగా" అంది.

"ఇందులో ఆయనకి ప్రాణం పోయేదేముంది - రహస్యం బయటపడితే - అంతగా అయితే పరువు పోవచ్చు..."

"సమాజంలో పెద్ద హోదా ఉందాయనకు. పరువు పోతే ప్రాణం పోయినట్లే కదా"

లీల నవ్వింది, "అదే నిజమైతే ఈ దేశంలో పెద్ద హోదా ఉన్నవాళ్ళలో ఒక్కరంటే ఒక్కరు కూడా బ్రతకరు"

వనజ కూడా నవ్వి, "అయితే మీరు నాకు రహస్యాలేం చెప్పలేరన్నమాట" అంది.

"అబ్బాయికోసం ఏమైనా చేయగలను. ఇంతవరకూ ఇలాంటి రహస్యాల గురించి ఆలోచించనే లేదు - నాకు కొంత టైమిస్తే - నీకు నమ్మకం కలిగించే రహస్యాల గురించి ఆలోచించనేలేదు - నాకు కొంత టైమిస్తే - నీకు నమ్మకం కలిగించే రహస్యం తెలుసుకుని చెబుతాను" అంది లీల.

"ఈ లోగా మీ శ్రీవారి ప్రియురాలి వివరాలు చెప్పండి. నిజానిజాలు ఆరా తీస్తాను" అంది వనజ.

లీల తల అడ్డంగా ఊపి, "ఆమె శ్రీవారికి ప్రియురాలే కావచ్చు. కానీ, ఆమె అమె భర్తా - ఇద్దరూ అసహాయులు. వాళ్ళమీద నాకు జాలే తప్ప కోపం, ద్వేషం లేదు. తప్పో, ఒప్పో చేసి సమాజంలో గౌరవంగా బ్రతుకుతున్నారు. వాళ్ళను నవ్వుల పాలు చేయడం నా అభిమతం కాదు. నేను నీకు తగిన రహస్యం తెలుసుకుని చెబుతానంటున్నానుగా" అంది.

"ఆమె మాటల్లో నిజముందో లేదోకానీ - ఉంటే మాత్రం చేతులెత్తి మ్రొక్క తగ్గ మనిషి" అనుకుంది వనజ.

భర్తని వెయ్యి కళ్ళతో కనిపెడుతోంది లీల. వనజని కలిసిన మర్నాడే - ఆమె హిరణ్యారావు ఏదో వీడియో కేసెట్‌ను భద్రంగా బీరువాలో దాచడం గమనించింది. ఆ కేసెట్‌ని స్వయంగా ఆయనే దాచడం ఆశ్చర్యమనిపించి, ఆయన కనుమరుగయ్యాక ఆ కేసెట్‌ను తీసిందామె వెంటనే ఆ స్థానంలో మరో కేసెట్ ఉంచింది.

భర్త ఇంట్లో లేడని పూర్తి నమ్మకం కుదిరాక ఆమె తన గదిలో ఆ కేసెట్‌ని ప్లే చేస్తే -

ఆరంభంలోనే ఓ పెద్దపులి గాండ్రుమంది.

లీల ఉలిక్కిపడింది.

ఆ పెద్ద పులి క్లోజప్ నుంచి లాంగ్ షాట్‌కి మారింది.

"అరణ్యంలో ఎవరైనా పులికి భయపడాలే తప్ప - పులి ఎవరికీ భయపడదు. పులిని వేటాడేవారుండొచ్చు. కానీ వాళ్ళాపని చాటుగా చేస్తారు. ఎదుట పడి పులినెవరూ ఎదిరించలేరు."

గంభీరంగా ఓ గొంతు వినిపించేక సీను అడవి నుంచి నగరానికి మారింది.

"ఇది జనారణ్యం..."

నగరమంతా హడావుడిగా ఉంది.

"వేటగాళ్ళు చచ్చుబడిన జనారణ్యం..."

సీను పోలీసులు, రాజకీయనాయకులు వగైరాలని ప్రదర్శించింది.

"ఈ జనారణ్యంలో ఎదురులేని పులి ఒకటుంది"

ఉన్నట్లుండి హిరణ్యారావు ప్రత్యక్షమయ్యాడు.

"ఆయనకి ఎదురు తిరిగితే.."

దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు. దృశ్యాలు చకచకా మారుతున్నాయి.

ఉన్నట్లుండి హిరణ్యారావు నవ్వు. నవ్వులోంచీ మళ్ళీ ఆయన రూపం....

నవ్వు ఆగింది. ఆయన నోరు విప్పాడు....

"రాగిణీ! ఇది నీ కోసం.." అన్నాడాయన.

"రాగిణి ఎవరు?" అనుకుంది లీల. భర్త నోట ఆ పేరు వినటం అదే మొదటిసారి ఆమెకి.

"ఈ కేసెట్ శ్రద్ధగా చూడు. నేనేంటో నీకు తెలుస్తుంది. నేనేంటో నీకు తెలియదనికాదు. కానీ నువ్వేమిటో నీకు తెలియకుండా ఉంది కదా - అందుకని నేనేమిటో చాలా తరచుగా మరచిపోతున్నావు.."

భర్త గొంతులో మెత్తటి క్రూరత్వం. అది లీలకి కొత్తకాదు.

ఉన్నట్లుండి ఓ ఫోటో..

"ఈ పిల్ల పేరు చిత్ర. అందమైనది. మధ్యతరగతిలో పుట్టింది. అర్థంలేని నీతి, నిజాయితీలని నమ్ముకుంది. తలిదండ్రులకీమె పెళ్ళి కష్టమైంది. నేను సాయం చేసాను. కన్నారావుతో పెళ్ళి జరిపించాను" చిత్ర ఫోటో మారి కన్నారావు ఫోటో వచ్చింది.

"కన్నారావూ మధ్యతరగతి వాడే - కానీ నా అనుచరుడు.."

హిరణ్యరావు గొంతులో కథ నడుస్తోంది. దృశ్యాలు మారుతున్నాయి.

కన్నారావుకి చిత్రంటే ప్రేమ. చిత్రకి కన్నారావు ప్రాణం. కానీ ఒకరోజు భర్త అసలు రూపం ఆమెకి తెలిసిపోయింది. పోలీసులకి లొంగిపొమ్మంది. కన్నారావు ముందు ప్రతిఘటించినా తర్వాత ఆమె మాటలకు లొంగిపోయాడు. తనను మామూలు మనిషిలా బ్రతకనిమ్మని హిరణ్యరావుని వేడుకున్నాడు.

టీవీ తెరమీద ఫోటోలు మారుతున్నాయి.

హిరణ్యరావు ఒప్పుకోలేదు. ఆయన చిత్రని కన్నారావు ఎదుట అనుభవించాడు. చిత్ర చూస్తూండగా కన్నారావును చిత్రహింసలు పెట్టాడు.

చిత్ర భర్తకోసం ఏమైనా చేస్తానంది.

హిరణ్యరావామెను నైట్ క్లబ్‌లో చేర్పించాడు. అర్ధరాత్రి ప్రత్యేక అతిథుల ముందామె చేత నగ్న నృత్యాలు చేయించాడు.

జీవచ్ఛవంలా బ్రతుకుతున్న చిత్ర అవకాశం దొరకగానే ఒకరోజు ఆత్మహత్య చేసుకుంది.

హిరణ్యరావా శవాన్ని కన్నారావుకి అప్పగించి, "నీకు స్వేచ్ఛనిస్తున్నాను. నీ భార్యకి అంతిమ సంస్కారం జరిపించి మళ్ళీ నాతో చేతులు కలుపు. మరో పిల్లనిచ్చి పెళ్ళిచేస్తాను" అన్నాడు.

కన్నారావు చిత్రకి దహన సంస్కారం చేసాడు. అక్కణ్ణించి తిన్నగా పోలీసు స్టేషను కెళ్ళి పిర్యాదు వ్రాసాడు. ఫోటోలు ఆగిపోయి టీవీ తెరమీద మళ్ళీ హిరణ్యరావు కనిపించాడు.

"తర్వాతేమైందో ఊహించగలవా? కన్నారావు నా చేతిలో చచ్చాడు. స్టేషన్లో రిపోర్టు ముక్కలయింది..." హిరణ్యరావు నవ్వుతో భవనం దద్దరిల్లగలదని సౌండు తగ్గించింది లీల.

"రాగిణీ! ఇలాంటి కేసెట్ల రూపంలో నా లీలలు చాలా ఉన్నాయి. ఈ కథ పూర్తిగా వాస్తవం. ఇందులోని పాత్రలు సజీవాలు. అనుమానముంటే చిరునామాలిస్తున్నాను. చిత్ర, కన్నారావుల గురించిన వాస్తవాలు నువ్వే తెలుసుకుంటావు. తెలుసుకున్న వెంటనే నాకు పాదాక్రాంతం కావాలి. లేదూ నువ్వు మరో చిత్రవవుతావు. ఇది నా హెచ్చరిక అనుకోకు. శ్రేయోభిలాషిగా చెబుతున్న మంచిమాట.."

మళ్ళీ హిరణ్యరావు నవ్వు.

"నా గురించి నేనే వీడియో తీసుకుని నా గొయ్యి నేనే తవ్వుకుంటున్నానని భ్రమ పడుతున్నావేమో! ఇది నా ఆత్మస్థైర్యానికీ మచ్చుతునక. ఈ కేసెట్‌తో నన్నెవరైనా ఏమైనా చేయగలరన్న భయం నాకు లేదు. ఇంకా నీకు నా గురించి భయం పుట్టకపోతే చివరిసారిగా నా క్రూరత్వాన్ని చూడు..."

హారర్ చిత్రాల్ని మరిపించే మరికొన్ని దృశ్యాలు. వాటిలోంచి అడవి. ఆ అడవిలో పెద్దపులి.

పెద్దపులి క్రమంగా క్లోజప్‌లోకి వచ్చి గాండ్రుమంది.

"శుభం!"

సినిమా అయిపోయింది.

లీల కేసెట్ ఆఫ్ చేసింది. కానీ ఆమెకింకా గుండెలదురుతూనే ఉన్నాయి.

## 12

**రఘు వనజ పంపిన సందేశం చదివాడు.**

అతడి ఆశ్చర్యానికి అంతులేదు. హిరణ్యారావుకి ఎంత ధైర్యం?

ఒక నేరాన్ని ముందుగానే ఆలోచించుకుని ఆదినుంచీ అందుకు సంబంధించిన విశేషాల్ని ఫోటోల రూపంలో భద్రపరుస్తూ – ఆ నేరాన్ని వీడియోగా మార్చి మరో నేరానికి ఉపయోగించుకుంటున్నాడు.

జనారణ్యంలో వేటగాళ్ళు చచ్చుబడ్డారని ఆయన ఖచ్చితంగా నమ్ముతున్నాడు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకపోతే ఆయనలాంటి పులులు మరింత రెచ్చిపోతాయి. సమాజాన్ని అల్లకల్లోలం చేస్తాయి. రఘు ఆలోచిస్తున్నాడు.

ఈ నగరాన్ని పరిశుభ్రం చేయాలంటే తమ లక్ష్యం హిరణ్యారావు కావాలి.

భారతీ టీచరుకి అవమానం జరిగినప్పుడు వనజలో విప్లవాగ్ని రగిలింది. ఆ నిప్పునుంచి దీపాన్ని వెలిగించి ఆరిపోకుండా చిమ్నీతో కప్పి సమాజపు చీకట్లను పారద్రోలడానికి తను శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. రఘుకి ఆశ్చర్యంగా ఉంటుంది.

తన లక్ష్యమేమిటో సరిగ్గా తనకే తెలియదు. వనజ లేకుంటే తను అతి సామాన్య జీవితం గడిపేవాడేమో! మామూలుగా చదువుకుని, పత్రికలకి రొటీన్ వార్తలందిస్తూ ఏదో ఉద్యోగం సంపాదించి పెళ్ళిచేసుకుని ఆఫీసుకి వెడుతూ, సంసారం చేస్తూ, సినిమాలు చూస్తూ, పిల్లల్ని కంటూ, వాళ్ళని పెంచుతూ..

అలాంటిది – పన్నెండేళ్ళ అమ్మాయి ప్రభావంతో తన జీవిత లక్ష్యం మారిపోయింది. ఆ లక్ష్య సాధనకై ఎంతటి ప్రమాదాన్నైనా ఎదుర్కోగల మనోబలం తనకి లభించింది.

మనుషులు ప్రభావితం కావాలంటే నాయకు కావాలి. వాళ్ళు మనిషిలో నిబిడీకృతమై ఉన్న సామర్థ్యాన్ని వెలికితీస్తారు.

వనజ నాయకి, తను అనుచరుడు.

అదేమిటో – ఇప్పటికీ ఆమెకు సహకరిస్తున్నానన్న భావమే తప్ప సమాజానికి తానేదో ఉపకారం చేస్తున్నానన్న భావమతడిలో కలగడంలేదు.

మరో విచిత్రం – వనజకీ, రఘుకీ ఉన్న అనుబంధం చాలామందికి తెలియదు. వనజకతడు చేస్తున్న సాయం గురించీ ఎవరికీ తెలియదు.

డిపార్ట్‌మెంట్లో రఘుకి గొప్ప నిజాయితీ పరుడన్న పేరేం లేదు. అందరు ఇన్‌స్పెక్టర్లలాగే అతడూ పనిచేస్తున్నాడు. అడపాతడపా లంచాలు తీసుకుంటున్నాడు. సమాజాన్ని శాసించే వ్యక్తులకి సలాములు కొడుతున్నాడు. తన నిజస్వరూపాన్ని మరుగున ఉంచడమే తనకీ, వనజకీ మంచిదని అతడు భావించాడు.

అందరూ భావించినట్లు పోలీసు డిపార్ట్‌మెంటు అవినీతిమయంకాదు. సమాజానికి ఏదైనా చేయాలనీ, సామాన్యుడికి ఏదో విధంగా సాయపడాలనీ తాపత్రయపడేవారు డిపార్టుమెంట్లో కోకొల్లలుగా ఉన్నారు. రఘు వారిలో కొంతమందిని ఎన్నుకున్నాడు. వారితో స్నేహం చేసాడు. వారిని ఆకాశానికెత్తేస్తూ వారిలా తనుండలేకపోతున్నందుకు బాధపడేవాడు.

రఘు మంచివాడనీ, కొన్ని బలహీనతలను జయించలేకపోతున్నాడనీ వారనుకునేవారు. అతడివల్ల కాని పనుల్ని చేయడానికి వారు సిద్ధంగా ఉండేవారు.

తను బయటపడకుండా వారిద్వారా సమాజానికి మేలు జరిగేలా చేస్తున్నాడు రఘు.

పేరు వాళ్ళకొస్తోంది. అందుకని వాళ్ళు సంతోషపడేవారు. తమకి లభించిన పేరు ప్రఖ్యాతుల్లో రఘుకీ వాటా ఉందనీ అది బయట పడడం లేదనీ నొచ్చుకునేవారు కూడా.

సినిమా కథల్లో హీరో ఇనస్పెక్టరైతే అతడొక్కడే విలన్లకి ఎదురు తిరుగుతాడు. దాంతో విలన్లకు తమ లక్ష్యం తెలుస్తుంది. వాళ్ళతణ్ణి వేటాడతారు. అది సినిమా కాబట్టి అతడు నెగ్గవచ్చు. కానీ వాస్తవంలో ఒంటరి మనిషికి పోలీసు డిపార్టుమెంట్లో పతనం తప్పదు.

వనజకు ఫలానా వ్యక్తి పోలీసు డిపార్టుమెంట్లో సాయంచేస్తున్నాడని పట్టడం కష్టం. మొత్తం డిపార్టుమెంటే ఆమెకు సాయపడుతున్నట్లుంది. ఆ సాయం కూడా వనజ పట్ల సానుభూతితో కాదు. సరైన సమయంలో డిపార్టుమెంటుకి సమాచారమందడమే అందుకు కారణమని వనజ శత్రువులు భావించారు.

రఘు ఈ విషయమై నేర్పుగా పథకం వేసి చాకచక్యంతో పావులు కదుపుతున్నాడు.

నగరంలో హిరణ్యారావు పతనమైతే వనజతో తన స్నేహాన్ని బహిరంగం చేయొచ్చని అతడు ఎదురు చూస్తున్నాడు. అందుకే డిపార్టుమెంట్లో అనామకుడిగా కొనసాగుతున్నాడు.

"ఇక హిరణ్యారావుకి రోజులు దగ్గర పడ్డాయి" అనుకున్నాడు రఘు, వనజ పంపిన సందేశం చూసుకుని. అతడు చకచకా చిత్ర, కన్నారావుల గురించి రహస్యంగా కూపీలాగించాడు.

చిత్ర అర్థాంతరంగా మరణించిందని ఆమె తలిదండ్రులేడ్చారు.

కన్నారావు ఆకస్మిక మరణంతో అతడి తలిదండ్రులు కృంగిపోయి ఉన్నారు.

వనజకు అందిన కేసెట్లో కథ - వాస్తవంలో చిత్ర కన్నారావుల కథలోని లొసుగులు పూడ్చింది.

నిస్సందేహంగా ఆ కేసెట్ హిరణ్యారావుపై బ్రహ్మాస్త్రం.

ఇంటిగుట్టు లంకకు చేటు, తన ఇంట్లోనే విభీషణుడున్నాడని హిరణ్యారావు అనుకుని ఉండడు. రామాయణంలో తమ్ముడు. ఇక్కడ భార్య...

రఘు ఆ కేసెట్ ఎవర్ని హెచ్చరించడానికి ఉద్దేశించబడిందో ఆ రాగిణి కోసం అన్వేషణ ప్రారంభించాడు.

రాగిణి జాడ మాత్రం ఇంకా తెలియలేదు.

అయినా హిరణ్యారావును కార్నర్ చేయడానికి ప్రయత్నాలారంభమయ్యాయి.

పథకం చాలా పకడ్బందీగానే ఉంది.

ప్రహ్లాద్ వనజని తరచుగా కలుసుకుంటున్నాడు. ఇద్దరూ పార్కులకీ, నదీ తీరాలకీ, సినిమాలకీ విహరిస్తున్నారు. ప్రహ్లాద్‌కి చాలా ఉత్సాహంగా ఉంది. అతడామెకి తన ప్రేమ గురించి పదే పదే చెప్పుకుంటూ, ఆ ప్రేమ లభిస్తే ఈ ప్రపంచంలో ఇంకేదీ తను కోరననేవాడు.

వనజ కతడిపై ప్రేమలేదు. అతడినామె అంతగా నమ్మనూ లేదు.

ఆ విహారాలను తమ పథకంలోని భాగంగా మాత్రమే ఆమె గుర్తించింది.

హిరణ్యారావు కూడా వారిద్దరి స్నేహాన్నీ ప్రోత్సహించేవాడు.

"నేనేం చేసినా నీకోసమే. నా పద్ధతులు నీకు నచ్చనపుడు నేనే మారక తప్పదు. నాకు మారాలనే ఉంది. వనజ దగ్గిర శరణాలయానికి సంబంధించిన ఫైలుంది. అది సంపాదించు. ఆ ఫైలుతో పాటే నా పాపాలన్నీ ప్రక్షాళణం చేసుకుంటాను. మనం కొత్త జీవితం ప్రారంభిద్దాం" అన్నాడాయన కొడుకుతో.

ప్రహ్లాద్ ఈ విషయం వనజకు చెప్పాడు.

"నీ తండ్రిలో అంత సులభంగా మార్పురాదు. తండ్రి కాబట్టి నీకు నమ్మాలనిపిస్తుంది. నేనాయన్ని నమ్మకపోయినా నీ తండ్రి కాబట్టి నేనాయన పతనాన్ని కోరుకోవడంలేదు. ఆయన్ని క్రమంగా బలహీనపర్చి మరోదారి లేకుండా చేయడమే నా ఉద్దేశ్యం. అప్పుడాయన విధిలేక అయినా మంచి మార్గానికొస్తాడు" అంది వనజ. తండ్రిని బలహీనపర్చడానికి ప్రహ్లాద్ అంగీకరించాడు.

ఆ ప్రకారం అతడు తండ్రితో, "ఆ వనజ అంత సులభంగా ఎవర్నీ నమ్మదు. ఫైలు నాకివ్వనని ఖచ్చితంగా చెప్పేసింది. ఐతే ఆ ఫైలెక్కడున్నదీ మాత్రం తెలుసుకోగలిగాను" అంటూ తండ్రికి ఓ చోటు చెప్పాడు. మర్నాడే అక్కడ హిరణ్యారావు అనుచరుల దాడి జరిగింది. వాళ్ళని పోలీసులు పట్టుకున్నారు. ఆ అనుచరుల కారణంగా ఆయన పేరు బయట పడలేదు కానీ కొన్ని అవినీతి కార్యకలాపాలు మూతపడ్డాయి. హిరణ్యారావుకి కోపమొచ్చింది.

"లోపం నాది కాదు. నీ అనుచరులది. అంత సులభంగా వాళ్ళు పోలీసులకెలా దొరికిపోయారు?" అన్నాడు ప్రహ్లాద్ తండ్రిమీద చిరాకుపడుతూ.

"ఇంకో ప్రయత్నం చేయాలి" అన్నాడు హిరణ్యారావు.

"ఫైలింకా అక్కడే ఉండదు. స్థలం మారుతుంది. నేనూ ఇంకో ప్రయత్నం చేయాలి - ఎక్కడుందో తెలుసుకుందుకు..." అన్నాడు ప్రహ్లాద్ సాలోచనగా.

అలా ఒకటి కాదు. ప్రహ్లాద్ మరో రెండు ప్రయత్నాలు చేయాల్సొచ్చింది.

రెండుసార్లూ హిరణ్యారావు అనుచరులు పెద్ద సంఖ్యలోనే పట్టుబడ్డారు - పోలీసులకి.

దాంతో ఇంచు మించు హిరణ్యారావు కార్యకలాపాలన్నీ స్థంభించిపోయాయి. ఐతే ఈసారాయనకి కోపం రాలేదు.

"వనజకి పోలీసు డిపార్టు మెంటు నుంచి సాయమందుతోంది. ఆమెనింక ఉపేక్షించకూడదు. మనవాడు ప్రేమిస్తున్నాడని ఊరుకున్న కొద్దీ తెగరెచ్చిపోతోంది. మనవాడికెలా నచ్చచెప్పాలో తర్వాత చూసుకుంటాను. ముందు నేనాపిల్లను లేపేస్తాను" అన్నాడు హిరణ్యారావు లీలతో.

ఆయనక్కోపం వస్తే ఫర్వాలేదు. అంత పంతంగా మాట్లాడేడంటే అన్నంత పనీ చేయగలడని లీలకు అనుమానం.

"మీరా పిల్లను లేపేస్తే మనవాడు మనకు దక్కడు.." అంది లీల.

"మనవాడంటే నాకు ప్రాణం. వాడు పెళ్ళి చేసుకుని పిల్లాపాపలతో సుఖంగా ఉంటే నేను చూసి సంతోషించాలని నా కోరిక. కానీ అందుకు నేనంటూ మిగలాలిగా! ఆపిల్ల నా ఉనికినే సవాలు చేస్తోంది. అబ్బాయి సుఖసంతోషాలతో జీవిస్తూంటే ఆకాశంలోంచి చూస్తూ కళ్ళు తుడుచుకోవాలని నాకు లేదు. చెబుతున్నాను - రెండే రెండు రోజుల్లో అది ఫినిష్!" అన్నాడు హిరణ్యారావు.

లీల విషయం ప్రహ్లాద్‌కు చేరవేసింది.

"హిరణ్యారావు అన్ని వైపుల నుంచీ కార్నరయ్యాడు. ఇప్పుడు అనాథ శరణాలయం ఫైలు బయట పెట్టామంటే ఆయన ఫినిష్."

అది ఇన్‌స్పెక్టర్ రఘు నుంచి వనజ కందిన ఇంటర్నెట్ ఈ మెయిలు సందేశం.

"ఈ విషయంలో ప్రహ్లాద్ మనకందించిన సహకారం మరువలేనిది. అతడు నన్ను నిజంగానే ప్రేమిస్తున్నాడనిపిస్తోంది" వనజ నుంచి రఘుకి జవాబు.

"కొంపదీసి నువ్వూ అతణ్ణి ప్రేమించడం లేదు కదా?" రఘు సందేహం.

"కొంపదీసి నేనూ అతణ్ణి ప్రేమించడంలేదు కదా!" వనజకి తనమీద తనకే సందేహం .

నదీ తీరంలో ఓ పెద్ద రావి చెట్టు.

ఆ చెట్టు నీడలో ఐదారు జంటలు. అందులో ఓ జంట ప్రహ్లాద్, వనజ.

"నేను నీ చిత్తశుద్ధిని నమ్ముతున్నాను" వనజ.

"నాది చిత్తశుద్ధి కాదు, ప్రేమ. నేనేం చేసినా నీ మీద ప్రేమతో చేస్తున్నాను" ప్రహ్లాద్ సవరణ.

"కానీ నేను నీ చిత్తశుద్ధినే నమ్ముతున్నాను"

"అంటే నువ్వు నా ప్రేమను నమ్మనట్లే"

ఉలిక్కిపడింది వనజ.

అతడి ప్రేమలో చిత్తశుద్ధి ఉన్నమాట నిజం. మరి తను అతడి ప్రేమను నమ్ముతోందా? నమ్మితే స్పందన ఏమిటి?

"వనజా?"

"ఊఁ"

"నా చిత్తశుద్ధిని నమ్ముతున్నావు కాబట్టి - సందేహించకుండా శరణాలయం ఫైలు నాకిచ్చేసేయ్. నాన్న నిన్ను మోసం చేయలేని విధంగా వ్యవహారం నేను డీల్ చేస్తాను"

వనజ నవ్వి, "ఫైలు - అప్పుడే వద్దులే" అంది.

"ప్లీజ్" అన్నాడు ప్రహ్లాద్.

"నువ్విలా నొక్కిస్తే నేను నిన్ను అనుమానించాల్సి వస్తుంది" అని ఆగి, "నిన్నంటే, నీ చిత్తశుద్ధిని!" అంది.

"అనుమానించినా సరే - నాకా ఫైలు కావాలి" అన్నాడు ప్రహ్లాద్.

"ప్రహ్లాద్ - నువ్వెందుకో కలవరపడుతున్నట్లు తోస్తుంది నాకు" అంది వనజ.

"ఔను - కలవరమే. అదీ నీ గురించే!"

"నా గురించి నీకు భయంలేదు. నన్ను దేవతలు దీవిస్తున్నారు"

"దేవతల్ని నమ్ముకోకు. రాక్షసుల్నించి తప్పించుకుందుకు వాళ్ళూ మనుషుల మీదే ఆధారపడుతూంటారు" దిగులుగా అన్నాడు ప్రహ్లాద్.

"ఏమైంది ప్రహ్లాద్!" అడిగింది వనజ.

"మా నాన్న నిన్ను చంపేస్తానన్నాడు. అదీ రెండే రెండు రోజుల్లో"

"నా విషయంలో మీ నాన్న ఏం చేయలేడు?" అంది వనజ.

"నీది మొండి ధైర్యం. అది నీ ప్రాణాలు తీస్తుంది"

"తీయదు"

"తీస్తుంది. తీస్తే నేను బ్రతకలేను"

"ఐతే ఏమంటావ్?"

"రెండు రోజులపాటు అనుక్షణం నేను నీతోనే ఉంటాను...."

"ఎందుకు?"

"నేనుపక్కనుండగా నాన్న మనుషులు నిన్ను తాకను కూడా తాకలేరు"

"అది నీ భ్రమ. నన్ను చంపడానికి మీ నాన్న తన ప్రయత్నాలు చెయ్యలేదనుకుంటున్నావా? అవన్నీ ఫెయిలయ్యాయి"

"ప్లీజ్ వనజా! అన్నివేళలా మొండితనం కలిసిరాదు. నాన్న నీ జోలికి రాకపోవడానిక్కారణం నేనే! నువు లేవని తెలిసినప్పుడు నా మెదడు స్థంభించింది. నీ దర్శనమే తిరిగి నా మెదడుకు చలనాన్నిచ్చింది. అది నాన్నకి తెలుసు.."

వనజ నవ్వింది, "మాఫియాలో బంధుత్వాలుండవు. నాకు తెలుసు"

"నీ నమ్మకం నీది. నా నమ్మకం నాది. నన్ను రెండురోజులు నీ సాన్నిహిత్యంలో ఉండనీ..."

"ఆడపిల్లను. పెళ్ళయ్యేదాకా నా వ్యక్తిగత జీవితంలో నేను ఒంటరిని" అంది వనజ.

"నా చిత్త శుద్ధిని నమ్ము"

"నమ్మాను"

"లేదు. నమ్మలేదు. నా చిత్తశుద్ధిని నమ్మడానికి నేనేం చేయాలో చెప్పు"

"ప్లీజ్ ప్రహ్లాద్! ఇంతవరకూ నువ్వు చేసింది చాలు.."

"చాలలేదు. నువు నమ్మలేదు..."

"ప్రహ్లాద్ - మొండితనం అన్ని వేళలా శోభించదు...."

"ఈ రెండూ రోజులూ నిన్నంటిపెట్టుకుని ఉండనివ్వకపోతే ఈ క్షణమే నా ప్రాణాలు తీసుకుంటాను..." ప్రహ్లాద్ జేబులోంచి కొత్త బ్లేడు ఒకటి తీశాడు.

వనజ మాట్లాడకుండా అతణ్ణే చూస్తోంది.

ప్రహ్లాద్ బ్లేడు రేపరు తీశాడు. కుడిచేతి రెండు వేళ్ళతో బ్లేడుని పట్టుకుని ఎడమ చేతి మణికట్టు మీదకి వంచాడు. "ఆగు -" అంది వనజ.

"ఏమిటీ అర్థంలేని మొండితనం?"

"మొండితనం నాది కాదు..." అన్నాడు ప్రహ్లాద్ - "పరిస్థితి నీకు తెలియక అలాగంటున్నావు. నాన సంగతి నీకు తెలియదు. నాకు తెలుసు. నువ్వు పోలీసు డిపార్టుమెంటుని నమ్ముతున్నావ్. నీకంటే ఎక్కువగా ఆ డిపార్ట్ మెంటు నాన్నని నమ్ముతుందని నీకు తెలియదు. ఇంతకాలం ఆయన తనకెదురు లేదన్న దురహంకారంలో ఉన్నాడు. ఇప్పుడాయన సర్వ శక్తులూ క్రోడీకరించి నిన్నెదుర్కుంటాడు. తట్టుకోలేవు.."

వనజ నవ్వింది. "నీకు తెలిసిన నిజాలు నిన్ను భయపెడుతున్నాయ్. నాకు తెలిసిన నిజాలు నాకు ధైర్యాన్నిస్తున్నాయ్"

"ఏమిటా నిజాలు?"

"సమాజానికి సంబంధించి నేనెప్పుడు స్పందించానో నీకు తెలుసు. భారతీ టీచరుకి జరిగిన అవమానం నన్ను రెచ్చగొట్టింది. అయితే అప్పుడు నా వయసు పన్నెండు. నేను బయట పడడం ప్రమాదమని అప్పుడొక వ్యక్తి నాకు అన్నగా నిలిచి నా రిపోర్టు తనదని చెప్పి - ఫలితంగా చావుదెబలు తిన్నాడు. తర్వాత ఈ ఊరొదిలి నాకోసమే పోలీస్ ఇన్‌స్పెక్టరై కష్టపడి ఈ ఊళ్ళోనే పోస్టింగు

సాధించాడు. తను అజ్ఞాతంగా ఉంటూ నాకు రక్షణ కవచమయ్యాడు. అతడుండగా నన్నెవరూ ఏమీ చేయలేరు. అది నీకు తెలియని నిజం..." ప్రహ్లాద్ ఆశ్చర్యంగా - "ఎవరతడు? ఒక్కసారి అతణ్ణి చూడొచ్చా?" అన్నాడు.

"నేనే అతణ్ణి చూడ్డం లేదు. నీకేం చూపిస్తాను? సమయమొచ్చినప్పుడు తప్పకుండా పరిచయం చేస్తాలే.."

"పోనీ అతడి పేరు చెప్పగలవా?"

"ప్రస్తుతానికి అంతా రహస్యం. నీ చిత్తశుద్ధిని నమ్మి ఈ మాత్రం చెప్పాను" అంది వనజ.

"నువ్వెంత చెప్పావో అంతా నాలోనే దాచుకుంటాను. అమ్మక్కూడా చెప్పను. నిన్నంటి పెట్టుకుని ఉంటానని వేధించను" అన్నాడు ప్రహ్లాద్.

"దిస్ గై రియల్లీ లవ్స్ మీ" అనుకుంది వనజ.

అయితే రావిచెట్టు చుట్టూ మైక్రోఫోన్లు అమర్చబడ్డాయనీ, తమ సంభాషణ యావత్తూ ఓ మనిషి వింటున్నాడని వాళ్ళకి తెలియదు.

"నిన్నెక్కడో చూసినట్లుంది -" అన్నాడు రఘు ఆ అమ్మాయిని చూసి.

"అందమైన ఆడపిల్లలంతా ఒక్కలాగే అనిపిస్తారు కొందరికి. నన్ను మీరెక్కడా చూళ్ళేదు" అందా అమ్మాయి.

"నీ పేరు?"

"రాగిణి"

"ఈ పేరెక్కడో విన్నట్లుంది"

"అగ్రీడ్ - వనజ మీకు పంపిన కేసెట్లో హిరణ్యారావు ఉచ్చరించింది నా పేరే!"

రఘు ఉలిక్కిపడ్డాడు. "ఎస్ - రాగిణి - అదే పేరు. మేమూ రాగిణి కోసం వెతుకుతున్నాం"

"ఇప్పుడా రాగిణి మీ ముందుంది..."

"అవును - నీకు వనజ కేసెట్ పంపిన విషయమెలా తెలుసు?"

"నన్ను వనజే ఇక్కడకు పంపింది"

"వనజకి నువ్వెలా తెలుసు?"

"ఆమె నన్ను కనుక్కుంది. ఎలా కనుక్కుందని అడక్కండి. ఇలాంటి విషయాల్లో ఆమెకి ఆమే సాటి" రఘు ఆలోచనలో పడ్డాడు.

"నేను మీ ఇద్దరికీ ఎంతో ఋణపడి ఉన్నా ను. మీ కారణంగా చాలా పెద్ద ఊబిలోంచి బయట పడ్డాను"

"ఆ కేసెట్ మా దగ్గిరుంటే అందులో విశేషాలు నువ్వెలా తెలుసుకోగలిగావు?" అడిగాడు రఘు.

"వనజతో మాట్లాడాక మొత్తం విషయం అర్థమైంది నాకు. ముందుగా ఆ కేసెట్ నాకు చూపించి ఇంట్లో దాచుకున్నాడు హిరణ్యారావు. ఆ తర్వాత అది మిమ్మల్ని చేరింది"

"ఇంతకీ వనజ నిన్నిక్కడకి ఎందుకు పంపింది?"

చిన్న స్లిప్ ఇచ్చింది రాగిణి.

"ఈ చిరునామాలో మీరు వనజను కలుసుకోవాలి. అర్జంటు. రహస్యం..."

అడ్రసు చూసాడు రఘు. "నువ్వూ వస్తావా?"

"రహస్యం అన్నమాట మరచిపోకండి..." హెచ్చరించింది రాగిణి.

"ఓహో, ఐతే నాకు పోలీసు డ్రస్సు కూడా మంచిది కాదు -..." అనుకున్నాడు రఘు.

ఊరి మధ్యలో సందులూ, గొందులూ తిరిగితే వచ్చిందా ఇల్లు. ప్రత్యేకంగా లేదు కాని బాగానే ఉంది.

రెండు మెట్లెక్కితే వరండా. అందులో అడుగు పెడితే వీధి గుమ్మం.

రఘు మెట్లెక్కి తలుపు తట్టాడు. ఆ మాత్రం స్పర్శకే తలుపులు తెరుచుకున్నాయి.

రఘు లోపల అడుగు పెట్టాడు. అతడి వెనుకనే తలుపులు మూసుకున్నాయి.

చటుక్కున వెనక్కి తిరిగాడు రఘు.

"వెనక్కు తిరక్కు - నువ్విక బయటకు వెళ్ళలేవు" గంభీరంగా వినబడిందో స్వరం.

రఘు నివ్వెర పోతూ ముందడుగు వేశాడు.

అదొక పెద్ద హాలు. ఫర్నిచరు లేదు. ఖాళీగా ఉంది. వీధి గుమ్మం కాక హాలుకింకా మూడు గుమ్మాలున్నాయి. తను మోసపోయాననీ రాకూడని చోటికిచ్చాననీ అర్థమైంది రఘుకి. ఇంకా భయం మాత్రం వెయ్యలేదు.

అప్పుడు గుమ్మంలోంచీ వచ్చాడు కండలు తిరిగిన ఆజాను బాహుడొకడు. ఛాతీ ప్రదర్శించడానికా అన్నట్లు అతడు పాంటు మాత్రం వేసుకున్నాడు.

"ఇందాకా నువ్వు విన్న గొంతునాదే" అన్నాడతడు.

"ఎవర్నువ్వు?" అన్నాడు రఘు.

ఆ వ్యక్తి చప్పట్లు కొట్టాడు.

మరో గుమ్మంలోంచి మరో ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. వాళ్ళ చేతుల్లో చెరో కుర్చీ ఉన్నాయి.

"అతిథికి ఆసనం వేయండి" అన్నాడా వ్యక్తి.

రఘు జేబులో చెయ్యి పెట్టాడు.

"నీ జేబులో పిస్తోలుందని తెలుసు. అందులో ఆరు గుళ్ళున్నాయని తెలుసు. ఈ ఇంట్లో ఎన్ని పిస్తోళ్ళున్నాయో చెప్పను. మనుషులు మాత్రం ఇంకా వందమంది ఉన్నారు. ఒక్కరూ చొక్కా వేసుకోలేదు. ఎందుకో తెలుసా - పిస్తోలు గుళ్ళకు భయపడమని తెలియజెప్పడానికి"

రఘు జేబులోంచి ఖాళీ చెయ్యి తీసాడు.

ఓ మనిషి కుర్చీ వేసాడు. రఘు అందులో కూర్చున్నాడు. ఇంకో కుర్చీలో ఆ వ్యక్తి కూర్చున్నాడు.

"ఎవర్నువ్వు?" అన్నాడు రఘు మళ్ళీ.

"హిరణ్యరావు నీకు మరణ శిక్ష వేశాడు. నేనది అమలు జరపడానికొచ్చాను" అన్నాడా వ్యక్తి.

"నాకు మరణశిక్ష ఎందుకు?" అమాయకత్వం నటిస్తూ అడిగాడు రఘు.

"శరణాలయం ఫైలు నీ ఇంట్లో బట్టల మడతల్లో ఉందని మా మనుషులు కనుక్కున్నారు. ఆ ఫైలు పోలీస్ స్టేషనుకి వెళ్ళేలోగా అందులో కాగితాలన్నీ మారిపోతాయి. ఆ మార్పు తెలుసుకుందుకు నువ్వుండవు"

"నాకు మరణ శిక్ష ఎందుకు?"

"ఆ ఫైలు తయారు చేసినందుకు"

"నేనా ఫైలు తయారు చేయలేదు"

"మిస్టర్ రఘూ! ఆ వనజకి డిపార్టుమెంటునుంచి సాయమందుతూంటే నీ మీద మాలో ఎవరికీ రవంత అనుమానం రాలేదంటే నీకు నా హేట్సాఫ్! హిరణ్యారావు తన మేధాశక్తినంతనీ ఉపయోగించి పథకం వేసి నీ ఆరా తీయాల్సొచ్చింది"

రఘు నవ్వి - "నేను నిమిత్తమాత్రుణ్ణి. మీరు నన్నాపగలరు కానీ వనజనాపలేరు" అన్నాడు.

"కావచ్చు. అందుకే చెయ్యగలిగింది ముందు చేస్తాం. ఇక సమయం వృథా చేయకు. కాసేపట్లో ప్రాణాలు పోయే నీకు అన్ని సరదాలూ తీర్చాలని హిరణ్యారావు ఆజ్ఞ కాబట్టి నీకేం తినాలనుందో చెప్పు. వండి పెడతాం ఆడపిల్ల కావాలా తెచ్చిస్తాం. అన్నీ అనుభవించు"

"నా ఆఖరి కోరిక నిజంగా తీర్చగలనంటే - హిరణ్యారావు చావు చూపించు" అన్నాడు రఘు తాపీగా.

"ఓకే" అంటూ చప్పట్లు కొట్టాడా వ్యక్తి. కొందరు అనుచరులు వచ్చారు. క్షణాల మీద అక్కడ బల్ల, టీవీ, డీవీడీ ప్లేయర్ ఏర్పాటు చేయబడ్డాయి. ఓ అనుచరుడు రఘు దగ్గరకొచ్చి అతడి జేబులోని పిస్తోలు తీసుకున్నాడు.

"భయమా?" అన్నాడు రఘు.

"ఉత్త పుణ్యాన చావడం నీకిష్టం. నాక్కాదు" అని, "హిరణ్యారావు చావు చూడ్డం అసాధ్యం కాబట్టి నీ ఆఖరి కోరిక తీర్చలేనుకానీ నీకో ఛాయిస్ ఇవ్వగలను. హిరణ్యారావు చేతిలో చావులెంత భయంకరంగా ఉంటాయో తెలిపే ఆరు శాంపుల్సు ఈ కేసెట్లో ఉన్నాయి. చాలవంటే ఇంకా కాసెట్లున్నాయి. ఎలాంటి చావు కావాలో ఛాయిస్ నీదే ఛాయిస్ వద్దంటావూ - అన్ని పద్ధతులూ కాస్త కాస్త ఉపయోగిస్తాం. అంతా నీ ఇష్టం. ఆలోచించుకో" అన్నాడా అనుచరుడు.

టీవీలో బొమ్మలు కదలసాగాయి.

అది హత్య కాదు. వేట. మనిషిని మనిషి వేట. జంతువు తన ఆహారాన్ని కూడా అంత క్రూరంగా వేటాడదు. నాజీలు కూడా శత్రుసైనికుల్ని అంతలా వేధించి ఉండరు. బహుశా కార్గిల్ సిపాయిలపై పాకిస్తాన్ సైన్యం దురాగతాలకి అదే ఇన్స్పిరేషన్ కావచ్చు....

"స్టాపిట్"... బిగ్గరగా అరిచాడు రఘు.

"గట్టిగా అరవకు. ఈ ఇల్లు సౌండ్ ప్రూఫ్" అన్నాడో వ్యక్తి.

రఘుకి పరిస్థితి అర్థమైంది. అతడికపుడు వెన్నులోంచీ భయం పుట్టుకొచ్చింది.

"మీకేం కావాలో చెప్పండి" అన్నాడు రఘు.

టీవీ ఆగింది.

గుమ్మంలో ఇద్దరు వ్యక్తులు. వారి దగ్గర వీడియో కెమేరాలున్నాయి.

"వనజకి చంపడానికి - లైవ్ లో షూట్ చేయాలి"

"ప్లీజ్ - మీరు నన్ను వేధించకండి. మీరేమడిగినా చెబుతాను. మీకేం కావాలన్నా ఇస్తాను" అన్నాడు రఘు.

"నీ ఆఖరి కోరికలు తీర్చుతాం. కోరుకున్న విధంగా చంపుతాం. తొందరగా నీ మనసులో మాట చెప్పు" అన్నాడో వ్యక్తి.

రఘు మాట్లాడలేదు.

ఆ తర్వాత నుంచి ప్రారంభమైంది వేట.

## 13

**వనజ ధైర్యానికి పెట్టింది** పేరు. నిబ్బరానికి మారుపేరు.

ఇప్పుడామె భోరున ఏడుస్తోంది.

రఘు -

కేవలం వనజకి సాయపడాలని పోలీసు ఇన్‌స్పెక్టరైన రఘు....

వనజ ఆశయాలనే జీవిత లక్ష్యం చేసుకున్న రఘు...

చిత్ర హింసలకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఆ దృశ్యాల్ని హిరణ్యారావు మనుషులు తనకి బలవంతంగా చూపించి మరీ వెళ్ళారు.

హిరణ్యారావు నిస్సందేహంగా క్రూరమృగం. జనారణ్యంలో ఆయన వేట సాగుతోంది. ఆయన్ని వేటాడేవాళ్ళే లేరు. అందుకు తను పూనుకుంటే రఘు తోడు నిలిచాడు. రఘు తోడుతోనే తనకి విజయాలు లభించాయి. ఇప్పుడు హిరణ్యారావు వేటకి రఘు అంతమయ్యాడు.

తనకి తోడులేదు.

ఈ సమాజంలో తను ఒంటరి.

ఒంటరినన్న బాధకంటే - రఘు ఇంకలేడన్న ఆలోచనే ఎక్కువగా బాధపెడుతోంది వనజని.

"ప్లీజ్ - వనజా- నువ్వు ఒంటరివి కాదు. నేనున్నాను నీకు.." అన్నాడు ప్రహ్లాద్ ఆమెని ఓదార్చుతూ.

"నన్ను ఒంటరిని చేసిందే నువ్వు" అంది వనజ కోపంగా

"జరిగిందానికి నేనూ ఎంతో బాధపడుతున్నాను. ఇలా జరుగుతుందని ఊహలో కూడా అనుకోలేదు" "మీ నాన్న క్రూరమృగం. ఆయన మారతాడని నువ్వు నమ్మావు. నేను నిన్ను నమ్మాను. అందువల్లనే ఇదంతా జరిగింది"

ప్రహ్లాద్ ఆమెని ఓదార్చడం కోసం తండ్రిని తిట్టాడు.

"నీ తిట్లు రఘుని బ్రతికిస్తాయా?" అంది వనజ.

ప్రహ్లాద్ కేం చెప్పాలో తోచలేదు.

"మనిషిని చంపడంలో కూడా అంత క్రూరత్వం.." అంది వనజ ఇంకా ఆ దృశ్యాలనే తల్చుకుంటూ. ప్రహ్లాద్ మాట్లాడలేదు.

ఉన్నట్లుండి వనజ పిడికిళ్ళు బిగిసాయి. "నేనూ నీ తండ్రి రక్తం కళ్ళచూస్తాను" అంది కసిగా.

"అందుకు నా సాయం నీకుంటుంది -" అన్నాడు ప్రహ్లాద్ తడుముకోకుండా.

"నా అన్నని చంపినవాడి రక్తం నీలోనూ ప్రవహిస్తోంది. ఆ రక్తం కళ్ళచూడ్డానికి నీ సాయమా?" అంది వనజ నిరసనగా.

"పోనీ నన్ను చంపి నీ కసి తీర్చుకో. ఆ రక్తమేగా నువ్వు కళ్ళచూడాలనుకుంటున్నది"

వనజ ప్రహ్లాద్‌ని ఆశ్చర్యంగా చూసింది, "నువ్వు మంచివాడివి. నీలో ఉన్న రక్తం ఆయనది కాదు. నీ తల్లిది"

ప్రహ్లాద్ వెంటనే ఆమె చెయ్యి పట్టుకుని, "వనజా! ఎంతమంచి మాటన్నావు? నా రక్తం నా తండ్రిది కాదు, నా తల్లిది అని నువ్వంటే నాకెంతో సంతోషంగా ఉంది" అన్నాడు. "నీ గొంతులో నిజాయితీ ధ్వనిస్తోంది - నీకు నిజంగా నీ తండ్రి అంటే అంత ద్వేషమా?" అంది వనజ.

"ఊఁ" అన్నాడు ప్రహ్లాద్.

"నేను నమ్మను -"

"ఎందుకని?"

"నువ్వు పుట్టగానే ఆయన నిన్ను ముద్దులాడేడు. తన వేలు పట్టుకుని నీ చేత తప్పటడుగులు వేయించాడు. ఆయన సాన్నిధ్యంలో, నీడలో పెరిగి ఇంతవాడివయావు. ఎప్పుడైనా ఇల్లు విడిచిపెట్టావా? నీ తండ్రి ముఖం చూడకూడదనుకున్నావా?"

ప్రహ్లాద్ ఆలోచనలో పడ్డాడు.

"నేను చెబుతున్నాను. నీకు నీ తండ్రి అంటే ఇష్టం -"

"నోఁ" - అరిచాడు ప్రహ్లాద్

"కాదనడం సులభం. బాగా ఆలోచించు -"

"నీ ప్రశ్నలకి నా దగ్గిర సరైన సమాధానాలు లేవు. నేను నా పద్ధతిలో జీవిస్తూ నాన్న గురించి పట్టించుకుని మాట నిజం. అయితే ఆయన పద్ధతులు నేను మెచ్చలేదు, అనుసరించలేదు. నీతో స్నేహం అయ్యాక, నీ ప్రభావం నా మీద పడ్డాక నాకు నాన్నంటే ద్వేషం కూడా పుట్టిందని అనుమానం. ఆ అనుమానం నానాటికీ పెరిగి పెద్దదై ఇప్పుడు పరాకాష్ఠ చేరుకుంది. ఆ విషయమై నీకింకా అనుమానముంటే - ఋజువు చేసుకుందుకు నేనేం చేయాలో చెప్పు" అన్నాడు ప్రహ్లాద్.

"చెప్పనా?" అంది వనజ.

"ఊఁ"

"నీ తండ్రిని చంపేయ్ - ఈ రాత్రికే..."

ప్రహ్లాద్ ఉలిక్కిపడ్డాడు.

"చంపగలవా?" అంది వనజ.

ప్రహ్లాద్ మాట్లాడలేదు.

"చంపలేవు-" అంది వనజ.

"చంపగలను" - ఆవేశంగా ప్రతిస్పందించాడు ప్రహ్లాద్.

"అయితే చంపాకనే నాక్కనిపించు -" అంది వనజ.

రాత్రి ఒంటిగంట.

హిరణ్యరావు తన గదిలో మంచం మీద నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

చప్పుడు చెయ్యకుండా ఆ గదిలో అడుగుపెట్టాడు ప్రహ్లాద్.

చల్లగా ఉన్న ఆ గదిలో ఏసీ కూడా చప్పుడు చెయ్యడంలేదు.

ఎందరి గుండెల్లోనో గురగుర శబ్దాలు పుట్టించే హిరణ్యారావు నిద్రలో కూడా నిశ్శబ్దంగా ఉన్నాడు.

ప్రహ్లాద్ తండ్రిని సమీపించాడు. ఆగాడు. జేబులు తడుముకున్నాడు.

కుడివైపు పాంటు జేబులో సైలెన్సరు అమర్చిన పిస్తోలుంది.

ఎడమ వైపు పాంటు జేబులో పదునైన కత్తి ఉంది.

ప్రహ్లాద్ తండ్రినే చూస్తున్నాడు.

ఏం చేయాలి తనిప్పుడు?

ఆయన్ని నిద్రలేపి, "కత్తితో పొడవనా, పిస్తోలుతో కాల్చనా - ఛాయిస్ నీదే అనాలా?"

ప్రహ్లాద్ రెండు జేబుల్లోకీ చేతులు పోనివ్వబోతే - ఉన్నట్లుండి ఆ జేబులు చిన్నవైపోయాయి. వాటిలోకిప్పుడు గుండుసూది కూడా దూరబడలేదు.

జేబుల్లో చెయ్యి పెట్టాలని విఫలయత్నాలు చేస్తున్నాడతడు. అంతలో మంచం మీద హిరణ్యారావు కదిలాడు.

ప్రహ్లాద్ తడబడ్డాడు.

ఆయన ముఖం చూస్తూంటే - ఆయన తనపై కురిపించిన ఆప్యాయతలు గుర్తుకొస్తున్నాయి. ఆముఖం చూస్తూ తను హత్యకు పాల్పడగలడా?

హిరణ్యారావు మంచం మీద అసహనంగా కదిలాడు. అటూ ఇటూ కదిలి దిండు ముఖం మీదకి లాక్కున్నాడు. ప్రహ్లాద్‌కి అప్పుడాయన ముఖం కనబడ్డంలేదు.

"బాబూ - నీ కోర్కెలు తీర్చడమే నా జీవితధ్యేయం. నన్ను చంపడానికి నా ముఖం అడ్డనిపిస్తే దాన్ని కప్పుకున్నాను. ఊఁప్రొసీడ్" అని తండ్రి అంటున్నట్లుగా అతడికి తోచింది.

తలగడ ముఖానికి గట్టిగా అదిమి కాసేపు పట్టుకుంటే ఊపిరాడక చస్తాడు హిరణ్యారావు.

ప్రహ్లాద్ ముందుకి వంగాడు. చేతులు సాచాడు.

అతడి వేలి కొసలు తలగడని తాకాయి. అంతే - షాక్ కొట్టినట్లు వెనక్కి తీసుకున్నాడు చేతుల్ని... ఏమయింది తనకి!

ఆయన పరమ కిరాతకుడే కావచ్చు - కానీ కన్నతండ్రి!

ప్రేమ కోసమే కావచ్చు - ఆయన్ని తను చంపగలడా?

ప్రహ్లాద్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కాళ్ళు వెనక్కు తిరిగాయి.

"ఏడవకు బాబూ" అంది లీల

"అమ్మా - నేను స్వార్థపరుణ్ణి" అన్నాడు ప్రహ్లాద్.

"కాదు" అంది లీల.

"వనజ కోసం - తన ప్రాణాలే త్యాగం చేసాడు రఘు. ఆమె కోసం నేను నా తండ్రి ప్రాణాలు తీయలేకపోయాను" వెక్కి వెక్కి ఏడ్చాడు ప్రహ్లాద్.

"వనజ కోసమే కాదు - నీ కోసం కూడా నువ్వాపని చేయలేవు. నీ తండ్రినే కాదు - నువ్వు ఎవరి ప్రాణాలూ తియ్యలేవు. నీ తండ్రి హంతకుడు కావచ్చు. ఆయన రక్తమే నీలోనూ ప్రవహిస్తూండవచ్చు - అయినా నువ్వు హత్యలు చేయలేవు" అంది లీల.

"నాలో ప్రవహించేది నాన్న రక్తం కాదట. కేవలం నీ రక్తమేనుట. వనజ అంది -" అన్నాడు ప్రహ్లాద్ చటుక్కున ఏడుపునాపి.

"ఆ అమ్మాయి నా గురించి అంత మంచి మాట అందంటే - అది నాకు చాలా పెద్ద సన్మానం. నేను ప్రతిఫలమిచ్చుకోక తప్పదు" అంది లీల.

"అమ్మా - నువ్వు నాన్నని హత్యచేయగలవా?" అన్నాడు ప్రహ్లాద్ అదే వనజకి ప్రతిఫలమన్నట్లు.

లీల నవ్వింది, "వెర్రివాడా! ఈ ఆలోచన నువ్వు చెప్పకుండానే నాకొచ్చింది. ఇప్పుడు కాదు - ఎప్పుడో!" ప్రహ్లాద్ ఆమె వంక ఆశ్చర్యంగా చూసాడు.

"ఈ మట్టిలోనో, ఈ సంప్రదాయంలోనో - ఎక్కడో పెద్దలోపముంది. లేకుంటే నాకు భర్త రూపంలో రాక్షసత్వం ఇన్నేళ్ళు మనగలిగేది కాదు. ఆయన్ను చంపాలంటే నాకు ఒకటా రెండా - ఎన్నో అవకాశాలు" అంది లీల మళ్ళీ. నిజమేననిపించింది ప్రహ్లాద్‌కి.

మంచినీళ్ళు, ఫలరసాలు, కాఫీ, టీ, తినుబండారాలు - వేటిలోనైనా విషం కలపవచ్చు.

"ఎన్నోసార్లు ఆయన్ని చంపాలనిపించింది. ఆయన మీద నాకు ప్రేమన్నది పుట్టనేలేదు. అయినా నా చేతులు నాకు సహకరించలేదు. నా మనసు నాకు ఎదురు తిరిగింది. అప్పుడే నాకు అర్థమయింది. టీవీ సీరియల్సులోలా - హత్యలు అందరూ చేయలేరు"

"అయితే మరి నాన్నకు చావురాదా?"

లీల కొడుకుని జాలిగా చూసింది, "ఈ ప్రపంచమంతా భగవంతుడి లీల. మీనాన్న వంటి వారు కూడా ఆ లీలలో ఒక భాగం. మనిషిలో మంచితనాన్ని సవాలు చేయడానికే వాళ్ళు పుడతారు. మంచిని పలువిధాల హింసించి వినోదిస్తారు. అప్పుడు ప్రపంచంలో మంచితనం విశ్వరూపం ధరించి వాళ్ళనెదిరిస్తుంది. మంచితనపు విశ్వరూపం ప్రపంచం ముందుకి రావాలంటే మీ నాన్నవంటివాళ్ళు కావాలి"

"మరి మనం మంచివాళ్ళం కాదా?"

"మనం మంచివాళ్ళమే కానీ మన బాగు మనం చూసుకుంటూ ఒకరికి చెడు చేయని సామాన్యపు మంచివాళ్ళం. మనమంచికి విశ్వరూపాన్ని ప్రదర్శించగల శక్తి ఉండదు"

"వనజకుంటుందా?"

"ఉంటుందనే నాకు అనిపిస్తోంది. అయితే అందుకింకా సమయం రాలేదని నా అనుమానం -"

"అలాగని ఊరుకోవద్దమ్మా - మన ప్రయత్నం మనం చేద్దాం"

"మనవంటి వాళ్ళవల్ల ఏమీకాదు. అది దైవనిర్ణయం. ఐనా మన ప్రయత్నాలు మనం చేశాం" అంది లీల.

"ఏంచేశాం?"

"నాన్న రాగిణిని హెచ్చరిస్తూ పంపిన కేసెట్ వనజ దగ్గరే ఉంది..."

"ఆ కేసెట్ రఘు వద్దనే ఉంది -" అంది వనజ.

"శరణాలయం ఫైలు రఘు దగ్గిర. కేసెట్ రఘు దగ్గిర. అన్నీ రఘు దగ్గిరుండిపోతే మనమూ రఘు దగ్గిరికే వెళ్ళాలింక" అన్నాడు ప్రహ్లాద్ నిస్పృహగా.

"మనం మనం అంటూ నన్ను నీతో కలపకు. నీక్కావలసింది నేను. సమాజం కాదు" అంది వనజ.

"అది నిజమే - ఐతే సమాజం కోసం నన్నుపయోగించుకోమంటున్నానుగా"

"మిష్టర్ ప్రహ్లాద్" చిరాగ్గా అంది వనజ, "ఈ మాట నువ్వు కాదు. మీ నాన్న అంటున్నాడు. ఆయన ఎప్పుడో చెప్పాడు -నా మీద రౌమాన్సు ప్రయోగిస్తానని. అది నువ్వేనని ఇప్పుడర్థమౌతోంది. నీకు నేను రఘు గురించి సూచించగానే అతడి ప్రాణాలు పోయాయి. అందుకు నిన్ను తప్పు పట్టను. కానీ నువ్వు నాకు దగ్గరౌతున్న కొద్దీ నాకు జరిగే చెడు పెరుగుతోంది. నువ్విక చెయ్యగల ఉపకారమొక్కటే. తిన్నగా మీ నాన్న దగ్గరకెళ్ళు. వనజకి దూరంగా ఉంటాను, వనజనేమీ చేయనని మాటివ్వమను. ఆయన మాటిస్తాడు. నా ప్రాణాలు దక్కుతాయి"

"కానీ నాకు నువ్వు కావాలి"

"నా ప్రాణాలు దక్కితే మీ నాన్నెలాగూ మిగలడు. ఆయన లేకుంటే నీకూ నాకూ అడ్డుండదు. కాబట్టి ఈ విష వలయం నుంచి బయటపడేదాకా నువ్వు నాకు దూరంగా ఉండి - నా ప్రాణాలు రక్షించు" నిరుత్సాహంగా వెనక్కి మళ్ళాడు ప్రహ్లాద్.

రఘు చావుతో వనజకి వెన్నెముక విరిగిపోయిందని హిరణ్యారావుకి తెలుసు. అయినప్పటికీ ఋణశేషం, శత్రు శేషం ఉంచకూడదని ఆయనకి తెలుసు.

అయితే ప్రహ్లాద్‌కి వనజ ప్రాణమని ఆయనకు తెలుసు.

వనజ అదుపు చేయాలి. కానీ ఆమె చావకూడదు. ఇదీ హిరణ్యారావు ఆలోచన. కానీ పరిస్థితులు వనజ చావునే తప్పని సరి చేస్తున్నాయి. ఏ నిర్ణయమూ తీసుకోలేక ఆయన సతమతమవుతున్న తరుణంలో కొత్త ఒప్పందంతో ముందుకొచ్చాడు ప్రహ్లాద్.

ఈ ఒప్పందం హిరణ్యారావుకి సంతోషాన్ని ఇచ్చింది, సవాలుగానూ నిలిచింది.

ప్రహ్లాద్ వనజకు దూరంగా ఉండడం ఎంతో సంతోషించాల్సిన విషయమే. అయితే వనజని బ్రతకనిచ్చి తను బ్రతకడమెలాగో ఆయనకు సవాలయింది.

వనజకి జీవితమంటే ఆసక్తి పోయింది. సమాజం పట్ల విరక్తి కలిగింది.

కానీ రఘు చావుకు ప్రతీకారం తీర్చుకోకుండా - ఎలా?

అలా ఆమె సతమతమవుతున్న తరుణంలో ఒక రోజున ఒక వ్యక్తి వచ్చి ఆమెకు చిన్న ప్యాకెట్ అందించాడు. అందులో వీడియో క్యాసెట్‌తో పాటు ఓ ఉత్తరముంది.

ఉత్తరం కాంతికిరణం సంపాదకుడు శ్యామలరావు వ్రాశాడు.

"అమ్మాయ్ -

నువ్వు నీరసపడిపోకు. సమాజం నీ సేవలకై ఎదురుచూస్తోంది.

ఇంతవరకూ నువ్వు సాధించిన ఆధారాలతో హిరణ్యారావుని గడగడలాడించొచ్చు. రఘు హత్య విషయంలోనూ, శరణాలయం కేసులోనూ ఆయన్ని నిందితుడిగా ఋజువు చేయడం ఏ మాత్రం కష్టం కాదు. ఎటొచ్చీ నువ్వు గుండె నిబ్బరం కోల్పోకూడదు.

నేను లాయర్ భగవంతరావుతో మాట్లాడాను. ఆయన నీకు సాయపడతానని మాటిచ్చాడు. నువ్వాయన్ను కలుసుకో. ఇక హిరణ్యారావుని చట్టానికి అప్పగించాల్సిన సమయం వచ్చింది. అది నీ వల్లే ఔతుంది. నేను నీకీ ఉత్తరం వ్రాసిన విషయం కానీ, క్యాసెట్ పంపిన విషయం కానీ ఎవరికీ చెప్పకు. ఈ క్యాసెట్ నాకు రఘుద్వారా అందింది. ఇందులో ఉన్న చిత్ర, కన్నారావుల కథని అత్యవసర

పరిస్థితిలో తప్ప ఉపయోగించవద్దు. అది మన చివరి అస్త్రం. క్యాసెట్‌ని భగవంతరావు కందిస్తే వ్యవహారమంతా ఆయన నడిపిస్తాడు. ఉత్తరం చదవగానే కాల్చి మసి చేసెయ్.

నీకు జయమవుతుంది. సమాజానికి కల్యాణం జరుగుతుంది.

శుభాకాంక్షలతో - నీ

బాబాయ్''

అది టైపు చేసిన ఉత్తరం.

ఉత్తరం చదవగానే వనజలో ఉత్సాహం పుట్టుకు వచ్చింది.

కోర్టులో కేసు ప్రారంభమైంది.

లాయర్ భగవంతరావు తన వాదనతో హిరణ్యారావుని గడగడలాడించాడు.

హిరణ్యారావు పేరు పేపర్లకెక్కింది. ఆయన శరీరం బోనెక్కింది.

భగవంతరావుది ప్రశ్నల దాడి. దాన్నెదుర్కొందుకు హిరణ్యారావు లాయరు హనుమాన్లు బ్రహ్మాస్త్రంలా వాడిన ఒకే ఒక్క సమాధానం - హిరణ్యారావు అమాయకుడని. ఒకప్పుడు తన పేరుగల పురాణ పురుషుడు కావాలని బ్రహ్మాస్త్రానికి కట్టుబడుండొచ్చు. కానీ నేటి న్యాయమూర్తి కూడా దానికి కట్టుబడతాడనుకోవడం ఆయన అమాయకత్వమని విన్నవారనుకున్నారు. కానీ -

కోర్టులో సాక్ష్యాలూ - ఎగ్జామినేషన్ - క్రాస్ ఎగ్జామినేషన్ - వచ్చేసరికి హిరణ్యారావుకి ప్రతికూలంగా ఉన్న ఒకో సాక్ష్యమే వీగిపోతోంది. హిరణ్యారావు నేరస్తుడనీ, సాక్ష్యాధారాలు బాహాటంగా తలకిందలౌతున్నాయనీ స్పష్టంగా తెలుస్తోంది. చట్టం హిరణ్యారావుకిచ్చిన వరం ప్రకారం చెవులే కానీ కళ్ళుండని కోర్టు ఆయన లాయరు సంధించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడుతున్నట్లే అనిపించింది. ఫలితం శరణాలయం రగడలో హిరణ్యారావుకి క్లీన్ చిట్.

అప్పుడు భగవంతరావు - హిరణ్యారావు రాగిణిని హెచ్చరిస్తూ పంపిన క్యాసెట్ కోర్టులో ప్రవేశపెడితే - అది అందరికీ ఊహించని బాంబ్ షెల్ అయింది!

ఆ రోజుకి కేసు వాయిదా పడింది.

ఆ వార్త ఒక్కటే రాష్ట్రంలో పెద్ద సంచలనాన్ని రేపింది.

ఆ రోజు కోర్టు జనంతో, పత్రికలు - టీవీ ఛానెళ్ళ రిపోర్టర్లతో కిక్కిరిసిపోయింది.

నగరంలోకల్లా పెద్ద తలకాయ, రాష్ట్రంలోని పెద్ద తలకాయలకి తలలో నాలుక - హిరణ్యారావు. ఆయనకి బేడీలు పడితే మీడియాకి ఆ రోజు చారిత్రాత్మకం.

కేసు ప్రారంభమైంది.

బోనులో హిరణ్యారావు - పాలిపోయిన ముఖంతో! కానీ ఆయన నోరు విప్పితే మాత్రం ఇంకా ధిక్కార స్వరమే! ''కుట్ర.. ద్రోహం.. దగా! అంతా నామీద పగబట్టారు. ఇందులో విదేశీహస్తమున్నా నేనాశ్చర్యపోను. ఎందుకంటే భరతమాత ముద్దుబిడ్డని నేను. ఈ దేశ పౌరులంతా నా తోడబుట్టినవాళ్ళు. వాళ్ళకోసం ఏమైనా చేయగలననీ, చేస్తున్నాననీ - ఈ భూమ్మీదే కాదు, అంగారక గ్రహంలో ప్రాణులుంటే వాళ్ళకి కూడా తెలుసు'' హిరణ్యారావు మాటలకి ఎగతాళిగా కోర్టులో నవ్వులు. ఆ నవ్వులకి సమాధానంగా లాయర్

హనుమాన్లు గొంతు కోర్టులో గంభీరంగా ప్రతిధ్వనించింది, "మిస్టర్ జస్టిస్ - నా క్లయింట్ చెప్పేది నిజం. ఆయన సమాజంలో చాలా ఎత్తుకి ఎదిగాడని, చాలామంది అసూయ పడుతున్నారు. తనకంటే, తన కుటుంబంకంటే దేశమే ముఖ్యమని నిస్వార్థబుద్ధితో సమాజసేవ చేస్తున్న నా క్లయింట్ - ఎందరో  స్వార్థపరులకీ, అవినీతిపరులకీ, దేశద్రోహులకీ - కంటకప్రాయం కావడం సహజం. అందుకే ఆయన మీద ఎన్నో కట్టుకథలు. ఆయన్ని కించపర్చడానికి ఎన్నో పథకాలు. ఆయనపై బురద చల్లడానికి భారీ ప్రయత్నాలు. ఐతే దుష్ట శిక్షణకీ, శిష్టరక్షణకీ ఆ భగవంతుడు ఏదో ఏర్పాటు చేస్తూనే ఉంటాడు. సరైన సమయంలో ఆ ఏర్పాట్లు తెలుసుకోగలగడం నా అదృష్టం" అని ఆగి, "ఇప్పుడు నేను కొందరు సాక్షుల్ని ప్రవేశపెట్టడానికి అనుమతించవలసిందిగా గౌరవనీయులైన న్యాయమూర్తిని కోరుతున్నాను -"

న్యాయమూర్తి అనుమతించాక, "మొదటి సాక్షి - చిత్ర.." అన్నాడు హనుమాన్లు.

కోర్టు నివ్వెరపోయింది. చిత్ర అంటే - చనిపోయిన చిత్ర!

"రెండవ సాక్షి - కన్నారావు..."

వనజ షాకయ్యింది. ప్రహ్లాద్ షాకయ్యాడు. లీల షాకయ్యింది. ప్రేక్షకులు షాకయ్యారు.

లాయరు హనుమాన్లు ముఖంలో విజయ గర్వం. కానీ హిరణ్యారావు మాత్రం ఇంకా దిగులుగానే ఉన్నాడు.

హనుమాన్లు కథ చెబుతున్నాడు. సాక్షులు సహకరిస్తున్నారు.

చిత్ర కన్నారావు పరస్పరం ప్రేమించుకున్నారు. ఇరుపక్షాల పెద్దలూ వాళ్ళ ప్రేమని కొట్టిపారేసారు. దాంతో ప్రేమికులరోజున జంటగా ఎగిరిపోయారు. ఆత్మహత్య చేసుకుంటామని ఉత్తరాలు వ్రాసి ఇంట్లో పెట్టి వెళ్ళడంతో - పెద్దలు వాళ్ళు చనిపోయారనే అనుకున్నారు.

"వనజ కూడా అలాగే అనుకుంది. జర్నలిజం వెర్రితలలేస్తున్న ఈ రోజుల్లో ఇంకా లేతవయసు దాటని వనజ కీర్తికాంక్షతో అడ్డదార్లు తొక్కడంలో ఆశ్చర్యంలేదు. నా క్లయింట్ సమాజంలో చాలా పెద్ద హోదాలో ఉన్నాడు కాబట్టి ఆమె ఆయన్నే లక్ష్యంగా పెట్టుకుని ఎన్నో ఆరోపణలు చేసింది. దేవుడి సృష్టిలో న్యాయానికి లభించే అపజయమెప్పుడూ తాత్కాలికమే కాబట్టి - అమాయకుడైన నా క్లయింట్ ఆమె చేసిన ప్రతి ఆరోపణనుంచీ క్రమంగా బయటపడుతూ వచ్చాడు. ఇలా జరగొచ్చని ముందే ఊహించిన వనజ - తన జర్నలిస్టు బుర్రనుపయోగించింది. దానికి ఆధునిక పరికరాలు సహకరించగా - చిత్ర, కన్నారావుల ఇతివృత్తానికి స్వంతంగా స్క్రీన్‌ప్లే తయారు చేసింది. ఓ వీడియో సినిమా తీసి - అది నమ్మరని నాకు తెలుసు. నా క్లయింటే కాదు - పరమ  మూర్ఖుడు కూడా తనమీద అలాంటి కేసెట్ తయారుచేసి ఉంచుకోడు. ఐనా కూడా వనజ తెలివి అభినందనీయం. అదృష్టవశాత్తూ చిత్ర, కన్నారావులు కాకతాళీయంగా సరైన సమయానికి ఈ ఊరొచ్చారు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే నా క్లయింట్ అన్యాయంగా కటకటాల వెనక్కి వెళ్ళిపోయేవాడే దేవుడున్నాడనడానికీ, నా క్లయింటుని ఆయన కాపాడుతున్నాడనడానికీ ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? జర్నలిజాన్ని ప్రజాసేవకుపయోగించాల్సిందిపోయి - బ్లాక్ మెయిలింగుకి సాధనంగానో, శత్రువులపై ఆయుధంగానో ప్రయోగించాలనుకుంది వనజ. ఇలాంటివారిని ఉపేక్షిస్తే సమాజం అల్లకల్లోలమైపోతుంది. కాబట్టి అలాంటివారికి జీవితకాలం హెచ్చరికగా ఉండేలా కోర్టు వనజకి తగిన శిక్ష విధించాలని మనవి చేసుకుంటున్నాను"

అదీ హనుమాన్లు వాదన సారాంశం. అది విన్న కోర్టులో ఒక్కసారిగా శ్మశాన నిశ్శబ్దం.

అంతవరకూ దోషి హిరణ్యారావు. అప్పుడు దోషి వనజ

లాయర్ భగవంతరావు అవాక్కైపోయాడు.

కోర్టులో ఏం జరిగిందో ఎలా జరిగిందో అందరికీ కలలా ఉంది. కొందరు దీర్ఘాలోచనలో పడితే కొందరు తగిలిన షాకునుంచి తేరుకునే ప్రయత్నంలో ఉన్నారు.

న్యాయమూర్తి తీర్పు చెప్పేలోగా - తనేదో చెప్పాలన్నట్లు హిరణ్యారావు హనుమాన్లుకి చెప్పాడు. హనుమాన్లు కోర్టుకి మనవి చేసుకోగా - న్యాయమూర్తి అనుమతితో హిరణ్యారావు బోనెక్కాడు.

బోనెక్కిన హిరణ్యారావు ముందు జడ్జికి నమస్కరించాడు. తర్వాత ప్రేక్షకులకి చేతులు జోడించాడు.

"ముద్దాయిగా ఇక్కడికొచ్చాను. కర్తవ్యం తప్ప మరొకటి తెలియని నేను కర్తవ్య విమూఢుణ్ణై కొన్నాళ్ళు గడిపాను. ఈ కొన్నాళ్ళలోనూ వనజ వ్యక్తిత్వం నన్నాకర్షించింది. ఇంత చిన్నవయసులో ఆ తెలివి, కార్యదీక్ష, పట్టుదల నన్నెంతగా ప్రభావితం చేశాయంటే నాకే కేసు ఓడిపోవాలనికూడా అనిపించింది. లాయరుగారికి చెప్పాను - 'అయ్యా, నా తరం అయిపోవస్తోంది - ఆ అమ్మాయికెంతో భవిష్యత్తుంది - సమాజాన్నిక్కావలసింది అటువంటివాడే'నని లాయరుగారు నన్ను మందలించారు. వనజ తప్పు చేసిందనీ ఆ తప్పుకి శిక్ష అనుభవించక పోతే యువతరం తప్పుదారి పడుతుందనీ ఆయన హెచ్చరించడంతో నేను వాస్తవానికొచ్చాను. ఈ సమాజం భవిష్యత్తంతా యువతరం మీదే ఆధారపడి ఉంది. యువతరం తప్పుదారి పడితే నేను భరించలేను. ఇప్పుడు కోర్టువారి నిర్ణయమేదైనా నాకు శిరోధార్యమే. వారు నన్ను దోషిగా నిర్ణయిస్తే, అదే సరైన నిర్ణయమని నమ్ముతాను. అప్పుడు వనజ యువతరానికి దీటైన నాయకి అవుతుంది. ఒకవేళ కోర్టువారు నన్ను నిర్దోషిగా భావిస్తే వనజకి ఏ విధమైన శిక్షా విధించొద్దని వేడుకుంటున్నాను. మహాత్మాగాంధీ అంతటివాడు చిన్నతనంలో చిన్న చిన్న తప్పులు చేశాడు. ఆ తప్పుల నాయన సరైన సమయంలో సవరించుకుని మహాత్ముడయ్యాడు. వనజకి తన తప్పు సవరించుకునే అవకాశమివ్వాలి. ఆమె తన శక్తి సామర్థ్యాలను నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలి. అలాచేస్తే సమాజానికి నాకంటే ఆమే ఎక్కువగా ఉపయోగపడుతుందని నాకు తెలుసు. నా నమ్మకాన్ని కాలమే ఋజువు చేస్తుంది. నాకామెపై కోపం లేదు. పగలేదు. నేనామెపై ఏవిషమైన కేసూ పెట్టను. కోర్టువారామెను మన్నించి విడిచిపెడితే నాకంటే సంతోషించేవాడుండడు"

వనజ రక్తం మరిగింది. ఉద్రేకం పొంగింది. అప్పటికప్పుడు అక్కడికక్కడ ఆమె ఏదో ఒకటి చేసేదేమోకానీ - అసహాయత, వివేకం పనిచేయగా అతి కష్టం మీద ఆమె ఆవేశం అణిగింది.

కోర్టు హిరణ్యారావుని నిర్దోషిగా నిర్ణయించింది. వనజని తీవ్రంగా మందలించి విడిచిపెట్టింది.

## 14

**"చెల్లాయ్ నీకు నేనున్నాను కదమ్మా..." రఘు మాటలు వనజ చెవుల్లో గింగురు.**

"నీకోసం - నేను నీకోసం ఇన్స్పెక్టరునయ్యానమ్మా" వనజ మెదడులో అనుభూతులు.

"హిరణ్యారావు అంతం చూసాక మనం ఒకేచోట కలిసుందాం" రఘు ఆశించిన ఆ భవిష్యత్తిప్పుడు శూన్యం.

"వనజని మన్నించమని కోర్టువారిని కోరుతున్నాను" హిరణ్యారావు గొంతప్పుడు శూలం.

"అన్నయ్యా - నేనేం చేయను, ఏం చేయగలను? పూర్తిగా అసహాయురాలిని" అనుకుంది వనజ.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగి సుడిగుండాలయ్యాయి. ఆమె గుండెలో కలకలం రేగి తుఫానుగా మారింది.

మనోబలాన్ని దింపుకుందుకు భోరున ఏడ్చిందామె.

అలాటి సమయంలో బల్లమీద ఫోను మ్రోగింది.

వనజ ఫోను తీయలేదు. ఫోను మోగడం ఆగలేదు. చివరికామె ఫోను తీస్తే అవతల శ్యామలరావు గొంతు.

వనజకి దుఃఖం మళ్ళీ పొంగుకొచ్చింది. భోరుమందామె.

"నువ్వేం మాట్లాడకమ్మా - నేనే నీ దగ్గరకొస్తున్నాను" అన్నాడాయన.

●●●

శ్యామలరావు వనజల సంభాషణలో - మరిన్ని ఆశ్చర్యకరమైన విశేషాలు బయటపడ్డాయి.

హిరణ్యావు దూరదృష్టి గొప్పది. చిత్ర, కన్నారావుల ప్రేమకథ, రాగిణికి హెచ్చరిక - ఆయన కల్పించిన వీడియో చిత్రం. తెలిసో తెలియకో ఆ కల్పనకి లీల, ప్రహ్లాద్‌లు సహకరించారు. చిత్ర, కన్నారావుల కుటుంబాలు ఈ కథ క్లైమాక్సుకి ఉపయోగపడ్డాయి.

ఆ వీడియోని వనజని తప్పుదారి పట్టించాలనే తయారు చేసాడాయన. దాన్ని శ్యామలరావు పంపినట్లుగా వనజకి పంపాడు. శ్యామలరావు చెప్పినట్లు - తనకి తెలిసిన లాయరు భగవంతరావు పేరునామెకి సూచించాడు. శ్యామలరావు తనని సంప్రదించొద్దన్నట్లు ఉత్తరం వ్రాసాడు. అన్నీ హిరణ్యారావే చేసి శ్యామలరావు రంగు పులిమాడు.

వనజ హిరణ్యారావు వలలో పడింది. ఆయన ఆమెని చావు దెబ్బ తీశాడు.

"బాబాయ్ - ప్రజాస్వామ్యం, చట్టం, పోలీసులు, సమాజం - అన్నీ ప్రజలకి తాము తీసుకున్న గోతులే ఔతున్నాయి. నాకిప్పుడు మంచితనం మీద నమ్మకం పోయింది. ఈ పరిస్థితుల్లో నేను చట్టాన్ని అనుసరించి చేయగలిగిందేం లేదు. హిరణ్యారావుని చంపేస్తాను" అంది వనజ కసిగా.

"అందువల్ల సమాజానికి ఒరిగిందేమిటి?"

"సమాజంతో నాకు పనిలేదు. ఆలోచిస్తే నాకు రఘు పద్దతే సరైనదనిపిస్తోంది. తను సమాజం కోసం కాక నాకోసం ఆలోచించాడు. ప్రాణాలు కోల్పోయాడు. నేనూ అదే చేస్తాను. అన్నయ్యకోసం హిరణ్యారావుని చంపేస్తాను. అన్నయ్య ఆత్మకి శాంతినిస్తాను"

"తనకోసం నువ్వు జైలు పాలైతే అన్నయ్య ఆత్మ శాంతించదు. నువ్వు నీ ఆశయం సాధించాలి. చనిపోయిన రఘుని తాత్కాలికంగా మర్చిపో. బ్రతికుండి నీకోసమే తన జీవితమంటున్న ప్రహ్లాద్‌ని ఆదరించు.."

"ప్లీజ్ - ఆ ప్రహ్లాద్ పేరు నా ముందు పలకొద్దు. అన్నయ్య చావుకి అతడే కారణం. నిస్సందేహంగా అతడు హిరణ్యారావు మనిషి" ఆవేశపడింది వనజ.

"ప్రజలు తాము తీసుకున్న గోతిలో తామే పడుతున్నారన్నావ్. నువ్వు ప్రహ్లాద్‌ని పెళ్ళి చేసుకుంటే ఆయన వేలితో ఆయన కన్నే పొడవచ్చు"

వనజ తల అడ్డంగా ఊపి, "ప్రహ్లాద్‌కి అనుకూలంగా ఏమాలోచన చేసినా అది ఆత్మవంచన" అంది.

"అయితే ఇక మిగిలిందొకటే దారి - హిరణ్యారావు సలహా పాటించు" అన్నాడు శ్యామలరావు.

"బాబాయ్-" అంది వనజ. ఆవేశంతో ఆమె పిడికిళ్ళు బిగిశాయి.

"ఆయన నరరూప రాక్షసుడు. జనారణ్యంలో మృగరాజుగా చెలామణీ అవుతున్నాడు కానీ నిజానికాయనో నక్క. అసలు సిసలు మృగరాజు ముందాయన క్షణం కూడా నిలవలేడు. ఆడదానివి. సున్నిత మనస్కురాలివి. ఎంత ప్రయత్నించినా నువ్వు మృగరాజువి కాలేవు. ఎందుకంటే ఏ ప్రజల కోసం నువ్వు జీవితాన్ని పణంగా పెట్టాలనుకుంటున్నావో ఆ ప్రజలు నక్కల్ని మృగరాజు చేసేటంత దౌర్భాగ్యులు. వాళ్ళకి ఆయనే తగిన నాయకుడు. ప్రజలతో పాటు నువ్వూ ఆయన మాట వినక తప్పదు"

"అంటే అవినీతిని సమర్ధించాలి. దౌర్జన్యానికి సహకరించాలి. ఔనా?" "నా మాటలు పూర్తిగా విను. ఉదాహరణకి కాంతి కిరణం తీసుకో. ఎన్నో ఏళ్ళుగా నేనీ పత్రికనెలా నడుపుతున్నానో ఆలోచించావా?" ఆగాడు శ్యామలరావు.

వనజ బదులివ్వలేదు. ఆయన చెబుతుంటే ఆకళింపు చేసుకుంటోంది.

సమాజంలో జరిగే అన్యాయాలను యథాతథంగా బయటపెట్టే పత్రిక ఏదీ కలకాలం మనలేదు. కానీ కాంతికిరణం మనగలిగింది. అందుక్కారణం - మానవ మనస్తత్వాలను కాచి వడబోసిన ఎడిటర్ శ్యామలరావు.

ఈ ప్రపంచంలో మంచివాళ్ళంతా ఒక్కటికాగలరు కానీ చెడ్డవాళ్ళు చేతులు కలపలేరు. సమాజ శ్రేయస్సుకోసం దేవుడు దుష్టులకా లక్షణాన్నిచ్చాడు.

హిరణ్యరావుకి వ్యతిరేకంగా వ్రాస్తే హిరణ్యరావుకి కోపం రావచ్చు. కానీ ఆయన ప్రత్యర్థులు శ్యామలరావుకి బాసటగా ఉంటారు. హిరణ్యరావు ప్రత్యర్థులని నిరసిస్తే అప్పుడు హిరణ్యరావు ఆయనకి బాసట.

ప్రత్యర్థులు, హిరణ్యరావు ఒక్కటి కారు. ఒక్కటై శ్యామలరావును ముట్టడించరు. ఎందుకంటే వారి వారి పెరుగుదలని శ్యామలరావు అదుపు చేస్తూంటాడు.

మొత్తం సమాజంలోని కల్మషాన్నంతా శ్యామలరావూ ఏరిపారేయాలనుకోవడంలేదు. ఆయనది అంచెలంచెల కార్యక్రమం. ఉత్తమ లక్ష్యసాధనకి సహనంతో బాటు మనస్తత్వం కూడా ముఖ్యం.

ఒకప్పుడు బీజేపీని పడగొట్టాలనే ములాయం సోనియాతో కలిసాడు. బీజేపీ పడిపోయాక ఎవరిదారి వారిది. ఇప్పుడు కూడా యూపీఏకి చుక్కెదురుగా ఉండే ములాయనం - అవసానదశలో తనే యూపీఏకి ఊపిరిపోసాడు. మంచికైనా, చెడ్డకైనా సర్దుబాట్లు ఎంతో అవసరం.

సమాజ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నవారికి మనుగడ ఎంతో కష్టమూ, ముఖ్యమూ కూడా. మనుగడ సర్దుబాట్లవల్లే వస్తుంది.

పన్నెండేళ్ళ వయసులోనే వనజలో టాప్ క్లాస్ జర్నలిస్టు లక్షణాలున్నాయి. తన వ్యాసాలనామె రఘు పేరుతో ఇవ్వడం సర్దుబాటు. అందువల్లనే ఈనాడామె సమాజానికింత చేయగలిగింది.

వనజ విజయాలకు అజ్ఞాతంగా సహకరించడం రఘు చేసుకున్న సర్దుబాటు.

శ్యామలరావు మాటలు దేనికి దారితీస్తున్నాయో అర్థమైన వనజ, "హిరణ్యరావు సలహాలు పాటించి నేను నా మనసుకు సర్దిచెప్పుకోలేను" అంది.

శ్యామలరావు నవ్వి, "ముందు నీకు హిరణ్యరావిచ్చిన సలహా ఏమిటో గుర్తు చేసుకో" అన్నాడు.

"ఆయన సలహాల్ని నేనెప్పుడూ గుర్తుంచుకోను"

"పోనీ - నేను గుర్తుచేస్తాను. విను" అంటూ ఆయన జేబులోంచి ఓ కాగితం తీసి చదివాడు.

"వనజ వ్యక్తిత్వం నన్నాకర్షించింది. అంత చిన్నవయసులో ఆ తెలివి, కార్యదీక్ష, పట్టుదల నన్నెంతో ప్రభావితుణ్ణి చేసాయి. ఆ అమ్మాయికెంతో భవిష్యత్తుంది. సమాజానిక్కావలసింది అటువంటివారే. ఆమె తన శక్తి సామర్థ్యాలను నిర్మాణాత్మక కార్యకలాపాలకు వినియోగిస్తే - సమాజానికి నాకంటే ఆమే ఎక్కువగా ఉపయోగపడుతుంది"

హిరణ్యరావు కోర్టువారికి చెప్పుకున్న మాటల్లోంచి శ్యామలరావు ఏరిన ఆ వాక్యాలు విని వనజ తెల్లబోయింది, "అయాం సారీ బాబాయ్ - నీ మాటల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. ఈ మాటలు వినడానికి బాగున్నా చెప్పడంలో ఆయన ఉద్దేశ్యంతో మనకేం పని? మనకి మాటే ముఖ్యం"

"ఐతే ఆయన మాటల్ని నేనెప్పుడో అనుసరించాను. ఫలితంగా నా అన్నయ్య చిత్రవధకు గురయ్యాడు. నేను కోర్టులో దోషినయ్యాను"

"కాసేపు నువ్వు హిరణ్యరావు గురించీ ఈ జనారణ్యం గురించీ మరిచిపో. ఇంకా ఇక్కడే ఉంటే ప్రతీకార జ్వాలలు నిన్ను నాశనం వైపు నడిపిస్తాయి. సుహృద్భావంతో నిర్మాణాత్మక కార్యక్రమాల గురించి ఆలోచించు. నాగరికత ముసుగులో ఉన్న మాయదారి

అనాగరికుల్ని విడిచిపెట్టి, నాగరికతకి దూరంగా ఉంటున్న అమాయకపు అనాగరికుల మధ్యకి వెళ్ళు. వాళ్ళకి సాయిపడు. ప్రమాదాలకు భయపడని నీవల్ల ప్రమాదకరమైన అనాగరికులు - అవసరమైన మేరకి మాత్రమే నాగరికులైతే నీ జన్మ సార్థకమౌతుంది" అన్నాడు శ్యామలరావు.

"మీ ఆజ్ఞ నాకు శిరోధార్యం. కానీ మీ ఆజ్ఞేమిటో నాకు తెలియలేదు" అంది వనజ.

"అటువా ద్వీపం తెలుసుకదా నీకు" అన్నాడు శ్యామలరావు.

"ఊఁ అక్కడ అటువా తెగ ఆటవికులున్నారు" అంది వనజ.

"అక్కడికెళ్ళడానికి నీకు ఎయిర్ టికెట్ బుక్ చేసాను. కాదనవని నాకు తెలుసు" అన్నాడు శ్యామలరావు.

●●●

అటువా ద్వీపం. నిండా అడవులతో ప్రకృతి సౌందర్యానికి మారురూపం. అటువాలనబడే ఆటవికుల నిలయం. అటువాలకి భాష ఉంది. లిపిలేదు. వినడానికి మృగభాషలా ఉన్నా శ్రద్ధగా వింటే మృతభాష (సంస్కృతం) అనిపించడానికి కారణం - ఏనాటి ఋషుల సంపర్కమో మరి!

అటువా ద్వీపానికి యాత్రికుల జోరు ఎక్కువే. వారికోసమని అటువాలో కొన్ని ప్రాంతాల పాశ్చాత్య దేశాల్ని మరిపించేంత ప్రత్యేక సదుపాయాలు ఉంటాయి.

నాగరికతకు ఆమడ దూరంలో ఉండే అటువాలని సంస్కరించాలని కొందరు సంఘసేవకులూ, మతప్రవక్తలూ ప్రయత్నించి - కొంతవరకూ ఆకర్షించారు కూడా. అలా అటువాలలో కొందరికి కొంత ఆంగ్ల భాషాపరిజ్ఞానం ఏర్పడింది. కొన్ని నాగరిక భాషలు కూడా అంతో ఇంతో పరిచయమయ్యాయి.

నాగరికులంతా ఒక్కరకంగా ఉండరు కదా. సంస్కరణ ముసుగులో కొందరు నాగరికులు అటువాల పట్ల అనాగరికంగా ప్రవర్తించారు. అది భరించలేని అటువాలు నాగరికుల పట్ల ద్వేషం పెంచుకున్నారు. నాగరికులకీ, అటులకీ గొడవలై - హత్యలక్కూడా దారితీసాయి.

పరిస్థితి అదుపుదాటుతున్న సమయంలో కొందరు మంచివాళ్ళు జోక్యం చేసుకుని అటువాలని శాంతపరిచారు. ఐతే అటువాలు నాగరికుల జోక్యాన్ని తీవ్రంగా నిరసించారు. ఫలితంగా అటువాలకూ, నాగరికులకీ మధ్య అడవుల్ని చుశుతూ అటువా రేఖ వెలిసింది. అటువాలా రేఖ దాటి ఇటు రారు. నాగరికులారేఖ దాటి అటువెళ్ళరు. వెళ్ళారా ప్రాణాలతో బయటపడరు.

నాగరికులు అటువాలని కలవాలన్నా, మాట్లాడాలన్నా - రేఖ కిటునుంచి సంప్రదింపులు జరపాలి.

అటువా రేఖకి దగ్గరలో ఓ గెస్టుహౌస్ ఉంది. కొందరు సంఘసేవకుల కృషి ఫలితంగా వెలసిన ఆ గెస్టుసులో అత్యాధిక సదుపాయాలన్నీ ఉన్నాయి. ఆ గెస్టు హౌసుకి డేవిడ్, మార్గరేట్ అనే వృద్ధ దంపతులు సంరక్షకులు. వారి జీతభత్యాలనూ, గెస్టు హౌసు వ్యయాలనూ కొన్ని విదేశీ సంస్థలు భరిస్తున్నాయి. గెస్టు హౌసు కాక ఆ చుట్టుపక్కల యాత్రికుల సౌకర్యార్థం కొన్ని కాటేజిలున్నాయి. వాటి అజమాయిషీ కూడా డేవిడ్, మార్గరేట్‌లదే వారికి సహకారంగా కొందరు పనివాళ్ళున్నారు.

అటువా రేఖ ఏర్పడ్డాక దీవికి వచ్చే యాత్రికుల సంఖ్య బాగా తగ్గిపోయింది. గెస్టు హౌసుకి వచ్చేవారి సంఖ్య మరీ తగ్గిపోయింది.

అలాంటి సందర్భంలో వనజ అనే అమ్మాయి కొంతకాలం పాటు దీవిలో గడపడానికి వస్తున్నదన్న సమాచారాన్ని అందుకున్నాడు డేవిడ్ అతడది భార్యకు చెప్పగా ఆమె ఎంతో ఆనందపడింది.

●●●

"వనజ అంటే పెద్దావిడనుకున్నాను నువ్వు మరీ చిన్నపిల్లవి" అంది మార్గరేట్ గెస్టు హౌసులో అడుగుపెట్టిన వనజని ఆప్యాయంగా పలకరిస్తూ.

"ఈ దీవిలో ఇంత స్పష్టమైన తెలుగుమాట వింటాననుకోలేదు. అదీ మార్గరేట్ పేరు విన్నాక" అంది వనజ.

మార్గరేట్ నవ్వి, "తెలుగు మాటేకాదు - వంట కూడా రుచి చూద్దువుగాని. గుత్తివంకాయ కూర కావాలో, వెల్లుల్లిపాయతో కందిపచ్చడి కావాలో చెప్పు" అంది.

మార్గరేట్ తెలుగమ్మాయే కానీ డేవిడ్ గుజరాతీవాడు రెండు పదుల వయసులో ఏదో హోటల్లో వంటవాడిగా ఆంధ్రాకి వచ్చి క్రమంగా అక్కడే స్థిరపడిపోయాడు. మార్గరేట్‌తో పెళ్ళయ్యాక తనూ తెలుగువాడైపోయాడు. ఆ దంపతుల గురించి వివరాలు తెలుసుకునేందుకు వనజకి రెండు రోజులు పట్టింది. ఎందుకంటే ఆమెలో పూర్వపు చలాకీతనం లేదు.

ఏం చేద్దామన్నా అన్యమనస్కంగా ఉంటోంది. ఎంత తెచ్చుకుందామన్నా ఉత్సాహం పుట్టడం లేదు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడాలనిపించదు. ప్రకృతి దృశ్యాలు కూడా చూడ బుద్ధికాదు.

నిద్రలేవడం. కాలకృత్యాలు. ఫలహారం. కాసేపు పుస్తకాలు. కాసేపు టీవీ. కాసేపు సంగీతం. భోజనం. మధ్యాహ్నం కాసేపు నిద్ర. మళ్ళీ పుస్తకాలు, సంగీతం, టీవీ, భోజనం. నిద్ర.

వనజ ముభావంగా ఉంటోందని తెలిసి కూడా మార్గరేట్ చొరవగా మాటలు కలిపేది. అప్పుడు వనజ తన గురించి చెప్పేది కాదు. మార్గరేట్ గురించి అడిగి తెలుసుకునేది.

మార్గరేట్‌కి కూడా తన గురించి చెప్పుకోవాలనుంది. అంత డిప్రెషన్‌లో వనజ ఆ ఉబలాటాన్ని గుర్తించింది. అంతేకాదు - ఆ వివరాలు తనని డిప్రెషన్‌కి దూరం చేస్తున్నాయని కూడా ఆమె గ్రహించింది.

మార్గరేట్ తలిదండ్రులకి - గుజరాతీని పెళ్ళిచేసుకుందని ఆమెపై కోపం. అత్తమామల్ని మెప్పించాలని డేవిడ్ ఎంతో కష్టపడి తెలుగు నేర్చుకున్నాడు. ఎదుటివారు నవ్వుతున్నారని తెలిసినా - అతడు తెలుగు తప్ప మరో భాష మాట్లాడేవాడు కాదు.

డేవిడ్ కష్టపడి పనిచేస్తాడు. డబ్బు బాగా సంపాదించేవాడు. అత్తమామల్ని ఆకట్టుకోవాలని వారికి కొంత డబ్బిచ్చేవాడు. వాళ్ళు మనసులో సంతోషించినా మెహర్బానీ చూపించేవారు. ఐతే క్రమంగా వాళ్ళతడి అలవాటు పడ్డారు.

ఆ ఊళ్ళో నరసింహులు అనే పెద్ద మనిషికి ఉత్తరాది వాళ్ళతో వ్యాపార సంబంధాలున్నాయి. డేవిడ్ గుజరాతీవాడని ఆయన అతణ్ణి దుబాసీగానే కాక వ్యవహారానికి ఉపయోగించుకునేవాడు. ఆయన డీల్స్ సక్రమంగా లేక పోవడంతో డేవిడ్ - తనకి అక్రమం, అవినీతి గిట్టవని చెప్పి - ఆయనకి దూరంగా ఉండసాగాడు. ఐతే డేవిడ్ అత్త మామల్ని కాదనలేడని కనిపెట్టిన నరసింహులు అటినుంచి నరుక్కురావడం మొదలెట్టాడు.

డేవిడ్ మీద అత్తమామల ఒత్తిడి పెరిగింది. ఏం చేయాలో తెలియక భార్యని సలహా అడిగాడు.

మార్గరేట్ తలిదండ్రుల చాటు బిడ్డ. వయసులో త్వరపడి నిర్ణయం తీసుకుని డేవిడ్‌ని పెళ్ళాడింది. అప్పట్నించీ అతడి నీడలో ఉండాలనుకుంది. అంతే తప్ప అతడికి సలహాలిచ్చే స్థితిలో లేదామె.

"నీకేది మంచి అనిపిస్తే అది చేయి" అందామె.

అయిష్టంగానే డేవిడ్ కొన్ని అవినీతి పనులకు పాల్పడ్డాడు. ఫలం అత్తమామలకి ధారపోస్తుంటే వాళ్ళది రుచిమరిగారు. కాస్త డబ్బు చేరగానే మార్గరేట్ తండ్రి ఊళ్ళో హోటలు పెట్టాడు. గల్లా పెట్టె మామది, కాయకష్టం అల్లుడిది.

రోజులు సాఫీగా వెళ్ళిపోవాల్సిందే కానీ ధనలోభం మహా చెడ్డది.

ఆ హోటలు అవినీతికి కేంద్రమైంది. అక్కడ సమాజ వ్యతిరేకులు సమావేశమయ్యేవి. అలాగే హోటలు పెద్దదై మార్గరేట్ తలిదండ్రులు ఓ వెలుగు వెలుతున్నారు.

ఏ అధికారికి మామూళ్ళందలేదో కానీ ఒకసారి ఆ హోటలుమీద రెయిడింగు జరిగింది. ఆరింట నాలుగు లాడ్జింగ్ గదుల్లో వ్యభిచారం రెడ్ హాండెడ్‌గా పట్టుబడింది.

డేవిడ్ నేరాన్ని తన మీదేసుకుని జైలుకెళ్ళాడు.

అప్పటికి మార్గరెట్‌కి ఇద్దరు పిల్లలు. స్మిత్ అనే బంధువామెని పెళ్ళాడ్డానికి సిద్ధంగా ఉన్నాడు.

"డేవిడ్‌కి చదువు లేదు. కలలు లేవు. జీవితాంతం వంటవాడిగానే మిగిలిపోతాడు. స్మిత్‌ని పెళ్ళిచేసుకో. సమాజంలో నీ హోదా ఇంకా ఇంకా పెరిగిపోతుంది" అని తలిదండ్రులామెకి హితువు చెప్పారు.

మార్గరేట్ వినలేదు. తలిదండ్రులు సతాయిస్తుంటే భరించలేక - ఇల్లొదిలిందామె.

మార్గరేట్ కళ్ళు వంటిచుట్టూ తిరిగేవి.

మార్గరేట్ ట్యూషన్లు చెప్పింది. పద్దులు రాసింది. అంట్లు తోమింది. బట్టలుతికింది. ఎక్కడ చూసినా మగాడి వేట. తను చేసే పనులకంటే ఆ వేటనుంచి తప్పించుకోవడమే ఆమెకి ఎక్కువ శ్రమ అనిపించేది.

ఆమె శ్రమకంటే వేటకే ప్రాధాన్యమిచ్చింది సమాజం. అది అవకాశంగా తీసుకుని తలిదండ్రులే ఆమెపై అపవాదులు వేశారు.

"వాళ్ళతో వీళ్ళతో తిరిగే బదులు స్మిత్‌ని పెళ్ళిచేసుకో. దర్జాగా బ్రతుకు" అన్నది వాళ్ళ హితువు. వినకపోతే, "వంటవాణ్ణి పెళ్ళాడవు. లేకి బుద్ధులు వంటబట్టాయి" అని ఎద్దేవా.

అపవాదులు భర్తని చేరతాయేమోనని మార్గరేట్ భయపడింది. కానీ ఏడాది జైల్లో ఉండి తిరిగొచ్చిన డేవిడ్ - అవేం పట్టించుకోలేదు - ఈలోగా భార్య మరొకరి సొత్తుకాలేదని సంతోషించాడు. అతడికింకా అత్తమామలపై కూడా అభిమానం పోలేదు.

కానీ మార్గరేకి అతడిపై అభిమానం రెట్టింపైంది. అప్పటికామె అతడికి సలహా ఇవ్వగల వివేకాన్ని కూడా సంతరించుకుందేమో - అతణ్ణి తలిదండ్రుల బారినుంచి రక్షించాలనుకుని ఊరుమారింది.

డేవిడ్ - మార్గరేట్‌ల ప్రేమకథలో విషాదమంతటితో ఆగలేదు. కన్నవాళ్ళ మోసం నుంచి బయటపడ్డాక - వాళ్ళని కన్నబిడ్డలు కూడా మోసగించారు. అలా జీవితం నమ్మినవాళ్ళొకొక్కరే మోసగిస్తూ వచ్చారు.

"ఈ ప్రపంచంలో మోసం, దుర్మార్గం, దౌర్జన్యం రాజ్యమేలుతున్నాయి. అదే నాగరికత పేరుతో వర్ధిల్లుతోంది. నాగరికుల మధ్య మేము సర్వస్వం కోల్పోయాం. నాగరికత అంటా విరక్తి పుట్టి - అది నరకమైనా సరే, నాగరికతకి దూరంగా ఉంటే చాలని మేమనుకున్నప్పుడు ఈ గెస్టుహౌసులో ఉద్యోగం దొరికింది. కానీ ఈ అటువా ద్వీపం మాకు స్వర్గంలా ఉంది. ఇక్కడ ఎంతో సంతోషంగా ఉంది " అంది మార్గరేట్.

మార్గరేట్ కథ వనజకి విస్మయాన్ని కలిగించింది.

తానింకా జీవితం ప్రారంభదశలో అన్యాయానికి గురైంది. కానీ జీవితమంతా అన్యాయానికి గురైపోయి ఇక్కడికొచ్చింది మార్గరెట్. ఈ లోకంలో బాధితులు ఎందరో. ఎవరి కన్నీటి గాథలు వారివి.

"ఇది మీ దంపతులకి స్వర్గమెందుకైంది?" కుతూహలంగా అడిగింది వనజ.

"మనిషికి మనిషితో అనుబంధం ఏర్పడితే అది నరకం. మనిషికి ప్రకృతితో అనుబంధ మేర్పడితే అదే స్వర్గం. జీవితానుభవం నేర్పిన పాఠమిది. స్వర్గానుభూతిని మాటల్లో చెప్పలేను. అనుభవంలో నువ్వే తెలుసుకుంటావ్" అంది మార్గరేట్.

"దేవుడా నాకు స్వర్గానుభూతినివ్వు" అనుకుంది వనజ మనసులో. ●●●

## 15

**మార్గరేట్ మాటలు వనజ** మనసుపై గొప్ప ప్రభావాన్నే చూపాయి. ఆమె అటువా ద్వీపం మీద దృష్టి సారించి - ఆ ద్వీపం నిజంగానే స్వర్గమని గ్రహించింది.

వేళకి భోజనం అమరుతూంటే - అలాంటి వాతావరణంలో తిరిగే అవకాశం లభిస్తే - బయట ప్రపంచంతో అనుబంధం అక్కర్లేదని చాలాసార్లే అనుకుందామె. అందుకేనేమో శ్యామలరావుక్కూడా ఫోన్ చేయలేదు.

ఒకరోజు వనజకి మెలుకువొచ్చేసరికి తోటలో ఏదో హడావుడి.

వనజ గది - గెస్టుహౌసు భవనం రెండో అంతస్తులో ఉంది.

భవనం చుట్టూ అందమైన తోట. తోటలో ఫలవృక్షాలు. పూలమొక్కలు. కాయగూరల పాదులు.

వనజ కిటికీలోంచీ చూస్తే తోటలో మార్గరేట్, డేవిడ్ - ఒక కుందేల్ని అదిలిస్తున్నారు.

కుందేలు తెల్లగా ముద్దుగా బొద్దుగా ఎంతో బాగుంది. అది ఒక దుంప మొక్కను పెకిలించి - తినడానికి ప్రయత్నిస్తూంటే డేవిడ్, మార్గరెట్ దాన్ని అదిలిస్తున్నారు.

కుందేలు కదలదు, బెదరదు.

వనజ చకచకా మెట్లు దిగి తోటలోకి వెళ్ళి, "దాన్ని దుంపలు తిననివ్వండి. లేదా నాలుగు తగిలించి తరిమేయండి. నోటిమాటలకి కదులుతుందా?" అంది వనజ.

"అదిలించకపోతే తోట తోటంతా నాశనం. చెయ్యి చేసుకుందామంటే అమ్మో - ఇది అరణ్యా పెంపుడు కుందేలు. పేరు శశి" అంది మార్గరేట్.

"ఏ కుందేలైనా అరణ్యానికి పెంపుడు జంతువే. మధ్య దీని ప్రత్యేకతేమిటి?" అంది వనజ.

"అరణ్యం కాదు. అరణ్యా. అది ఒక అటువా జాతి అటవికుడి పేరు. అతడి కుందేలిది. దీనిమీద ఈగ వాలినా అతగాడు సహించడు. ఒకసారి అడవిలో ఈ కుందేల్ని నాలుగు తోడేళ్ళు చుట్టుముట్టాయి. ఎలా తెలిసిందో అరణ్యా క్షణాల మీద అక్కడ వ్రాలాడు. తన పట్టా కత్తి తీసి ఒక్క వేటుతో నాలుగు తోడేళ్ళనీ చంపేశాడు. అప్పట్నించీ క్రూరమృగాలు కూడా ఈ కుందేలెదురైతే పక్కకు తప్పుకుంటాయంటారు" అంది మార్గరేట్.

ఈ కథను వనజ ఎంతో కుతూహలంగా విని, "నేను ఈగనీ కాదు, తోడేళ్ళీ కాదు. దీన్ని తాకితే అరణ్యా ఏం చేస్తాడో చూస్తాను" అంటూ కుందేల్ని సమీపించి మృదువుగా దాని వీపు నిమిరింది.

కుందేలు పారిపోలేదు.

వనజకి ఎంతో సంతోషమైంది. ఆ స్పర్శ ఎంత మధురంగా ఉందో! అలా కాసేపు దాని వీపు నిమిరి నెమ్మదిగా దాన్ని వళ్ళోకి తీసుకుందామె.

"సాధారణంగా ఇది ముట్టుకుంటే పారిపోతుంది. నీ స్పర్శలో ఏదో మంత్రముంది" అంది మార్గరెట్.

"పాపం - ఆకలి తీరింది దీనికి పాలు పట్టాలి" అంది వనజ.

"బహుశా నీ మనసులో మాట దీనికి తెలిసుంటుంది. అందుకే అంత బుద్ధిగా కూర్చుంది -" అంది మార్గరెట్.

"దీన్ని బంగళాలోకి తీసుకెడదామా?" అంది వనజ.

"అమ్మో - వద్దు. ఇళ్ళు జంతువులకి వధ్యశాలలని, ఎప్పుడో తెలుసేమో వీటికి తోటలేకానీ ఇళ్ళు నచ్చవు" అంటూ మార్గరెట్ - ఇంట్లోకెళ్ళి కొద్దిక్షణాల్లో పాలసీసాతో వచ్చింది.

వనజ కుందేలుకి పసిపాపకిలా పాలు పట్టిస్తూ, "దీన్నిప్పుడు వదిలేస్తే అరణ్య దగ్గిరకెడుతుంది. నేనూ దీన్ననుసరించి వెళ్ళి అరణ్యను కలుసుకుంటాను" అంది.

"నో" అంది మార్గరెట్.

"ఎందుకని?"

"అరణ్యకీ, గెస్టు హౌసుకీ మధ్య అటువా రేఖ ఉంది. ఆ రేఖ దాటి మనం అటుగా వెళ్ళకూడదు"

"వెడితే?"

"వెడితే ఏమిటి? వెళ్ళనివ్వను. నా బాధ్యతల్లో అది ఒకటి"

మార్గరెట్ గొంతులో దృఢత్వానికి వనజ ఆశ్చర్యపడింది. "ఎలాగైనా సరే - ఒకసారి అటువా రేఖ దాటి అటుగా వెళ్ళాలి అనుకుందామె

కుందేలుకి పాలుపట్టడం అయింది. అది ఉన్నట్లుండి ఆమె ఒడిలోంచి గెంతి అరణ్యంలోకి పరుగు తీసింది.

●●●

వనజ అటువా రేఖ దాటాలని ఒకటి రెండు ప్రయత్నాలు చేసింది. అప్పుడే ఆమెకి తెలిసింది - మార్గరెట్ దంపతులు తనని వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నారని!

అప్పటికీ ఆమె ఒకసారి మార్గరెట్‌కి చెప్పింది -

"నాగరికతలో మంచీ ఉంది. చెడూ ఉంది. నాగరికత వృద్ధి చెందిన కొద్దీ చెడు బలపడి మంచి మరుగుకు వెళ్ళిపోయింది. అనాగరికతలోనూ మంచీ, చెడూ ఉన్నాయి. అనాగరికతలోని చెడు ఎంతో ప్రమాదకరమైనది. ఆ చెడును తొలగించడానికి నాగరికతలోని మంచి ఉపయోగపడుతుంది. నేనిక్కడికి ఆ పనిమీదే వచ్చాను. అటువాలను సంస్కరించడం నా లక్ష్యం. వాళ్ళని కలుసుకోవాలంటే అటువా రేఖ దాటి తీరాలి. కాబట్టి మీరు నా లక్ష్యాన్ని అర్థం చేసుకుని - సహకరించండి. నన్నాపకండి"

మార్గరెట్ దీనికి బదులుగా - "అది అటువా రేఖ కాదు. మృత్యురేఖ. అదిదాటితే ఎదురయ్యేది అటువాలు కాదు. మృత్యువు. నిన్ను మృత్యువు చెంతకు మేమెలా పంపగలం?" అంది.

కానీ వనజ ఆ దంపతుల కనుగప్పే విధానం కోసం అన్వేషిస్తూనే ఉంది.

●●●

ఒకరోజు బట్టలు తీసుకుని కిందకొచ్చింది వనజ, "ఆంటీ - నేను ఇక్కడ స్నానం చేస్తాను" అంది భయంగా.

"ఏమైంది?" అడిగింది మార్గరెట్ కుతూహలంగా.

"బాత్రూంలోకి పాము దూరిందని అనుమానంగా ఉంది"

"బాత్రూంలో పామా - ఇంపాసిబుల్... గెస్ట్ హౌస్ చుట్టూ పాముల్ని బెదరగొట్టే ముందుకొట్టారు" అంది మార్గరెట్.

"అయితే స్నానానికి మళ్ళీ మెట్లెక్కి వెళ్ళాలన్నమాట" అంది వనజ నీరసంగా.

"లేదులే - ఎందుకైనా మంచిది - ఒకసారి డేవిడ్‌ని నీ బాత్రూం చెక్ చేయమంటాను. ఈ పూటకి నువ్విక్కడే స్నానం చెయ్"

"తలంటుకుంటాను. ఆలస్యమైనా నీకేమి ఇబ్బంది లేదుగా"

"నా స్నానం ఎప్పుడో అయిపోయింది" అంది మార్గరేట్.

"మరి అంకుల్...?"

"ఏ రోజైనా అంకుల్ తరవాతే నా స్నానం. ముందు నేను స్నానం చేసానంటే అంకుల్ జ్వరపడ్డాడని అర్థం" అంది మార్గరెట్ నవ్వుతూ.

వనజ స్నానాల గదిలో దూరి తలుపేసుకుంది.

●●●

మార్గరెట్ స్నానాలగదికి పెరటి వైపు తలుపొకటుంది. బాత్రూం శుభ్రం చేసే వాడికోసమది.

తలుపు తీస్తే చెట్లు, పొదలు. వాటిని దాటి అటువా రేఖ దాకా ఎవరికంటా పడకుండా వెళ్ళిపోవచ్చు.

ఈ విషయాన్ని తెలుసుకుందుకు వనజ రెండు రోజులు పరిశోధన చేసింది.

ఇప్పుడామె బాత్రూంలో సన్నగా కుళాయి విప్పి - లోపల తను స్నానం చేస్తోందన్న నమ్మకం మార్గరెట్‌కి కలిగించింది.

తర్వాత తొందరగా బట్టలు మార్చుకుని, తలుపు తీసి బాత్రూంలోంచీ బయటపడి చకచకా అటువా రేఖ వైపు నడిచింది. అక్కడికి చేరగానే ఆమెకు గుండె అదిరింది.

నల్లగా పొడువుగా పెద్ద కొండచిలువలా ఉన్నదా రేఖ.

వనజ వెనక్కి చూసింది. పక్కలకి చూసింది. క్షణం మాత్రం తటపటాయించి ముందడుగు వేసింది.

ఆమె కుడిపాదం రేఖను దాటింది.

మరోక్షణం - అంతే!

ఆమె ఎడమపాదమూ రేఖను దాటింది.

ఇప్పుడామె అటువా రేఖకు అటువైపున ఉంది.

●●●

కండలు తిరిగిన విగ్రహం. చురుకైన కళ్ళు. ఆజానుబాహుడు.

మొలను కప్పుతూ జంతుచర్మం. నడుముకు వ్రేలాడుతూ పట్టాకత్తి. భుజానికో వక్రదండం.

అటువా జాతికి చెందిన ఆ యువకుడు ఓ చెట్టుచాటునుంచి అటువా రేఖను దాటుతున్న వనజను గమనిస్తున్నాడు.

వనజ రేఖను దాటగానే అతడికళ్ళు ఎర్రబడ్డాయి. అతడి చేయి పట్టా కత్తిని తడిమింది.

ఆమె అరణ్యంలో అడుగిడగానే చప్పుడు కాకుండా అతడామెను చెట్లు చాటు చేసుకుని అనుసరించసాగాడు.

వనజకప్పుడు భయంగాలేదు. తననో ఆటవికుడు అనుసరిస్తున్నాడనీ ఆమెకి తెలియదు.

ఆ అడవిలో తనూ ఓ మృగమైనట్లు చకచకా ముందుకెడుతోంది. ప్రకృతి సౌరభం ఆమెకి వింతలోకాలు పరిచయం చేస్తోంది.

ఆటవికుడి ముఖంలో చిరాకు. అతడామెను కొంతదూరం అనుసరించి - ఇక ఉపేక్షించకూడదనుకున్నాడేమో మరోసారి కత్తిని తడిమి చెట్లచాటునుండి బయట పడి వనజ వెనక్కి వచ్చాడు.

అప్పుడు వారిద్దరికీ పదడుగులు దూరం మాత్రమే ఉంది.

వనజకి తెలియదు - తన వెనుకే ఓ అటవికుడున్నాడని. ఆమె వెనక్కి తిరగలేదు. ఐనా ముందు శోభాయమానమైన ప్రకృతి కవ్విస్తుంటే ఆమెకి వెనక్కు తిరగాలని ఎలా అనిపిస్తుంది?

ఆమె ముందడుగు వేస్తోంది. అతడామె అడుగులో అడుగు వేస్తున్నాడు.

పదడుగుల దూరం.

అది ఇంకొక్కడుగు తగ్గిందా - వనజకు మూడినట్లే!

సరిగ్గా అప్పుడే ఓ కుందేలు పరుగున వచ్చింది. వనజని చూస్తూనే ఆమె ముందు ఆగింది.

నడుస్తున్న వనజ ఆగింది. చట్టుక్కున మోకాళ్ళమీద వంగింది. ఆప్యాయంగా కుందేలు వీపు నిమిరింది.

ఆ స్పర్శలో వనజే కాదు - కుందేలు కూడా ఏదో హాయిననుభవిస్తున్నట్లే ఉంది. అది కదలడం లేదు. ఆటవికుడా దృశ్యం చూసి చకితుడయ్యాడు. ఎంతోసేపు కాదు.... ఒక్కక్షణం. అతడు ఆదమరచాడు.

సరిగ్గా అప్పుడే ఎట్నించో పరుగున వచ్చిందో లేడిపిల్ల.

ఆటవికుడు పరధ్యాన్యంగా, అప్రయత్నంగా నాలుగడుగులు పక్కకు వేసాడు. అంతే! ఊబిలో పడ్డాడు.

అతడు ఊబిలో పడ్డ శబ్దానికి ఉలిక్కిపడ్డ వనజ వెనక్కి తిరిగింది.

ఆమె ఆటవికుణ్ణి చూడలేదు.

గుండె గుభేల్ మనేలా ఆమెకో పెద్దపులి కనపడిందప్పుడు.

అది లేడిని తరుముతూ వచ్చింది. వనజని చూసింది.

పులి ఆగి ఆమెను కళ్ళు చిట్లించి చూడసాగింది.

వనజకి పై ప్రాణాలు పైనే పోయాయి.

ఒక పెద్ద అడవిలో తను.. తన ఎదుట పులి..

ఆ అడవిలో తన్ను రక్షించడానికి నాగరికులు లేరు.

ఇప్పుడేం జరుగుతుంది?

ఆలోచిద్దామన్నా వనజకి మెదడు పనిచేయలేదు. కదులుదామంటే కాళ్ళూ, చేతులూ ఆడలేదు.

అప్పుడు..

వనజ వెనుకనుంచీ కుందేలు ముందుకొచ్చింది. వనజను దాటుకుని పులి ముందుకు వెళ్ళి ఆగింది.

పులి చూపులు కుందేలు మీదకి వెళ్ళాయి.

కుందేలు పులిని చూస్తోంది. పులి కుందేల్ని చూస్తోంది.

అలా ఎన్ని క్షణాలు గడిచాయో - ఉన్నట్లుండి పులి వెనకడుగు వేసింది. క్రమంగా కనుమరుగైంది.

వనజకి జరిగినదంతా కలలా ఉంది. ఆమె మెదడా కలని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఆమె దృష్టి మాత్రం ఇంకా కుందేలు ననుసరిస్తూనే ఉంది.

కుందేలు ఓ పక్కగా వెళ్ళి ఆగితే వనజ అటు చూసి ఉలిక్కిపడింది.

అక్కడ ఒక ఆటవికుడు ఊబిలో ఇరుక్కుని బయట పడడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

వనజకి పరిస్థితి అర్థమై చటుక్కున ఊబి దగ్గిరకి పరుగెత్తింది.

పక్కనే చెట్టు ఒకటి ఉంది. ఆ చెట్టు తమాషాగా సన్నగా పొడుగ్గా రివటలా ఎదిగింది. ఆ చెట్టు కొమ్మలూ అలాగే ఉన్నాయి.

వనజ తన బలాన్నంతా ఉపయోగించి ఆ చెట్టును వంచితే - ఆశ్చర్యంగా ఆ చెట్టు సులభంగానే వంగింది.

వనజ చూస్తోంది. ఆటవికుడికి చెట్టుకొమ్మ అందింది.

ఆమె గమనిస్తోంది. అతడికి పట్టు దొరికింది.

కొమ్మ బలంగా ఉంది. అది విరగదని రూఢి అవుతోంది.

ఆటవికుడు ఊబిలోంచీ బయటపడడానికి ప్రయత్నిస్తున్నాడు.

చెట్టు నెమ్మదిగా పైకి లేస్తోంది. అతడు బయట పడుతున్నాడు.

వనజకు తెలిసిపోయింది - అతడికి ముప్పు తప్పిందని.

ఇప్పుడా ఆటవికుడు బయటకొస్తే - అటువా రేఖ దాటిన తనని క్షమించి విడిచి పెడతాడా?

వనజకి భయం వేసింది. ఆమె చటుక్కున వెనక్కి తిరిగి తన గెస్టు హౌసు వైపుగా పరుగెట్టింది.

●●●

"నువ్వు మమ్మల్ని మోసం చేసావ్" అంది మార్గరెట్.

వనజ తలవంచుకుని, "నన్ను మన్నించు-" అంది.

"ఎందుకు చేసావీపని?" అంది మార్గరెట్.

"మరి నేను వచ్చిందే అటువాలకోసం.." అంది వనజ.

"అలాంటప్పుడు అక్క ఉండిపోలేదేం? పారిపోయి వెనెక్కెందుకొచ్చినట్లు?" అడిగాడు డేవిడ్

"మొదటిసారి కదా - భయమేసింది" అంది వనజ.

"మొదటిసారి అంటున్నావు మళ్ళీ వెడతావా?"

"అమ్మో అక్కడ పులి ఉంది. నేను జూలో తప్ప అంత దగ్గర్నుంచి పులిని చూడలేదు" అంది వనజ మళ్ళీ వెళ్ళడానికున్న అభ్యంతరమేమిటో సూచిస్తూ.

"నువ్వు భయపడాల్సింది పులికి కాదు, అటువా రేఖకు గస్తీ కాసే అరణ్యకి. నువ్వు ఊబిలోంచి రక్షించింది అతణ్ణేనని నా అనుమానం" అన్నాడు డేవిడ్

"ఆ విషయమలాగుంచండి. నాదో అనుమానం. అటువా రేఖని మనుషులర్థం చేసుకుంటారు. మరి జంతువుల సంగతేమిటి? రేఖకి బాగా దగ్గిర్లో పులిని చూసాను. అదెప్పుడూ గెస్టుహౌసు వైపు రాలేదా?" అంది వనజ.

డేవిడ్ నవ్వాడు. "ఈ అడవి చాలా పెద్దది. అందులో క్రూరమృగాలకి తిండికి లోటులేదు. సహజంగా తిండి దొరికినంతకాలం అవి మనుషుల జోలికి రావు. ఎందుకంటే మనిషి వాటికి సహజమైన ఆహారం కాదు. ఈ గెస్టు హౌసు, కాటేజీలు ఇక్కడి సదుపాయాలు అన్నీ ప్రత్యేకంగా తయారు చేయడానికీ కారణమదే! ఇది కృత్రిమ వాతావరణం. అడవికీ దీనికీ ఉన్న తేడా కొట్టొచ్చినట్లు తెలుస్తుంది - అది ముఖ్యంగా జంతువులకి. సాధుజంతువులైతే తప్ప క్రూరజంతువులేవీ ఇటువైపు రావు"

వనజకి అర్థమైంది. మనుషులుండే చోటుకి క్రూరమృగాలు రావు. వచ్చినా అది యాదృచ్ఛికం.

"నువ్విపుడు భయపడాల్సింది పులికి కాదు. అరణ్యకి. అటువా రేఖను దాటిన నిన్నతడు క్షమించడు. వేటలో అతడు నిపుణుడు. అతడు నిన్ను వేటాడతాడు" అన్నాడు డేవిడ్

"అంకుల్ - నువ్వు అనవసరంగా భయపడుతున్నావు. కృతజ్ఞత జంతుగుణం. మనిషి కూడా జంతువే కాబట్టి మనిషికీ ఎంతో కొంత కృతజ్ఞత ఉంటుంది. అరణ్య ఆటవికుడు. అతడిలో మనిషి కంటె జంతు లక్షణాలు ఎక్కువుంటాయి కాబట్టి కృతజ్ఞతా ఎక్కువే ఉంటుంది" నమ్మకంగా అంది వనజ.

అప్పుడు డేవిడ్ ఆమెకో కథ చెప్పాడు.

ఒక రాజా వారు తన ఇంట్లో ఒక పులిని పెంచారు. అది ఇంట్లో పెంపుడు పిల్లిలా తిరిగేది. ఎవరికీ హాని చేసేది కాదు. ఒక రోజున రాజావారు కుర్చీలో కూర్చుంటే పులి ఆయన పాదాల చెంత కూర్చుని ఆప్యాయంగా ఆయన పాదాలు నాకింది. పులి నాలుక ఆకురాయిలా ఉంటుందిగా. దాని తాకిడికి రాజావారి చర్మం రేగి రక్తం చిమ్మింది. పులి నాలుకకి మనిషి రక్తం తగిలింది. ఆ రుచి పులిలో నిద్రాణమైన ఉన్న సహజగుణాల్ని మేల్కొలపగా ఉన్నట్లుండి అది గాండ్రించింది. ఆ అరుపులో కొత్తదనం కనిపెట్టిన రాజావారు ఆశ్చర్యంగా దానివైపు చూస్తే దాని చూపుల్లోనూ కొత్తదనముంది. పులి వేటలో ఆరితేరిన రాజావారా మార్పు కనిపెట్టారు. తాత్కాలికంగా ఆయన దాన్ని అదుపు చేయగలిగినా జంతు రక్తంకోసం దానిలో తపన బయల్దేరింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఒకరోజు ఆయన దాన్ని తుపాకీతో కాల్చి చంపేసారు.

"తుని సంస్థానంలో అనుకుంటాను - ఇది నిజంగా జరిగిన కథ. కాబట్టి క్రూర జంతువులతో మనిషికి వేట, ఆట రెండూ ప్రమాదమే. అరణ్య క్రూరజంతువు. అతడి విషయంలో నువ్వు జాగ్రతగా ఉండు" అన్నాడు డేవిడ్ వనజ తలాడించింది కానీ డేవిడ్ హెచ్చరికనామె పట్టించుకోలేదు. మళ్ళీ అరణ్యను కలుసుకునేదెలా అని ఆలోచిస్తోంది.

●●●

**మృతభాష (ఉష ఈమెయిల్)**

*కౌముది వెబ్ పత్రికలో మీ ప్రకృతి పుత్రుడు సీరియల్ చదువుతున్నాను. ఈ నెల ఎపిసోడ్‌లో మీరు అండమాన్‌లో అటువా జాతి వారి భాష గురించి రాస్తూ- వినడానికి మృగభాషలా ఉన్నా శ్రద్ధగా వింటే మృతభాష (సంస్కృతం) అనిపించటానికి కారణం- ఏ నాటి ఋషుల సంపర్కమో మరి- అని రాశారు. ఇక్కడ ఋషుల సంపర్కం అంటే ఏంటో అర్థం కాలేదు. నిజానికి తెలుగులోనే ఉన్న 'జనని సంస్కృతంబు సకల భాషలకును ' అనే సూక్తి మీరు ఇంకా విననట్టున్నారు. దానికి ఋషుల సంపర్కాలే అక్కర లేదు.*

*** మొదట్నించీ సంస్కృతం ఋషుల, పండితుల భాష. ఏ భాషకైనా వారి సంపర్కంతోటే సంస్కృతం జనని అయింది.**

*సంస్కృతాన్ని మృతభాష అనడమేంటి? సంస్కృతం మృతభాష ఎందుకైంది? మీ కథలో రాసే భాషను తరచి చూసుకుంటే ముప్పావు సంస్కృతమే ఉంటుంది. ఒక్కసారి సంస్కృత పదాలను తీసేసి తెలుగు ఏమిటో తరచి చూసుకోండి. ఏది మృతభాషో మీకే అర్థమౌతుంది. చివరకు మన తెలుగుకు భాష అనేవ పదం ఇచ్చింది కూడా సంస్కృతమే! మనకు ఈనాడు ఏ కొత్త పదం కావాలన్నా బిచ్చం ఎత్తుకోవాల్సింది ఆ (అ)మృత భాషనే! వాటికి ఎన్ని ఉదాహరణలు ఇమ్మంటారు? ఈనాడు సహజ భాషా విశ్లేషణకు ప్రాణం పోస్తూ ఒకానొక ప్రపంచస్థాయిలో సంచలనం రేపుతున్న ఆ భాషను మృతం అంటున్నది బహుశా పపంచం మొత్తం మీద మన వాళ్ళేనేమో! మన్నించండి. సంస్కృతం మృతభాష అంటే నేనే కాదు- #Peter Scharf, Gerard Huet, Brendan Gillon, Malcolm D Hyman, Oliver Hellwig-# ఎవ్వరూ ఒప్పుకోరు. (ఇంకా ఎన్ని పేర్లు కావాలో చెప్పండి- ఎందుకంటే వీరు భారతీయులు కారు)*

*** మాట-వ్రాత పరంగా వాడుకలో లేకపోవడంవల్ల సంస్కృతాన్ని లాటిన్‌తో కలిపి మృతభాషగా వ్యవహరించడం భారతీయులు, తెలుగువారు ప్రారంభించలేదు. మాకు తెలిసి ఆ పదం పాశ్చాత్యులు వాడిన డెడ్ లాంగ్వేజ్ అన్న పదానికి అనువాదం. మనకి నిజం నిష్ఠూరం. ఘెరావో అన్న పదం ఆంగ్లాన్ని హిందీ చెయ్యదు. ఎన్ని సంస్కృతపదాలు వాడినా తెలుగు సంస్కృతం కాదు. తత్సమాలెన్ని వాడినా మాకు తెలుగే తప్ప సంస్కృతం రాదు. మరణానంతరం నేత్రదానం చేసినవాడి కనులకు చూసే శక్తి లభించినా దాత మృతుడే కదా! పదాల్ని దానం చెయ్యడంవల్ల సంస్కృతం మరో భాషను సుసంపన్నం చేస్తుందే తప్ప భాషగా మనలేదు. సంస్కృతాన్ని అభిమానించేవారు మృతభాష అన్న పదానికి స్పందిస్తే సరిపోదు. ఆ భాష వాడుకకు స్వయంగా ప్రయత్నించాలి. తెలుగునిప్పుడు**

**అతిత్వరలో అంతరించనున్న భాష అంటున్నారు. స్పందనగా భావి తరాలకి తెలుగు పుష్టినిచ్చి వారిని తెలుగు తేనెలో ముంచి తేల్చాలి. మృతభాష అన్న పదం సంస్కృతభాష దశకీ, దిశకీ వ్యాఖ్యానము, హెచ్చరిక. ఫలితంగా సంస్కృతానికిప్పుడు ప్రచారం విస్తృతమైంది.**

*మీ రచనలంటే నాకెంతో అభిమానం. శైలి నాకు చాలా ఇష్టం. మీ కథలలో వస్తువు, ఉద్దేశ్యం, అన్నీ నాకు నచ్చేవి. కానీ ఈ మాట చదివాక మనస్సు చివుక్కు మనిపించింది.*

*** మేమభిమానించే సంస్కృతంపట్ల మీ అభిమానానికి సంతోషం. మాపట్ల మీ అభిమానానికి ధన్యవాదాలు. ఇక సంస్కృతాన్ని అమృతభాష అనడంలో మీదీమాదీ ఏకాభిప్రాయం. మృతభాష అన్న పదం మా నవలలో కథాపరంగా వాడబడిందే తప్ప సంస్కృతంపట్ల వ్యాఖ్య కానీ, మా అభిప్రాయం కానీ కాదు. మృతభాష అనడానికి బదులు 'మృతభాషగా వ్యవహరించబడుతున్న అమృతభాష' అనడం ఆవశ్యకమని మీరు భావిస్తే పునఃప్రచురణలో ఆ మేరకు సవరించగలం. ఆవేశంతో కూడిన స్పందన భారత రాజకీయం. కార్యాచరణ సామాన్య భారతీయం. ముందు తెలుగును కాపాడుకుంటూ ఉట్టికెగిరి- ఆపైన స్వర్గానికెగురుదాం. స్వర్గంలో ఉండేది మృతులైనా వారు తాగేది అమృతమే కదా! మృతభాష అంటే దైవత్వమున్నవారి వాడుకభాషగా భావించి తృప్తి చెందడం ప్రస్తుతానికి తరణోపాయం.**

శుభాకాంక్షలతో

వసుంధర

## 16

**మంచి నిద్రలో ఉంది వనజ. ఆ నిద్రలో ఓ కల.** ఆ కలలో ఓ అటవికుడు.... అస్పష్టంగా ఉందతడి రూపం.

అతడామెను క్రూరంగా చూస్తున్నాడు. వనజ అతణ్ణి నిర్భయంగా చూస్తోంది.

ఉన్నట్లుండి ఆటవికుడు పెడబొబ్బ పెట్టాడు. అది అటువా దీవి అంతా ప్రతిధ్వనించింది.

ఆ కేక విని వనజ హడలిపోయింది. కెవ్వుమంటూ లేచి చూస్తే...

ఎదురుగా మార్గరేట్!

"భయపడ్డావా?" అంది మార్గరెట్.

వనజ ఆమెను చూ, "అంతా కలన్న మాట" అనుకుని నిట్టూర్చింది తేలికగా.

అంతలోనే మళ్ళీ పెడబొబ్బ. అదే కేక.. తను కలలో విన్న కేక...

"అది అరణ్య పిలుపు. బహుశా నీకోసమే" అంది మార్గరెట్.

ఉలిక్కిపడి మంచం దిగింది వనజ.

గది కిటికీలోంచీ బయటకి చూస్తే - కొండచిలువలాంటి అటువా రేఖకి అవతల ఓ అటవికుడు ఆ కేకలోంచీ తన కల పుట్టిందా - లేక కేక తన కలని భగ్నం చేసిందా?

"అతడిప్పుడేం చేస్తాడు?" అంది వనజ.

"నిన్ను పిలుస్తున్నాడు. వెళ్ళకు. రేఖకివతలుండగా అరణ్య నిన్నేం చెయ్యలేడు" అంది మార్గరెట్.

వనజ చకచకా బ్రష్ చేసుకుంది. మధ్యలో మరో పెడబొబ్బ....

ఆటవికుడు రేఖ పక్కనే ఉండి అసహనంగా పచార్లు చేస్తూ మధ్య మధ్య పెడబొబ్బలు పెడుతున్నాడు.

"పిలుస్తున్నప్పుడు వెళ్ళడం మర్యాద" అంటూ వనజ షూస్ వేసుకుంది.

మార్గరెట్ ఆమెకు అడ్డంగా నిలబడి, "నేను నిన్ను వెళ్ళనివ్వను" అంది.

"అయితే నేనిపుడేం చేయాలి? "

"స్నానం చెయ్యి.."

"స్నానమా - సరే - కింద నీ బాత్రూంలో చేస్తాను" అంది వనజ నవ్వుతూ.

మార్గరెట్ చిరాగ్గా ముఖం పెట్టి - "వేళాకోళానికిది సమయం కాదు. నువ్వు కింద బాత్రూంలో స్నానం చేస్తే ఓ తలుపు దగ్గర నేనుంటాను. ఇంకో తలుపు దగ్గిర డేవిడ్ ఉంటాడు" అంది.

"ఆంటీ అనవసరంగా కంగారుపడి లేని ప్రమాదం మీదకి తెచ్చుకోవద్దు. తన పిలుపును మన్నించకపోతే అరణ్యాకి కోపమొస్తుంది. అతడు క్రూరమృగమని నువ్వే అన్నావు. ఆ కోపంలో అతడు అటువా రేఖ దాటి కూడా రావచ్చు. నన్నేకాదు - మిమ్మల్నీ వేటాడొచ్చు"

మార్గరెట్ ముఖంలో రవంత భయం.

"నాకూ ప్రాణాలమీద తీపి ఉంది. అయినా వెడుతున్నానంటే ఒక్కటే కారణం. ఈ ప్రపంచంలో కృతజ్ఞత తెలియనిది మనిషి ఒక్కడేనని పాతకాలం నుండీ కథలు చెబుతున్నాయి. అరణ్యా అసలు సిసలు మనిషి కానంత వరకూ కృతజ్ఞతాభారం నుంచి బయటపడలేడు. నన్ను వెళ్ళనియ్" అంది వనజ.

"కానీ - నీకేమైనా ఐతే.." మార్గరెట్ అభ్యంతరం బలహీనపడింది.

"నాకేం కాదు. అనుమానముంటే నువ్వూ నాతో రా"

మార్గరెట్ నవ్వి, "ప్రాణభయం నాకూ లేదు. కానీ రాను. మరిక్కడ నా బాధ్యతలు నాకున్నాయి" అంది.

"అయితే నేను వెళ్ళొచ్చుగా" అది అనుమతి కోరుతున్నట్లు లేదు. ఆజ్ఞాపిస్తున్నట్లే ఉంది.

"వెళ్ళు, రేఖ మాత్రం దాటకు.." అంది మార్గరెట్. అది శాసనంలా కాక విన్నపంలా ఉంది.

వనజ బదులివ్వలేదు. హుషారుగా మార్గరెట్‌ని తప్పించుకుని చకచకా మెట్లు దిగింది

●●●

కొండచిలువలాంటి అటువా రేఖకి ఇవతల నిలబడి చూస్తోంది వనజ.

రేఖకు అటువైపు నిలబడి ఉన్నాడు ఆటవికుడు.

ఊబిలో కూరుకున్నప్పుడామె అతణ్ణి సరిగ్గా చూడలేదు. ఇప్పుడతడు స్పష్టంగా కనబడుతున్నాడు.

ఆజానుబాహుడు. వంటిరంగు చామనఛాయ. ముఖంలో అమాయకత్వం. కండలు తిరిగిన విగ్రహం. పొడవుగా వేలాడే గెడ్డం. భుజాన్నెక్కిన వక్రదండం. నడుముకి వేలాడే పట్టాకత్తి. మొలచుట్టూ పులిచర్మం.

అతడూ ఆమెని కాసేపు పరీక్షగా చూసాడు. తర్వాత రేఖ దాటి రమ్మని సైగచేసాడు.

"వద్దు.. వద్దు.. వెళ్ళొద్దు.." వెనకనుండి దూరంగా డేవిడ్ కంఠస్వరం.

అంతవరకూ వనజ తటపటాయించింది. కానీ డేవిడ్ వస్తే తను రేఖ దాటలేనని ఆమెకు తెలుసు. ఆ వృద్ధుడు తనను చేరడానికి శక్తి కొద్దీ పరుగెడుతున్నాడనీ ఆమెకి తెలుసు.

నెమ్మది ముందడుగేసిందామె. ఆమె ముందుకొస్తుంటే ఆటవికుడు వెనక్కి వెనక్కి వెడుతున్నాడు. వనజ అటువా రేఖకి దగ్గరైంది.

"వద్దు -" డేవిడ్ గొంతు ఆమెకి దగ్గరైంది.

వనజ జాప్యం చేయలేదు. చటుక్కున అటువా రేఖ దాటింది.

అంతే - ఆటవికుడు మెరుపు వేగంతో ఆమెను సమీపించి రెండు చేతులతో పైకెత్తి అరణ్యంలోకి పరుగు తీసాడు.

అప్పుడే రేఖని సమీపించిన డేవిడ్ - "వద్దు-" అనబోతే ఆ మాట గొంతులోనే ఆగిపోయింది.

వనజ అతడికి కనుమరుగైంది.

"ఇక ప్రభువే ఆమెను రక్షించాలి -" అనుకున్నాడు డేవిడ్

●●●

వనజ శరీరం గాలిలో తేలుతోంది. ఆమె మనసు కూడా గాలిలో తేలుతోంది.

ఆటవికుడికి ఒడుపుంది. అతడెంతో మృదువుగా ఆమెని తాకాడు. పూవులా పైకెత్తాడు.

అప్పుడామెలో భయంలేదు. మనసుకి ఏదో తెలియని హాయి. కానీ అదెంతో సేపు నిలవలేదు.

ఉన్నట్లుండి ఆటవికుడామెను విసిరేసాడు. తిన్నగా వెళ్ళి ఊబిలో పడిందామె.

ఏం జరిగిందో అర్థం చేసుకునేలోగా వనజ ఊబిలోకి దిగిపోతోంది.

కెవ్వుమందామె.

ఊబికి అవతల ఆటవికుడు. వనజనే చూస్తున్న అతడి ముఖంలో చిరునవ్వులు.

వనజ మనసు పరిపరివిధాల పోయింది.

అటువా రేఖ దాటినందుకు - ఆ రేఖకు గస్తీ తిరిగే ఈ ఆటవికుడు తన్ను ఊబిలో ముంచి చంపేస్తాడా? నిన్న తను అతణ్ణి ఇదే ఊబినుమిచి రక్షించింది. తనే రక్షించకపోతే ఈ రోజతడుండేవాడా? వనజ చేతులు కొట్టుకుంటోంది. బయటపడే మార్గమున్నట్లు తోచడం లేదామెకి. అసహాయ స్థితిలో ఉక్రోషంతో, "అలా చూస్తూ వినోదిస్తావేం. నన్ను రక్షించవా?" అంటూ ఆటవికుడినుద్దేశించి అరిచింది.

ఏమనుకున్నాడో ఆటవికుడు - నిన్న వనజ వంచిన చెట్టునే తనూ వంచాడు.

వనజ చెట్టుకొమ్మనందుకుంది. అది స్ప్రింగులా కదలడం గమనించి, "లోపలికి లాగి ప్రాణం తీసే ఊబి, దాని పక్కనే బైటకి లాగి ప్రాణం నిలబెట్టే ఈ చెట్టు. నారుపోసినవాడే నీరు పోయడమంటే ఇదేనేమో" అనుకుంటూ ఒడ్డు చేరింది అతి కష్టం మీద. అప్పుడా ఆటవికుడేం చేస్తాడోనని భయపడింది కానీ అతడామే ఒడ్డు చేరగానే ఉత్సాహంగా చప్పట్లు కొట్టాడు.

వనజ వంటినిండా బురద. దానివల్ల కాళ్ళూ, చేతులూ సరిగ్గా కదలడం లేదు.

అంతలో ఆమెకి ఏనుగుల ఘీంకారం వినిపించింది. వెనువెంటనే వాటి పదఘట్టనలకి నేల అదరడం తెలిసింది. అది నాగరిక ప్రపంచం కాదు. జంతు ప్రదర్శనశాల కాదు.

క్రూర జంతువులకి నిలయమైన అడవి. ఆ అడవిలో ఆమె. ఆమెకి ఎదురుగా ఆటవికుడు. వెనుకగా ఊబి. పక్కలనుంచి ఘీంకరిస్తున్న అడవి ఏనుగులు.

వనజకు వళ్ళు జలదరించింది.

ఏం జరుగుతుందిప్పుడు?

వనజ ఆలోచిస్తూనే ఉంది - ఈలోగా ఆమె వంటిమీద నీటి జల్లులు. అవి జల్లు కూడా కాదు - ధారలు.

వనజ వంటిమీద బురద కరిగిపోతోంది. నీటిధార జలపాతమైతే - వనజకి మాత్రం షవర్ బాత్‌లా ఉంది. ఒకటికాదు. రెండు కాదు నాలుగు ఏనుగులు తొండాలెత్తి ఆమెపై జలధారలు కురిపించాయి.

కడిగిన ముత్యంలా ఉన్న వనజని చూస్తూ మళ్ళీ ఆటవికుడి చప్పట్లు.

ఏనుగులు మరోసారి ఘీంకరించి ఎక్కడికో వెళ్ళిపోయాయి.

వనజకు అర్థమౌతోంది - ఆటవికుడు తనని స్నానం చేయించాడని.

"అడుసు తొక్కనేల - కాలు కడుగనేల.." అంటుంది సామెత.

ఇప్పుడాటవిడుకు చేసిందదే - కానీ ఎందుకలా చేసాడు?

వనజ ఇంకా నిలబడి ఉంది. ఏం చేయాలో ఆలోచించి నిర్ణయం తీసుకోగల శక్తి ఆమె మెదడుకింకా రాలేదు. వచ్చేలోగానే గుర్రుమన్న శబ్దం. శబ్దంతో పాటే, ఓ ఎత్తైన నల్లటి ఆకారం ఆమె ముందుకొచ్చి నిలబడింది.

వనజ ఒళ్ళు ఝల్లుమంది.

ఎదురుగా పెద్ద ఎలుగుబంటి!

ఎలుగుబంటి అంత దగ్గరగా వచ్చినందుకే వళ్ళు జలదరిస్తుంటే - అదామె ముందు చేతులు సాచింది.

వణుకుతూ చూస్తున్న వనజ ఉలిక్కిపడింది.

ఆ చేతుల్లో ఓ ఆకు దొన్నె. ఆ దొన్నెలో పుట్టతేనె.

ఆటవికుడు తన మిత్రులచేత తనకు అతిధిమర్యాదలు చేయిస్తున్నాడని అప్పటికర్థమైందామెకి. ఆమెలో ధైర్యం వచ్చింది. చేయి చాపి ఎలుగుబంటి చేతుల్లోంచి ఆకుదొన్నె అందుకుంది. పుట్టతేనె తాగింది. ఆ తేనె సహజ మాధుర్యం తెలుగు భాషంత గొప్పగా ఉంది.

వనజ తాగడం అవగానే ఎలుగుబంటి ఆమె చేతిలో ఆకు దొన్నెని మృదువుగా అందుకుంది. నాలుగడుగులు వెనక్కి వేసి తిరిగి ఎటో వెళ్ళిపోయింది.

అప్పుడు ఆటవికుడామెను సమీపించి తన ఛాతీ మీద కొట్టుకుని - "అరణ్యా... అరణ్యా.." అన్నాడు.

అతడు తన్ను పరిచయం చేసుకుంటున్నాడని అర్థమై వనజ తనూ ఛాతీమీద కొట్టుకుని, "వనజ... వనజ..." అంది.

అరణ్యా నవ్వాడు. అసలు సిసలు ప్రేమానురాగాల్లోంచే పుట్టినట్లు మనోహరంగా ఉందా నవ్వు. అలా నవ్వుతూనే, "వనజ.." అన్నాడు అరణ్యా.

ఉచ్చారణలోని స్పష్టతని బట్టి అరణ్యాకి మాట్లాడ్డం బాగా వచ్చని అర్థమైంది వనజకి, "థాంక్యూ -" అందామె.

"నో థాంక్స్ - యు సేవ్ మీ.. ఐ సేవ్ యు.." అన్నాడు అరణ్యా.

అతడికి కొంత ఆంగ్లం వచ్చని గ్రహించిన వనజ అతడి ఆంతర్యాన్ని ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేసింది. తను అరణ్యాని ప్రమాదం నుంచి రక్షించింది. అతడు ప్రత్యుపకారం చేయాలనుకున్నాడు. అందుకు తన్ను కావాలని ప్రమాదంలో పడేసి మరీ రక్షించాడు.

అతడు తన్ను ఊబిలో పడేసినప్పుడతడి ఉద్దేశ్యం ఇదని ఆమెకు తెలియదు.

"అరణ్యా నువ్వు విచిత్రవ్యక్తివి. నీ గురించి నేనింకా చాలా తెలుసుకోవాలి" అనుకుంటూ ఆమె అతడికి వెళ్ళిపోతానన్నట్లు సైగ చేసింది.

అరణ్యా తలవంచి ఆమెకు అభివాదం చేసాడు.

వనజ అతడికి రెండు చేతులూ జోడించి, "సెలవ్-" అంది.

అరణ్యా కూడా ఆమెకు చేతులు జోడించి, "సే లవ్-" అన్నాడు.

ఉలిక్కిపడింది వనజ. అరణ్యా తనమాట రిపీట్ చేసాడా - లేక తనకు తెలిసిన ఇంగ్లీషు మాట్లాడేడా? అనుమానంగా ఆమె అతడివంక చూస్తే అతడి కళ్ళు నిర్మలంగా ఉన్నాయి.

వనజ వెనుతిరిగింది.

అరణ్యా ఆమెను అటువా రేఖదాకా దిగబెట్టాడు. అక్కడ డేవిడ్ ఆమెకోసం ఎదురుచూస్తు నిలబడి ఉన్నాడు. వనజని చూస్తూనే, "మాగీ - వనజ క్షేమంగా తిరిగొచ్చింది" అంటూ అక్కణ్ణించే పెద్దకేక పెట్టాడు.

వనజ రేఖని దాటింది. అరణ్య వెనక్కి తిరిగాడు.

వనజ, డేవిడ్‌లు గెస్ట్ హౌస్ వైపు నడుస్తుంటే సగం దారిలోనే మార్గరెట్ వారికి ఎదురైంది. ఆమె వనజని సమీపించి, "అమ్మాయ్ - నువ్వు క్షేమంగానే ఉన్నావ్ కదూ, ఆ అరణ్య నిన్నేం చెయ్యలేదు కదూ!?" అంటూ ఉద్వేగంతో ఆమె వళ్ళు తడిమింది.

వనజ ఆ ఆత్మీయతకి కరిగిపోతూనే, "ఆంటీ, అంతా మీ అనుమానం తప్పు అరణ్య ఎంతో మంచివాడు. అతడు ఏనుగులతో నాకు షవర్ బాత్ చేయించాడు. ఎలుగుబంటిచేత పుట్టతేనె ఇప్పించాడు. ఆ అనుభవం చాలా థ్రిల్లింగ్ గా ఉంది" అంటూ జరిగిందంతా ఆ దంపతులకి వివరంగా చెప్పింది.

"అరణ్య చాలా ప్రమాదకరమైన మనిషి. అతడు పిలిచాడంటే అది ప్రమాదపు పిలుపే. నువ్వా పిలుపు విని వెళ్ళావ్. ప్రాణాలతో తిరిగి రావడం ఆశ్చర్యమే" అన్నాడు డేవిడ్

"అమ్మాయి మామూలు మనిషి కాదు, ఏంజెల్" అంది మార్గరెట్.

●●●

క్రమంగా అరణ్యకీ, వనజకీ స్నేహం పెరిగింది. అరణ్య రోజూ అటువా రేఖ వద్దకొచ్చి పిలిస్తే - వనజ అరణ్యంలోకి వెళ్ళేది. మొదట్లో వారి మధ్య సైగలే ఎక్కువ. అరణ్యకి భాషాజ్ఞానముంది కాబట్టి - క్రమంగా ఆమెనుంచి వాడుక తెలుగు పదాలు నేర్చుకున్నాడు. తన ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకున్నాడు. చురుకునైవాడు కావడంతో కొన్నాళ్ళకే - నెమ్మదిగా మాట్లాడితే తెలుగు అర్థం చేసుకోగలుగుతాడు.

అరణ్యకి వనజ గొప్ప ఆకర్షణ. ఆమె ముందు తన ప్రతిభ ప్రదర్శించి, ఆమె మెచ్చుకుంటే మురిసిపోయేవాడు. అరణ్య ఒక్క ఉదుటున పక్షిలా ఎగిరి చెట్టుపైకి చేరగలడు. లక్ష్యం కంటికి కనిపిస్తే చాలు, ఎంత దూరాన ఉన్నా గురిచూసి కొట్టగలడు. విసిరే వేగం వల్లనేమో అతడి పట్టాకత్తికి - పదును పెరిగి రాతిబొమ్మల తలలు కూడా తెగ నరుకుతుంది. అన్నింటినీ మించినది అతడి భుజానికి వ్రేలాడే వక్రదండం. దాన్ని ముందికి విసిరితే కొంత దూరం ముందుకెళ్ళినట్లే వెళ్ళి అతడి వెనకనున్న లక్ష్యాన్ని బలంగా తాకుతుంది.

ఆఫ్రికా అడవుల్లో ఆటవికులు వాడే బూమరాంగ్ గురించి పుస్తకాల్లో చదివిన వనజకి ఆ వక్రదండం కూడా అలాంటిదేననిపించింది. అప్రమత్తుడైన శత్రువుని ఏమరుపాటున దెబ్బ తీయగల వింత ఆయుధమది. తన పథకం తనకే ఎదురు తిరిగితే బూమరాంగ్ అయిందనే సామెత తెలిసిన వనజకి - అరణ్య చూపేదాకా వక్రదండం ప్రయోజనం తెలియదు. వక్రదండాన్ని ముందికి విసిరి వెనకనున్న శత్రువుని తాను నిర్దేశించిన దారికి మళ్ళించి తరుముతాడు అరణ్య. దృష్టి అరణ్య మీదే సారించిన శత్రువుని మరో వైపు నుంచి దెబ్బ తీస్తుంది వక్రదండం.

వనజ స్నేహం అరణ్యకి బాగా నచ్చింది. ఓ రోజతడు ఆమె ఆహ్వానం మన్నించి గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాడు. అక్కడి మెత్తటి పరుపులు, రుచికరమైన వంటలు, ఆధునిక సదుపాయాలు - అతణ్ణి అమితంగా ఆశ్చర్యపరిచాయి.

వనజ అతడికి టీవీ చూపించింది. నాగరికత క్రమంగా మనిషిని గ్రహాంతరయానాలు చేసే స్థాయికి ఎలా తీసుకెళ్ళిందో వీడియో షోలతో వివరించింది.

అరణ్యకి నాగరికత పట్ల ఆసక్తి పుట్టింది. రోజూ గెస్ట్‌హౌస్ కొచ్చి, ఓ కొత్త విశేషం తెలుసుకుని వెళ్ళేవాడు. క్రమంగా అతడి ఆసక్తి విపరీతమైన మోజుగా మారిపోయింది. ఆ మార్పు పసికట్టిన వనజ ఒకరోజతడితో, "నువ్వు నాతో మా ఊరుకొచ్చి - నాగరికుల మధ్య మసలుతూ, అక్కడి మంచి చెడ్డలు అంచనా వేయి. చెడుని విడిచి, మంచిని గ్రహించి నీ వాళ్ళకి తీసుకెళ్ళి పంచిపెట్టు. అటువాలు నాగరికుల్ని మించిపోతారు" అంది. అరణ్య మరో ఆలోచన లేకుండా, "సరే" అన్నాడు వెంటనే. కానీ తన వాళ్ళని కూడా ఒప్పించడానికి

ఒకరోజు గడువడిగాడు. వాళ్ళని ఒప్పించి వచ్చాక, "నా పొడుగు జుట్టు కత్తిరించుకోను. పట్టాకత్తి వదలను. వక్రదండం విడువను. ప్రియమైన నా కుందేలు శశి కూడా నాతో వస్తుంది" అన్నాడు వనజతో.

వనజ అన్నింటికీ ఒప్పుకుని, "నాగరికుల మధ్య పులి చర్మం కట్టుకు తిరిగితే - మనిషిలా మృగంలా ఉంటావు. కాబట్టి నీ దుస్తులు మాత్రం నన్ను డిజైన్ చెయ్యనీ" అంది నవ్వుతూ.

అరణ్య ఒప్పుకుని, "అటువాకి తిరిగొచ్చాక మాత్రం - నీ దుస్తులు వేసుకోను" అన్నాడు. వనజ సరేనంది.

●●●

## 17

**"మరీ ఇంత తొందరగా తిరుగు ప్రయాణమౌతావనుకోలేదు" అంది మార్గరెట్.**

"ఓ ఆటవికుణ్ణి నగరంలోకి రప్పించేంతలా ఆకర్షించగలనని నేననుకోలేదు" అంది వనజ.

"అరణ్యనక్కడికి తీసుకెళ్ళి ఏం సాధిస్తావ్?" అంది మార్గరెట్ ఆశ్చర్యంగా.

"మనుషుల మధ్య కొన్ని మృగాలు మనుషులుగా చెలామణీ ఔతున్నారు. వాళ్ళని చూసి మృగాలుగా ముద్రవేసుకున్న మనుషుల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకుంటాను" అంది వనజ.

"అందువల్ల నీకేం ప్రయోజనం?" అడిగాడు డేవిడ్

"అదిప్పుడు చెప్పలేను. కానీ ఇదో కొత్త ప్రయోగం. దీనివల్ల సమాజానికి మేలు జరుగుతుందని నా మనసు చెబుతోంది."

"అరణ్య అమాయకుడు. అతడితో ప్రయోగాలా - మంచిది కాదు" హెచ్చరించాడు డేవిడ్ "ప్రయోగమయ్యాక నువ్వు నన్ను మెచ్చుకుంటావంకుల్" వనజ గొంతులో నమ్మకం.

"తప్పు చేస్తున్నావేమో - ఒక్కసారి ఆలోచించు. నాగరికత దెబ్బకి తట్టుకోలేక - నేను, మాగీ పారిపోయి ఇక్కడికొచ్చాం. మాకిక్కడ సుఖశాంతులు దొరికాయి. అరణ్య ఇక్కడి మనిషి. అనాగరికుడు. అతణ్ణి నాగరికత దెబ్బకి గురిచేయడం మంచిదనే నీకనిపిస్తోందా?" డేవిడ్ గొంతులో కలవరం.

"అంకుల్ - నాకంటే పెద్దవాడివి. నీకు చెప్పేటంత దాన్ననుకోను కానీ - ఇది విను. లోపాలుండొచ్చు కానీ నాగరికత చెడ్డది కాదు. లోపాల్ని సవరించాలే తప్ప - అనాగరికతకి పట్టం కట్టకూడదు. ఏమంటావ్?" అంది వనజ.

"నేను అనాగరికతకి పట్టం కట్టమన్నానా?"

"అనాగరికతని నాగరికతకి దూరంగా ఉంచడం - పట్టం కట్టడమే ఔతుంది"

డేవిడ్ నిట్టూర్చి, "నీది ఆవేశం. నాది అనుభవం. నీకు నేను తాత్కాలికంగా తలొంచక తప్పదు" అన్నాడు.

జనారణ్యంలో ప్రకృతి పుత్రుడు

ప్రహ్లాద్ ధ్యానం నిత్యం వనజమీదే ఆమె వివరాలకోసం తరచుగా శ్యామలరావుని కలిసేవాడు. తన అజ్ఞాతం గురించి బయటపెట్టడానికి వనజ అనుమతి లేదని - అవి చెప్పడానికి నిరాకరించేవాడాయన.. అలాంటిదో రోజున "వనజ మళ్ళీ మనూరికొస్తోందయ్యా" అని ఆయన చెప్పడంతో ఉత్సాహం పట్టలేకపోయాడతడు.

"అంటే వనజ మళ్ళీ మామూలు మనిషైందన్నమాట!" అన్నాడతడు ఆతృతగా.

"అడవి మనిషిని - మనిషిని చేయాలని వస్తోందామె" అంటూ శ్యామలరావు అతడికి అరణ్య, వనజల కథ క్లుప్తంగా చెప్పాడు.

ప్రహ్లాద్ కళ్ళలో ఆరాధనాభావం, "ఆమె సామాన్యురాలు కాదంకుల్! ఎక్కడికెళ్ళినా ఏదో ఆశయం పడుతుంది. ఓ ఆటవికుడికి తగుమాత్రం నాగరికత నేర్పి వెనక్కి పంపాలన్న ఈ ఆశయం కూడా చాలా గొప్పది" ప్రహ్లాద్ కళ్ళల్లో మెరుపు - వనజ పట్ల అతడికున్న ప్రేమ లోతుని చెప్పకనే చెబుతుంటే, "ఇలాంటివాడు హిరణ్యారావు కొడుగ్గా ఎలా పుట్టాడో" అనుకుని ఆశ్చర్యపడ్డాడు శ్యామలరావు.

"వనజ నన్ను నమ్మదు. నేను ఎదుటపడితే మా మధ్య దూరం మరింత పెరుగుతుంది. కానీ ఆమె ఆశయసాధనకి నా చేతనైన సాయం చేస్తాను. ఎలా చేయాలో మీరే చెప్పాలి" అన్నాడు ప్రహ్లాద్.

"మనిషి రూపంలో ఉన్న అడవి మృగాన్ని - నగరంలోకి తీసుకొస్తోంది వనజ. అతణ్ణి నాగరికుణ్ణి చేయాలన్న ఆమె ఆశయానికి పురప్రముఖుల సహకారముండాలి. ముఖ్యంగా మీ నాన్న హిరణ్యారావు.."

ఆయన్ని మధ్యలో ఆపుతూ, "బాగుందంకుల్ - మా నాన్న వనజకి సాయపడేవాడైతే కథ ఇంతవరకూ ఎందుకొస్తుంది?" అన్నాడు ప్రహ్లాద్.

"అప్పుడామె మీ నాన్నకి ఎదురు తిరిగింది. ఆయన తన తడాఖా చూపించాడు. నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టమని ఆయనే కోర్టులో ఆమెకి సలహా ఇచ్చాడు కూడా. ఇప్పుడామె చేస్తున్నదదే కాబట్టి - ఆమె విజయం సాధిస్తే ఆ ఘనత తనదేననొచ్చు ఆయన. ఆ అవకాశాన్ని మీ నాన్న వదులుకుంటాడనుకోను.."

"ఐతే - వనజని రిసీవ్ చేసుకుందుకు నగరంలో పెద్ద సభ ఏర్పాటు చేస్తాను. అందుకు నేను నాన్నని ఒప్పిస్తాను. మీరు వనజని ఒప్పించండి" అన్నాడు ప్రహ్లాద్. శ్యామలరావు సరేనంటే "అంకుల్! ఇదంతా నేను చేస్తున్నట్లు పొరపాటున కూడా వనజకి చెప్పొద్దు. నాకిప్పుడామెని మెప్పించాలన్న తపన లేదు. ఆమె సంతోషమే నేను కోరుకునేది" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"వనజ ఇతడి మంచితనాన్నీ, ప్రేమనీ గుర్తిస్తే బాగుంటుంది" అనుకుని నిట్టూర్చాడు శ్యామలరావు.

●●●

"నో - మళ్ళీ నన్నా హిరణ్యారావు ఊబిలోకి లాగొద్దు" అంది వనజ.

శ్యామలరావు నవ్వి, "అలాగంటే ఎలా? నీ ఆశయసాధనకి ఆయన సహకారం అవసరం" అన్నాడు.

"హిరణ్యారావు సహకారంతో సిద్ధించే ఆశయాలు సమాజానికి ప్రమాదకరం. మరి నా ఆశయం సమాజ కళ్యాణమని మీరు మర్చిపోకూడదు" అంది వనజ.

"చూడమ్మా! ముట్టుకుంటే షాక్ కొట్టే కరెంటుతో - ఇంట్లో దీపాలు వెలిగించొచ్చు, పంఖాలు తిప్పొచ్చు, పిండి రుబ్బొచ్చు. బయటైతే దాని ఉపయోగాలకి అంతేలేదు. మన సమాజంలో హిరణ్యారావొక హై వోల్టేజి కరెంటు. ఆ శక్తి నువ్వుపయోగించుకోవాలి" అన్నాడు శ్యామలరావామెని బుజ్జగిస్తూ.

వనజ ఆయన్ని ఆశ్చర్యంగా చూసింది. ఐతే చురుకైన ఆమె మెదడు ఆ మాటల అంతరార్థాన్ని ఇట్టే పట్టేసింది.

●●●

రెండువేల మందికి కూర్చునే వీలున్న పెద్ద హాలు. పాతికమంది పెద్దలకి ఆసనాలివ్వగల పెద్ద వేదిక.

హిరణ్యారావు అధ్యక్షత వహిస్తున్న ఆ సభావేదికపై నగర ప్రముఖులతో పాటు, అరణ్య, వనజ..

తన ఆశయానికి అంత ఆర్భాటాన్ని ఊహించని వనజ పరిసరాలని ఆశ్చర్యంగా చూస్తుంటే - పరిసరాల వ్యక్తులందరూ అరణ్యని చిత్రంగా చూస్తున్నారు.

గ్రే కలర్ జీన్సులో చూడ్డానికి పాశ్చాత్య సినిమాల హీరోలా ఉన్నాడు అరణ్య. పొడుగు జుట్టు, పట్టాకత్తి, వక్రదండం - ఏవీ అతణ్ణి అనాగరికుడిగా నిరూపించడానికి సహకరించడంలేదు.

హిరణ్యారావు కూడా అరణ్యానే గమనిస్తూ - వనజ అతడితో చనువుగా ఉండడం గమనించి తృప్తిపడ్డాడు. ఒక బాలగాయని 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' అంటూ సభని ప్రారంభించింది. తర్వాత అధ్యక్షుడు హిరణ్యారావు సభ ప్రారంభిస్తూ వనజని సభికులకి పరిచయం చేసాడు. ఆమె సమాజాన్ని ప్రేమించే మనిషి అన్నాడు. సమాజసేవే ఆమె ధ్యేయమన్నాడు. సమాజంలో దుష్టశక్తులు ఆమె శక్తియుక్తుల్ని తప్పుదారి పట్టిస్తే - చాలా తొందరగా తన తప్పు తెలుసుకుందన్నాడు. ఇప్పుడామె తలపెట్టిన నిర్మాణాత్మక కార్యక్రమం అపూర్వమంటూ - ఆ వివరాలు ఆమె నోటనే విందామన్నాడు.

కరతాళధ్వనులమధ్య లేచి నిలబడింది వనజ. నెమ్మదిగా మైకు ముందుకొచ్చింది. హిరణ్యారావు ధోరణిలోనే తనూ ఆయన్ని పొగిడింది. గతంలో ఆయన్ని అపార్థం చేసుకున్నాననీ, ఐనా ఆయన తనని సహృదయంతో మన్నించి హితోపదేశం చేసాడనీ చెప్పింది. ఆయన మాటల ప్రభావమే తనని అటువా దీవికి పంపిందంది. వనజ చెప్పిన అటువా ద్వీపం విశేషాలు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసాయి. తర్వాత ఆమె అరణ్యా గురించి చెప్పింది. ఆమె సూచనని అర్థం చేసుకున్న అరణ్యా లేచి నిలబడి సభకి అభివాదం చేసాడు.

చప్పట్లతో సభ మార్మోగిపోయింది.

వనజ అరణ్యాని వేదికపై ప్రముఖులొకొక్కరికే పరిచయం చేసింది. అంతా నమస్కార ప్రతి నమస్కారాలతో సరిపుచ్చితే హిరణ్యారావు మాత్రం అతణ్ణి ఆప్యాయంగా కౌగిలించుకుని, "నా పేరు హిరణ్యారావు" అన్నాడు. అది ధృతరాష్ట్ర కౌగిలి కాదు. అరణ్యా, వనజ పరస్పరం ఆకర్షింపబడుతున్నారన్న నమ్మకం ఆయనలో అతడి పట్ల వల్లమాలిన అభిమానాన్ని పుట్టించింది. అలా ప్రహ్లాద్‌కి వనజ పీడ విరగడౌతుందని ఆయన ఆశ. అరణ్యా కళ్ళలో అసలు సిసలు ప్రేమ ప్రతిఫలించింది. కౌగిలి విడిపించుకుని రెండడుగులు వెనక్కి వేసాడు. చూపుడు వ్రేలిని ఆయనకి గురిపెట్టి, "నువ్వు హిరణ్యా.. నేను అరణ్యా.." అన్నాడు.

అప్పుడతడి ముఖంలోని స్నేహభావాన్ని చూసి వనజ ఉలిక్కిపడింది.

వేదిక మీద ప్రముఖులొకొక్కరుగా ప్రసంగిస్తూ - అరణ్యాని నగరంలోకి స్వాగతించారు. నగరంలోని థియేటర్లూ, క్రీడాస్థలాలూ, హోటళ్ళూ, క్లబ్బులూ వగైరాలన్నింటికీ ఫ్రీ పాసులేర్పాటు చేస్తామన్నారు.

సభలో ఓ మూలగా ఉండి మొత్తం తతంగమంతా గమనిస్తున్న ప్రహ్లాద్ ముఖంలో చెప్పలేనంత సంతృప్తి....

●●●

అరణ్యా నగర విహారానికి హిరణ్యారావు సహకారం గొప్పగా ఉపయోగపడింది.

ఆయన వనజకి డబ్బుకిబ్బంది పడకూడదని స్పెషల్ ఏటీఎం కార్డు ఇప్పించాడు. ఏ బ్యాంకు ఏటిఎం మిషన్లోంచైనా ఎంత కావాలంటే అంత తీసుకోవచ్చునన్నాడు ఆ డబ్బు ఆయన పర్సనల్ అకౌంట్లోంచి విత్ డ్రా అయ్యే ఏర్పాటు చేయడం ఆయన ప్రతిష్ఠని పెంచింది.

నగరంలో ఏ వాహనమెక్కినా, ఏ థియేటర్‌లో అడుగెట్టినా, ఏ హోటల్లో భుజించినా, ఏ వినోదానికి తలపెట్టినా - డబ్బుకి తడుముకోవాల్సిన అవసరం లేకపోయేది వనజకి. ఇదంతా అర్థంకాని అరణ్యాకి మాత్రం - నగరంలో సదుపాయాలన్నీ ఉచితమేనన్న భావం కలిగి - నగరమంటే గొప్ప సదభిప్రాయం ఏర్పడింది.

అరణ్యా అమాయకుడైనా చురుకైనవాడు. చంటిపిల్లాడిలా పరిసరాలని గమనించి అనుసరిస్తూ, అనుకరిస్తూ - నాగరికుల పద్ధతుల్ని తొందరగా నేర్చుకుంటున్నాడు. తిండి తినే విధానమైతే మరీ తొందరగా మారింది. అతడి చురుకుతనం, అమాయకత్వం - మెచ్చుకోతగ్గవే ఐనా - అవగాహనా రాహిత్యం వనజకి ఇబ్బందుల్ని సృష్టించేది.

ఒకసారి వనజ, అరణ్యా థియేటర్లో సినిమా చూస్తున్నారు. అందులో మానభంగ దృశ్యం వచ్చింది. ఒక అమ్మాయి. చుట్టూ నలుగురు రౌడీలు.

అమ్మాయి వంటిమీద బట్టలు తొలిగిపోతున్నాయి. తొలగనివి చిరిగిపోతున్నాయి.

అమ్మాయి అరిచి గోల పెడుతోంది. తెరమీద రౌడీలు వికటాట్టహాసాలు చేస్తూ విజృంభిస్తున్నారు. తెరముందు ప్రేక్షకులు బయటపడుతున్న అమ్మాయి వంటి సొగసులు చూసి ఈలలేస్తున్నారు.

ఉన్నట్లుండి అరణ్య సీట్లోంచి లేచాడు. మెరుపు వేగంతో ముందుకు దూకి తెరని చేరాడు. పట్టాకత్తి తీసాడు. తెరమీది రౌడీల్ని చీల్చి చెండాడు.

తెరముక్కలైంది. కొన్ని బొమ్మలు అరణ్య మీద పడుతున్నాయి. రౌడీల వికటాట్టహాసాలింకా ఆగలేదు. జనం గొడవ. థియేటర్ యజమాని లబోదిబో.

కానీ అమ్మాయిని మానభంగం చేస్తుంటే చూసి వినోదించాలనుకున్న జనంలో ఒక్కరికీ - పట్టాకత్తితో ప్రళయభీకరంగా గర్జిస్తున్న అరణ్యని సమీపించడానికి కూడా ధైర్యం చాలలేదు.

పరిస్థితి అదుపు తప్పిందని గ్రహించిన వనజ హిరణ్యరావుకి ఫోన్ చేసింది. ఆయన హుటాహుటిన అక్కడికొచ్చాడు. జరిగింది తెలుసుకుని థియేటరు యజమానికి నష్టపరిహారానికి హామీ ఇచ్చాడు. ప్రేక్షకుల్ని శాంతపర్చాడు. కానీ ఆ గొడవంతకీ కారణమైన అరణ్యని భుజం తట్టి ఓ సారి ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. సినిమా హాల్లో తెరకి దగ్గిర్లో, సినిమా చూడ్డానికొచ్చిన ప్రేక్షకులముందు - సినీ తారలకి బదులుగా హిరణ్యరావు. అలాంటవకాశం నేతలకి ఎప్పుడో కానీ రాదని ఆయనకి తెలుసు.

హిరణ్యరావు అందర్నీ ఉద్దేశించి, "ఈ అరణ్యది పసిపిల్లవాడి మనస్తత్వం. ఇక్కడ తెరమీద జరిగే దృశ్యానికి స్పందనగా మీలో చాలామంది ఈలలేసారు. కానీ ఒక పసి మనసు ఎలా స్పందిస్తుందో ఈ యువకుడు చెప్పాడు. ఏ దృశ్యాల్ని మనం తెరమీద చూసి వినోదించాలనుకుంటున్నామో - అవి చీల్చి చెండాడతగ్గవన్న సందేశాన్నిస్తోంది ఇతడి చర్య. ఇతణ్ణి నేను అభినందిస్తున్నాను" అన్నాడు.

థియేటర్ యజమాని హిరణ్యరావుతో, "ప్రొడ్యూసర్ బోల్డు డబ్బు పెట్టి తీసాడు. నేను బోల్డు డబ్బు పెట్టి కొన్నాను. ఇది సెన్సారైన సినిమా. ఇకమీదట ప్రదర్శన ఆపేయాలంటే నిండా మునిగిపోతాను" అన్నాడు. హిరణ్యరావు నవ్వి, "కోర్టులో సాక్షి భగవద్గీతమీద ప్రమాణం చేసి - అంతా నిజమే చెబుతాను, అబద్ధం చెప్పను - అంటాడు. అంటే సాక్షి అబద్ధం చెప్పడనా? నిజం చెప్పడం కరెక్టూ, అబద్ధం చెప్పడం తప్పూ అని సాక్షి తెలుసుకుని, మనకి తెలియజెప్పడం కోసం కోర్టులో ఆ పద్ధతి పెట్టారు. ఇప్పుడు జరిగిందీ అంతే. ఎలాటి దృశ్యాలు తెరమీద చూపడమూ, చూడ్డమూ తప్పో తెలుసుకున్నాం. అంటే చూపడం, చూడ్డం ఆగిపోతుందని అర్థంకాదు. తప్పు తెలుసుకోవడం వేరు, ఆచరించడం వేరు అని తెలుసుకుంటే అదే నాగరికత" అని అతడికి హామీ ఇచ్చాడు. దానికి తోడుగా, తనకి జరిగిన నష్టం పూడుకుంటుందన్న హామీ కూడా ఉంది కాబట్టి థియేటర్ యజమాని అప్పుడు తనూ అరణ్యని అభినందించాడు.

తనవల్ల కూడని పని ఏదో జరిగిందనీ, అందుకు పెద్ద గొడవే జరగాల్సి ఉండగా హిరణ్యరావు వచ్చి ఆపాడనీ అరణ్యకి అర్థమైంది. అతడు ఆప్యాయంగా ఆయన్ని చూస్తూ, "నువ్వు హిరణ్య.. నేను అరణ్య..: అన్నాడు.

"నేనుండగా నీకేం భయంలేదు. కానీ అన్నింటికీ వనజ చెప్పినట్లు మసలుకో. అప్పుడిలాంటి ఇబ్బందులుండవు" అంటూ హిరణ్యరావు మరోసారి అతడి భుజం తట్టాడు.

వనజ మాత్రం ఆలోచనలో పడింది.

అరణ్య చురుకైన మనిషి. నాగరికుల్ని ఇట్టే అనుకరిస్తున్నాడు. కానీ థియేటర్లో తెరమీద మానభంగం దృశ్యమొస్తే - జనమా దృశ్యానికి ముగ్ధులై ఈలలేస్తూంటే - అతడు వారిని అనుకరించాలనుకోలేదు.

అంటే అతడిలో యుక్తాయుక్త విచక్షణ ఉంది. అతడు చెడుని సహించకపోవడమే కాదు, దాన్నెదుర్కొనేందుకు దుస్సాహసం కూడా చేస్తాడు.

"ఇతణ్ణి నేను సక్రమంగా ఉపయోగించుకోవాలి" అనుకుంది వనజ.

●●●

హోటల్ స్కై హైట్స్‌కి ఇటీవలే ఐదు చుక్కలొచ్చాయి. స్విమ్మింగ్ పూల్ ఆ హోటలుకే ప్రత్యేకం. ముప్పై మూడు మీటర్ల పొడవు. చుట్టూ ఉన్న ప్లాస్మా టీవీల్లో కనిపించే రమణీయ ప్రకృతి దృశ్యాలు. పులకరించేలా పలకరించే సేవికలు, స్పర్శకే పరవశానుభూతినిచ్చే నిర్మలజలాలు, అల్లంత దూరంలో పిన్నలకీ పెద్దలకీ నోరూరించే తినుబండారాలు - ఇలా ఒకటేమిటి - అక్కడ ఎన్నో సదుపాయాలు..

అరణ్యని ఆ స్విమ్మింగ్ పూల్‌కి తీసుకెళ్ళింది వనజ. అప్పుడు అతడా స్విమ్మింగ్ పూల్‌కే ప్రత్యేకమనిపించే విన్యాసాలు చేసాడు.

అరణ్య ముందు మామూలుగానే నీళ్ళలో దిగాడు. ఆ నీటి స్పర్శ పరిసరాలు మర్చిపోయేలా చేసింది. అటువా అడవిలో, కొలనులో అడుగిడిన అనుభూతితో అతడు ఒక్కసారిగా విజృంభించాడు.

అది మామూలు ఈతకాదు. అక్కడి చూపరులు కనివిని ఎరుగని ఈత.

పక్షిలా గాలిలో అంతెత్తుకి ఎగురుతాడు. నీటినీ అంతెత్తుకి చిమ్ముతాడు. లేని సుడిగుండాలు సృష్టిసాడు. మెరుపు వేగంతో కొలను చుట్టేస్తాడు. ఎప్పుడు ఒడ్డెక్కుతాడో ఎప్పుడు నీటిలో దూకుతాడో తెలియదు. పూల్ చుట్టూ ఉన్నవారు కాసేపతడి విన్యాసాలు ఎంజాయ్ చేసారు. క్రమంగా వారిలో విసుగు, భయం, అసహనం. అల్లకల్లోలమైన నీటిలో ఉండలేక, నీళ్ళు చిమ్ముతుంటే ఒడ్డున మనలేక - వారి ఇబ్బంది హాహాకారాలుగా రూపు దాల్చింది. అంతా అరణ్యకి ఎదురు తిరుగుతుంటే వనజ అతణ్ణి అదుపు చేసే ప్రయత్నం చేసింది. స్నానం చేసేటప్పుడు విజృంభణ తగదని ఈతకి ముందే అతడికామె చెప్పింది. విజృంభణ లేకుంటే స్నానంలో మజా లేదనుకునే అరణ్యకి అదుపెందుకో తెలియలేదు. కానీ అక్కడి హడావుడి చూసి - తనవల్ల మళ్ళీ వనజకి ఇబ్బంది కలుగుతున్నట్లు గ్రహించి విన్యాసాలు ఆపేసాడు.

ఐతే చుట్టూ ఉన్న జనం ఊరుకోలేదు. వాళ్ళని అదుపు చేయలేక హిరణ్యారావుకి ఫోన్ చేసింది వనజ. హిరణ్యారావు వచ్చాడు. ముందు అందరికీ సర్దిచెప్పాడు. తర్వాత అరణ్య గొప్పతనాన్ని ప్రస్తావించి, "ఇతడు ప్రకృతిపుత్రుడు. నాగరికత పేరుతో మనం మర్చిపోయిన విశేషాల్ని - ఇతణ్ణి చూసి గుర్తుచేసుకోవాలి. నిజానికి మనిషికి స్నానాన్ని మించిన వ్యాయామం లేదు. ఒలింపిక్ క్రీడల్లో స్నాన ప్రావీణ్యాన్ని చూడ్డంకోసం టీవీలకి అంటుకుపోతాం కదా! అంతకి మించిన శక్తియుక్తుల్నితడు ప్రదర్శిస్తే మెచ్చుకోవడం పోయి, న్యూసెన్స్ అనుకుంటున్నాం. బహుశా నాగరికత అంటే అదేనేమో!" అన్నాడాయన.

ఆయన అంతటితో ఊరుకోలేదు. అరణ్యని భుజం తట్టి మెచ్చుకుని, "నీ స్నానలీలల గురించి విన్నాను కానీ చూడలేదు. నాకోసం మరొక్కసారి.." అన్నాడు.

అరణ్య ముఖంలో వెలుగు. "నువ్వు హిరణ్య.. నేను అరణ్య.." అంటూ ప్రేమగా నవ్వి - ఉన్నట్లుండి గాల్లోకి ఎగిరి డైవింగ్ స్పాట్ కంటే ఎత్తుకి వెళ్ళి అక్కణ్ణించి నీళ్ళలోకి దూకాడు.

నీళ్ళు ఎంతలా చిమ్మాయంటే ఒడ్డున ఉన్న హిరణ్యారావు తడిసి ముద్దయ్యాడు.

ఆ దృశ్యం చూసిన అరణ్య నీళ్ళలోంచే ఉత్సాహంగా చప్పట్లు కొట్టాడు.

●●●

అరణ్య నాగరికతకి పరిచయం చేయడంలో హిరణ్యారావు నిర్వహిస్తున్న పాత్ర అద్భుతమంటూ వనజ గుప్పించిన ప్రశంసలు - ఫోటోలని జత చేస్తుకున్న వార్తగా మారి, స్థానిక దినపత్రికల మొదటి పేజీలని అలంకరించి, నగరపౌరుల్ని అలరించాయి. ఆ మధ్యాహ్నం ఒక వ్యక్తి వనజని కలుసుకుని, "నన్ను గుర్తుపట్టావా అమ్మా - నేను భీమన్నని" అన్నాడు.

"గుర్తుపట్టడానికి నేను నిన్ను మర్చిపోతే కదా!" అంది వనజ.

భీమన్న ఎంతో సంతోషించి వనజ తలపెట్టిన సమాజ సేవా కార్యక్రమం తనలో ఎంత మార్పు తీసుకొచ్చిందో చెప్పాడు.

"నాకు చాలా సంతోషంగా ఉంది" అంది వనజ.

"కానీ నాకు సంతోషంగా లేదు" అన్నాడు భీమన్న.

"ఎందుకని?" అంది వనజ ఆశ్చర్యంగా.

సమాజంలో దుష్టశక్తులు భీమన్నని క్రూరమృగాన్ని చేస్తే - వనజ అతణ్ణి మళ్ళీ మనిషిగా మార్చింది. మృగంలా అనుభవించిన సుఖాలకంటే మనిషిలా ఎదుర్కొంటున్న సవాళ్ళే - అతడికి సంతోషాన్నిస్తున్నాయి.

"నువ్విప్పుడా దుష్ట శక్తుల్ని ఆరాధించే దశకి దిగజారిపోయావ్" అన్నాడు భీమన్న బాధగా.

"రాముడు దేవుడెలాగయ్యాడు - ప్రజలంతా అన్నారనేగా! హిరణ్యారావుని ప్రజలందరూ దేవుడంటున్నారు. అందరి మాటని నువ్వో, నేనో కాదనకూడదు" అంది వనజ.

"కానీ ప్రజలు అమాయకులు.."

"ప్రజలు అమాయకులనుకోవడం మన భ్రమ. వాళ్ళు తమకి సుఖమనిపించిన పని చేస్తున్నారు. ఆ సుఖాల్లోనే దోపిడికి గురికావచ్చు. అన్యాయానికి బలైపోవచ్చు. అవినీతికి తలొంచొచ్చు. కానీ అది వారి అసహాయత కాదు. అవకాశవాదం. ఈ అవకాశవాదులకోసం గుండెలు మండి కొందరు సమాజానికి దూరమై అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు సమాజంలోనే ఉంటూ అందరి అపహాస్యానికీ గురౌతున్నారు. ఈ అవకాశవాదులు ఎవర్ని సమర్థిస్తే వారే సమాజంలో ఓ వెలుగు వెలుగుతున్నారు. హిరణ్యారావు వారి ఛాయిస్. కాబట్టి ఆ అనుభవమూ వారి ఛాయిస్..." అంది వనజ.

"నువ్విలా ఎందుకు మాట్లాడుతున్నావో నేనర్థం చేసుకోగలను.. నువ్వు జీవితంలో చాలా నష్టపోయావు. త్యాగాలు చేసి చేసి విసిగిపోయావు. నీ కృషికి లభించిన ఫలితం నిన్ను నిరాశకి గురిచేసింది. అందుకే నేను నిన్ను చూడవచ్చాను. మార్పు నీలో కాదు - సమాజంలో రావాలి. నువ్వు ఎప్పటిలాగే ఉండాలి. అందుకు నేనేం చేయాలో చెప్పు. ప్రాణాలకి తెగించి కూడా నీ కార్యం సాధిస్తాను. ఇన్స్పెక్టర్ రఘు పోతే ఆ స్థానం తీసుకుందుకు నేనున్నాను" అన్నాడు భీమన్న.

ఆజ్ఞాపించమన్నట్లు తలొంచుకున్న భీమన్నని ఆశ్చర్యంగా చూసింది వనజ, "భీమన్నా, నీకు నా కృతజ్ఞతలు. ఇన్స్పెక్టర్ రఘు మళ్ళీ బ్రతికొచ్చిన అనుభూతి నాలో కలుగుతోంది. నా అన్నయ్య నాకున్నాడని ధైర్యంగా ఉంది. కానీ ఇప్పుడు మరో అన్నయ్యని కోల్పోయే ధైర్యం నాలో లేదు. నేనిప్పుడు దుష్టవినాశనం గురించి కాదు - సమాజ నిర్మాణం గురించి ఆలోచిస్తున్నాను. అవకాశవాదుల గురించి కాదు, అసహాయుల గురించి ఆలోచిస్తున్నాను. అరణ్యలో నేనాశించే మార్పు అటువా వాసుల జీవితాన్నే మార్చివేయగలదని నా నమ్మకం..."

"అమ్మా! నువ్వు వినాశకుల మధ్య నిలబడి నిర్మాణం గురించి ఆలోచిస్తున్నావు. అది జరిగే పనిగా నాకు తోచదు. నువ్వు నీ గదిలో కూర్చుని ఆలోచించు. నువ్వెక్కడ కావాలంటే అక్కడ బాంబునై పేలుతాను. నన్ను నీ ఆయుధం చేసుకో. ఇది నా ప్రార్థన" అన్నాడు భీమన్న.

వనజ ఆలోచనలో పడింది.

ఒకప్పుడు రఘు తన ఆయుధం. అతడి సాయంతో ఎన్నో ఘనకార్యాలు సాధించింది. ఆ ఆయుధం అంతం కాగానే తన బ్రతుకు వీధిన పడింది.

ఒకప్పుడు రఘు తన ఆయుధం. అతడి సాయంతో ఎన్నో ఘనకార్యాలు సాధించింది. ఆ ఆయుధం అంతంకాగానే తన బ్రతుకు వీధిన పడింది.

తనని చూసి కొందరు జాలిపడ్డారు. కొందరు ఏవగించుకున్నారు. ఒక్కరూ సాయపడాలనుకోలేదు. తానెవరి బారినుంచి ప్రజల్ని రక్షించాలనుకుందో ఆ హిరణ్యారావు సమాజంలో వెలిగిపోతున్నాడు. ప్రజలతడికి బ్రహ్మరథం పడుతున్నారు.

ఇప్పుడు భీమన్న తనకి ఆయుధమౌతానంటున్నాడు. ఎవరికోసం?

వనజ తల అడ్డంగా ఊపి, "భీమన్నా! అవసరమొస్తే నిన్ను తప్పక పిలుస్తాను. ప్రస్తుతం నేను తలపెట్టిన కార్యక్రమంలో నీకు పాత్రలేదు" అంది. భీమన్న వెళ్ళిపోయాడు.

అప్పుడు వనజ పక్క గదిలోకి వెళ్ళింది. అక్కడ ఓ మంచం మీద పసిబాలుడిలా అమాయకంగా నిద్రపోతున్నాడు అరణ్య. అతడి మంచం పక్కనే చిన్న బల్లమీద అతడి కుందేలు శశి కూర్చుని ఉంది. నిద్రపోతోందో, మెలుకువగా ఉందో కానీ అది కదలడం లేదు.

వనజ అరణ్యానే తదేక దీక్షగా చూస్తూ, "చుడ్డానికి అమాయకంగా ఉన్నాడు. కానీ కొండల్ని పిండికొట్టగలడు" అనుకుంది. అంతలోనే మళ్ళీ, "ఛీ - నాకిలాంటి ఆలోచనొచ్చిందేమిటి? నేను ఆయుధం గురించి ఆలోచిస్తే అవకాశవాదుల గురించి ఆలోచించినట్లే కదా!" అనుకుంది.

## 18

"**ఉదయం ఫోన్ చేస్తే రాత్రి రమ్మన్నావ్.** అందుకని రాత్రే వచ్చాను" అంది లీల.

"అరణ్యది పసిపిల్లాడి మనస్తత్వం. తానుండగా ఇతరులతో మాట్లాడ్డం ఎక్కువసేపు సహించలేడు. అందుకే అతడు నిద్రపోయాక రమ్మన్నాను" అంది వనజ.

"ఇక నేను మాట్లాడొచ్చా?" అంది లీల.

"అయ్యో, నిలబడే ఉన్నారు. కూర్చోండి" అంది వనజ.

"బిచ్చానికొచ్చాను. నీ ముందెలా కూర్చుంటాను?"

"ఈ నగరాన్నే కొనగల హిరణ్యారావు భార్య మీరు. మీకు బిచ్చమా - అదీ నేను!" అంది వనజ ఆశ్చర్యంగా.

"డబ్బుతో కొనలేనివి బిచ్చమెత్తే సాధించాలి. నాకు ప్రేమ బిక్ష కావాలి" అంటూ చీరని జోలెలా పట్టింది లీల.

"మీరు మాతృమూర్తి. మీ ప్రేమ అనంతం. మీకు ప్రేమ బిక్షా - అదీ నేను?" అంది వనజ ఆశ్చర్యంగా.

"బిడ్డ కోరింది తనవద్ద లేకపోతే అడుక్కునైనా తెచ్చి ఇవ్వాలనుకుంటుంది తల్లి. నా బిడ్డకి నీ ప్రేమ కావాలి" అంది లీల.

వనజ చటుక్కున లేచి నిలబడింది, "మిమ్మల్ని బిచ్చగత్తెలా తిరస్కరించి పంపలేను. మీ గౌరవార్థం లేచి నిలబడ్డాను. ఇప్పుడు కళ్ళు మూసుకుంటున్నాను. నేను కళ్ళు తెరిచేసరికి మీరిక్కడుండకూడదు" అందామె.

"నువ్విలా ఎందుకంటున్నావో నాకు తెలుసు. నువు నన్నపార్థం చేసుకున్నావు. అది తొలిగించాలనే వచ్చాను. అసలు జరిగిందేమిటంటే.."

"ప్లీజ్" అంది వనజ, "మీరు చెప్పేదేంటో నాకు తెలుసు. మీరు నిజంగా మంచివారే ఐతే ఆ మంచితనం నాక్కాక మీ వారికి ఉపయోగపడింది. కాబట్టి నా మటుకు నాకు - మీ మంచి, చెడ్డ ఒక లాంటివే. మీ భర్త నాగరికత ముసుగులో అనాగరికతకి పాల్పడుతున్నాడు. మీరు మంచితనం ముసుగులో మంచివారిని మోసగిస్తున్నారు. ఈ మోసాన్నిక్కడితో ఆపడం మంచిది"

"నేను చెప్పేది కాస్త వినమ్మా.."

"విన్నాను. నాకీ సమాజంలో ఉన్న ఒకే ఒక్క అన్నయ్యని పోగొట్టుకున్నాను"

"పోయిన నీ అన్నని తిరిగివ్వలేను. కానీ అంతకంటే ఆత్మీయుణ్ని నీకందించగలను. ప్రహ్లాద్ .." ఆగింది లీల.

"ప్రహ్లాద్.. ప్లీజ్ మీరు నా మాటగా అతడికి చెప్పండి. ఆ పేరు వింటేనే భరించలేనని. అతడే నా అన్నకి హంతకుడు" అంది వనజ.

ఆమె ఇంకా కళ్ళు మూసుకునే ఉండడం గమనించిన లీల భారంగా నిట్టూర్చి, "ప్రస్తుతానికి నీ కళ్ళు మూతబడి ఉన్నాయి. అవి తప్పక తెరుచుకుంటాయనే నా నమ్మకం. ఆ రోజు కోసం నేను, నా బిడ్డ ఎదురు చూస్తుంటాం" అంది.

వనజ బదులివ్వలేదు. ఆమె కళ్ళు తెరిచేసరికి అక్కడ లీల లేదు.

*********

హిరణ్యారావు తన అనుచరులతో సమావేశంలో ఉండగా వనజ ప్రసక్తి వచ్చింది.

"పిల్లకాకి. ఉండేలు దెబ్బ తగిలేసరికి ఠక్కున దార్లోకొచ్చింది" అన్నాడు హిరణ్యారావు.

"మిమ్మల్ని మీరు మరీ తక్కువచేసి మాట్లాడుతున్నారు. అది కాకి కాదు. పిచ్చుక. దానికి తగిలింది ఉండేలు దెబ్బ కాదు. బ్రహ్మాస్త్రం. బెదిరిపోయింది. జన్మలో మన జోలికి రాదు" అన్నాడో అనుచరుడు.

"అది నిజం. అసలు దానికిప్పుడు మనుషులంటేనే భయం పుట్టినట్లుంది. వెళ్ళి ఓ అడవి బుల్లోణ్ణి తెచ్చుకుంది. సంస్కరణ, సమాజసేవ అంటోంది కానీ, అది వాణ్ణి సుఖాలకోసమే తెచ్చుకుందని నా అనుమానం" అన్నాడు మరో అనుచరుడు.

"దాని విషయం మొదట్నించీ నాకు అనుమానంగానే ఉంది. అదో నింఫోమానియాక్. మగాళ్ళ కోసం వెర్రెత్తి పోయే దానికి సమాజ మర్యాదలు అడ్డొచ్చాయి. దాంతో రెచ్చిపోయి సమాజం మీదే తిరగబడింది. పెట్టుకోక పెట్టుకోక మీతో పెట్టుకుని చావుదెబ్బ తింది. ఇక ఈ సమాజంలో తన ఆటలు సాగవని అడివికిపోయి అరణ్యాని పట్టింది. దాని విచ్చలవిడితనానికి వాడు సరిపోయుంటాడు. వాణ్ణి బాగా మరిగింది. అడవి మనిషి సుఖమిస్తాడు కానీ అడవిలో సుఖముండదుగా. వాణ్ణి తీసుకుని ఇక్కడికొచ్చి సమాజసేవంటూ రెచ్చిపోయి పబ్లిగ్గా వెంటేసుకు తిరుగుతోంది" రెచ్చిపోయాడు మరో అనుచరుడు.

"ప్లీజ్" అరిచాడు హిరణ్యారావు అసహనంగా, "పవిత్ర భారత దేశం మనది. ఆడదాన్ని గౌరవించడం మన పవిత్ర సంప్రదాయం. వనజ ఆడది. ఆమెవల్ల మనకెన్ని ఉపద్రవాలొచ్చినా ఎదుర్కుందాం. ఆమె ఆడతనాన్ని రచ్చకీడ్వద్దు. ఇక్కడే కాదు. వేరెక్కడా ఆమె గురించి మీరిలా మాట్లాడితే నేను సహించలేను"

అనుచరులాశ్చర్యపోయారు. ఆయన ఆమెని సమర్థించడంలోని ఆంతర్యం వారికి బోధపడలేదు. ఏమిటని అడిగే ధైర్యం వాళ్ళకికలేదు. అడిగినా ఆయన చెప్పడు. ఎందుకంటే..

ప్రహ్లాద్ వనజని ప్రేమించాడు. ప్రహ్లాద్‌ని హిరణ్యారావూ ప్రేమించాడు. వనజని తన కొడుక్కి చేసుకుందుకు ఆయనకే ఇబ్బందీ లేదు - ఆమె ఆశయాలు తప్ప. వనజ ఆశయాల బలం తెలియక - డబ్బు కోసం సమాజంలో హోదాకోసం - ఆమె ప్రహ్లాద్‌తో పెళ్ళికి ఒప్పుకుంటుందనే అనుకున్నాడాయన. అందువల్ల వనజని కోడలు అన్న దృష్టితో చూడ్డానికి మానసికంగా అలవాటు పడ్డాడు.

వనజ ఆయనకి కోడలు కాలేదు. బహుశా కాబోదు. కానీ ప్రహ్లాద్ ఆమెనింకా ప్రేమిస్తూనే ఉన్నాడు. ఆమె నిర్లక్ష్యం చేస్తోంది కానీ ఇప్పటికీ ఆమెని పెళ్ళాడ్డానికతడు సిద్ధమే. వనజ మనసు మార్చుకుంటే ఇంకా వాళ్ళ పెళ్ళి జరిగే అవకాశముంది.

వనజ వ్యక్తిత్వం ఎంత గొప్పదో హిరణ్యారావుకి తెలుసు. ఆమె అరణ్యని మరిగిందంటే ఆయన నమ్మడు. ఐతే ప్రహ్లాద్ ఆమెకి దూరం కావడానికి అలాంటి ప్రచారం సహకరిస్తుందంటే - దానికాయనకేం అభ్యంతరం లేదు. కానీ ప్రహ్లాద్ వనజమీద జరిగే ఎలాంటి ప్రచారాన్నీ పట్టించుకోడు. వనజనీ, అరణ్యనీ సన్నిహితంగా చూసినా కూడా అతడి మనసు ఆమెతో పెళ్ళికి విముఖం కాదు. అంతలా అతడామెని ప్రేమించాడని ఆయనకి తెలుసు. అందుకే హిరణ్యారావు వనజ చరిత్రని తప్పు పట్టనివ్వడు. రేపు వనజ మారి ప్రహ్లాద్‌తో పెళ్ళికి ఒప్పుకుంటే - తన కోడలు మచ్చనెరుగని మగువ కావాలని ఆయన ఆశయం.

ఇలా ఆలోచించి ఆయన అట్నించి నరుక్కొస్తున్నాడు. సమాజంలో వనజ వ్యక్తిత్వాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చాలి. అరణ్యానామెకి తగిన వరుణ్ణి చేయాలి. ఆ మాట వనజ చేతే చెప్పిస్తే ప్రహ్లాదే వాళ్ళ పెళ్ళి తన చేతుల మీదుగా జరిపిస్తాడు.

సమాజంలో స్వార్థపరులకీ, దుష్టశక్తులకీ - స్వప్రయోజనాల విషయమై ఇంతటి దూరాలోచన ఉండడం వల్లనే సమాజంలో సామాన్యులకీ, స్త్రీలకీ ఇంకా కొంత రక్షణ ఉంది.

"వనజ గురించి నాకు బాగా తెలుసు. ఆమె ఒకప్పుడు మాత్రమే మనకి నిప్పు రవ్వకావచ్చు. కానీ ఇప్పటికీ ఎప్పటికీ ఆమె నిప్పు.." అన్నాడు హిరణ్యారావు అనుచరులతో.

అది మాటకాదనీ, నిప్పు రవ్వల తూటాలాంటి హెచ్చరిక అనీ అనుచరులకి అర్థమైంది.

*********

"డ్రైవర్ కారాపు" అన్నాడు హిరణ్యారావు. సడెన్ బ్రేకుతో కారాగింది.

హిరణ్యారావు ఓ చేతిలోకి చేతి కర్ర, మరో చేతిలోకి బ్రీఫ్ కేసూ తీసుకుని కారు దిగి, "ఇదిగో జగన్నాథం" అంటూ గట్టిగా పిలిచాడు.

దారినపోతున్న జగన్నాథం అనే వ్యక్తి చటుక్కున వెనక్కి తిరిగి ఆయన్ని చూసి వెనక్కి వచ్చాడు.

అన్నీ ముందుగానే నిర్ణయించుకుని చేసినా చూసేవాళ్ళకి అప్పటికప్పుడు అనుకోకుండా జరిగినట్లు అనిపించేలా వ్యవహారం నడపడం హిరణ్యారావు స్టైలు. జగన్నాథానికిప్పుడాయన బ్రీఫ్ కేసివ్వాలి. ఐతే అది జరిగేలోగా ఓ వ్యక్తి ఆయన వెనక నుంచీ వచ్చి ఆ బ్రీఫ్ కేస్ లాక్కుని పరుగెత్తాడు. అది తన ప్లాన్‌లో భాగం కాకపోవడంతో, "దొంగ, దొంగ" అంటూ అరిచాడాయన.

దొంగ బ్రీఫ్ కేసుతో సహా స్పీడందుకున్నాడు.

ఆ బ్రీఫ్ కేసు జగన్నాథం తప్ప వేరెవరందుకున్నా - పట్టపగలు నడిరోడ్డుమీద హిరణ్యారావు తలపెట్టిన ఓ దారుణ కృత్యానికి తిరుగులేని నిదర్శనమౌతుంది.

"దొంగ, దొంగ." మళ్ళీ అరిచాడాయన.

ఈసారి వెనుకనుంచీ ఇంకెవరో ఆయన చేతికర్రని బలంగా లాక్కున్నారు. ఏం జరుగుతోందో అర్థంకాక అయోమయంలో పడ్డ హిరణ్యారావు వెనక్కి కూడా తిరగలేదు.

అప్పుడు, "నువ్వు హిరణ్య.. నేను అరణ్య.." అంటూ పరిచిత కంఠం వినిపించింది.

"అరణ్య" అంటూ హిరణ్యారావు చప్పున వెనక్కి తిరిగాడు.

అరణ్య ఆయన చేతికర్రని బలంగా విసిరాడు. అది సూటిగా వెళ్ళి పరుగెడుతున్న దొంగ తలని బలంగా తాకింది. దొంగ వెంటనే నేలకూలాడు.

"గుడ్ షాట్" అంది అరణ్యా పక్కనే ఉన్న వనజ.

హిరణ్యరావుకి తన బ్రీఫ్ కేస్ దక్కింది. అది జగన్నాథంని చేరింది.

హిరణ్యరావు అరణ్యాని పొగడ్తలతో ముంచెత్తేస్తే, "అరణ్యా గురికి తిరుగులేదు. సమయానికి మేమిక్కడుండి మీకు సాయపడగలడం మా అదృష్టం" అంది వనజ.

"నాకు సాయపడగలగడం నీ అదృష్టమని నువ్వనుకుంటే అది నా అదృష్టం" అన్నాడు హిరణ్యరావు సంతోషంగా.

"ఎవరి అదృష్టానికెవరు కర్తలు?" అనుకుంది వనజ - అదృష్టం, కర్మ తనకి ఒక్కటే ఐనట్లు.

*********

కొద్ది రోజుల్లోనే అరణ్యా నగరానికే పెద్ద ఆకర్షణ అయ్యాడు. మీడియాకి అతడి లీలలు ప్రత్యేక లక్ష్యమయ్యాయి. ఒకరోజు వనజ, అరణ్యా - జనప్రియ క్లబ్ ప్లేగ్రౌండ్‌లో బాస్కెట్ బాల్ ఆట చూస్తున్నారు. ఉన్నట్లుండి అరణ్యలో ఉద్రేకం. అతడు గ్రౌండ్‌లోకి దూకపోతుంటే వనజ చేయి పట్టుకుని వారించింది. గతంలో జరిగిన రభసల ప్రభావమో ఏమో - అతి కష్టం మీద తన్ను తాను అదుపు చేసుకున్నాడు అరణ్యా. కానీ తనూ ఆటలో పాల్గొంటానని చిన్నపిల్లాడిలా మారాం చేసాడు. వనజ హిరణ్యరావుకి ఫోన్ చేసింది. ఆయన రికమెండేషన్‌తో వెంటనే అతడు జనప్రియ క్లబ్‌లో బాస్కెట్ బాల్ టీమ్ మెంబరయ్యాడు. ఒకే ఒక్క రోజు ప్రాక్టీసు చేసి తన టీముకే బెస్ట్ ప్లేయర్ అనిపించుకుని - మర్నాడు హైవే క్లబ్‌తో జరిగే ఇంటర్ క్లబ్ పోటీల్లో జనప్రియ తరఫున ఆడడానికి టీమ్ మెంబరుగా ఎన్నికయ్యాడు.

హైవే క్లబ్ టీమ్ ఆ నగరానికే ఛాంపియన్. జనప్రియది అట్టడుగు ర్యాంక్. వాటిమధ్య జరిగే పోటీలో ఫలితం పట్ల ఎవరికీ ఆసక్తి ఉండదు. హైవేకి విక్టరీ మార్జిన్‌లో కొత్త రికార్డులు సృష్టించడానికే అన్నట్లుంటుంది ఆ పోటీ. కానీ మర్నాడు జరిగిన పోటీలో అరణ్యా సమక్షం అంతా తారుమారు చేసింది. కోర్టులో అతడిది మెరుపు వేగం. అతడి గురి అమోఘం. రికార్డు స్కోరుతో జనప్రియ సాధించిన విజయం నగర క్రీడాకారుల్లో ఒక సంచలనం. ఆ గేమ్ వీడియో అన్ని టీవీ ఛానెల్స్‌కీ పెద్ద ఆకర్షణ.

జనప్రియ క్లబ్‌కి ఇది ఊహించని విజయం. అందుకని మర్నాడే పెద్ద ఎత్తున సెలబ్రేషన్ పార్టీ ఏర్పాటు. అందులో జరిగిన బ్రేక్ డ్యాన్స్ షోలో అరణ్యా తనూ వేదికనెక్కాడు. ప్రొఫెషనల్స్‌తో పోటీపడి విజృంభించి డ్యాన్స్ చేసాడు. అతడి నృత్యంలో సహజత్వపు సొగసులు సభ్యులచే పదే పదే చప్పట్లు కొట్టించాయి. ఆ వీడియో కూడా టీవీ ఛానెల్సుకి పెద్ద ఆకర్షణ.

బాస్కెట్ బాల్లో ఓ మైకేల్ జాక్సన్నీ, బ్రేక్ డ్యాన్లో మరో మైకేల్ జాక్సన్నీ మరిపించాడంటూ- మీడియా అతణ్ణి ఆకాశానికెత్తేసింది.

అరణ్యా తనని పరిచయం చేసుకుందుకు అరచేతులతో ఛాతీమీద తట్టుకుంటాడు. యువతరానికి అదో కొత్త ఫ్యాషనైంది. ఇప్పుడు చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు పరిచయానికి అతణ్ణి అనుకరిస్తున్నారు. మీడియా అతణ్ణి యూత్‌కి ఐకాన్‌గా అభివర్ణిస్తోంది.

ఈ విశేషాలన్నీ వనజని ఆలోచింపజేస్తున్నాయి.

ప్రకృతి పుత్రుడు కావడం వల్లనేమో అతడి ప్రతిభ మానవాతీతమనిపిస్తోంది. ఆ ప్రతిభ ఏ దుష్టశక్తులవైపు మళ్ళుతుందోనన్న భయం, తనవల్లనే ఆ ప్రతిభ దోపిడి కాదు కదా అన్న అనుమానం ఆమెని వేధిస్తున్నాయి. "రఘు రాకతో సమాజాన్నెదిరించాను. ప్రహ్లాద్ రాకతో రఘుని కోల్పోయాను. ఇప్పుడు అరణ్యా రాకతో ఏం జరుగుతుంది నా జీవితంలో?" అన్నది ఆమె మనసులో కలకలం.

అరణ్యా రాకలో ఏదో ఆంతర్యముందనీ, అతడి ప్రతిభలో సమాజ హితముందనీ ఆమెకి పదే పదే అనిపిస్తోంది.

కానీ అటువా వాసుల జీవితాన్ని మార్చాలని తానతణ్ణి నగరంలోకి తీసుకొస్తే - మారనున్నది ఎవరి జీవితమో - ఆమె ఊహకి అందకుండా ఉంది.

*******

ఒకరోజు అరణ్య ఎందుకో డల్‌గా ఉంటే ఉత్సాహపరచడానికి సినిమా ప్రపోజల్ పెట్టింది వనజ. అరణ్య ఊఁ అన్నాడు కానీ ఉత్సాహపడలేదు.

"ఏమయింది నీకు?" అడిగింది వనజ.

నెమ్మదిగా చెప్పాడు అరణ్య.

అతడికి గాలి కావాలి. నీరు కావాలి. చెట్టుకావాలి. పుట్టకావాలి. ఆటకావాలి. వేట కావాలి.

ఒకటి కాదు. రెండు కాదు. ఒకటొకటిగా ఎన్నో ఎన్నెన్నో కోరికలు. కానీ తీరాల్సింది ఒకటొకటిగా కాదుట. ఒక్కసారిగా..

అసమంజసమని నచ్చచెపితే అరణ్య తన కోర్కెల్ని వెనక్కి తీసుకుంటాడని వనజకి తెలుసు, "ఒకటొక్కటిగా ఐతే ఫరవాలేదు. ఒక్కసారిగా ఇవన్నీ ఎలా సాధ్యమో చెప్పు" అంది అనునయంగా.

"అటువా" అన్నాడు అరణ్య.

వనజ గతుక్కుమంది. ఈ మాత్రం తనకి స్ఫురించలేదేమిటి?

అరణ్య ప్రకృతి పుత్రుడు. అడవిలో అతడికి అన్ని సదుపాయాలూ ఒకేచోట ఉన్నాయి. ఆ పైన అదుపూ లేదు. జూలో జంతువుల్ని ప్రదర్శించినా వాటి సంతోషానికి వీలైనంతలో జంతు సహజ వాతావరణాన్ని సమకూర్చుతారు. అరణ్యని కృత్రిమ వాతావరణంలోకి తెచ్చి పడేసిన తను ఆ సంగతే ఆలోచించలేదేమిటి?

"కాసేపట్లోనే అటువాకి వెడదాం" అందామె. వెంటనే అరణ్య ముఖంలో ఉత్సాహం.

********

కాలినడకన వెడుతున్నారు వనజ, అరణ్య. ఆమె చేతులూపుతూ, అతడు కుందేలు శశి వీపు నిమురుతూ.

అప్పటికే వాళ్ళు బస్ స్టాప్ నుంచి చాలా దూరం వచ్చేసారు. ఆ ప్రాంతంలో జనసంచారం తక్కువగా ఉన్నా అరణ్య పక్కనుంటే వనజకి భయమన్నది స్ఫురించదు. అరణ్య మానవాతీతుడనిపిస్తుందామెకి.

మరికొంత దూరం వెళ్ళేసరికి నరవాసన కూడా తగలడంలేదు. అరణ్య ఉత్సాహంగా గెంతుకుంటూ ముందుకి పోతున్నాడు. కాస్త ముందుకెళ్ళి వనజ వెనకబడిందని ఆగిపోతున్నాడు.

అతడి ఉత్సాహం ఆమెకి అబ్బురంగా ఉంది.

నాగరికత మనిషిని మరని చేస్తోంది. మర బుద్ధుల మనిషికి అసలు మనిషి భావనా ప్రపంచం మరపైంది.

అరణ్య అసలు సిసలు మనిషి. ఊరి చివర అరణ్యాన్ని సమీపిస్తుంటే అతడిలో ఉత్సాహం పెల్లుబికింది. అదే ఉత్సాహంతో శశి అతడి చేతిలోంచి నేలమీదకి దూకింది.

శశి గెంతుతోంది. పరుగెడుతోంది. ముందుకెడుతోంది. వెనక్కి వస్తోంది. సాటి జంతువన్నట్లు అరణ్యతో ఆడుకుంటోంది. అరణ్య కూడా అలాగే స్పందిస్తూ దానితో సమంగా ఆడుతున్నాడు.

వాళ్ళు అడవిలో అడుగెట్టారు. క్రమంగా చెట్ల పచ్చదనం వారిని ఆక్రమిస్తోంది.

హుషారుగా గెంతుకుంటూ ముందుకెళ్ళిన శశి ఉన్నట్లుండి గోడకి కొట్టిన బంతిలా వెనక్కొచ్చి అరణ్య భుజమెక్కింది. వనజ దాని కళ్ళలో భయాన్ని చూసి, "అడవి జంతువుకి అడవిలో భయమా?" అనుకుంది. మరుక్షణంలోనే అందుకు కారణమూ తెలిసింది.

జంతువులుండాల్సిన అడవిలో చెట్టుచాటునుంచీ - జంతువుల్లాంటి నలుగురు మనుషులొచ్చారు. జీన్సు పాంట్సు ధరించిన వాళ్ళు చొక్కాలు వేసుకోలేదు. వళ్ళు చూస్తే బలిష్టులనీ, కళ్ళు చూస్తే దుష్టులనీ వెంటనే తెలిసిపోతుంది. శశికి కూడా తెలిసినట్లుంది. అందుకే దాని కళ్ళలో భయం.

వాళ్ళు వనజనీ, అరణ్యనీ అదోలా చూసారు. అరణ్య వాళ్ళని యధాలాపంగా చూసాడు. వాళ్ళు చేత్తో సైగ చేసి వనజని పిలిస్తే ఆ విషయం ఆమెకి చెప్పాడు కూడా.

"ఎందుకూ అనడుగు" అంది వనజ.

"ఎందుకు?" అన్నాడు అరణ్య.

"పిలిచింది నిన్నుకాదు, ఆ పిల్లని" అన్నాడో బలిష్టుడు.

"నన్నుకాదు, నిన్ను అంటున్నారు" అన్నాడు అరణ్య వనజతో.

"మరి నేనేం చేయాలనడుగు" అంది వనజ.

"మరి నేనేం చేయను?" అడిగాడు అరణ్య.

అతడా ప్రశ్న అడగడం ఎంత ప్రమాదమో వనజకి అప్పుడు స్ఫురించలేదు..

"కూర్చో, సినిమా చూద్దువుగాని" అన్నాడా బలిష్టుడు.

అరణ్యకింకా భాషలో శ్లేషలు తెలియవు.

గాలి. వెలుతురు. ఆరుబయలు. ప్రకృతి మధ్యన. అలాంటప్పుడు సినిమా చూసే అవకాశం అద్భుతమనిపించి చటుక్కున కూర్చున్నాడు.

బలిష్టులు వనజపై అత్యాచారం ప్రారంభించారు. కొంగులాగే వాడొకడు. చెయ్యిలాగేవాడొకడు. జాకెట్ చించేవాడొకడు. బుగ్గలు చిదిమేవాడొకడు.

వనజ పరుగెడుతోంది. వాళ్ళని తప్పించుకుందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఆక్రందనలు చేస్తోంది. అరణ్య చప్పట్లు కొడుతున్నాడు. ఈలలేస్తున్నాడు. గతంలో జరిగిన పొరపాటు సరిదిద్దుకోవాలన్నట్లు ఉత్సాహంగా సినిమా చూస్తున్నాడు.

అతడికి తన కళ్ళముందు ఓ అభాగిని అత్యాచారానికి గురౌతుందని స్ఫురించడంలేదు. సినిమాకీ, నిజజీవితానికీ తేడా తెలియడంలేదు.

ఎందరో పసిపిల్లలు సినిమాలు చూసి చూసి రక్తం ఏరులై పారినా చలించడం మానేసారు. పసిమనసున్న అరణ్య సినిమాలు చూసి మానభంగాన్ని ఆటగా భావించి వినోదిస్తున్నాడు.

"అరణ్యా.. అరణ్యా.. ప్లీజ్ హెల్ప్‌మీ" ఆక్రోశిస్తోంది వనజ.

సరిగ్గా అప్పుడే -

శశి అరణ్య భుజం మీంచీ ఉరికింది.

సినిమాలు చూడకనో ఏమో కానీ - అరణ్యకి అర్థంకానిదేదో దానికి అర్థమైనట్లుంది. అది బలిష్టుల మధ్యకి వెళ్ళింది. ఎగిరి వాళ్ళలో ఒకడి చేయి గట్టిగా కరిచింది.

కెవ్వుమన్నాడు బలిష్టుడు.

అప్పుడందరి దృష్టి శశిమీద పడింది. అప్పటికి సర్వశక్తులూ ఉడిగి నేలమీద పడున్న వనజని తాత్కాలికంగా వదిలి - ఓ బలిష్టుడు శశిని పట్టుకున్నాడు. గాల్లోకి ఎగరేసి వికటంగా నవ్వాడు.

ఆ నవ్వు తోడేలు అరుపులా ఉంది.

కుందేలుపై తోడేలు దాడి..

అరణ్య రివ్వున లేచాడు.

అతడికి తెలుసు. శశికి తనంటే ఎంత నమ్మకమంటే - తన సమక్షంలో ఎలాంటి క్రూరమృగాన్నైనా ఎదిరించడానికి సంకోచించదు.

అరణ్య సింహనాదం చేసాడు.

అడివి అదిరింది. అడవితోపాటే బలిష్టులూనూ.

అరణ్య వారి మధ్య కురికాడు. ఒక చేయి పట్టా కత్తిని తీస్తుంటే - మరో చేయి గాల్లోకి లేచింది.

అప్పటికి బలిష్టులు తేరుకున్నారు. తాము నలుగురు. అతడొక్కడు. అందుకని ఊహించని ఈ ఎదురుదాడికి వాళ్ళలో ఆశ్చర్యమే తప్ప భయం కలగలేదు. ఇంకా చెప్పాలంటే వాళ్ళకి అరణ్య మీద జాలి కూడా పుట్టింది.

గాల్లోకి లేచిన అరణ్య చేయి శశిని కింద పడకుండా పట్టుకుంది. రెండో చేతిలోని పట్టా కత్తి శరవేగంతో గిర్రున తిరిగింది.

తలలే తెగాయో, గుండెలు చిట్లాయో - బలిష్టులు నలుగురూ ఒక్కసారిగా నేలకూలారు.

అరణ్య శశిని తన గుండెలకి హత్తుకున్నాడు. కత్తిని నడుముకి వ్రేలాడదీసాడు.

అప్పటికి వనజ లేచింది. బట్టలు సరిచేసుకుంది. చిరిగిన జాకెట్‌ని చీర కొంగుతో కప్పింది. అరణ్యని సమీపించి, "నీకు నాకంటే శశే ఎక్కువ" అంది నిష్టూరంగా.

అర్థమైనట్లుంది, "నీది సినిమా. దీంది ప్రాణం" అన్నాడు అరణ్య.

అంత టెన్షన్లోనూ ఆ సంజాయిషీ ఆమెకి నవ్వు తెప్పించింది. అంత టెన్షన్ వల్లే ఆ నవ్వు తాత్కాలికమైంది.

అరణ్య పక్కనున్నాడని మహా ధైర్యంగా ఉంది తను. కానీ అరణ్యకి నటనకీ, వాస్తవానికీ మధ్య చిన్న కన్ఫ్యూజన్. అదీ తనవల్లే. అలాంటప్పుడు అతడు పక్కనుండీ ఏం లాభం?

ఈ రోజు తన మానం కాపాడింది అరణ్యకాదు, శశి!

వనజ అతడి దగ్గరనుంచి శశిని తీసుకుని ఆప్యాయంగా వళ్ళు నిమిరి హృదయానికి హత్తుకుంది. మనసు కాస్త తేలికపడేసరికి వళ్ళు బరువెక్కి అడుగు ముందుకు పడనంది. దుష్టులతో పోరాడి అలసిపోయిన శరీరం విశ్రాంతి కోరగా చప్పున కూర్చుందామె. వెంటనే అరణ్య కూడా ఆమె పక్కన కూర్చున్నాడు.

అప్పుడు వనజ గొంతు సవరించుకుంది. తనకొచ్చిన ప్రమాదం వాస్తవమనీ, అతడు తనని రక్షించే ప్రయత్నం చేసి ఉండాల్సిందనీ నచ్చచెప్పే ప్రయత్నం మొదలెట్టింది.

అంతా మౌనంగా విని, "అది నటనే. లేకపోతే వాళ్ళకి నీతో ఏం పనీ?" అన్నాడు అరణ్య "మరి శశితో వాళ్ళకేం పనీ?" అంది వనజ.

"అది తిండి. మరి నువ్వు?"

తడబడింది వనజ. పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం అన్నది సామెత్తేకానీ వాస్తవం కదు. పిల్లి ఎలకతో ఆడదే కాదు, వేట. వేట దానికి అవసరమేతప్ప వినోదం కాదు. వేట మనిషికి అవసరం కాదు, వినోదం. ఎంత చెప్పినా వేట వినోదానికంటే అరణ్యకి అర్థంకాదు. ఐనా తన ప్రయత్నంగా, "కొందరికి సాటి మనుషుల్ని బాధించడం ఆట. అది బలవంతులకి సరదా ఐతే బలహీనులకి బాధ" అందామె.

బలవంతుడైనా, బలహీనుడైనా మనిషి సాటి మనిషితో అలాంటి ఆట ఎందుకాడాలంటాడు అరణ్య.

ఇక ఆమెకి మంచి - చెడు ప్రస్తావన తేక తప్పలేదు. మంచి అంటే తెలిసింది కానీ చెడు ఏమిటో అరణ్య అవగాహనకి అందడంలేదు. అతడికి అర్థమయ్యే ఉదాహరణలకోసం వనజ బాగా ఆలోచించాల్సొచ్చింది. ఎందుకంటే అరణ్య అవగాహనకి అందడంలేదు. అతడికి అర్థమయ్యే ఉదాహరణలకోసం వనజ బాగా ఆలోచించాల్సొచ్చింది. ఎందుకంటే అరణ్య మాములు మనిషి కాదు. సినిమాలో మానబంగం చూసి వ్యతిరేకంగా స్పందించాడు. అలా చేయకూడదని నచ్చచెపితే - వాస్తవంలో మానభంగానికి కూడా చలించలేదు. అతడికేం చెప్పినా ఫలితం గురించిన దూరదృష్టి అవసరం.

"ఇందాకటి నలుగురూ చెడ్డ. నువ్వు మంచి. నేను మంచి." అంది వనజ బాగా ఆలోచించి.

"నువ్వు మంచి. నేను మంచి" అన్నాడు సంబరంగా అరణ్య.

"ఇంకా ఎవరు మంచి?" చిన్నపిల్లాడినడిగినట్లే అడిగింది వనజ.

అరణ్య శశిని చూపించి, "అది కూడా మంచి" అంది.

"ఇంకా?" అంది వనజ కుతూహలంగా. అరణ్య ఆలోచనలో పడితే, "బాగా ఆలోచించు. ఇంకా?" అందామె మళ్ళీ.

"హిరణ్య... హిరణ్య మంచి" అన్నాడు అరణ్య.

ఉలిక్కిపడింది వనజ. ఈ నాగరిక ప్రపంచంలో అడుగెట్టాక తన తర్వాత అతడికి హిరణ్యారావుని మించిన మంచివాడే దొరకలేదా?

"హిరణ్య మంచి కాదు. చెడ్డ" అంది వనజ.

"కాదు, హిరణ్య మంచి.." ధృఢంగా అన్నాడు అరణ్య.

మనుషుల మంచి చెడ్డలు అంచనా వేయడానికి అతడు కేవలం ఇతరుల అభిప్రాయాల మీద ఆధారపడడనీ, స్వానుభవానికీ ప్రాధాన్యమిస్తాడనీ అర్థమైందామెకి.

"అరణ్యని నేనింకా బాగా అర్థం చేసుకోవాలి. లేకుంటే నాకే ప్రమాదం" అనుకుందామె.

ఈలోగా అరణ్య లేచి అక్కడ పడి ఉన్న నలుగుర్నీ వరుసగా తన్నుతూ, "మంచి కాదు, చెడ్డ. వీళ్ళు చెడ్డ.." అంటున్నాడు. అతడెంత తన్నినా వాళ్ళు లేచి నిలబడి పారిపోయే ప్రయత్నం చెయ్యడంలేదు. వనజ ఆశ్చర్యపోయి దగ్గిరకెళ్ళి చూస్తే వాళ్ళెప్పుడో శవాలుగా మారిపోయారని అర్థమై వళ్ళు జలదరించింది.

హత్య... కాదు... హత్యలు.. అవీ నాలుగు..

"వీళ్ళు చచ్చిపోయారు" అందామె భయంగా.

వాళ్ళు చచ్చిపోయారని అరణ్యకు తెలుసు. ఐతే అందుకతడు భయపడ్డంలేదు. పైగా గర్వపడుతున్నాడు. పట్టాకత్తిని తీసి గుండ్రంగా తిప్పి ఒక్క వేటుతో నలుగుర్నీ ఎలా చంపాడో ఆమెకి వివరిస్తున్నాడు. అతడిలో అపరాధభావం లేశమైనా లేదు.

ఈ హత్యల గురించి పోలీస్ స్టేషన్లో రిపోర్టిస్తే - పోలీసులు అరణ్యని అరెస్టు చేసి ఉరికంబమెక్కిస్తారు. అది తెలియనివాడిలా అరణ్య మహా హుషారుగా ఉన్నాడు. ఇప్పుడు తనేం చేయాలన్నది వనజ మీమాంస.

"నువ్వు హత్యచేసావ్.." అంది వనజ అతడికి తనతప్పు తెలియాలని.

"తోడేలు.. చంపా.. శశి అంటే అన్నిటికీ భయం. వీళ్ళని చంపా.. నువ్వంటే అందరికీ భయం..."

అతడి మనోగతం వనజకి అర్థమైంది. క్రూరత్వంలో మనిషినీ, మృగాన్నీ వేరు చేసి చూడ్డం తెలియదతడికి. తనని వీళ్ళు హింసించబోయారు. అప్పుడే పులో వచ్చి వీళ్ళని చంపితే దానికి శిక్ష ఉండదు. అరణ్యా మనిషైపోయాడు కాబట్టి అది నేరం. అతడు మనిషి కాడనుకుంటే..

వనజ మనసు తాత్కాలికంగా తేలికపడింది. ఆమె అతడిచేత ఆ శవాల్ని దూరంగా అడివిలోకి విసిరేయించింది.

దగ్గర్లో ఉన్న కొలనులో అతడి పట్టాకత్తిని తనే స్వయంగా కడిగి శుభ్రం చేసింది. ఆ పని చేస్తున్నంతసేపూ ఆమెకి గుండెల్లో గుబులు. అరణ్యా మాత్రం శశితో ఆడుకుంటున్నాడు ఉల్లాసంగా ఉత్సాహంగా...

## 19

**అతనింటికి తిరిగి వెళ్ళాక ఆ రాత్రి వనజకి నిద్రపట్టలేదు**. నలుగురు దుండగలు తనకి మానభంగం చేయబోవడంకంటే - అరణ్యా వారిని ఒక్క వ్రేటుతో చంపిన తీరు అమానుషమని మనసు పదే పదే చెబుతోంది. అవలీలగా నాలుగు హత్యలు చేసి ఇంటికొచ్చి పెరుగన్నం తిని హాయిగా బబ్బున్నాడు అరణ్యా.

తనెలాంటి మనిషిని చేరదీసింది? ఈ మనిషివల్ల సమాజానికేం ప్రయోజనం?

ఆమె కళ్ళముందు అరణ్యా పట్టా కత్తిని గిరగిరా తిప్పుతున్నాడు. చుట్టూ చివ్వున రక్తం చిమ్ముతోంది. అప్పుడామెకి రఘు గుర్తుకొచ్చాడు. అతడి చావు..

అరణ్యా పట్టా కత్తితో గిరగిరా..

రఘు వంట్లోంచీ చివ్వున చిమ్ముతున్న రక్తం..

రఘుని చంపినవారు ఆటవికులు కారు. కానీ వారు అరణ్యాకంటే ఘోరంగా అతణ్ణి చంపారు.

అరణ్యా ఉద్దేశం రక్షణ. వాళ్ళ ఉద్దేశ్యం భక్షణ. అరణ్యాది ఆవేశం. వాళ్ళది కసి. అరణ్యా వాళ్ళకిచ్చింది మృత్యువు. వాళ్ళు రఘుకిచ్చింది చిత్రవధ. అరణ్యాది దుష్టశిక్షణ. వాళ్ళది శిష్ట భక్షణ.

మానభంగం అనాగరికం. అనాగరికుడు దాన్నెదిరించాడు.

తన ఆలోచనలేదారిలో వెడుతున్నాయో గ్రహించిన వనజ ఉలిక్కిపడింది.

వజ్రాన్ని వజ్రం. నిప్పుని నిప్పు. అనాగరికాన్ని అనాగరికం.

"రఘూ! నీ హత్యకి ప్రతీకారం చేసేదాకా నా మనసుకి శాంతిలేదు. నాకా విషయం తెలుస్తోంది. అరణ్యాని నేనెందుకు చేరదీస్తున్నానో అనాగరికాన్ని అరణ్యా ఎదుర్కోవడం ఈరోజే మొదలైంది. ఈ పోరాటం హిరణ్యారావుని చేరే రోజుకి ఎంతో దూరంలేదు" అనుకుందామె.

●●●

"హలో" అంది వనజ.

"ఈ రోజు పేపరు చూసావా?" అందో అపరిచిత స్వరం.

"ఎవర్నువ్వు?"

"ఆ హంతకుడెవరో నాకు తెలుసు"

"ఏయ్ - ఎవర్నువ్వు?" అంది వనజ ఉలిక్కిపడి.

"ఫోన్లో చెప్పడమెందుకు? అనుమతిస్తే స్వయంగా వచ్చి కలుసుకుంటాను.."

"నువ్వెవరో తెలిస్తే తప్ప నీతో మాట్లాడను" బింకంగా అంది వనజ.

"మాట్లాడ్డానికి అనుమతిస్తే తప్ప నేనెవరో చెప్పను" అందవతలి గొంతు.

"ఓకే - ఎప్పుడొస్తావ్?" అంది వనజ అసహాయంగా.

"ఇప్పుడే - ఐదు నిముషాల్లో.."

"సరే - ఇకనైనా నువ్వెవరో చెబుతావా?"

"థాంక్స్ వనజా! నేను ప్రహ్లాద్‌ని" ఫోన్ కట్టయింది.

●●●

"చివరికిలా బ్లాక్ మెయిలరువయ్యావన్నమాట!" అంది వనజ అతణ్ణి అదోలా చూస్తూ.

"లోపం నా జాతకానిదో, మొహానిదో! ఎప్పుడూ నామీద అపవాదులే వేస్తావ్!" అదోలా నవ్వాడు ప్రహ్లాద్.

ఆ గొంతులోని దైన్యం ముఖంలోనూ కనిపించడంతో ఆశ్చర్యపడింది వనజ.

శవాలు చూసానంటాడు. హంతకుడు తెలుసంటాడు. మరి నిబ్బరంగా ఉండాల్సిన ముఖంలో దిగులెందుకు?

"వనజా! నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. అందుకే అనుక్షణం నిన్ను వెన్నంటే ఉన్నాను. నిన్ను ప్రమాదాల్నుంచి కాపాడుకోవడమే నా ధ్యేయం. ఆ ప్రయత్నంలోనే ఆ నాలుగు హత్యలూ చూసాను. హంతకుణ్ణీ చూసాను. ఐనా నోరు విప్పను. నేను నోరు విప్పకపోతే ఈ హత్య ఫైలు మూతపడిపోతుంది. ఇదంతా నా ప్రేమని నువ్వర్థం చేసుకుందుకు అవకాశంగా భావించానే తప్ప బ్లాక్ మెయిలింగ్ అన్నమాటే నాకు నువ్వు చెప్పేదాకా స్ఫురించలేదు. నా ప్రేమని నమ్ము. మా నాన్న నీకు చేసిన అన్యాయానికి - ఆయనపై నీలో చెలరేగిన ప్రతీకార జ్వాలలింకా చల్లారి ఉండకపోతే - నీ మనశ్శాంతికోసం నేనేమైనా చేయగలను. అదీ చట్టానికి దొరక్కుండా. ప్లీజ్ వనజా! నన్ను ద్వేషించకు. ఉపయోగించుకో. ఇది నా రిక్వెస్ట్" అన్నాడు ప్రహ్లాద్.

అతడి కళ్ళు ప్రాధేయపడుతున్నాయని గ్రహించిన వనజ ఆలోచనలో పడింది.

ఒకప్పుడు తనా గొంతులోని నిజాయితీని నమ్మింది. ఫలితంగా రఘు బలయ్యాడు. ఇప్పుడితడి లక్ష్యం అరణ్య అనుకోవాలి.

"హిరణ్యారావ్! నువ్వింకా నీ పాత పద్ధతులు మానుకోలేదు. నీ కొడుకుని నా మీద ప్రయోగిస్తూనే ఉన్నావ్. కానీ నేను పాత వనజని కాదు. ఈసారి నీ ప్రయోగాన్నెలా తిప్పికొడతానో చూడు" అనుకుందామె.

"నన్ను నమ్ము వనజా!" మళ్ళీ వేడుకున్నాడు ప్రహ్లాద్.

"నిన్ను నమ్మడం చాలా కష్టం. ఐనా ప్రయత్నిస్తాను. అందుకు నీ సహకారం కావాలి" అంది వనజ.

ప్రహ్లాద్ కళ్ళు మెరిసాయి, "నువ్వేం చెప్పినా చేస్తాను" అన్నాడు.

"నీ తండ్రిని చంపమన్నాను. చంపగలిగేవా?"

ప్రహ్లాద్ తల వంచుకుని, "హత్యలు చేయడం నావల్లకాదు" అన్నాడు.

"హత్యలు నాకూ సరదా కాదు. కానీ నువ్వు నీ తండ్రిని చంపనన్నందుకు ఫలితంగా - నా రఘు చచ్చిపోయాడు. ఆ హత్య ఎంత క్రూరమైనదో తల్చుకుంటే.."

"అందుకు నువ్వే శిక్షైనా విధించు. అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను"

"నిన్ను శిక్షిస్తే అన్నయ్య తిరిగిరాడు. కానీ మరెందరో అన్నలు బ్రతికి బట్టకట్టడానికి నీ తండ్రి చావకతప్పదు"

"అది తప్ప ఇంకేమైనా అడుగు.."

"అది తప్పే అడుగుతాన్లే. ఎందుకంటే నీ సంగతి నాకు తెలిసిపోయిందిగా. నువ్వు చేయగలిగిందే నేనడుగుతాను. చెప్పేది శ్రద్ధగా విను" అంది వనజ.

ప్రహ్లాద్ చెవులు రిక్కించాడు.

ప్రహ్లాద్ ప్రేమ నిజమైనది. వనజ ఆ ప్రేమని నమ్మేదే కానీ హిరణ్యరావా నమ్మకాన్ని వమ్ముచేసాడు. ఇంకా చేస్తూనే ఉంటాడు. హిరణ్యరావు అడ్డు తొలిగితే తప్ప ఆ ప్రేమ ఫలించదు. అంటే ఆ ప్రేమ ఫలించడంలో జగత్కళ్యాణముంది.

"నువ్వు మీ నాన్నని చంపలేవు. కాబట్టి నేను చంపుతాను. నీకు అభ్యంతరమా?" అంది వనజ.

"నువ్వా?" అన్నాడు ప్రహ్లాద్ ఆశ్చర్యంగా.

"ఆఁ నేనే చంపుతాను. అందుకు నీ సహకారం కావాలి"

ప్రహ్లాద్‌కి నోటమాట రాలేదు.

"ఆలోచించుకో - నీ ప్రేమ ఫలించడం నీ చేతుల్లోనే ఉంది" అంది వనజ.

ప్రహ్లాద్ చటుక్కున, "నా ప్రేమకోసం కాదు, నీ సంతోషం కోసం - దేనికైనా నేనొప్పుకుంటాను. మా నాన్నని చంపడం వల్ల నీకు సంతోషం కలిగితే అందుక్కూడా నీకు నా సహకారముంటుంది" అన్నాడు.

"నీ సహకారముంటే నాకు మీ నాన్నని చంపడం చాలా సులభం" అంది వనజ.

"చెప్పు - నేనేం చేయాలో -" అన్నాడు ప్రహ్లాద్.

వనజ చెప్పసాగింది.

●●●

ఆ రోజంతా వనజ అరణ్యకి పాఠాలు చెప్పింది.

***నాగరిక ప్రపంచంలో నటన అంతర్భాగం. నాగరికం బాగా వంటబట్టిన వారికే ఆ నటన అర్థంకాదు.*** అరణ్యకేం తెలుస్తుంది?

వనజని దుండగులు చుట్టుముట్టినప్పుడు అరణ్య అది నటన అనుకున్నాడు. అలాగని అతడూరుకుంటే ఆమె ప్రాణం పోయేది. శశి కోసమైతేనేం అతడు పూనుకోబట్టే వనజకి ప్రాణాలు దక్కాయి.

"ఇతరుల నటన నాకు అర్థమైనట్లు నీకర్థంకాదు. నేను ప్రాణాలతో మిగలాలని నీకుంటే, నేనెప్పుడు ఎవర్ని చంపేయమంటే అప్పుడు - మంచి చెడ్డల గురించి ఆలోచించకుండా వెంటనే చంపేయ్" అంది వనజ.

అరణ్య బుద్ధిగా తలాడించాడు.

"హిరణ్యరావ్ - ఈ రాత్రితో నీ పని సరి" అనుకుంది వనజ.

●●●

లీల అప్పుడే స్నానం చేసి వచ్చి తెల్లచీర కట్టుకుంది. జడ వేసుకోకుండా జుట్టు విరబోసుకుంది.

అప్పుడే అలా వచ్చిన హిరణ్యరావు ఆమెని చూసి, "ఈ అవతారమేమిటి? ఎవరైనా చూస్తే నాకేదో అయిందనుకుంటారు. కనీసం ముఖానికి బొట్టైనా పెట్టుకో" అన్నాడు.

లీల నవ్వి, "నా అవతారంతో మీ భవిష్యత్తు శాసించడానికి నేనేం పతివ్రతని కాను" అంది.

"నువ్వు పతివ్రతని నా శత్రువులే నమ్ముతున్నారు. నీ పాతివ్రత్య ప్రభావంతోనే కదా - నామీద కత్తికట్టిన వనజ కూడా - ఇప్పుడు నాకు పూలమాలలు వేసి సత్కరిస్తోంది"

"ఏం పాతివ్రత్యమో కానీ నా పాతివ్రత్యాన్ని శాసిస్తున్నది మీరు.."

"అంటే?"

"మీకు వ్యతిరేకంగా పనిచేసాను. దాన్ని మీకు అనుకూలంగా తిప్పుకున్నారు. మీ సమర్ధతకి నా జోహార్లు"

"అయితే"

"నా ముఖాన బొట్టు మాత్రమే మిమ్మల్ని ప్రమాదాలనుంచి రక్షించగలదనుకుంటే ఆ బొట్టు మీరే పెట్టండి"

హిరణ్యరావు అహం దెబ్బతింది, "ఎందుకు లీలా - నన్నెప్పుడూ శత్రువులా చూస్తావ్! నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదా?"

లీల తల అడ్డంగా ఊపి, "నాకు తెలిసి మీరు మిమ్మల్ని తప్ప ఇంకెవర్నీ ప్రేమించలేరు" అంది.

హిరణ్యరావు నిట్టూర్చి, "నేనెవరికోసం జీవిస్తున్నానో నాకే తెలియదు. ఒక్కగానొక్క కొడుకు, కట్టుకున్న భార్య - ఇద్దరికీ నేనంటే ద్వేషమే" అన్నాడు.

"ప్రజలముందు నటిస్తారు - సరే! నా ముందెందుకండీ ఈ నటన?" అంది లీల వ్యంగ్యంగా.

హిరణ్యరావుకి కోపమొచ్చింది. అప్రయత్నంగా పళ్ళు పటపటలాడాయి. ఏదో అనబోతుండగా ప్రహ్లాద్ అక్కడి కొచ్చి, "నాన్నా, నువ్విక్కడున్నావా?" అన్నాడు.

"నా కోసం వెదుకుతున్నావా, దేనికి?" అన్నాడు హిరణ్యరావు.

"నా భవిష్యత్తుకి సంబంధించిన పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నాను. ఆ విషయమై ఏకాంతంగా మాట్లాడ్డానికి ఈ రాత్రి తొమ్మది గంటలకి నువ్వు నాకు టైమివ్వాలి.."

హిరణ్యరావు బదులివ్వకుండా సాలోచనగా అతడి వంక చూసాడు. ప్రహ్లాద్ మళ్ళీ, "టైం లేదనకూడదు. ఎన్ని అపాయింట్ మెంట్సుకన్నా సరే కాన్సిల్ చేసుకోవాలి" అన్నాడు.

"నా టైమంతా నీదేరా! మనమెక్కడ కలుసుకోవాలో చెప్పు" అన్నాడు హిరణ్యరావు ఆప్యాయంగా.

"నీ గదిలోనే"

"ఒకే - అప్పటికి నన్ను నేను ఫ్రీ చేసుకోవాలి కదా - వస్తాను" అంటూ హిరణ్యరావు ముందా గదిలోంచీ తర్వాత ఇంట్లోంచీ వెళ్ళిపోయాడు.

"నాన్న ఒప్పుకున్నాడు" అంటూ ఉత్సాహంగా తల్లిని చూసిన ప్రహ్లాద్ ఆమె రూపం చూసి నివ్వెరపోయాడు.

ఆ రూపం తను చేయబోయే పనికి పర్యవసానంలా అనిపించగా, "అయాం సారీ, అమ్మా!" అన్నాడు.

"ఎందుకురా సారీ?" నిర్లిప్తంగా అంది లీల.

"అపకారికి ఉపకారం చెయ్యమన్నాడు సుమతి. నేనిప్పుడు ఉపకారికి అపకారం చెయ్యబోతున్నాను" అన్నాడతడు దిగులుగా.

"నీ అభిప్రాయం తప్పు" అంది లీల, "ఉపకారి అంటే నీకు ఉపకారం చేసినవాడు కాదు. లోకానికి ఉపకారం చేసినవాడని అర్థం. మీ నాన్న లోకానికి అపకారం చేసారు. చేస్తున్నారు. నువ్వు లోకానికి ఉపకారం చేస్తున్నావు"

"మరోలా ఆలోచిస్తే - నాన్న నాకే అపకారం చేయలేదు సరికదా నాకోసమే జీవిస్తున్నాడు. సకల సదుపాయాలూ ఏర్పాటు చేసి, సమస్త వైభవాలూ అందించాడు. మాకు కలవనివి. అభిప్రాయాలు మాత్రమే. అంతమాత్రాన నేనాయన విషయంలో ఇంత దారుణానికి ఎలా పూనుకుంటున్నాను?"

"ప్రహ్లాద్ - ఇలాంటి సమయంలో గుండె నిబ్బరం కావాలిరా. మీ నాన్న లోకకంటకుడు. ఈ రోజుతో ఆయన పాపం పండింది. నీ వరకూ నువ్వు నిమిత్తమాత్రుడివి. అంతే!" అంది లీల.

"నువ్వు నిజంగానే అలా భావిస్తుంటే మరి ఈ వేషమేమిటమ్మా? ఇది నాకు హెచ్చరిక కాదా?"

"కాదు. ఈ వేషం నా తృప్తికోసం"

"అంటే?"

"ఆయన పోయారని చేతికి గాజులు, తల్లో పువ్వులు, ముఖాన బొట్టు, చీరకి రంగు తీసేస్తే - మనసా వాచా నేనాయన్ని భర్తగా గౌరవించినట్లే ఔతుంది. ఆయన నాలో ఏమార్పూ ఉండకూడదంటే - పోవడానికి ముందే ఈ రూపముండాలి"

"అమ్మా!" అన్నాడు ప్రహ్లాద్ ఉద్వేగంతో. లీల మాట్లాడలేదు.

"అమ్మకి నాన్నమీద ఎంతకోపం!" అని ఆశ్చర్యపడ్డ ప్రహ్లాద్‌కి తండ్రిపై మరీ అంతకోపం లేదు. కానీ ఆ క్షణంలో మాత్రం, "యూ డిజర్వ్ దిస్ నాన్నా!" అనుకున్నాడు.

●●●

రాత్రి తొమ్మిది గంటలు.

హిరణ్యరావు గదిలో - ఆయన, ప్రహ్లాద్.. సోఫాల్లో ఒకరికొకరు ఎదురెదురుగా -

"నాన్నా! నేను పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు ప్రహ్లాద్.

"ఇదా జీవితంలో వీడు తీసుకున్న పెద్ద నిర్ణయం?" అని మనసులో అనుకుని, "చాలా సంతోషంరా, పిల్లని నేను చూడాలా, నువ్వే చూసుకున్నావా?" అన్నాడు హిరణ్యరావు యధాలాపంగా.

"నేనే చూసుకున్నా, వనజని!" తాపీగా అన్నాడు ప్రహ్లాద్.

కొడుకు నోట వనజ పేరు వినిపించడంతో ఉలిక్కిపడ్డ హిరణ్యరావు, "వనజ ఒప్పుకుందా?" అన్నాడు.

"ఊఁ"

ఈసారి షాక్ తిన్నాడాయన, "నేను నమ్మను"

"ఇంకో అరగంటలో వనజ ఇక్కడికొస్తుంది"

ఆయనలో ఆశ్చర్యం పెరిగిపోయింది - "మరీ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?"

"చెబితే ఆ కాస్త సమయంలో నువ్వే అడ్డుపుల్ల వేస్తావోనని భయం!"

హిరణ్యరావుకి చెప్పలేనంత కోపమొచ్చింది. ఎలాగో తమాయించుకుని, "బాబూ, నీ భవిష్యత్తు గురించి నీకంటే నాకే ఎక్కువ చింత. నేనడ్డుపుల్లవేసినా అది నీ మేలు కోరే. ఐతే వనజని పెళ్ళి చేసుకుంటానని నువ్వంటే అడ్డుపుల్ల వేయాల్సిన అవసరం నాకు లేదు. ఎందుకంటే విధి ఎలాగూ మీ పెళ్ళికి ఎదురు తిరుగుతుంది" అన్నాడు నెమ్మదిగా.

"విధి ఐతే ఫరవాలేదు. ఎదిరించగలను. నిన్నెదిరించడమే నాకు కష్టం"

"నువ్వూ నేనూ కూడా విధి చేతిలో పావులమని మర్చిపోయి ఇలా మాట్లాడుతున్నావ్ - సరేలే - ఇప్పుడీ మాటలన్నీ ఎందుకు? నేనేం చేయాలో చెప్పు"

"తొమ్మిదిన్నరకల్లా వనజ వస్తుంది. మా పెళ్ళికి తన షరతులు చెబుతుంది. వాటికి నువ్వొప్పుకుంటా సరేసరి - లేకపోతే నేనేమైపోతానో నాకే తెలియదు -"

అది విన్నపంలానూ లేదు, బెదిరింపులానూ లేదు. కానీ రెండూ ధ్వనించాయి హిరణ్యరావుకి. ఆయన ప్రహ్లాద్‌ని చురుగ్గా చూసి, "అంటే తండ్రిగా నాకు నీ మీదున్న ప్రేమని ఋజువు చేసుకునే అవకాశమిస్తున్నావ్. ఉపయోగించుకుంటాన్లే" అన్నాడు.

కాసేపు ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది. తండ్రీ కొడుకుల చూపులు గోడగడియారం మీదకి మళ్ళాయి. సెకన్ల ముల్లు కదులుతూ పన్నెండు అంకెని తాకింది. అప్పటికే పెద్దముల్లు ఆరుమీదుంది.

"టైము తొమ్మిదిన్నర" రాక్షసుడి అట్టహాసంలా గడియారంలోంచీ ఓ స్వరం.

"నాన్నవన్నీ విలన్ టేస్టులు" అనుకున్నాడు ప్రహ్లాద్ మనసులో. అంతలోనే గది తలుపు ఎవరో తట్టారు.

"వనజ వెరీ పంక్చ్యువల్" అన్నాడు ప్రహ్లాద్.

"దట్స్ గుడ్" అన్నాడు హిరణ్యారావు గంభీరంగా. కానీ ఆ క్షణంలో అది మేకపోతు గాంభీర్యమని ఆయనకే అనిపిస్తోంది. ఏదో జరుగుతుందని తెలుసు. ఏం జరుగుతుందో తెలియదు. ఆయనలో ఉత్కంఠ. అది బయటపడకూడదన్న తాపత్రయం.

ప్రహ్లాద్ లేచి, "నాన్నా, నేను వెడుతున్నాను. తలుపు తీసి నేను బయటకెడితే వనజ లోపలికొస్తుంది. మీరిద్దరూ ఏం మాట్లాడుకుంటారో నాకు తెలియదు. తర్వాత నువ్వేం చెప్పినా నేను నమ్ముతాను. ఐతే వనజకోసం నేను గది బయట ఎదురు చూస్తూంటాను. లోపల ఆమెకేం జరుగుతుందో, అదే బయట నాకూ జరుగుతుంది - ఉపకారమైతే ఉపకారం. అపకారమైతే అపకారం!" అన్నాడు.

హిరణ్యారావు అహాన్ని చంపుకుని ఆ హెచ్చరికని భరించి తలూపాడు.

ప్రహ్లాద్ వెళ్ళి తలుపు తీసాడు. అతడు బయటకు వెడితే వనజ లోపలికొచ్చింది.

తలుపులు మూసుకున్నాయి. వనజ వెళ్ళి హిరణ్యారావు ముందు కూర్చుంది.

"నీలో మంచి మార్పు వచ్చిందనుకున్నాను. కానీ నువ్వు మావాణ్ణి పెళ్ళి చేసుకుంటానన్నావుటగా" అన్నాడు హిరణ్యారావు.

"చేసుకుంటాననలేదు. కానీ నన్ను చంపగలదెవ్వరు?" అన్నాడు.

"చావంటే నవ్వుతారేం?" అంది వనజ చిరాగ్గా.

"నీ జోకులు నాకెప్పుడూ నచ్చుతాయి మరి"

"మిస్టర్ హిరణ్యారావ్! మిమ్మల్ని చంపగల మనిషిని తీసుకొచ్చాను. మరి మీరు చావుకి సిద్ధంగా ఉన్నారా?" '

హిరణ్యారావు భృకుటి ముడతలు పడింది, "నా ఇంట్లో నన్ను చంపడమా?" అన్నాడాయన.

"ఔను. మీ ఇంట్లోనే. ఇప్పుడో మనిషొచ్చి మిమ్మల్ని చంపుతాడు. మీ చావు ప్రమాదవశాత్తూ జరిగిందేతప్ప హత్యకాదని మీ కన్నకొడుకు, కట్టుకున్న భార్య సమర్ధిస్తారు. అలా మీ చరిత్ర ముగిసిపోతుంది"

ఉలిక్కిపడ్డాడు హిరణ్యారావు. ఆయన కళ్ళలో రవంత భయం. ఐనా బింకంగా, "నన్నెవరు చంపుతారు?" అన్నాడు.

"అలా చూడండి. తలుపులు భళ్ళున తెరుచుకుంటాయి. స్థంభాన్ని చీల్చుకొచ్చిన నృసింహస్వామిలా ఓ అవతార పురుషుడు ప్రత్యక్షమౌతాడు" అంది వనజ.

హిరణ్యారావు భయంగా అటే చూస్తే తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.

హిరణ్యారావు దిగ్గున లేచాడు. అరణ్య రివ్వున లోపలికొచ్చాడు. అతడి చేతిలో పట్టా కత్తి తళుక్కుమంటోంది.

"అరణ్యా! వీణ్ణి చంపు" ఆదేశించింది వనజ. అప్పుడామె మనిషైతే ఓ జిజియా బాయి. దేవతైతే ఓ దుర్గామాత!

అరణ్య కత్తి ఝుళిపిస్తూ ముందుకి దూకాడు.

హిరణ్యారావు అప్రతిభుడై చూస్తున్నాడు. తనకి అంతిమ ఘడియలు సమీపించినట్లే తోచిందాయనకి.

ఏదో అనాలనుకున్నాడు. నోటమాట రాలేదు.

అరణ్య ఆయన్ని సమీపించాడు. అతడి కళ్ళలో క్రూరత్వం.

"ఊఁ అరణ్యా! వీణ్ణి చంపు" అంది వనజ కర్కశంగా.

అరణ్య కత్తిగాల్లోకి లేచింది. అంత వేగంగానూ కిందకి దిగి అతడి నడుముకి వ్రేలాడింది. అతడి ముఖంలో క్రూరత్వం మాయమై చిరునవ్వు వెలసింది. అతడు చూపుడు వేలితో హిరణ్యారావుని చూపించి, "నువ్వు హిరణ్య.." అన్నాడు. తర్వాత అరచేత్తో తన గుండె మీద కొట్టుకుని, "నేను అరణ్య.." అన్నాడు. తర్వాత చేతులు చాపి ఆయన్ని బలంగా కౌగలించుకున్నాడు.

జరిగినదానికి వనజ అప్రతిభురాలైంది. ఐతే మెదడు చురుగ్గా పనిచేసి విషయాన్ని వెంటనే ఆకళింపు చేసుకుందామె.

తానెంత ప్రయత్నించినా అకారణంగా ఎవర్నీ చంపడు అరణ్య. తానతడు మృగమనుకుంది కానీ కాదు. అతడు దేవుడు రూపొందించిన అసలు సిసలు మనిషి. ఆ మనిషిలో హిరణ్యారావు పట్ల ద్వేభావం లేదు సరికదా, స్నేహభావం కూడా ఉంది. కేవలం తన ఆజ్ఞతో ఆ స్నేహభావం తొలిగిపోదు.

"హిరణ్యారావ్ - నీకింకా భూమ్మీద నూకలున్నాయ్" అనుకుందామె అసంతృప్తిగా.

హిరణ్యారావు తొందరగా తేరుకున్నాడు. అంత తొందరగానూ తేరుకున్న వనజ - రెండడుగులు ముందుకేసి, "కంగ్రాట్యులేషన్స్ హిరణ్యారావుగారూ!" అంది.

అప్పటికి చచ్చి బ్రతికినట్లున్న ఆయనకి వనజ ధోరణిలో మార్పు మింగుడు పడలేదు, "ఏమిటిదంతా?" అన్నాడు చిరాగ్గా.

"అరణ్యకి మీరు చేసిన ఏర్పాట్లు అద్భుతం. అతడికి మీరెంతగా నచ్చారంటే నేను చెప్పినా మిమ్మల్ని చంపడు" అంది వనజ.

"అంటే?"

"ఆటవికులనుంచి మనం నేర్చుకోవలసినదిదే! ఉత్తపుణ్యాన వాళ్ళు ఎవర్నీ చంపరు. బాస్ ఆజ్ఞాపించినా సరే" అంది వనజ.

"కానీ, ఇందాక నువ్వు..?" అని ఆగేడాయన. అంతా గజిబిజిగా ఉందాయనకి.

"జరిగిందంతా ఓ డిమాన్ స్ట్రేషన్ ఎక్స్‌పరిమెంటు. నేనెంత మారినా మీకు నా మీద గురి కుదరకపోవచ్చని నాకు తెలుసు. అందుకే అరణ్యకి నేనెలాంటి శిక్షణ ఇస్తున్నానో మీకు తెలియబర్చాలనుకున్నాను. అందువల్ల నాకేమిటి ప్రయోజనమని మీరనుకోవచ్చు. ఒకసారి మీ చేతిలో దెబ్బ తిన్నాను. మళ్ళీ తినకూడదనే ఈ జాగ్రత్త. ఈ డిమాన్ స్ట్రేషన్ తర్వాత - నా గురించి ఇతరులు మీలో ఎన్ని అపోహలు కలిగించినా - మీ చల్లని చూపు నామీద ప్రసరిస్తూంటుందనే నా ఆశ" అంది వనజ.

ఆమె మాటల్లో వినయం. ముఖంలో ప్రసన్నత. క్షణం క్రితం కనబడ్డ రౌద్రం ఇప్పుడు మచ్చుకి కూడా లేదు. "ఈమె నటనలో ఆరితేరింది" అనుకున్నాడు హిరణ్యారావు.

"మరి నేను ప్రహ్లాద్ కేమని చెప్పాలి?" అడిగాడాయన.

"వేచి ఉండమనండి"

"ఎంతకాలం?"

"ఎంతకాలమెంతకాలం?" అని పాటలా హమ్ చేసి, "అది నాచేతుల్లో లేదు" అంది వనజ.

అరణ్య వాళ్ళ మాటలు వినడంలేదు. అతడా గదిలో నలుమూలలా తిరిగి అన్నీ పరీక్షగా చూసాడు. ఒకసారి సోఫాలో కూర్చున్నాడు. ఒకసారి మంచం మీద పడుకున్నాడు. కుతూహలంతో ప్రతి వస్తువునీ పదే పదే తాకాడు - ఆటవికుడిలా కాదు, అతి సున్నితంగా. అతడి తాకడికి గదిలో ఏ వస్తువూ పాడవలేదు.

"కమాన్ అరణ్యా! మనమిక వెళ్ళాలి" అంది వనజ.

ప్లాస్మా టీవీని అరచేత్తో సుతారంగా నిమురుతున్న అరణ్య వెంటనే వాళ్ళు ముందుకొచ్చాడు. హిరణ్యారావుకి చేతులు జోడించి, "సే లవ్" అన్నాడు. అతడితో పాటు వనజ కూడా చేతులు జోడించింది.

హిరణ్యరావు తనూ చేతులు జోడించాడు.

అప్పుడు అరణ్య మెదడులో అభిమానం తప్ప మరేం లేదు కానీ మిగతా ఇద్దరిలోనూ పరస్పర విరుద్ధమైన ఆలోచనలు రేగుతున్నాయి.

"ఇప్పుడిక్కడికి వనజ ఏం సాధించాలనొచ్చినట్లు? అనుకున్నది సాధించిందా లేక సమయానుకూలంగా ప్లేటు ఫిరాయించిందా?" అన్న అనుమానం హిరణ్యరావుని పీడిస్తోంది. వనజకి దురుద్దేశ్యమే ఉంటే తనని చంపడానికి తనింటికే రాదు. అరణ్య తనని చంపడని తనకి తెలియకపోవచ్చు కానీ ఆమెకి తెలిసే ఉండాలి. బహుశా అరణ్య ఎంత బలమైన భయంకరమైన ఆయుధమో డిమాన్ స్ట్రేట్ చేయాలనుకుందేమో! అదే నిజమైతే అరణ్య విషయంలో తను అప్రమత్తంగా ఉండాలి. ఇందాకా అతడు తనమీద పట్టాకత్తి ఎత్తినప్పుడు మూర్తీభవించిన మృత్యుదేవతలా కనిపించాడు మరి. ఆ దృశ్యం తలచుకుంటే మళ్ళీ వళ్ళు గగుర్పొడుస్తోందాయనకి.

ఎంతో సులభమనుకున్న అవకాశం ఇట్టే చేజారిపోయింది. తప్పు తనదే. అరణ్యని తను సరిగ్గా అంచనా వేయలేకపోయింది. హిరణ్యరావుపట్ల శత్రుభావం ప్రవేశపెడితే తప్ప అతణ్ణి ఆయన మీద ఆయుధంగా ప్రయోగించలేదు తను. ఇక అటునుంచి నరుక్కురావాలి. అటు అనగానే ఆమెకి స్ఫురించిన వ్యక్తి భూతనాథ్!

## 20

భూతనాథ్‌కి ప్రేమంటే నిదర్శనంగా అతడికో ప్రియురాలుంది. ఆమె పేరు సీత. ఆ ప్రేమకి అతడిచ్చే విలువలి సాక్ష్యంగా సీతకో పెద్ద బంగళా ఉంది. ఆ బంగళా కంటే పెద్దది దాని చుట్టూ ఉన్న స్థలం. ఆ స్థలాన్ని కప్పిన ఆకుపచ్చని దుప్పటిలా ఆస్ట్రేలియన్ గ్రాస్. ఆ దుప్పటిపై త్రీడీ డిజైన్లా అక్కడక్కడ ఫలవృక్షాలు, పూల మొక్కలు.

భూతనాథ్ విలాస పురుషుడు. నిర్దుష్టమైన పద్ధతిలో విలాసాలననుభవించడం అతడి ప్రత్యేకత. పగటిపూట విలాసాలు అతడికి నిషిద్ధం కావు కానీ సీతతో విలాసానికి రాత్రి సమయాన్నే కేటాయించాడతడు. వచ్చే రోజున ఆమెకి ముందుగా కబురెడతాడు. అపాయింట్‌మెంటు కోసం కాదు, అవసరమైన ఏర్పాట్లకోసం. భూతనాథ్ భోజనప్రియుడు. అందుకని ఉత్తప్పుడు తన వంట తనే చేసుకునే సీత - భూతనాథ్ వచ్చే రోజున ఆయనకి నచ్చే వంటవాడు హుస్సేన్‌ని పిలుస్తుంది. అంటే హుస్సేన్ ఆయనకి నచ్చేలా వంట చేస్తాడని కాదు. అతడు వంటవాడు. భూతనాథ్‌కి నచ్చాడు.ఆ రెండూ వేరు. అదెలాగంటే -

భూతనాథ్‌కి మాంసం లేకపోతే ముద్ద దిగదు. వంటపాత్రలో ఆ మాంసాన్నెలా వండారూ అన్నది కాదాయనకి కొశ్చను. వంటపాత్రదాకా అదెలా వచ్చిందీ అన్నదే పాయింటు.

అది మేక, గొర్రె, కుందేలు, పంది వగైరాల్లో ఏ సాధు జంతువైనా కావచ్చు. దాన్ని పొద్దున్నుంచి రాత్రి ఎనిమిది గంటలదాకా తెగ మేపాలి. అప్పుడొస్తాడాయన.

వంటవాడు జంతువుని తోటలో విడిచి వెళ్ళాలి. అప్పుడక్కడ ఆయన, జంతువు తప్ప మరెవ్వరూ ఉండకూడదు. భూతనాథ్ ఆ జంతువుని వేటాడ్డం మొదలెడతాడు. జంతువుకి ప్రాణ భయం. తోట పెద్దదే కానీ బయటపడే దారి ఉండదు. కాల యముడిలా భూతనాథ్.

జంతువుని తరమడానికి రోలర్ స్కేట్స్ వేసుకుంటాడు భూతనాథ్ బుద్ధి చెప్పడానికి కాళ్ళు మాత్రమే ఉన్న జంతువు కాసేపటికి శారీరకంగా అలసిపోతుంది. దాని కళ్ళు చూస్తే దానికీ మనసుందనీ, ఆ మనసు కూడా హింసకి గురౌతోందనీ అర్థమౌతుంది. పూర్తి

అసహాయ దశలో ఉన్న ఆ జంతువుని స్వయంగా చంపడం ఆయనకి వినోదం. ఆ వినోదం అందరికీ వినోదం కాదని ఆయనకి తెలుసు. వంట చేసేవాడికీ, వళ్ళప్పగించేదానికీ మూడ్ పాడవకూడదని ఆయన ఆ వినోదాన్ని వాళ్ళిద్దరికీ నిషేధించాడు.

ఆ తర్వాత వంటవాడికి వంట వినోదం. ఆయనకి ప్రియురాలు వినోదం.

ఒకసారి ఆయన అలా తోటలో ఓ మేకపిల్లతో ఆడుకుంటుంటే ఇంట్లో హుస్సేన్, సీత ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తున్నారు.

ఉన్నట్లుండి, "అయ్యో, అయ్యో, అయ్యయ్యో" అన్న పెద్ద కేక. అది పిలుపు కాదు, ఆర్తనాదం.

ఆ గొంతు భూతనాధ్ దేనని సీత గుర్తించింది. నాలుగు గోడల మధ్య పిల్లి పులి అయినట్లు, ప్రహరీ దాటలేని మేక తోడేలు అయిందేమోనన్న అనుమానంతో - ఆమె అతడికి ప్రియురాలు కావచ్చు, కనీ తన శాసనాన్ని నిర్లక్ష్యం చేసిన వారాయనకి ప్రియులు కారు. భూతనాధ్‌తో రిస్కు తీసుకుందుకామెకి చెప్పలేనంత భయం.

హుస్సేన్ కూడా భయపడ్డాడు కానీ అతడికి సీత కూడా యజమాని కావడంవల్ల తటపటాయిస్తూనే వెళ్ళాడు. అతడు వెళ్ళేసరికి భూతనాధ్ వికటాట్టహాసం చేస్తున్నాడు. ఆయన ముందు మేకపిల్ల చచ్చిపడి ఉంది.

భూతనాధ్ హుస్సేన్ ని చూసి, "పిలవకుండానే వచ్చావేం?" అన్నాడు.

"తమరికేదైనా అయిందేమోనని...." నీళ్ళు నమిలాడు హుస్సేన్.

"ఇలారా" అన్నాడాయన. అతడు దగ్గరకి రాగానే కుడి చెంప ఛెళ్ళుమనిపించి, "ఆఫ్టరాల్ మేకపిల్ల నన్నేం చేస్తుంది? నువ్వు నా మాటకెంత విలువిస్తావోనని చిన్న పరీక్ష పెట్టాను" అన్నాడు.

హుస్సేన్ బుర్ర గిర్రున తిరిగింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఐతే అవి తుడుచుకుందుకు కూడా భయపడుతున్న అతణ్ణి చూసి, "ఒకవేళ నాకేదైనా ఐతే నన్ను రక్షించగలననే వచ్చేవా? నువ్వు నాకంటే మొనగాడిననుకుంటున్నావా? నీ అహంకారానికిదీ శిక్ష" అంటూ కాలితో గట్టిగా తన్నాడు.

హుస్సేన్ బోర్లా పడిపోయాడు.

"మేకని తీసుకుని లోపలికి వెళ్ళు. క్షణాల మీద వంటైపోవాలి" అంటూ లోపలికెళ్ళాడాయన. ఆ తర్వాత సీత హుస్సేన్‌కి సారీ చెప్పుకుంది. "సారీ వద్దమ్మా! నన్ను పన్లోంచి తీసేయకుండా చూడండి చాలు" అన్నాడు హుస్సేన్.

పేరుని బట్టి హుస్సేన్ ముస్లిమ్ అనుకుందుకు లేదు. ఊరూ పేరూ లేని అనాథ అతడు. అవసరాన్ని బట్టి ఊరుతో పాటు పేరూ మార్చుతూ - ప్రస్తుతం హుస్సేన్‌గా చెలామణీ ఔతున్నాడు. భూతనాధ్ ఇచ్చే డబ్బు ముందు ఆయన దెబ్బ ఏ మాత్రం ఆనని ఆర్థికస్థాయి అతడిది. తిట్టినా కొట్టినా భూతనాధ్ అతడికి దేవుడే దేవుడు పెట్టే ఎలాంటి పరీక్షలకైనా తట్టుకోగల అచంచల భక్తి అతడిది. అది పలుమార్లు బుజువు కావడంతో హుస్సేన్ భూతనాధ్‌కి అభిమాన వంటవాడయ్యాడు.

●●●

ఆ రోజు భూతనాధ్ వస్తున్నట్లు సీతకి కబురొచ్చింది. సీతనుంచి హుస్సేన్‌కి కబురెళ్ళింది. ఆమె సందేశాన్నందుకుని ఓ చక్కని కుందేలు పిల్లతో వెళ్ళాడు హుస్సేన్.

సీత ఆ కుందేల్ని చూసి ఎంతో ముచ్చటపడి దాన్ని పెంచుకోవాలనుకుంది. అతణ్ణి మరో జంతువుని తీసుకురమ్మంది. హుస్సేన్ వెంటనే, "పెంపుడు జంతువు కూడా జంతువే. ఎటొచ్చీ పెంపుడు జంతువంటే మమకారం పెరుగుతుంది. ఆ తర్వాత అది అనుభవించే నరకం మనకీ నరకమే!" అన్నాడు.

ఆ హెచ్చరిక అర్థమైన సీత తనకోరికని మొగ్గదశలోనే త్రుంచేసింది.

హుస్సేన్ రోజంతా కుందేల్ని మేపాడు. సీతకి దాని దరిదాపులకి వెళ్ళాలంటేనే భయంగా ఉంది. తోటలో ఏం జరుగుతుందో చూడకపోయినా - ఏం జరుగుతుందో తెలుసామెకి. రాత్రి ఆ కుందేలు పడనున్న పాట్లు తలచుకుంటే ఆమె మనసేదోలా ఐపోతోంది.

"ఛీ! ఎలాంటి మనిషితో గడుపుతున్నాను?" అనుకుందామె.

రివాజు ప్రకారం రాత్రి ఎనిమిదింటికి భూతనాథ్ వచ్చాడు. హుస్సేన్ ఆయనకి కుందేల్ని అందించి వెళ్ళాడు.

భూతనాథ్ దాని మెడలో తాడు తీసి తన దగ్గిరున్న ఉచ్చు తగిలించి తోటలోకి వెళ్ళాడు.

దీపాల వెలుగులో పట్టపగల్లా ఉన్నదా తోట.

భూతనాథ్ జేబులోంచి క్యారట్ తీసి కుందేలుకి చూపించాడు. అది తినడానికి ఉత్సాహపడితే - క్యారట్ అల్లంత దూరంలో పడేలా విసిరాడు. కుందేల్ని నేలమీద దించాడు.

కుందేలు పరుగెత్తింది. ఉచ్చుతాడు భూతనాథ్ చేతిలో ఉంది.

కుందేలు క్యారట్‌ని అందుకునే సమయానికి ఆయన తాడు వెనక్కి లాగాడు. ఉచ్చు మెడ చుట్టూ బిగుసుకుని అది ముందుకెళ్ళలేకపోయింది.

భూతనాథ్ ఉచ్చును గట్టిగా బిగించలేదు. కుందేలు ప్రాణం అతి సున్నితమని ఆయనకి తెలుసు. అలా కాసేపు క్యారట్, ఉచ్చులతో ఆడాక మరో కొత్త ఆట.

ఆయన ఉచ్చు తొలిగించి క్యారట్ అందించాడు కుందేలుకి. అది తినబోతే కత్తినెత్తాడు. భయపడిన కుందేలు పారిపోబోతే తాడు విసిరి కుందేలు మెడకి ఉచ్చు బిగిసేలా చేస్తున్నాడు. అది దాని ప్రాణంపోనంత వదులుగా ఉండేలా చూస్తున్నాడు. ఆ విద్యలో ఆయన నేర్పరి.

భూతనాథ్ ఆడుకుంటున్నాడు. కుందేలు క్రమంగా అలసిపోయింది. అది ఒకచోట ఆగి ఆగకుండా రొప్పుతుంటే - భూతనాథ్ దాన్ని సమీపించి కత్తినెత్తాడు.

●●●

అదే తోటలో ఓ చెట్టు వెనక నిలబడి వనజ, అరణ్యా - ఈ దృశ్యం చూస్తున్నారు.

ఎర్రబడ్డ కళ్ళతో ఆవేశంగా రొప్పుతున్న అరణ్యా చేతికి ఉచ్చు తాడు అందించింది వనజ.

అరణ్యా తాటిని ముమ్మారు తిప్పి ఉచ్చు విసిరాడు. ఆ ఉచ్చు సరిగ్గా భూతనాథ్ మెడకి పడింది. ఆయన చేతిలో కత్తి జారిపడింది.

అరణ్యా భూతనాథ్‌ని లాగుతుంటే ఆయన విడిపించుకుందుకు ప్రయత్నిస్తూ వెనక్కి వెనక్కి వెడుతున్నాడు. వనజ చెట్టు చాటునుంచి బయటికొచ్చింది. దూరానున్న కుందేలు ఆమెని చూస్తూనే కొత్త శక్తిని సంతరించుకుంది. గెంతుకుంటూ వచ్చి ఆమె చేతుల్లో వాలింది. వనజ దాని వీపు నిమురుతూ, "ఓ మూగజీవీ! ఈ నాటకంలో నీ పాత్రని జయప్రదంగా నిర్వహించావు. ఈ ప్రయత్నంలో నిన్ను మానసిక, శారీరక హింసకి గురిచేసిన నన్ను మన్నించు. ఐతే ముమ్ముందు ఎన్నో మూగజీవాల్ని కాపాడ్డానికి సహకరించే ఈ పథకం విజయవంతం కావడంతో దేవుడున్నాడని మరోసారి ఋజువైంది. ఐతే ఇప్పుడు నీ ప్రాణాలు రక్షించకపోతే మాత్రం నన్ను నేనే మన్నించుకోలేకపోయేదాన్ని" అంటూ శశిని గుండెకి హత్తుకుంది.

శశి తలూపింది - అంతా తనకర్థమైనట్లు.

ఈలోగా వెనక్కి వెనక్కి వెళ్ళిన భూతనాథ్ అరణ్యకి దగ్గిరయ్యాడు. అరణ్యా నెమ్మదిగా భుజం తడితే గిరుక్కున వెనక్కి తిరిగాడు.

అరణ్యా పట్టాకత్తిని తీసి ఝుళిపించాడు.

"అయ్యో, అయ్యో, అయ్యయ్యో.." అరిచాడు భూతనాథ్.

అది ఆర్తనాదమే కానీ ఆ ఆర్తి తీర్చేందుకు ఎవరూ రాకపోవడం ఆయన చేసుకున్న ఏర్పాటే!

అప్పుడు భూతనాథ్ కుందేలు. ఇప్పుడు అరణ్య భూతనాథ్.

భూతనాథ్ అలసి సొలసి కదల్లేని స్థితికొచ్చేదాకా ఆ ఆట కొనసాగింది.

చివరికి ఉచ్చు భూతనాథ్‌కి ఉరి అయింది. ఆయనకి మిడిగుడ్లు పడ్డాయి. నాలిక బయటికొచ్చింది. ఓపికలేదో, ఉచ్చుబిగిసిందో - గొంతు మాత్రం బయటికి రాలేదు.

భూతనాథ్ చనిపోయాడని గ్రహించాక వనజ అరణ్య భుజం తట్టి శాంతపరిచి శశినతడికి అందించింది. అరణ్య దాని వీపు నిమురుతూ మామూలు మనిషియ్యాడు. ఇక వనజ అక్కడ ఎక్కువ సమయం తీసుకోలేదు.

అరణ్యకి అర్థమయేలా చెప్పి భూతనాథ్ శవాన్ని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చెట్టుకి వ్రేలాడదీయించింది. కింద ప్రహ్లాద్ జేబురుమాలు ఉంచి, "ఇకమీదట ఇది హిరణ్యారావు సమస్య. దీన్ని పోలీసులు ఆత్మహత్యగా నిరూపించడం తథ్యం" అనుకుంది.

అక్కణ్ణించి బయటికి వెడుతుంటే - అప్పుడే ఆమె ఆలోచనల్లోంచి భూతనాథ్ తొలిగిపోయి జాన్ స్టూవర్ట్ చోటు చేసుకున్నాడు.

●●●

వనజ కబురందుకుని పరుగున వచ్చాడు భీమన్న.

"భీమన్నా! నువ్వింక దిగాల్సిన సమయమొచ్చింది" అంది వనజ.

"నేను రెడీ" అన్నాడు భీమన్న ఉత్సాహంగా.

వనజ అతడికి ఏం చేయాలో చెప్పసాగింది. భీమన్న శ్రద్ధగా విని, "ఇలాంటి ఆలోచనలు మనుషులకి రావడం అసాధ్యం. నువ్వు నిజంగానే దేవతవి" అన్నాడు.

"ఈ మాత్రపుటాలోచనలకి మనిషి దేవత కానక్కర్లేదని గ్రహించిన రోజున మనదేశంలో హిరణ్యారావులకి మనుగడే ఉండదు" అంది వనజ గంభీరంగా.

"సరేనమ్మా! మరి నాకు సెలవిప్పించు" అన్నాడు భీమన్న.

"అయితే - ఈ రోజే నువ్వు చేయాల్సిన ముఖ్యమైన పని ఒకటుంది" అంది వనజ.

భీమన్న చెవులు రిక్కించాడు.

"వెళ్ళి జాన్ స్టూవర్ట్‌ని కలుసుకో. భూతనాథ్‌ని చంపింది నువ్వేనని నిర్భయంగా చెప్పు. తన కొడుకు ప్రహ్లాద్ మీద ఆ నేరం పడుతుందన్న భయంతో హిరణ్యారావు - భూతనాథ్ హత్యని ఆత్మహత్యగా చిత్రిస్తున్నాడని చెప్పు. జాన్ స్టూవర్ట్‌కీ భూతనాథ్ గతే పడుతుందని హెచ్చరించు. చేతనైతే తన్ను తాను రక్షించుకోమని సవాలు చేయి. అప్పుడతడి మనుషులు నిన్ను వేటాడ్డం మొదలెడతారు.."

"ఆ వేటంటే నాకు భయం లేదు. కానీ ఇందువల్ల నీకు ప్రయోజనం?" కుతూహలంగా అడిగాడు.

"అతడి దృష్టి నీ మీదుంటుంది. అప్పుడు నేను అతణ్ణి.." ఆగింది వనజ.

ఏం చెబుతుందా అని కుతూహలంగా చూస్తున్నాడు భీమన్న.

"ఎటాక్" అంది వనజ.

అదామె పథకమో తనకి సందేశమో తెలియదు భీమన్నకి. కానీ అక్కణ్ణించి కదిలినప్పుడు 'ఎటాక్'కి బయల్దేరేవాడిలాగే ఉన్నాడతడు.

●●●

నగరం చివర ఉంది జాన్ స్టూవర్ట్ స్థావరం. అక్కడ మాదక ద్రవ్యాలు తయారౌతాయన్నది ఓపెన్ సీక్రెట్. విశాలమైన ఆవరణ చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ. దానికి ఎత్తైన ఇనుప తలుపులతో ఒకే ఒక్క గేటు. ఆ గేటు ముందు పదిమంది పెట్టనిపించే ఒకే ఒక్క దర్వాను. చూడ్డానికి రాక్షసుడైనా కావడానికి సైంధవుడు. వాణ్ణి కాదని ఆ ఆవరణలో అడుగుపెట్టడం అసాధ్యమే అనొచ్చు.

ఆవరణ లోపలేం జరుగుతున్నదీ పోలీసులకి తెలుసు. కానీ వాళ్ళెప్పుడూ సైంధవుణ్ణి దాటి వెళ్ళాలనుకోలేదు. కురువంశంలో లాగే పోలీసుల్లోనూ పాండవులకంటే కౌరువుల సంఖ్యే ఎక్కువ. పరిపాలనలోనూ పాండవుల కంటే కౌరవులకి వచ్చే అవకాశాలే ఎక్కువ. ఎందుకంటే కురుక్షేత్ర యుద్ధానికి ఇంకా చాలా గడువుంది.

ఆవరణ లోపల జరిగేది ప్రజాసేవ అని ప్రజలకి కథలు చెప్పాలిగా – అందుకని అక్కడ పోలీసులకి మూసిన తలుపులు – పత్రికా విలేకరులకోసం తెరుచుకుంటూంటాయి.

ఒకరోజున వనజ పత్రికావిలేకరిగా తన్ను తాను పరిచయం చేసుకుని ఆ గేటు దాటి లోపల అడుగెట్టింది. ఆమెకు గైడ్‌గా కంపెనీ నిర్దేశించిన వ్యక్తి చలం.

ఆవరణ లోపల పెద్ద భవనముంది.

ముందా భవనం చుట్టూ ప్రదక్షిణం చేసింది వనజ. చలం ఆమె ననుసరించి అడిగిన ప్రశ్నలకి బదులిస్తున్నాడు. భవనం చుట్టూ సాయుధులైన కాపలావాళ్ళున్నారు. వాళ్ళు మొత్తం పదిమందని తెలుసుకుని, "ఈ కాపలా ఎందుకు? ఇంతమందెందుకు?" అనడిగింది వనజ.

"మనదేశంలో చిన్న పిల్లలకి పోషణ, రక్షణ రెండూ లేవు. మా కంపెనీ వాళ్ళకి లోపల ఉద్యోగాలిచ్చి పోషిస్తోంది. బయట ఇలాంటి వాళ్ళ కాపలాతో రక్షిస్తోంది" అన్నాడు చలం.

"మరి లోపల చిన్న పిల్లలచేత ఉద్యోగం చేయించడం చట్ట విరుద్ధం కదా!" అంది వనజ.

"సామాన్యుడి ప్రాణం తీసేది చట్టమైనా నిషిద్ధం. అమాయకుల ప్రాణాలు నిలబెట్టేది చట్ట విరుద్ధమైనా అనిషిద్ధం. మా పోషణ, రక్షణ లేకపోతే ఇక్కడున్న పిల్లలీపాటికి ముంబై పేవ్ మెంట్లోనే, దుబాయ్ అపార్ట్ మెంట్లోనో తేలుతారు" అన్నాడు చలం.

"గుడ్ – అందుకేనేమో మనదేశంలో అధికారంలోకి రావడానిక్కూడా చట్టవిరుద్ధం అనిషిద్ధం" అంటూ వనజ ఓ కాపలావాడి దగ్గిర ఆగి – వాడి పేరూ, జీవిత వివరాలూ నోట్ చేసుకుంది. వాడి మాటల్ని బట్టి వాడికా ఉద్యోగం అన్ని విధాలా బాగుందని తెలుసుకుంది. తర్వాత తన బ్యాగ్ లోంచీ ఓ బార్ చాక్లెట్ తీసి, రేపర్ వలిచి వాడికిచ్చింది. వాడు తటపటాయిస్తుంటే, "ఇది ఫ్రెండ్ షిప్ చాక్లెట్. వద్దన కూడదు. కొత్తమనిషిని కాబట్టి నీ అనుమానం పోగొట్టడానికి నేనూ అందులో ఓ చిన్న ముక్క తీసుకుని తింటాను. ఎట్నించైనా సరే" అంది వనజ.

"చెరి సగం చేసుకుందాం మేడమ్" అన్నాడు కాపలావాడు.

"ఒకరా ఇద్దరా పదిమంది కాపలా వాళ్ళున్నారిక్కడ. నీకైతే ఒకటి కానీ – ఒకొక్కరి దగ్గిర సగం చాక్లెట్ చొప్పున తిన్నానంటే మొత్తం ఐదు చాక్లెట్స్ తినాలి నేను. అట్నించో ఇట్నించో చిన్న ముక్క విరిచివ్వు" అంది వనజ. కాపలావాడో చిన్న ముక్క విరిచిస్తే నోట్లో వేసుకుంది వనజ. అపుడు కాపలావాడు కూడా నిస్సంకోచంగా మిగతా చాక్లెట్ తినసాగాడు.

ముందుకు కదిలిన వనజతో, "కాపలావాళ్ళకి చాక్లెట్లెందుకూ ఇవ్వడం?" అన్నాడు చలం.

"గుడ్ విల్. అది జర్నలిజంలో చాలా ఇంపార్టెంటు" అంది వనజ.

"గుడ్ విల్ నాతో అక్కర్లేదా?" అన్నాడు చలం.

"నువ్వు కాపలావాడివి కాదుగా. నీ లెవెల్‌కి గుడ్ విల్ ఐటం వేరే ఉంది. అది వెళ్ళేముందిస్తాను" అంది వనజ.

అదేమిటా అని చలం ఊహలో పడ్డాడు. వనజ ఒకో కాపలావాడికే చాక్లెట్ ఇచ్చుకుంటూ వెడుతోంది. అలా ఆరుగురయ్యేక ఆమెకి పక్కనే ఓ చిన్న నీటి కొలను కనిపించింది. కొలనులో అలలు రేగుతుంటే, "ఎక్కడా గాలి లేదు. ఆ కొలనులో కెరటాలెలాగొస్తున్నాయి? లోపల మోటారుందా?" అంది వనజ కుతూహలంగా.

"మోటారే - ప్రాణమున్న మోటారు. వెళ్ళి చూడండి మేడమ్" అన్నాడు చలం.

వనజ కొలనుకి దగ్గిరగా వెడితే అలలకి కారణమైన మోటారు నీటిమీద భీకరంగా ఈదుతూ కనపడింది. అది ఓ పెద్ద మొసలి. ఉండుండి తోకతో నీటిని సాచి కొడుతుంది. మనుషులు దగ్గిరైన అలికిడికి అది పెద్దగా నోరు తెరిచి స్థంభించిపోయింది.

మాంత్రికుడి గుహలా బయంకరంగా ఉన్న మొసలి నోటి వంకే చూస్తూ, "ఈ కొలను అందం చూసి మనుషుల స్నానానికనుకున్నాను. కనీ - ఇదేమిటి?" అంది చూపుడు వేలితో మొసలిని చూపుతూ.

చలం తడుముకోలేదు, "ఒకసారి ఇంతకాపలాకీ కన్ను కప్పి లోపలికొచ్చిన ఓ దొంగ - కాసేపు ఈ నీటిలో తల దాచుకున్నాడు. దీనికీ కాపలా అవసరమని అప్పుడే తెలిసింది.."

వనజ ఆ వివరం కాగితం మీద నోట్ చేసుకుంటూ, "ఇక్కడుండేది దుర్మార్గులు కాదు, రాక్షసులు" అనుకుంది. ఆమె అక్కణ్నించి కదిలి మిగతా కాపలా వాళ్ళకి కూడా చాక్లెట్టిచ్చింది. అప్పటికి భవనం చుట్టూ ప్రదక్షిణ కూడా ఐపోవడంతో - చలంతో కలిసి భవనంలోపల ప్రవేశించింది.

లోపల పెద్దహాలు. హాల్లో నాలుగు పొడవాటి బల్లులు. వాటిమీద ఏదో పౌడరు. నిండా పన్నెండేళ్ళు లేని బాలబాలికలు, ఆ బల్లల ముందు నిలబడి - వంచిన తలెత్తకుండా పౌడర్ని ప్యాకెట్లలో నింపుతున్నారు.

"ఏం చేస్తున్నారు వాళ్ళు?" అంది వనజ.

"గిన్నెలు తోముకునే పౌడరు ప్యాకెట్లలో సర్దుతున్నారు. పేదవారి కోసం కారు చౌకగా తయారౌతున్న పౌడరిది. ప్యాకెట్‌కి రూపాయి లాభం. అందులో అర్ధరూపాయి మాత్రమే కంపెనీది.

మిగతా సగం వీళ్ళదే. మేజర్లయ్యేసరికి వీళ్ళ దగ్గర చాలా డబ్బే చేరుతుంది. అప్పుడు కంపెనీ వీళ్ళకి స్వయం ఉపాధి పథకాలు సూచించి పంపేసి - కొత్త బ్యాచ్ పిల్లల్ని తీసుకుంటుంది. దేశంలో అటు దారిద్ర్యాన్నీ, ఇటు నిరుద్యోగాన్నీ నిర్మూలించే టూ - ఇన్ - వన్ శిక్షణ ఇది" అన్నాడు గర్వంగా.

"మీ కంపెనీ ఆశయం చాలా గొప్పది. అయామ్ ఇంప్రెస్డ్. పిల్లలు కూడా చాలా శ్రద్ధగా పనిచేస్తున్నారు. ఒక్కసారి పలకరించాలనుంది. డిస్టర్బెన్స్ అనుకోరుగా" అంది వనజ రిక్వెస్ట్ చేస్తున్నట్లు.

చలం ఆమెనో కుర్రాడికి దగ్గరగా తీసుకెళ్ళాడు. అలికిడికి కూడా ఆ అబ్బాయి తలెత్తలేదు.

"నీ పేరు తెలుసుకోవచ్చా?" అంది వనజ.

"వెంకట్" అన్నాడా అబ్బాయి తలెత్తకుండానే.

"వెంకట్! ఆగకుండా పనిచేస్తున్నావు. విసుగనిపించడంలేదా?" అంది వనజ.

ఆ అబ్బాయి తలెత్తకుండానే, "నాకీ పని ఎంతో ఇష్టం. ఎంతసేపు చేసినా విసుగనిపించదు. సంతోషంగా కూడా ఉంటుంది" అన్నాడు వెంకట్ తలెత్తకుండానే.

అది మనిషి మాటలాకాక చిలకపలుకులా అనిపించింది వనజకి. ఆ పలుకులోనూ ఏదో అపశృతి ధ్వనిస్తోంది. "మేడమ్ నీతో మాట్లాడతారట. ఒక్కసారి తలెత్తి చూడు" అన్నాడు చలం.

వెంకట్ తలెత్తితే వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లా ఉన్నాయా కళ్ళు. నివ్వెరపోయిన వనజ, "ఇదా నీ సంతోషం" అంది చటుక్కున.

వెంకట్ కళ్ళు తుడుచుకుని, "మీ గొంతు వినగానే అమ్మ గుర్తుకొచ్చింది. నాకు ఐదేళ్ళప్పుడు చచ్చిపోయింది అమ్మ. నాన్న ఇంకో పెళ్ళి చేస్కుని నన్ను అనాథ శరణాలయంలో చేర్చాడు. అక్కడ ఏం బాగుండేది కాదు. ఎప్పుడూ ఏడుస్తూండేవాణ్ణి. ఇక్కడికొచ్చాక ఎంతో బాగుంది. చాలా సంతోషంగా ఉన్నాను" అన్నాడు. అక్కణ్ణించి వనజ ఓ అమ్మాయి దగ్గరకెళ్ళింది. పేరడిగితే కనక అని చెప్పింది. "నాకీ పని ఎంతో ఇష్టం. ఎంత సేపు చేసినా విసుగనిపించదు. సంతోషంగా కూడా ఉంటుంది" అని కూడా చెప్పింది. చలం చెప్పేదాకా తలెత్తలేదు. తలెత్తితే ఆమె కళ్ళు శ్రావణమేఘాలు. ఆమెకీ అమ్మ గుర్తుకొచ్చిందట. తనూ అనాథ శరణాలయం నుంచే ఇక్కడికొచ్చిందట ఇక్కడి కొచ్చాకే సంతోషంగా ఉంటోందట.

వనజ మరి కొందర్ని కలుసుకుంటే అందరిదీ ఒక్కతే కథ. అందరి నోటా అవే చిలక పలుకులు.

ఆ పిల్లలు బాగా బెదిరిపోయారని అర్థం చేసుకుందుకు వనజకి ఎంతో సేపు పట్టలేదు. ఎందుకంటే, "స్వతంత్ర భారత దేశమా! మేము బాధలనుంచి విముక్తిని కోరం. బాధని ఇతరులకి చెప్పుకునే స్వేచ్ఛనైనా మాకివ్వు" అని వారి కళ్ళు అడుగుతున్నట్లు తోచిందామెకి. ఆమెకి గుండె పిండినట్లైంది. కానీ మనోభావాలు ముఖంలో ప్రతిఫలించకుండా ప్రయత్నిస్తోంది.

చివరికామె ఓ అబ్బాయి దగ్గరికొచ్చింది. వాడు మరీ చిన్నవాడు. పట్టుమని ఎనిమిదేళ్ళుండవు.

అడుగుల చప్పుడు వింటూనే వాడు చప్పున తలెత్తాడు. ఆ కళ్ళు వర్షించే మేఘాల్లా లేవు. ఆశ.. వాటినిండా చెప్పలేనంత ఆశ.

"అక్కా! నాకు అమ్మ ఉంది. వీళ్ళు నన్ను అమ్మకి తెలియకుండా ఎత్తుకొచ్చారు. నాకు అమ్మని చూడాలనుంది. అడిగితే కొడుతున్నారు. నువ్వు నాకు అమ్మని చూపిస్తావా?"

అది విన్నపం కాదు, ఆక్రందన!

వనజకి కన్నీళ్ళాగలేదు. ఆమె చప్పున వాణ్ణి దగ్గరగా తీసుకుంది. వాడామెని బలంగా హత్తుకుని, "ప్లీజ్ అక్కా! నేను నీతో వచ్చేస్తాను. ఇక్కడుంటే నన్ను వీళ్ళు చంపేస్తారు" అన్నాడు.

ఆ మాట వాడు చెప్పాడో ఆ గొంతులో ధ్వనించిన మృత్యుభయం తనకలా అనిపించెలా చేసిందో వనజకి తెలియలేదు. ఈలోగా చలం అందుకుని, "బాబూ! నీ మేలు కోరినవాళ్ళ గురించి అలా అబద్ధం చెప్పొచ్చా? మేము నిన్నెందుకు చంపుతాం? నీకు అంతలా అమ్మని చూడాలనుంటే రాత్రికి తప్పకుండా అమ్మని చూపిస్తాంగా -" అన్నాడు నయవంచనకి ఆడియో రూపంలా ఉన్నదా గొంతు.

ఇంకా తనవంకే ఆశగా చూస్తున్న వాణ్ణి మృదువుగా వదిలించుకుని, "బాబూ! నీ పేరేమిటి?" అంది వనజ.

"శేఖర్"

"చూడు శేఖర్! నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావ్. చలం చాలా మంచివాడు. ఈ రాత్రే నీకు అమ్మని చూపిస్తానంటున్నాడుగా - చూపిస్తాడు. ఒకవేళ చూపించలేదనుకో - రేపు నేను మళ్ళీ వస్తానుగా. అప్పుడు నిన్ను అమ్మ దగ్గరకి తీసుకెడతాను. ఈలోగా నిన్నెవరైనా కొడితే - కొట్టిన వాళ్ళందర్నీ పోలీసులకి పట్టిస్తాను. సరేనా?" అంది వనజ శేఖర్ని అనునయిస్తూనే చలాన్ని కూడా హెచ్చరిస్తూ. ఐతే ఆమెకి తెల్సు.- తన అనునయం శేఖర్ మీదా, హెచ్చరిక చలం మీదా - పనిచేసే అవకాశం ఏమాత్రం లేదని!

ఇద్దరూ పిల్లలకి కాస్త దూరంగా వచ్చేక, "మేడమ్! ఈ పౌడరు శాంపిల్ తీసుకోరా?" అన్నాడు చలం.

"ఎందుకు?" అంది వనజ ఆశ్చర్యం నటిస్తూ.

"పత్రికలవాళ్ళకి రకరకాల అనుమానాలుంటాయి కదా!"

వనజ నవ్వి, "సమాజ సేవ నేనూ చేస్తున్నాను. మీరూ చేస్తున్నారు. నమ్మకమే మనం ఒకరికొకరిచ్చుకునే గౌరవం. అందులోనే సమాజ కళ్యాణమూ ఉంది. ఇంత భారీ ఎత్తున, ఇంత పబ్లిగ్గా మాదక ద్రవ్యాలని ప్యాకింగ్ చేసేవారెంత మూర్ఖులో, ఈ పౌడర్ని మాదక ద్రవ్యమని అనుమానించేవారూ అంతే మూర్ఖులు. తర్వాత ఈ ప్యాకెట్లలోకి - మాదక ద్రవ్యాలున్న చిన పోలిథీన్ ప్యాకెట్లని జొనిపితే అది వేరే సంగతి. అలాంటి ఊహలతో కథలల్లి ప్రచారం చేసే బ్లాక్ జర్నలిజానికి నేను వ్యతిరేకిని. నాకు ఈ కంపెనీమీద ఎటువంటి అనుమానం లేదు. కానీ శేఖర్ ప్రవర్తన మాత్రం మీ కంపెనీకి మచ్చేఔతుంది. అందుకు నువ్వివ్వగల సంజాయిషీ ఏమైనా ఉందా?" అంది.

"బ్లాక్ జర్నలిజం అనే మాట మొదటిసారిగా వినడమే కాదు. అంటే ఏమిటో కూడా తెలుసుకున్నాను. మీకు శేఖర్ అసలు కథ చెబుతాను. అదే సంజాయిషీ కూడా అనుకోవచ్చు" అన్నాడు చలం.

ఆ అబ్బాయి పేరు శేఖర్ కాదు, వినోద్. శేఖర్ వినోద్ స్నేహితుడు. ఒక కారు ప్రమాదంలో వినోద్ తలిదండ్రులు మరణించారు. బంధువులెవ్వరూ వాణ్ణి చేరదియ్యకపోతే శేఖర్ తండ్రి జాలిపడి తనింట్లో ఆశ్రయమిచ్చాడు. అక్కడ తనకి అమ్మలేదనీ, శేఖర్ కి ఉందనీ వినోద్ తరచుగా దిగులుపడేవాడు. ఒకరోజున శేఖర్ తల్లి సుమ జాలిపడి, "నాయనా! నువ్వే శేఖర్ అనుకో. నేను నీ అమ్మని" అంది. ఆ మాట వినోద్ మీద మంత్రంలా పనిచేసింది. వాడు తనే శేఖర్ అనుకోసాగాడు. సుమ శేఖర్‌ని చేరదీస్తే సహించలేకపోయేవాడు. శేఖర్ తలిదండ్రులక్కోపమొచ్చి వినోద్‌ని అనాథ శరణాలయంలో జేర్పించారు. అక్కడ శేఖర్ తనే అంటూ అందర్నీ వేధిస్తుంటే ఈ కంపెనీ ఇక్కడికి తీసుకొచ్చింది. అప్పట్నించీ ఇదీ కథ.

"నీకు నిజంగా బ్లాక్ జర్నలిజమంటే తెలియదంటే నువ్వెవరివో నీకు తెలియదనుకోవాలి. నువ్వే బ్లాక్ జర్నలిస్టువి" అనుకుంది వనజ ఆ కథ విని. పైకి మాత్రం, "పెట్టనమ్మ పెట్టదు, పెట్టే ముండకేమొచ్చిందన్న సామెత సమాజ సేవకులకీ వర్తిస్తుంది. మీ ఇబ్బంది అర్థం చేసుకున్న నాకు మీమీద పూర్తి సానుభూతి ఉంది. కానీ ఆ పసివాడికి మాటిచ్చాను కాబట్టి రేపోసారి ఇక్కడికి మళ్ళీ వస్తాను. కథల్లోలా కాక వాడు క్షేమంగా ఉంటాడనే నా నమ్మకం" అంద చలంతో.

వెళ్ళబోతున్న వనజతో, "మేడం, వినోద్ విషయంలో మీకు నాదీ హామీ. మీరు రేపు వాణ్ణి తప్పక కలుసుకుంటారు. అంతవరకూ మా కంపెనీ విషయంలో ఏ రిపోర్టూ వ్రాయరు కదూ!" అన్నాడు చలం.

వనజ మనసులో, "బాబూ, శేఖర్! నీకు మంచి రోజులొచ్చాయి. నీతోపాటే వీళ్ళందరికీ స్వేచ్ఛ ప్రసాదించడానికి నేనాడే నాటకంలో తాత్కాలికంగా నువ్వోపావువయ్యావు. ఐనా నీ రక్షణ కోసం నేను చేయగలిగింది చేసాను. ఆపైన దేవుడున్నాడు" అనుకుంది. చలంతో, "గుడ్‌విల్‌కి నీకూ ఓ గిఫ్టిస్తానన్నానుగా. అది రేపు. అందుకని రేపటి దాకా ఆగాలనే అనుకుంటున్నాను. కానీ దైవేచ్ఛ ఎలా ఉందో నాకు తెలియదు" అని నవ్వింది.

●●●

## 21

రాత్రి తొమ్మిది గంటలు.

ఆ కంపెనీ లోపల ఆవరణలో కొలనుకి కాస్త దూరంలో రాకింగ్ చెయిర్లో కూర్చున్నాడు జాన్ స్టూవర్ట్.

అప్పుడే ఒక వ్యక్తి అక్కడికి తీసుకొచ్చాడు శేఖర్ని.

జాన్ స్టూవర్ట్ వాణ్ణి పరీక్షగా చూసి, "అమ్మని చూడాలన్న శేఖర్‌వి నువ్వే కదూ?" అన్నాడు ఆప్యాయంగా.

"ఊఁ" అన్నాడు శేఖర్ ఆశగా.

"అదిగో అమ్మ. అక్కడుంది చూడు"

శేఖర్ ఆత్రుతగా అటుచూస్తే వెనక్కి తిరిగున్న ఓ స్త్రీ. "అమ్మ" అన్నాడు శేఖర్ అప్రయత్నంగా.

"వెళ్ళు. అమ్మని కలుసుకో. తనివితీరా చూడు" జాన్ స్టూవర్ట్ గొంతులో ఆత్మీయత.

శేఖర్ పరుగున వెళ్ళి ఆమెని సమీపించి, "అమ్మా!" అన్నాడు.

ఆమె చటుక్కున వెనక్కి తిరిగింది.

ఒత్తైన కనుబొమలు. మిడిగుడ్లు. పెద్ద ముక్కు. నోట్లోంచి అటూ ఇటూ పొడుచుకొచ్చిన పెద్ద కోరలు.

రాక్షసిలా ఉన్న ఆమెని చూసి కెవ్వుమన్నాడు శేఖర్.

"రా బాబాబు రా" అంటూ చేతులు సాచిందామె. ఆ గొంతు రూపంకంటే భయంకరంగా ఉంది.

శేఖర్ వెనక్కి తిరిగి జాన్ స్టూవర్ట్ దగ్గరకి పరుగెత్తాడు. ఆ స్త్రీ, "బాబూ" అంటూ వాణ్ణనుసరించి వస్తోంది.

"భయమేస్తోందా?" జాలిగా అడిగాడు జాన్ స్టూవర్ట్.

శేఖర్ ఊఁ అనడానికి కూడా గొంతు పెగలక, ఔనన్నట్లు తలూపాడు.

"నేను చెప్పినట్లు చెయ్యి. నీకే భయమూ ఉండదు" అన్నాడు జాన్ స్టూవర్ట్. శేఖర్ బుద్ధిగా తలూపితే, "అది శేఖర్ అమ్మ. నువ్వు శేఖర్ వి కదా! అందుకని నీ కోసం వస్తోంది. నువ్వు వినోద్‌వైపోయావనుకో అది నీ దరిదాపులకి రాదు. మరి వినోద్‌వైపోతావా?" అన్నాడు మళ్ళీ.

శేఖర్ అటు చూస్తే ఆ స్త్రీ చేతులు సాచి నెమ్మదిగా తనవైపే వస్తోంది.

"ఊఁ" అన్నాడు శేఖర్ వెంటనే.

"ఐతే సరే, నీకేం భయంలేదు. వెంటనే స్నానం చేసిరా" అంటూ కొలను వైపు చూపించాడు.

శేఖర్ పరుగున కొలను దగ్గిరకెళ్ళి నీటిలో దూకబోయి ఆగిపోయాడు.

దీపాల వెలుగు ప్రతిఫలించి కొలను నీరు వెలుగు భాషలో వాణ్ణి పిలుస్తున్నట్లుంది. ఐనా వాడు నీటిలో దూకలేదు. భయంకరంగా నోరు తెరిచి ఆహ్వానిస్తున్న మొసలి కూడా ఆ వెలుగులో వాడి కంటబడింది.

శేఖర్ వెనక్కి తిరిగి జాన్ స్టూవర్ట్ దగ్గిరకి పరుగెత్తాడు. అతడు వాణ్ణి ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆప్యాయంగా వీపు నిమురుతుంటే వికృతాకారిణి వాళ్ళకి దగ్గిరగా వచ్చింది.

శేఖర్ భయంగా జాన్ స్టూవర్ట్ వంక చూసాడు. అతడి కళ్ళలో ఆప్యాయత. శేఖర్ వీపు నిమురుతున్న అతడి చేతి స్పర్శలో ఆత్మీయత.

జాన్ స్టూవర్ట్ వికృతాకారిణితో, "లోపలికెళ్ళి పిల్లలందర్నీ పిల్చుకుని రా! వాళ్ళంతా చూస్తుండగా వీడిచేత కొలనులో స్నానం చేయిస్తాను" అన్నాడు. ఆ గొంతు కర్కశంగా ఉంది.

●●●

ఆ గోడ ఎక్కాలని మూడు సార్లు ప్రయత్నించాడు అరణ్య. వీలుపడలేదు.

చివరికి అరణ్య బాగా వెనక్కి వెళ్ళాడు. అక్కణ్ణించి చిరుతపులిలా గెంతి నడకతో ప్రారంభించి పరుగుకు మారాడు. క్రమంగా వేగం పుంజుకుంది. అదే వేగంతో గోడని సమీపించాడు. గోడని తాకుతూనే సాలీడులా చకచకా గోడపైకెక్కి అటువైపు ఆవరణలో దూకి చుట్టూ చూసాడు.

ఆవరణ చుట్టూ గోడకి దగ్గర్లో ఉన్న సిమెంటు బెంచీలమీద కూర్చునే నిద్రపోతున్నారు కాపలావాళ్ళు. వనజ ఇచ్చిన చాక్లెట్లలో కలిసిన స్లో సెడేటివ్ మత్తుమందు వెంటనే కాక అప్పటికి ప్రభావం చూపింది.

కాస్త దూరంగా చూస్తే జాన్ స్టూవర్ట్ కనిపించాడు అరణ్యకి. జాన్ స్టూవర్ట్ అతణ్ణి చూడలేదు.

హింస. ఆకలికి కాక స్వార్థానికి హింస. శిక్షలో వినోదానికి హింస.

అక్కడేం జరుగుతోందో అర్థమై అరణ్య కళ్ళు ఎర్రబడ్డాయి.

అంతలో శేఖర్‌ని భయపెట్టిన వికృతాకారిణి భవనం వైపు వెళ్ళింది. ఆమె అరణ్యని చూడలేదు.

జాన్ స్టూవర్ట్ ఒళ్ళో శేఖర్. జరగబోయేది ఊహకందుతున్న వాడి కళ్ళలో భయం.

శేఖర్ చటుక్కున జాన్ స్టూవర్ట్ ఒళ్ళోంచీ దూకి అక్కణ్ణించి పారిపోబోయాడు. అది ఊహించినట్లే జాన్ స్టూవర్ట్ చప్పున లేచి నాలుగంగల్లో వాణ్ణి సమీపించి చొక్కా కాలరు పట్టుకుని ఆపి, "స్నానం చేస్తే ఒంటితోపాటు మనసు కూడా శుభ్రపడుతుంది. అశుచిగా నిన్నెక్కడికీ వెళ్ళనివ్వను, తెలిసిందా?" అన్నాడు. తర్వాత వాడి చేయి పట్టుకుని కొలనువైపు ఈడ్చుకు వెడుతూ, "పిల్లలొచ్చేదాకా ఆగాలనుకున్నాను. కానీ నువ్వాగనిస్తేనా?" అన్నాడు కోపంగా.

ఏం జరుగుతోందో అరణ్యకి తెలుస్తోంది. అతడు వేటకి మాటు వేసిన చిరుతలా వాళ్ళననుసరిస్తున్నాడు. గట్టు దగ్గిర ఆగాడు జాన్ స్టూవర్ట్.

అతడి వెనుక ఆగాడు అరణ్య.

అరణ్య జాన్ స్టూవర్ట్ శేఖర్ని గాల్లోకెత్తి నీళ్ళలోకి విసిరాడు.

అలా జరుగుతుందని ముందే పసికట్టిన వాడిలా అరణ్య తనూ కొలనులోకి దూకాడు. చిన్న పిల్లల చేతిలో చిల్ల పెంకు కప్పగెంతు వేసినట్లు నీటిమీద తేలుతూ పయనిస్తూ మొసలికంటే ముందుగా శేఖర్‌ని అందుకుని అవతలి గట్టు చేరుకున్నాడు.

నోటికందిన ఆహారం గల్లంతవడంతో ఉక్రోషమొచ్చిందేమో - కొలనులో మొసలి విహారం వీరవిహారమైంది. ఏం జరిగిందో ఊహకందక జాన్ స్టూవర్ట్ అప్రతిభుడైపోయాడు.

చూస్తూండగా అరణ్య అట్నించి ఇటు హనుమంతుడిలా లంఘించి జాన్ స్టూవర్ట్ ముందు వాలాడు. అదే ఊపులో జాన్ స్టూవర్ట్‌ని బలంగా ముందుకి లాగి వదిలాడు.

జాన్ స్టూవర్ట్‌కి బ్యాలన్స్ తప్పింది. వెనకడుగు వేయాలని ఎంత ప్రయత్నించినా ముందుకే పడ్డాడు. ముందున్నది నేలకాదు. నీరు. ఆ నీటిలో మొసలి ఉంది. అదీసారి జాప్యం చెయ్యలేదు.

జాన్ స్టూవర్ట్ ఆర్తనాదాలు ఆ ఆవరణలో ప్రతిధ్వనించాయి. మొసలికి మాత్రం అవి మూన్ లైట్ డిన్నర్ ఆర్కెస్ట్రా బీట్సులా హుషారునిచ్చాయి. ఫలహారమనుకుంటే భోజనం దక్కిన ఉత్సాహానికా బీట్స్ ఇచ్చిన రిథమ్ మొసలి కదిలికల్లో కనపడుతోంది.

అరణ్య క్షణమాత్రం ఆ దృశ్యాన్ని చూసాడు. ఆ వెంటనే భుజం మీద శేఖర్‌తో - శబ్దాన్ని మించిన వేగంతో పరుగెడుతూ విమానంలా గాల్లో తేలి ఆవరణలోని ఓ చెట్టుమీద వాలాడు. అదే వేగంతో చెట్టుమీంచి గోడమీదకి. గోడమీంచి బయటికి. ఇదంతా కనుమూసి తెరిచేలోగా జరిగిపోయింది.

వికృతాకారిణి భవనంలోంచి పిల్లల్ని తీసుకుని వచ్చేసరికి అక్కడ శేఖర్, జాన్ స్టూవర్ట్ - ఇద్దరూ లేరు. కొలనులోని ఆర్తనాదాలెప్పుడో ఆగిపోయాయి.

ఆ స్త్రీ జాన్ స్టూవర్ట్ ఏమయ్యాడా అని చుట్టూ వెతుకుతోంది. కొలనులో జరిగిన విశేషం ఆమె ఊహకి అందనిది. అందుకని అక్కడే చాలాసేపు వెదుకుతూ ఉండిపోయిందామె.

జాన్ స్టూవర్ట్ చేతిలో ఆ రాత్రి శేఖర్ హింసకి గురౌతాడని వనజకి ముందే తెలుసు. ఆ హింస అరణ్యలో కలిగించే స్పందన ప్రభావం జాన్ స్టూవర్ట్‌కి మృత్యువు కాగలదనీ ఆమెకి తెలుసు. అందుకని మొత్తం పథకాన్ని రూపొందించి అరణ్యకి కర్తవ్య బోధ చేసి పంపిందామె. శేఖర్ని రక్షించాక అతణ్ణి ఏ పోలీస్ స్టేషన్ దగ్గిర విడిచిపెట్టాలో కూడా అతడికి చెప్పిందామె.

ఈ పథకం అమలు చేయడానికి తను అరణ్య పక్కన ఉండడం సాధ్యం కాదని ఆమెకి తెలుసు. ఎందుకంటే కాపలా వాళ్ళకిచ్చిన చాక్లెట్‌లో కొంత తనూ తిన్నది కాబట్టి, ఆ స్లో సెడేటివ్ ప్రభావంతో తనూ నిద్రకి గురికాక తప్పదు. అన్నింటికీ సిద్ధపడి అరణ్యని పురమాయించి ఆ పైన దేవుడిదే భారమనుకుందామె.

ఆ రాత్రంతా వళ్ళు తెలియకుండా నిద్రపోయింది. మర్నాడుదయం నిద్రలేచి - టీవీ పెడితే - శేఖర్ కనిపించాడు. ఆ కుర్రాడు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన వాజ్మూలం ఆధారంగా పోలీసులు జాన్ స్టూవర్ట్ స్థావరంపై దాడి చేసారు. అక్కడ జరుగుతున్న ఘోరాలు బయట పడ్డాయి. ఏ ఛానెల్ చూసినా అదే వార్త.

నీటిలో పడ్డాక తానెలా రక్షించబడ్డాడో శేఖర్ సరిగ్గా చెప్పలేకపోతున్నాడు. భయం, దిగ్భ్రాంతి ఆ సమయంలో అతడి మెదడుని స్థంభింపజేసాయి.

అప్పుడే వచ్చిన స్థానిక దినపత్రిక చూస్తే అందులోనూ మొదటి పేజీలో శేఖర్ ఫోటో.

ఎక్కడా అరణ్య ప్రసక్తి లేకపోవడం వనజకి గొప్ప ఊరట. "భగవంతుడా! అంతా అనుకున్నట్లే జరిగింది. కాబట్టి నువ్వున్నావనే అనుకోవాలి. కానీ మంచికైనా చెడ్డకైనా నువ్వెప్పుడుంటావో, ఉండవో ఊహించడం మాత్రం నాకింకా కష్టమే అనిపిస్తోంది" అనుకుందామె.

భగవంతుడు మనిషికిచ్చినంత ఆలోచన సృష్టిలో మరే జంతువుకీ ఇవ్వలేదు. మరి మనిషి ఆ అవకాశాన్నే విధంగా ఉపయోగించుకుంటున్నాడూ అంటే అది వేరే విషయం.

ఇప్పుడు హిరణ్యారావు ఆలోచిస్తున్నాడు.

వనజ తనింటికొచ్చి ఓ హత్యాప్రయత్నం చేసింది. అందులో ఆమె ఉద్దేశ్యమేమిటో అంతు పట్టడంలేదు. అరణ్య ఆటవికుడు. అతడి మనసు పసికట్టడం కష్టం కాదు. అతడు తనకి మంచి మిత్రుడన్నది సుస్పష్టం. నాగరీకం తెలిసిన వనజ తనపట్ల ప్రకటించే స్నేహభావంలోని స్వచ్ఛత ఆయన అంచనాకి అందడంలేదు. వనజ అరణ్య చేత తనని చంపించాలన్న ప్రయత్నంలో విఫలమైందనుకుందామంటే - ఆపని తన ఇంట్లోనే చేయాలని ఎందుకనుకుంది? అందులో ప్రమాదముందని శంకించలేదా - లేక లీల, ప్రహ్లాద్ తనకి బాసటగా ఉన్నారని ధైర్యమా? లేక - నీ ఇంట్లోనే నిన్ను చంపి తప్పించుకోగల అవకాశం నాకున్నదని నిరూపించాలనుకుందా? లేక నిజంగానే ఆమె తన ప్రాపకాన్ని కోరుతోందా? మరి ప్రాపకాన్ని కోరే మనిషైతే - ప్రహ్లాద్‌ని పెళ్ళాడక - వెంట అరణ్య నెందుకు తెచ్చుకుంది? లేక సమాజ సేవాభావం జీర్ణించుకుపోయిన ఆమె - తనకి దూరంగా ఉంటూ ఆటవికులనుద్ధరించడానికి మాత్రం తన నుంచి సాయం పొందాలనుకుంటోందా?

ఇలా ఒకదానితో ఒకటి లింకుపడి వరుసగా సందేహాలు చెలరేగుతూ ఆలోచనల్ని ఆక్రమిస్తుంటే.. భూతనాథ్ అంతరించాడు. జాన్ స్టూవర్ట్ సమసిపోయాడు. వాళ్ళిద్దరూ తనకి ఎంతో కావలసినవాళ్ళు. ఇక తన ముఖ్యానుచరుల్లో మిగిలింది ఉస్మాన్ ఖాన్.

భూత్నాథ్, జాన్ స్టూవర్ట్‌ల చరిత్ర కాకతాళీయంగానే ముగిసిందా లేక వేరెవరి హస్తమైనా ఉందా? అప్పట్లో వనజ - తన సింహాసనం పునాదుల్నే కదల్చింది. అప్పుడు రఘు ఆమెకి సాయపడ్డాడు. తను రఘుని అంతం చేసి ఆమెని చావు దెబ్బ కొట్టాడు.

అప్పట్లో రఘు తన మనిషేననుకున్నాడు. అతడు తనతోనే ఉంటూ, తన మనిషిగా వ్యవహరిస్తూ - పోలీస్ డిపార్ట్‌మెంట్ సహాయ సహకారాల్ని మాత్రం వనజకి అందజేసాడు. అది ఊహించలేక ప్రాణం మీదకి తెచ్చుకున్నాడు తను.

ఇప్పుడు వనజ తన మనిషిలా వ్యవహరిస్తోంది. అజ్ఞాతంగా ఆమె ఎవరికైనా సాయపడుతోందా లేక ఆమెకి అజ్ఞాతంగా ఎవరైనా సాయపడుతున్నారా?

నాగరిక ప్రపంచంలో అరణ్య నిర్వహిస్తున్న పాత్ర ఏమిటి?

తన ఆలోచనలకి పదును పెట్టడానికి ఉస్మాన్ ఖాన్‌ని పిలవాలనుకున్నాడు హిరణ్యారావు. తలచుకుంటే చాలు దెయ్యం పలుకుతుందన్నట్లు - సరిగ్గా అప్పుడే ఉస్మాన్ ఖాన్ నుంచి ఫోనొచ్చిందాయనకి.

చెడ్డవాళ్ళలోనూ మేధావులుంటారు. మేధావుల ఆలోచనలు ఒకే తీరులో ఉంటాయన్న నానుడి వాళ్ళకీ వర్తిస్తుంది. హిరణ్యారావు తరహాలోనే ఆలోచిస్తూ మధనపడుతున్న ఉస్మాన్ ఖాన్ తను మేధావినని ఋజువు చేసుకున్నాడు.

"ఒక్కసారి మా ఇంటికి రా. ముఖాముఖీ మాట్లాడుకుందాం" అన్నాడు హిరణ్యారావు.

●●●

"నా అనుమానం భీమన్న మీదుంది. అందుకని వాడిమీద నిఘా వేసాను. జాన్ స్టువర్ట్ మనుషులు కూడా చెప్పారు - వాడు స్టువర్ట్‌ని బెదిరించి వెళ్ళాడని. ఐతే ఈ ఘోరం జరిగిన సమయంలో భీమన్న పోలీస్ స్టేషన్లో ఉన్నాడు. మొదటాట సినిమా చూస్తూ అక్కడ న్యూసెన్స్ క్రియేట్ చేసాడన్న నేరం మీద పోలీసులు వాణ్ణరెస్ట్ చేసి రాత్రంతా లాకప్పులో ఉంచి తెల్లవారు ఝామున విడిచిపెట్టారు" అన్నాడు ఉస్మాన్ ఖాన్.

"అంటే భీమన్న ఈ పని చేయలేదని తేలిపోయింది. కానీ వాడు సరిగ్గా ఆ సమయంలోనే పోలీస్ స్టేషన్లో ఉండడమేమిటి? స్టువర్ట్‌కిలా జరుగుతుందని ముందే తెలిసి - తనకి ఎలిబీ సృష్టించుకోలేదు కదా!" అన్నాడు హిరణ్యారావు అనుమానంగా.

"ఆ బద్మాష్‌కి అంత తెలివా? వాడి బుద్దే అంత - అల్లరి బుద్ధి. ఇలాంటివి వాడికి కొత్తేం కాదు. సైతాన్ పూనినప్పుడల్లా పిచ్చిపనులు చేస్తూంటాడు. ఇదీ అంతే!"

"అలా తీసి పారేయకు. భీమన్న వేరెవర్నో ఈ పనికి పురమాయించి తనకి ఎలిబీ సృష్టించుకుని ఉండొచ్చని నా అనుమానం" అన్నాడు హిరణ్యారావు.

"వాడినొకళ్ళు పురమాయించడమే తప్ప - ఇంకొకళ్ళని పురమాయించేవాడయ్యేడంటావా? నువ్వు భీమన్నని మరీ ఎక్కువగా అంచనా వేస్తున్నావ్?" అన్నాడు ఉస్మాన్ ఖాన్.

"నువ్వన్నదీ నిజమే" ఆలోచనలో పడ్డాడు హిరణ్యారావు.

"ఎవరో స్టువర్ట్ దృష్టిని భీమన్న మీదకి మళ్ళించారు. ఇంకెవరో స్టువర్ట్ పని పట్టించారు.."

"ఆ ఇంకెవరో సామాన్యుడనిపించడంలేదు"

"సామాన్యుడో - సామాన్యురాలో..?"

హిరణ్యారావు మందహాసం చేసాడు, "మనమిద్దరం ఒకరి గురించే మాట్లాడుతున్నాం.."

"అంటే సామాన్యుడూ, సామాన్యురాలూ ఒక్కరేనా - అదెలా?"

"అరణ్య, వనజ - ఇద్దరూ ఒకటంటావా - వేరంటావా?"

ఉస్మాన్ ఖాన్ కళ్ళు పెద్దవయ్యాయి, "అరణ్య.. అంటే ఆ జంగ్లీ.."

"ఆఁ - జంగ్లీయే - వాడు జంగ్లీనుంచి తెలివైన మనిషిగా మారేలోగానే మనం వాణ్ణి ఎటాక్ చేయాలి.."

ఉస్మాన్ ఖాన్ కళ్ళలో అనుమానం, "వాడికి నగరంలో మీ రక్షణ ఉన్నట్లు ప్రచారమైందిగా - వాడికేమైనా ఐతే మొదటి ముద్దాయి మనమే"

హిరణ్యరావు నవ్వి "ప్లస్సుకి మైనస్ కలిస్తే సున్నాకి దారితీస్తుంది. అనాగరికరికం నాగరికంతో కలిసినా జరిగేదదే అరణ్య అనాగరికుడు. వాడిమీద మన ఎటాక్ నాగరికంగా ఉంటుంది..." అన్నాడు.

"అర్థంకాలేదు"

"వయసులో ఉన్న కుర్రాడు. ఆరోగ్యంతో మిసమిసలాడిపోతున్నాడు. వాడిమీదకో చక్కని చుక్కని ఉసికొల్పామనుకో - కుక్కలా వెంటబడతాడు. అసలే వాడో మృగం.."

కానీ వనజ ఆ చోక్రీని కూడా వశపర్చుకుని తన చెప్పుచేతల్లో ఉంచుకుందనుకో. అప్పుడు?"

"ఆ పిల్లెవరో తెలిస్తే నీకీ అనుమానం రాదు.." అన్నాడు హిరణ్యరావు.

"ఎవరా చోక్రీ?" ఉస్మాన్ ఖాన్‌లో కుతూహలం.

"లత"

నోటిమాట రాలేదు ఉస్మాన్ ఖాన్‌కి. లతకి ఎయిడ్స్ ఉందని అతడికి తెలుసు.

## 22

**యధా రాజా తథా ప్రజా అన్నది సామెత. కానీ ప్రజాస్వామ్యంలో** ప్రజలే రాజునెన్నుకుంటారు కాబట్టి యధాప్రజా తథా రాజా అయింది.

యుగయుగాల రాజరికానికి అలవాటుపడ్డ భారతప్రజలు ప్రజాస్వామ్యాన్ని రాజరికానికి మారుపేరు చేసారు.

అందువల్ల రాజరికం రాజధానుల్లో మాత్రమే కాక ఊరూరా కూడా వర్ధిల్లుతోంది. అలా దేశం నిండా ఎందరో సంస్థానాధీశులు. వారిలో రంగారావొకడు. ఆ రంగారావు అనుచరుడే భీమన్న.

నకిలీమందుల వ్యవహారంలో భీమన్న సాధువైపోయాడు. రంగారావు మాత్రం వనజని రెచ్చగొట్టి హిరణ్యరావు మీద ప్రయోగించాడు. ఆ ప్రయోగం విఫలమైన వనజ అవమానాలపాలైంది.

వనజ తీసిన దెబ్బకి తట్టుకోలేకపోయాడో, హిరణ్యరావుకి భయపడ్డాడో కానీ - రంగారావు ప్రశాంతజీవనం ప్రారంభించి, క్రమంగా దానికి అలవాటుపడ్డాడు. ఎంతలా అంటే గత జీవితాన్ని ఏవగించుకునేటంతలా.. రంగారావు తొత్తు భీమన్న సాధువైపోయాడు. ఇక ఆయన తీసిపోతాడా?

యధా ప్రజా తథా రాజా అన్న సామెత నిజం చేస్తూ - రంగారావు తన స్థాయికి తగ్గట్లు మహాసాధువైపోయాడు.

భీమన్న తరచుగా ఆయన్ని కలిసేవాడు. ఇద్దరూ సాదు సంభాషణ చేసేవాళ్ళు. వనజ హిరణ్యరావుని అంతం చేయడానికి పూనుకుందని తెలిసి - ఆయన ఎంతో ఉత్సాహపడ్డాడు. వనజకి సాయపడి తన పాపాల్ని కడిగేసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆయన వనజని కలుసుకున్నాడు.

"మీరు నాకే విధంగా సాయపడగలరు?" అడిగింది వనజ.

"ఈ చేతుల్తో మనుషుల ప్రాణాలు తీయగలను" రంగారావు తన చేతులు చూపించాడు.

"మీరిప్పుడు సాధుపుంగవులు. నేనేమో ఆడపిల్లని. మనకి తగ్గ ఆలోచన చేద్దాం" మందలించిందామె.

"నేనిప్పుడు సాధువునే - కానీ గత చరిత్ర నా తపోశక్తి. అది హిరణ్యరావుకి శాపం" అన్నాడు రగారావు.

"విశ్వామిత్రుడు శాపాలతో భయపెట్టాడు. వశిష్ఠుడు వరాలని నమ్మాడు. మన సంప్రదాయం వశిష్ఠుణ్ణే అనుసరించమంటుంది"

"ఐతే నేనేం చేయాలి?"

"నా వల్ల మీరు మంచి దారికొచ్చారు. నా కోసమని చెడ్డదారికి మళ్ళడాన్ని నేనొప్పను"

"ముల్లుని తీయానికుపయోగపడే ముల్లు - సాధనమే తప్ప ఆయుధం కాదు. చెడుని ప్రతిఘటించే చెడూ అంతేనని నా నమ్మకం"

వనజ నవ్వి, "చెడుని కూడా మంచితో ఎదిరించొచ్చని ఋజువు చేసిన మహాత్ముడు కన్ను మూసి ఇంకా అరవై రెండేళ్ళే అయింది" అంది.

తను కూడా మహాత్ముడి దారిలో నడవాలని రంగారావుకి అర్థమైంది.

●●●

శరణాలయం ముందు దీక్షాశిబిరం వెలసింది. ఆ శిబిరంలో రంగారావు వెలిసాడు.

"శరణాలయం నేరాల నిలయం. వాటిని కనిపెట్టి అరికట్టే బాధ్యతని ప్రభుత్వం తీసుకునేదాకా నేను నిరాహార దీక్ష చేస్తాను" అన్న ఆయన ప్రకటన సంచలనాత్మకమై అందరి దృష్టినీ ఆకర్షించింది.

జాన్ స్టూవర్ట్ స్థావరం విశేషాలు బయటపడి ఇంకా పది రోజులైనా కాలేదు. అప్పుడే రంగారావు నిరాహారదీక్ష.

అది అగ్నికి వాయువులా తోడై రాష్ట్రాన్ని వేడెక్కించింది.

●●●

"టు ఎవ్విరి యాక్షన్ దేరీజ్ యాన్ ఈక్వల్ అండ్ ఆపోజిట్ రియాక్షన్" అన్నాడు సర్ ఐసాక్ న్యూటన్.

"ప్రతి చర్యకీ ప్రతిచర్య ఉంటుంది" అని దాన్ని అద్భుతంగా తెనుగీకరించారు నండూరి రామమోహనరావు.

దాన్ని అక్షరాలా దారుణంగా నిరూపించాడు ఉస్మాన్ ఖాన్.

ఆయన నియోగించిన గూండాలు ఒక రాత్రిపూట దీక్షా శిబిరంపై దాడి చేసారు.

మొత్తం పదిమంది. అందరి చేతుల్లోనూ గండ్రగొడ్డళ్ళు.

రంగారావు, అనుచరులు - మొత్తం యాభైమంది. అందరూ నిరాయుధులు.

●●●

ప్రతి చర్యకీ మాత్రమే కాదు. ప్రతి చర్యకి కూడా ప్రతిచర్య ఉంటుంది.

ఇలాంటిదేదో జరగబోతోందని వనజకి ముందే తెలుసు. అందుకే ఆ సమయంలో ఆ చుట్టుపక్కలే మాటేసి ఉందామె. గూండాల్ని పసి కడుతూనే ఆమె అరణ్యాని వాళ్ళమీదకి ఉసిగొల్పింది.

అరణ్యా ఒక్కడు. వాళ్ళు పదిమంది.

కొందరికది యుద్ధం. కొందరికది వేట. కొందరికది ఆట.

గండ్ర గొడ్డళ్ళు గాల్లోకి లేస్తున్నాయి. పట్టాకత్తి సుదర్శనమై తిరుగుతోంది. నిరాయుధులు పరుగెడుతున్నారు. అంతా అల్లకల్లోలం.

ఆ క్షణంలో గూండాలు రంగారావు గురించి మర్చిపోయారు. తమకి సవాలుగా అనిపించే అరణ్యాని అంతా కలిసి చుట్టుముట్టారు. ఐనా వారి యుద్ధం అతడికి ఆటలాగే ఉంది.

ఎటో విసురుతాడు వక్రదండాన్ని. అది ఎట్నించో వచ్చి వాళ్ళని బలంగా ఢీకొడుతుంది. దెబ్బకి ఠా.

అంతా ఒక్కసారే అతడి మీద దాడి చేస్తారు. అరణ్య హెలికాప్టర్లా పైకి లేస్తాడు. వాళ్ళు శత్రువుని బదులు తమని తమే ఢీకొంటారు. దెబ్బకి తా.

అతడు అవలీలగా వాళ్ళ వేటు తప్పించుకుంటాడు. అతడి గురి పొరపాటున కూడా తప్పదు. దెబ్బకి తా.

ఎదుట అరణ్య. ఎలా దెబ్బతీస్తాడో తెలియదు. ఎట్నించైనా వక్రదండం. ఎప్పుడు దెబ్బతీస్తుందో తెలియదు.

అన్ని దెబ్బలకీ గూండాల ముఠా తా అయిపోతూ, క్రమంగా పలచబడింది. అరణ్య నెదిరించి నిలవడం అసాధ్యమని ముఠానాయకుడు శంకర్‌కి తెలిసిపోయింది.

ఐతే వాళ్ళకి గత్యంతరం లేదు. అరణ్యకి భయపడి పారిపోతే - వచ్చిన పని పూర్తికాలేదని ఉస్మాన్ ఖాన్ చంపేస్తాడు. ఆ చావు ఈ చావుకంటే భయంకరంగా ఉంటుంది. అందుకని శంకర్ మిగిలిన అనుచరుల్ని అరణ్యకి వదిలి తను రంగారావు మీదకి వెళ్ళాడు.

రంగారావు సాధువుగా మారినా బలమున్న మనిషి. నిరాహారదీక్ష కూడా ఆ బలాన్ని జయించలేకపోయింది. మీదకొస్తున్న గూండా తనని ప్రాణాలతో వదిలిపెట్టాడని గ్రహించిన రంగారావు సర్వశక్తులూ క్రోడీకరించి పరుగులంకించుకున్నాడు. ఎంత దూరమైనా అలా పరుగెత్తేవాడే - కానీ ఎంతో దూరం వెళ్ళకుండానే..

రోడ్డుమీద గొయ్యి. గోతినిండా నీరు. నీటినిండా బురద. బురదలో ఆయన కాలు..

మరుక్షణం బురదనీరు అంతెత్తున చిమ్మింది. ఆ వెంటనే ఆయన రక్తం కూడా అంతెత్తూ చిమ్మింది.

●●●

మొత్తం గూండాలంతా ఫినిష్. ఇంకా ఉన్నారేమోనని ఓ సారి చుట్టూ చూస్తే వనజ కనిపించింది అరణ్యకి.

వీరావేశంలో ఉన్న అతణ్ణి అదుపు చేయాలని వస్తోందామె. అప్పుడు వినిపించాయి పోలీసులు ఈలలు - 'కోరుకున్నదిచ్చుటలో కొద్దిగా లేటు' అని పాడుతున్నట్లుగా.

పోలీసులొచ్చేలోగా వనజ అరణ్యని అక్కణ్ణించి దగ్గర్లో ఉన్న ఓ ఇంట్లోకి లాక్కుపోయింది. తలుపులు తెరిచే ఉన్నాయి. లోపల పెద్ద హాలు. హాలు మధ్యలో -

ఒక వ్యక్తి గోడ వైపు తిరుగున్నాడు. నలుగురు మనుషులు ఆయన వీపుకి నమస్కరిస్తున్నారు. ఈ తప్పు కాయమంటున్నారు. మధ్య మధ్య నేలమీద వాలి సాష్టాంగపడుతున్నారు.

ఆ వ్యక్తి వెనక్కి తిరిగాడు. అతడి చేతిలో పెద్ద కొరడా గాల్లోకి లేచింది. మరుక్షణం ఆ గాలి ఆక్రందనలతో నిండిపోయింది.

కొరడా ఆగి ఆగి మళ్ళీ మళ్ళీ గాల్లోకి లేస్తోంది. ఆక్రందనలు విన్నాడు. అతడి ముఖంలో ఆవేశం. వెంటనే ఒరలోంచీ పట్టాకత్తి తీసి ముందుకు దూకాడు.

ఏం జరగబోతోందో ముందే ఊహించిన వనజ అతడికంటే వేగంగా అతణ్ణి దాటి దారికడ్డంగా నిలబడింది. అడ్డొచ్చింది ఆమె కాబట్టి అతికష్టం మీద ఆగాడు అరణ్య.

అప్పుడు వనజ వెనక్కి తిరిగి, "హిరణ్యారావ్ - అరణ్య నీక్కాదు, నీలో మంచికి మాత్రమే మిత్రుడు. నీలో చెడుచూసాడా - నీకే శత్రువౌతాడు. ఈ విషయం మర్చిపోకు" అంది.

అరణ్య హిరణ్యారావుని చూసాడు. అతడి ఆవేశమింకా తగ్గలేదు. వనజ అనుమతిస్తే ఆ క్షణమే ఆయన్ని మట్టుపెట్టాలన్నట్లు చూస్తున్నాడు.

"అరణ్యా! ఈయన హిరణ్య. నీ ఫ్రెండ్ ఎందుకో ఈ రోజిలా చేసాడు. ఒక్క నిముషం నువ్విక్కడే ఉండు. ఈయన్ని పక్క గదిలోకి తీసుకెళ్ళి అసలేం జరిగిందో తెలుసుకునొస్తాను" అంది వనజ.

అరణ్య బుద్ధిగా తలూపి అక్కడే కూర్చున్నాడు.

వనజ, హిరణ్యారావు పక్క గదిలోకి వెళ్ళి - అక్కడున్న రెండు కుర్చీల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. అప్పుడు హిరణ్యారావు తన ముఖానికున్న మాస్కు తొలగించి భీమన్నగా మారాడు.

"గుడ్ షో" అంది వనజ అతణ్ణి మెచ్చుకుంటూ.

"ఏం గుడ్ షోయో - ఈ వేళ నా పనైపోయిందన్నే అనుకున్నాను. హిరణ్యారావునై మనుషుల్ని హింసిస్తూ అరణ్య కళ్ళబడ్డం నాకిది మూడోసారి" అన్నాడు భీమన్న ఆయాసపడుతూ.

"నీ పెర్ఫార్మెన్స్ సింప్లీ గ్రేట్. ఈ రోజు అరణ్యకి నిన్నుచంపేయాలన్నంత ఆవేశం కలిగింది" అంది వనజ.

"ముచ్చటగా మూడుసార్లు తప్పించుకున్నాను. తడవతడవకీ అతడి ఆవేశం పెరిగిపోతోంది. నాలుగో షో వేస్తే - అది లాస్ట్ షో ఔతుంది" అన్నాడు భీమన్న.

"తలపెట్టిన ఈ యజ్ఞంలో ఇంకా ఎందరు సమిధులు కానున్నారో!" బాధగా నిట్టూర్చింది వనజ, "ఇప్పుడే హిరణ్యారావు మనుషుల రంగారావుని పరమ కిరాతకంగా చంపేసారు. అసహాయంగా చూడ్డం తప్ప ఇంకేం చెయ్యలేకపోయాను. రంగారావు తన్ను తాను రక్షించుకోగల క్రూరజంతువు. మనిషిగా మారడం వల్ల - ఈ రోజు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ సమాజంలో జంతువులకే తపప మనుషులకి మనుగడ లేదనిపిస్తోంది భీమన్నా! నువ్వు మనిషివైతే నీ గతీ అంతేనేమో - ఆలోచించుకో. నేను ముందే ఫిక్సైపోయాను కాబట్టి నాకు తప్పదు కానీ - నీకు ఎనీ టైం విత్‌డ్రా అయ్యే అవకాశముంది"

భీమన్న అసంతృప్తిగా నవ్వాడు, "నాలుగో షో లాస్ట్ షో అన్నాను. అలా అన్నప్పుడు నా గొంతులో భయం కానీ ధ్వనించిందా నీకు - ఇలాగంటున్నావ్!"

"అంటే?" అంది వనజ అర్థంకానట్లు.

"చట్టానికి దొరక్కుండా సాధువయ్యాడు రంగారావు. ఆయన్ని చట్టం ముందు నిలబెడితే - ఈ పాటికి పదిసార్లైనా ఉరిశిక్షపడేది. నీకోసం పనిచేయడం వల్ల ఉరికంబానికి బదులు వీరస్వర్గం లభించిందాయనకి. నేనూ ఆయన లాంటివాణ్ణే. నేనూ ఉరికంబానికి బదులు వీరస్వర్గం కోరుకుంటున్నాను" అన్నాడు భీమన్న దృఢంగా.

"నీ అంకిత భావం గొప్పది. ఐతే నువ్వు కోరాల్సింది చచ్చేక వీరస్వర్గం కాదు. బ్రతికుండగా వీరచక్రం" అని,

"అరణ్య ప్రవర్తనే చిత్రంగా ఉంది నాకు. అతడు మంచివాడనుకున్న మనిషిని అతడిచేత చంపించడం నా వల్ల కాలేదు. కానీ అతడు దుర్మార్గుడనుకున్న మనిషిని చంపకుండా ఆపగలిగాను. అసలు సిసలు మంచి మనిషి కావడానికి అతడి ప్రవర్తనలో ఏదో నిగూఢ సందేశమున్నదనిపిస్తోంది నాకు" అంది.

అంతలో గది గుమ్మం దగ్గర అలికిడయింది. భీమన్న చటుక్కున హిరణ్యారావు మాస్కు తగిలించుకుని వికటాట్టహాసం చేసాడు. ముందు గతుక్కుమన్నా వెంటనే పరిస్థితి అర్థం చేసుకున్న వనజ చప్పున జుట్టు చెరుపుకుని, "హెల్ప్ హెల్ప్.." అంటూ అరిచింది.

అరణ్య క్షణాలమీద ఆమె ముందు వాలాడు.

వనజ చెదిరిన జుట్టు సవరించుకుంటూ, "హిరణ్యారావీ జన్మకి మారడు. ఇందాకా నిన్నాపి తప్పు చేసాను" అంది.

●●●

ఐఐటీలో సీటొచ్చిందని అబ్బాయి పొంగిపోతే రాంకు వెయ్యిదాటిందని తండ్రి ఈసడిస్తాడు.

అరణ్య వంటి ఆటవికుణ్ణించి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డమే కాక - రంగారావుని చంపి కార్యం సాధించుకొచ్చిన గూండా శంకర్‌ది ఇప్పుడలాంటి పరిస్థితే!

తనమీద ప్రశంసల జల్లు కురుస్తుందన్న ఆశతో జరిగిందంతా ఉస్మాన్ ఖాన్‌కి వినిపిస్తే ఆయన శ్రద్ధగా విని - ముందు ఆశ్చర్యపోయాడు. వనజ తమకి వ్యతిరేకంగా పనిచేస్తోందనీ, అరణ్యని ఆమె ఆయుధంగా వాడుతోందనీ - రూఢి కావడం ఆశ్చర్యానికి మొదటి కారణం. తమ అంచనాలకందని అరణ్య శక్తియుక్తులు రెండో కారణం.

ఇంత జరుగుతుంటే ఈ విషయం తెలుసుకుందుకు ఇంతకాలం పట్టడం మూడో కారణం.

వనజని తెరవెనకనుంచి ముందుకి తీసుకొచ్చాడు శంకర్. అతడు సేకరించిన సమాచారం సామాన్యమైనది కాదు. కానీ సమాచారానికిచ్చిన ప్రాముఖ్యం శంకర్‌కి ఇవ్వదలచుకోలేదు ఉస్మాన్ ఖాన్.

"అంటే - నువ్వు అరణ్యని చంపకుండా పిరికిపందలా పారిపోయొచ్చేవన్నమాట!" అన్నాడాయన ఎగతాళిగా. జరిగింది కళ్ళకి కట్టినట్లు వర్ణించి చెప్పేక కూడా ఆయనిలాగంటాడని ఊహించలేదేమో, శంకర్ దెబ్బ తిన్నాడు. ఉస్మాన్ ఖాన్ అతణ్ణి తిరస్కారంగా చూసి, "సరే - ఈసారికి నిన్ను క్షమిస్తున్నా. అలాగని కాళ్ళు ముడుచుకుని నిద్దరోకు. ఇరవై నాలుగ్గంటలు టైమిస్తున్నా. అంతమంది మనవాళ్ళని ఖైమా చేసిన ఆ జంగ్లీగాణ్ణి ఖతమ్ చేసి తప్పు సవరించుకో. అర్థమైందిగా - ఇరవైనాలుగ్గంటల తర్వాత - నువ్వో, ఆ జంగ్లీగాడో - ఒక్కరే బ్రతికుంటారీ భూమ్మీద" అన్నాడు కటువుగా. శంకర్ కంగారుగా ఆయనకేదో చెప్పబోతే, "టైం వేస్ట్ చేసుకోకు. అప్పుడే ఇరవై నాలుగ్గంటల్లో కొన్ని నిముషాలు బేకార్" అని హెచ్చరించాడు.

శంకర్ కదలబోతే కాళ్ళలో వణుకు. అతి కష్టం మీద అడుగు కదిపితే, "గుర్తుంచుకో, ఆ జంగ్లీగాడి ప్రాణాలు తియ్యాల్సింది నగరంలో కాదు, జంగిల్లో. నిన్నటి సంగతి వేరు. ఆ జంగ్లీగాడక్కడే చచ్చుంటే - రంగారావుని వాడే చంపాడనుండేవాళ్ళం" అని, చెప్పేది వినడానికి ఆగిపోనక్కర్లేదు. కాస్త గట్టిగానే అరిచి చెబుతాగా నువ్విక నడక మొదలెట్టు. లేకుంటే నిముషాలు వేస్టు" అంటూ మళ్ళీ హెచ్చరించాడాయన.

## 23

**ఆటల్లో గెలుపుకి నేర్పుతోపాటు** కిల్లర్ ఇన్ స్టింక్ట్ - అంటే చంపేయాలన్నంత కసి - కూడా చాలా అవసరం. అది లేకనే - వ్యక్తిగతంగా ఒలింపిక్ స్వర్ణాన్ని సాధించడానికి ఇండియా 2008 దాకా ఎదురు చూడాల్సొచ్చిందన్న మాట అక్షరాలా నిజం. అంటే హత్య చేయడం తప్పైనా - హత్యా స్ఫూర్తి తప్పు కాదని, అర్థం అనుకున్నది సాధించాలన్న పట్టుదల నుంచి, ఫలితం సాధించే కిటుకేమిటో హంతకుణ్ణించే నేర్చుకోవాలి. ఆ కిటుకు తెలిస్తే ఆటగాడు ఆటలో, హాలికుడు తోటలో, గాయకుడు పాటలో, నాయకుడు కోటలో రాణిస్తారు.

శంకర్ వీళ్ళలో ఎవ్వరూ కాదు. అతడు స్వయానా హంతకుడు. బాస్ చెప్పాడని ఎందరి ప్రాణాలో తీసిన అతడిప్పుడు తన ప్రాణాల్ని రక్షించుకుందుకు అరణ్యని చంపడం తప్ప మరోమార్గం లేదనుకుంటున్నాడు. ఉస్మాన్ ఖాన్‌ని చంపడం కూడా ఓ మార్గమని అతడికి తోచదు. తోచినా ఆయన్ని చంపి తన ఆయువు పెంచుకోగల నన్న నమ్మకంలేదు. ఉస్మాన్ ఖాన్ ఒక వ్యవస్థ అనీ, ఆయన అశాశ్వతమైనా ఆ వ్యవస్థ శాశ్వతమనీ, ఆ వ్యవస్థ అంతమైతే తప్ప ఆయన్నంతమొందించి ప్రయోజనముండదనీ అతడికి తెలుసు. తనూ ఆ వ్యవస్థలో భాగమనీ తెలుసు. అందుకే తన ఆయువు పెంచుకుందుకు అరణ్యని చంపడమే మార్గమని ఫిక్సైపోయాడు.

అతడు తనతో కలిపి మెరికల్లాంటి మనుషుల్ని నలభైమందిని ఎన్నిక చేసాడు. రాత్రి కాగానే ఒక వ్యానులో ముప్పైమందినీ, జీపులో పదిమందినీ ఎక్కించాడు. రాత్రి ఆ రెండు వాహనాలూ అతడు చెప్పిన ప్రకారం వనజ ఇల్లు చేరి పెరటి వైపు ఆగాయి. శంకర్ ఒక్కడూ ఆ ఇంట్లో దొడ్డిదారిన ప్రవేశించాడు.

వీధిలో ఆగిన కార్లని చూసేందుకే మనుషులు లేరు. అతడా ఇంట్లో ప్రవేశించడాన్ని చూసేదెవరు?

శంకర్ నిశ్శబ్దంగా ఇంట్లో ప్రవేశించాడు. ఇల్లు కూడా నిశ్శబ్దంగానే ఉంది.

ఓ గదిలో వనజ. మరో గదిలో అరణ్య - గాఢ నిద్రలో ఉన్నారు.

శంకర్ స్ప్రే చల్లి ముందు వనజనీ, తర్వాత అరణ్యనీ మత్తులో పడేసాడు. కూడా తెచ్చిన ప్లాస్టిక్ తాళ్ళతో ఇద్దరికీ కాళ్ళూ చేతులూ కట్టేసాడు. ఒకరి తర్వాత ఒకర్ని మోసుకుంటూ వెళ్ళి జీపులో వెనకాల చేర్చాడు.

వాహనాల్లోని నలభైమందీ అరణ్యని కుతూహలంగా చూసారు. అతణ్ణి చంపడానికి నలభైమంది అవసరమా అని మనసుల్లో ఆశ్చర్యపడ్డారు. వాళ్ళేకాదు, శంకరూ ఆశ్చర్యపడ్డాడు. ఆ ఆశ్చర్యానికి ఆనందం కూడా జత కలిసింది. ఉస్మాన్ ఖాన్ హెచ్చరించినప్పుడీ పని ఇంత సులభమని అతడనుకోలేదు.

శంకర్ టైము చూసుకుంటే పదకొండయింది, "ఇరవై నాలుగ్గంటలకి ఇంకా ఏడు గంటలుంది" అనుకున్నాడు. జీపు, వ్యాను - అడవి వైపు మళ్ళాయి.

●●●

గూఢచారికీ గూఢచారిలాంటి మనిషికీ తేడా ఉంది.

గూఢచారిది ఉద్యోగం. దానికి కొన్ని నియమాలు పాటించాలి. సూత్రాలననుసరించాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. అది ఉద్యోగ ధర్మం.

గూఢచారిలాంటి మనిషికీ నియమాలు, సూత్రాలు ఉంటాయి. అప్రమత్తతా అవసరం. కానీ అది ఉద్యోగధర్మం కాదు కాబట్టి - అదనంగా మానవత్వం, దైవత్వం, నమ్మకం జత కడతాయి.

ఇన్స్పెక్టర్ రఘు మరణించేక - మానవ ప్రయత్నానికి దైవం కూడా సహకరించాలని గ్రహించింది వనజ. దేవుడి లీలలు అర్థం చేసుకోవడం కష్టమే ఐనా - ఆయన మంచికి బాసటగా నిలుస్తాడని నమ్మసాగింది. ఆయన అండ లేనిదే ఏ ప్రయత్నమైనా వ్యర్థమేనని తెలుసుకుంది.

ఇండియా - పాకిస్తాన్ల మధ్య జరిగే యుద్ధంలో ధర్మం, న్యాయం ఇండియా పక్షానే ఉండొచ్చు. ఐనా కొందరు భారత సైనికులు ప్రాణాలు కోల్పోక తప్పదు. మంచికీ చెడుకీ జరిగే పోరాటంలో అంతిమ విజయం మంచికే లభించినా - ఆలోగా మంచి కూడా కొంత నష్టపోక తప్పదు. మంచికి జరిగిన నష్టానికి చలించిపోయి - మంచినే విడిచిపెట్టాలనుకోవడం ఎవరికైనా తగని పని.

ఒకటి కాదు, రెండు కాదు - చాలా మార్లే అనిపించింది వనజకి - మంచికి న్యాయం జరగదని! కానీ ప్రతిసారీ ఏదో జరిగి ఆమె తన దృష్టికోణం మార్చుకోవాల్సొచ్చింది. ఇప్పుడు భీమన్న రంగారావు హత్య విషయంలో ఆమెకి ధైర్యం చెప్పడం - తాజా సంఘటన.

దేవుణ్ణి నమ్మినవారికి లక్ష్యమే తప్ప భయముండదు. వనజ అరణ్యతో సహా అంత సులభంగా శంకర్ చేతిలో చిక్కడానికి ఆ నిర్భయత్వమే కారణమయుండాలి.

ఈ ప్రపంచంలో బందిపోట్లకంటే మహాత్ములే ఎక్కువకాలం జీవించడానికీ, ఆ మహాత్ములు కూడా ప్రమాదానికి గురి కావడమే తప్ప సహజ మరణాన్ని పొందకపోవడానికీ కూడా ఆ నిర్భయత్వమే కారణం.

●●●

సగం దారిలో వనజకి మెలుకువొచ్చింది. తనే పరిస్థితిలో ఉన్నదీ తెలుసుకునేందుకు కొన్ని క్షణాలు పట్టింది. అప్పుడే వనజ పక్కనే ఉన్న అరణ్యకీ మెలుకువొచ్చింది. తన పరిస్థితి తెలియగానే అతడు శరీరాన్ని కుంచింపజేసాడు. ఆటవికులది వెన్నతో పెట్టిన విద్య.

కట్లు వదులైపోయాయి. చప్పుడు చేయకుండా అరణ్య వాటినుంచి బయటపడి చుట్టూ చూసాడు.

జీపులో వెనకాల ఏడుగురున్నారు. అందరూ కునికిపాట్లు పడుతున్నారు.

అరణ్య ముందు వనజకి కట్లు విప్పాడు.

తామిద్దరూ ప్రమాదంలో ఉన్నారని అతడు పసికట్టాడు. వనజని ఒడిలోకి తీసుకుని ఒక్క ఉదుటున కదులుతున్న జీపులోంచీ బయటకి గెంతాడు. జీపు వెనకే వస్తున్న వ్యాన్ మీదకొచ్చేలోగా పక్కకి తప్పుకుని లేచి నిలబడ్డాడు. ఒడిలోని వనజని భుజం మీదకి మార్చుకుని - పరుగందుకున్నాడు.

అది మామూలు పరుగు కాదు.

లేడి పిల్లని వేటాడే చిరుత పరుగు. చిరుతనుంచి తప్పించుకునే లేడి పరుగు....

●●●

జీపుకి సడెన్ బ్రేకు పడింది. వ్యాను కీచుమంటూ ఆగింది.

ఒకరు కాదు ఇద్దరు కాదు.. నలభైమంది బలిష్టులు - వాహనాల్లోంచీ బిలబిలమంటూ బయటికొచ్చారు.

"వాడూ, అదీ - ఇప్పుడే అలా పరుగెత్తారు. ఇంకా ఎంతో దూరమెళ్ళి ఉండరు. పరుగెత్తండి. తొందరగా అందుకోండి. వాణ్ణిప్రాణాలతోనే పట్టుకోవాలని లేదు. అవసరమైతే చంపేయండి" అన్నాడు శంకర్.

వెంటనే ఓ పాతికమంది అటువైపుగా దూకారు. అక్కడే ఉన్న మిగతావాళ్ళని చూసి, "మీరెందుకాగారు?" అన్నాడు శంకర్. అది ప్రశ్నలాకాక మందలింపులా ఉంది.

"వాడు అడవి మనిషి. మనకి ఇల్లెలాగో వాడికి అడవి అలాగ. ఇట్టే అలా వెళ్ళాడు. అట్టే ఇలా వస్తాడేమోనని - మేము నీకు సాయంగా ఉండిపోయాం" అన్నాడొకడు.

"అఘోరించారు. మీరూ వెళ్ళండి" అన్నాడు శంకర్. అంతలోనే ఏమనుకున్నాడో, "సరేలెండి, ఇక్కడే ఉండండి" అన్నాడు.

అప్పుడే శంకర్ మనసులో భయం కళ్ళకి కట్టినట్లే ఉంది.

తనవాళ్ళు నలభైమందున్నా అరణ్యని తరమకుండా తానక్కడుండిపోయిన కారణమదే! నువ్వెందుకిక్కడుండి పోయావూ అని ఎదురు ప్రశ్న వేయకుండా - తనకి రక్షణగా ఉంటామన్న ఆ అనుచరుల అండ తనకి అవసరమని అతడికి తోచింది. ఒకవేళ అరణ్య వెనక్కొస్తే తనవాళ్ళతణ్ణి ఢీకొనే సమయానికి తను తప్పించుకుపారిపోవచ్చునని అతడి ఆశ.

ఆ ఆశకి మూలకారణం భయమని అతడికి తెలుసో తెలియదో - కానీ ఆ భయం క్రమంగా పెరుగుతోంది కూడా.

●●●

వనజ ఆశ్చర్యంగా చూస్తోంది.

చేపపిల్లకి నదీ జలాలతోనే తప్ప నదితో పనిలేదు. నీటిలో చేపపిల్ల ఈదినట్లు దూసుకుపోతున్న అరణ్యకి అడవైతే చాలు, అటవీ ప్రాంతంతో నిమిత్తం లేదన్నట్టుంది.

వెంటాడుతున్న మనుషుల అడుగుల చప్పుడు వినబడుతోంది. అరణ్య దూసుకుపోతున్నాడే తప్ప భయపడ్డంలేదు. వారినెదుర్కొనేందుకు ఏ క్షణంలోనైనా సిద్ధమే అన్నట్లుంది అతడి బాడీ లాంగ్వేజ్.

నిజానికి వెంటాడుతున్నవాళ్ళు చాలామందే ఉన్నారు. కానీ ఇది అడవి.

"చంపాలనుకున్నవాళ్ళకి ఈ ప్రకృతి పుత్రుణ్ణి అడవిలోకి తీసుకు రావాలనెందుకనిపించిందో - - కొరివితో తలగోక్కున్నారు" అనుకున్న వనజకి, "దేవుడున్నాడు. ఆయన దుష్టశక్తుల్ని నివారించకపోయినా, వాటి ఆలోచనల్ని మంచికి అనుకూలంగా శాసించగలడు" అనికూడా అనిపించింది.

సరిగ్గా అప్పుడే అరణ్య చెట్టు చాటుకి తప్పుకున్నాడు.

వెనుకనుంచీ అడుగుల చప్పుడు దగ్గరైంది.

●●●

"ఒక్కడూ ఇంకా వెనక్కి రాలేదు, ఏం జరుగుతోందో వెళ్ళి చూసొస్తావా?" అన్నాడు శంకర్ ఓ అనుచరుడితో. వాడు బుద్ధిగా తలూపి ఇట్టే వెళ్ళి అట్టే వెనక్కి వచ్చాడు.

"అప్పుడే వచ్చేసావేంటి?" అన్నాడు శంకర్ భయాన్ని చికాకుగా మార్చే ప్రయత్నం చేస్తూ.

అనుచరుడు గుటకలు మింగుతూ, "శవం, మనవాడిదే." అని అర్ధోక్తిలో ఆగాడు.

శంకర్‌కిక భయం చికాకుగా కూడా మారనుంది. ఐనా మేకపోతు గాంభీర్యంతో, "ఊఁ శవాన్ని చూసి వెనక్కొచ్చేసావ్. ముందుకెళ్ళొద్దూ?"

"వెళ్ళాను. ఇంకో శవం. అదీ మనవాడిదే...."

ఉలిక్కిపడ్డాడు శంకర్. నోటమాట రాలేదతడికి.

అనుచరుడు కొనసాగించాడు, "అలా మొత్తం నాలుగు శవాలు చూసాను. ఇక ముందికి ఒక్కణ్ణీ వెళ్ళాలంటే భయమేసింది...."

"అంటే అరణ్య అటే ఉన్నాడు. రండి అంతా కలిసే వెడదాం" అన్నాడు శంకర్.

కలిసే అన్నప్పటికీ అందరి ముఖాల్లోనూ భయం. అది బయటపడుతుందనో ఏమో ఒకరి ముఖాలొకరు చూసుకోలేదు. కానీ తప్పదుకదా - చివరికి 'విజయమో, వీరస్వర్గమో' అనుకుంటూ అందరూ బయల్దేరారు. కాస్త దూరం వెళ్ళగానే అది అడవిదారి కాదనీ శవాల దారి అనీ వాళ్ళకి అనిపించింది.

ఒకటి...రెండు...మూడు..

శవాల్ని లెక్కిస్తుంటే అందరికీ గుండెలు గుబగుబలాడాయి, "వాడు మనిషి కాదు, మృత్యువు" అన్నాడొకడు.

శంకర్ మాట్లాడలేదు.

పదకొండు.. పన్నెండు.... పదమూడు...

"నేను వాణ్ణి అడవిలోకి తీసుకురాకుండా ఉండాల్సింది.." అనుకున్నాడు శంకర్. అనుకున్నది మనసులోనే ఐనా అక్కడా మాటలు తడబడ్డాయతడికి.

ఇరవై.. ఇరవై ఒకటి.. ఇరవై రెండు..

"గురు! బ్రతికుంటే బలుసాకు తినొచ్చు.."

అది ఒక్కడిమాటకాదు. పైకనలేదు కానీ శంకర్ మనసులో మాటకూడా అదే కానీ బ్రతికుండడమూ, బలుసాకు తినడమూ - వెనక్కి వెడితే జరగనివని అతడికి తెలుసు.

శంకర్ ఆలోచిస్తూనే ఉన్నాడు. ఉన్నట్లుండి అక్కడ తుపాకి గుళ్ళ వర్షం కురిసింది. అనుచరులొకొక్కరుగా కూలి పోగా శంకర్ ఒక్కడే మిగిలాడు.

"జేబులో ఆయుధాలు తీసి కింద పారేయ్.." అందో స్త్రీ కంఠం.

శంకర్ తటపాటయించలేదు. ఆ మాటని సుగ్రీవాజ్ఞలా పాటించాడు.

"చేతులెత్తు"

అతడు చేతులెత్తి నిలబడగానే చెట్టుచాటునుంచీ వచ్చింది వనజ.

"అందర్ని చంపావ్. నన్నెందుకు చంపలేదు?" అన్నాడు శంకర్ ఆశ్చర్యంగా.

"నీ వాళ్ళని చంపింది నేను కాదు. కానీ నేను తలుచుకునుంటే ఇందరితోపాటు నువ్వూ చచ్చి ఉండేవాడివన్నది నిజం. కానీ నేనలా చేయలేదు. ఎందుకంటే అసహాయులమైన మమ్మల్ని ప్రాణాలతో బంధించి ఇక్కడికి తీసుకొచ్చావే తప్ప నువ్వు నన్నూ, నా మిత్రుణ్ణీ చంపాలనుకోలేదు. మమ్మల్ని మేము రక్షించుకునేందుకు ఆ మాత్రం అవకాశమిచ్చిన నీ పట్ల కృతజ్ఞత ఉండాలి కదా!" అంటూ వనజ అతణ్ణి సమీపించింది.

శంకర్ ఆమెని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఆమెని చూస్తే మృత్యుముఖం నుంచి బయటపడినట్లనిపించదు. సరదాగా షికారుకొచ్చినట్లుందామె. అతడింకా అలానే చూస్తుండగా ఆమె చేయిసాచి, "స్నేహభావంతో ఇస్తున్నాను. ఈ చాక్లెట్ తీసుకో. సగం నీకూ, సగం నాకూ" అంటూ అతడికో చాక్లెట్టందించింది.

అతడి మనసు పరిపరివిధాలపోయింది. ఇప్పుడు తనామెని ఎటాక్ చేస్తే..?

అరణ్య ఏమూల పొంచి ఉన్నాడో తెలియదు. ఒకొక్కరుగా శవాలైన తన అనుచరులు గుర్తుకొస్తున్నారు. శంకర్ పిచ్చి వేషాలు వేయలేదు. చాక్లెట్ ఆమె చేతిలో ఉండగానే బుద్ధిగా సగం ముక్క విరిచి తీసుకున్నాడు.

ఇద్దరూ చెరి సగం చాక్లెట్ తిన్నాక, "దాచకుండా నిజం చెప్పు" అంది వనజ.

"ఇకదాచి మాత్రం ఏంలాభం? నిజమే చెబుతాను. నన్ను ఉస్మాన్ ఖాన్ పంపాడు. నేను అరణ్యాని చంపాలి. లేకపోతే ఆయన నన్ను చంపేస్తాడు. గడువిప్పుడు గంటల్లో కొచ్చింది...."

"ఆ గడువులోగా నువ్వే ఆయన్ని చంపేయొచ్చుగా?"

"నేనాయన ఉప్పు తిన్నాను.."

"నువ్వు మూర్ఖుడివి. ఆయన తినేది తీపి. నీచేత తినిపించేది ఉప్పు. అందుకు నీకు కృతజ్ఞత. ఇంతకీ ఆయన నీచేత తినిపిస్తున్నది ఆరోగ్యకరమైన సఫోలా సాల్టుకాదు. శుద్ధిచేయని సముద్రపుటుప్పు. ఆయన నీ చెల్లిని వేశ్యగా మార్చాడు. నీలో ప్రతీకారం జ్వలించలేదు. నిన్నూ నీ తమ్ముణ్ణీ గూండాల్ని చేసి తన పనులు చేయించుకుంటున్నాడు. పోనీ గూండాగిరీ గొప్పదని ఒప్పుకుంటాడా? నో - ఆయనకి గూండాల సాయంకావాలి కానీ తను పెద్దమనిషన్న స్టాంపుండాలి. అందుకు నువ్వాయన పెట్టే ఉప్పు తిని - ఆయనకోసమే ఆ ఉప్పుని చెమటగా మార్చి - పోయిన ఉప్పుని భర్తీ చేసుకుందుకు మళ్ళీ ఉప్పు తిని - ఆయనకోసమే ఆ ఉప్పుని చెమటగా మార్చి - పోయిన ఉప్పుని భర్తీ చేసుకుందుకు మళ్ళీ ఉప్పుతింటావ్. నువ్వలా ఉప్పు తింటూనే ఉండు. ఏదో రోజున బ్లడ్ ప్రెషర్‌తో చస్తా.." ఆగింది వనజ.

శంకర్ మాట్లాడలేదు.

వనజ కొనసాగించింది, "ఉస్మాన్ ఖాన్‌కి తమ్ముడున్నాడు. వాణ్ణి గూండాని చేయడేం? చెల్లెలుంది. దాన్ని వేశ్యగా మార్చడేం? పిల్లలున్నారు - శరణాలయంలో జేర్పించడేం? ఏదైతే తనకి ఉప్పో - అది మీ చేత తినిపిస్తూ - తను మాత్రం తియ్యతియ్యగా బ్రతుకుతున్నాడు. ఒక్కసారైనా తోచలేదా - ఆయన్ని నిలదీయాలని!"

"ఆయన్ని కాదంటే బ్రతుకుండదు నాకు..." నిస్సహాయంగా అన్నాడు శంకర్.

"నన్ను కాదన్నా బ్రతుకుండదు నాకు.." నిస్సహాయంగా అన్నాడు శంకర్.

"నన్ను కాదన్నా బ్రతుకుండదు నీకిప్పుడు. ఆలోచించుకో - నువ్వు ఉస్మాన్ ఖాన్‌ని చంపి - పోలీసులకి లొంగి పోయావనుకో. నీకు శిక్ష పడితే పడొచ్చు కానీ సమాజంలో ఇన్నాళ్ళూ పొందని గౌరవం లభిస్తుంది. అది ఉప్పగా ఉండదు, తియ్యగా ఉంటుంది. మరి నా మాటమీద ఉస్మాన్ ఖాన్‌ని చంపుతావా?"

ఏ నాయకుణ్ణైనా ఏమైనా అనగల కాంగ్రెస్ నేత - సోనియా ప్రసక్తి వస్తే నోరు మెదపలేనట్లు - ఏమనాలో తెలియక, "ఆలోచించుకోవాలి" అన్నాడు శంకర్.

"ఎంతసేపాలోచిస్తావో నీ ఇష్టం. కానీ నీకున్నది మాత్రం నాలుగే గంటలు. ఇప్పుడు నువ్వు తిన్నావే - ఆ చాక్లెట్లో విషముంది. అది నాలుగు గంటల తర్వాత పని చేయడం మొదలెడుతుంది. ఆ విషానికి విరుగుడు నా దగ్గరుంది. గడువులోపల ఉస్మాన్ ఖాన్ని చంపి నా దగ్గరకి రా. ఆ తర్వాత నీకు నేను మారిపోయిన నేరస్థుడిగా గొప్ప ప్రచారాన్నిస్తాను. పత్రికల్లో, టీవీ ఛానెల్సులో ఎక్కడ చూసినా నువ్వే నువ్వు.."

శంకర్ ఉలిక్కిపడ్డాడు. ఉన్నట్లుండి తనని విషనాగు కరిచిన అనుభూతి. వళ్ళంతా ఏదో కంపరం. తమాయించుకున్నాక, "ఆయన్ని చంపడం అంత సులభం కాదు" అన్నాడు నెమ్మదిగా.

"నీకు సులభమే. ఎందుకంటే ఆయనకి నీమీద అనుమానం లేదు..."

"కానీ..." శంకర్ శరీరంలో స్లో పాయిజన్ అతడి దృఢనిర్ణయాన్ని సందిగ్ధంగా మారుస్తోంది.

"నాకు తెలుసు. నువ్వు అరణ్యని చంపకుండా ఆయన దగ్గరకి వెళ్ళలేవు. సో - నువ్వు అరణ్యని చంపినట్లు ఆయన నమ్మే ఆధారాలు నేనిస్తాను. వాటితో ఆయన దగ్గరకెళ్ళు. అదును చూసుకుని ఆయన్నే వేసేయ్..."

"ఐనా"... ఏమనాలో తెలియదు కానీ శంకర్లో బానిసతత్వపు సంకోచం.

"ఇక్కణ్ణించి ఊళ్ళోకెళ్ళాలి. అక్కణ్ణించి ఉస్మాన్ ఖాన్ ఇంటికి. తర్వాత ఆయన్ని చంపాలి. అప్పుడు ఏ ఇంట్లోంచి బంధించి మమ్మల్నిక్కడికి తెచ్చావో - అక్కడికొచ్చి ఆ కబురు చెప్పాలి. ఆధారాలు చూపిస్తే నమ్మే టైపు కాదు నేను. అచ్చంగా చంపే రావాలి సుమా - అన్నింటికీ కలిపి మొత్తం నాలుగు గంటలు.."

ఆమె చివరి మాటలు వింటూనే శంకర్ పరుగెత్తాడు. ప్రాణభయం ఆ పరుగుకి వేగాన్నిచ్చింది.

అతడలా వెళ్ళగానే అరణ్య చెట్టుచాటునుంచి వచ్చాడు. "పద" అంది వనజ.

ఇద్దరూ రోడ్డు చేరుకునేసరికి శంకర్ వ్యాన్ స్టార్ట్ చేసాడు. వనజ, అరణ్యలు జీపెక్కారు.

●●●

వ్యాన్ ఉస్మాన్ ఖాన్ ఇంటిముందాగింది. శంకర్ అందులోంచి దిగాడు. వనజ ఎంతలా చెప్పినా అతడి మనసు ఉస్మాన్ ఖాన్ పట్ల వ్యతిరేకతకి సంసిద్ధం కాలేకపోతోంది. ఐతే తన ప్రాణాలు రక్షించుకునేందుకు అన్యమార్గముంటే తప్ప వనజ ఆజ్ఞ పాటించక తప్పదు. అసలు విషయం బాస్కి చెప్పేసి తన విశ్వాసపాత్రతని బుజువు చేసుకుంటే - ఆయనే ఏదైనా మార్గం చూపిస్తాడేమో!

శంకర్ బానిస మనస్తత్వం ఇంకా ఉస్మాన్ ఖాన్ వైపే మొగ్గుతోంది. అతడు చకచకా ఇంట్లో ప్రవేశించాడు. ఆ ఇంట్లో ఏ సమయంలోనైనా అతణ్ణి ఆపేవారుండరు.

ఉస్మాన్ ఖాన్ గదిలోంచీ మాటలు వినిపిస్తున్నాయి.

"బాస్ మెలుకువగానే ఉన్నాడు" అనుకున్నాడు శంకర్. ఆయన మూడ్ ఎలా ఉందో తెలుసుకుందుకు గది గుమ్మం ముందు ఆగాడు.

●●●

అనుమానం పెనుభూతమన్నది ఉత్తమాట కాదు.

అరణ్యని చంపడానికి నాగరికం పనికిరాదనీ, అనాగరికంగా చంపే ఏర్పాటు చేసాననీ ఉస్మాన్ ఖాన్ ఫోన్లో చెప్పినప్పుడు హిరణ్యరావు ఏ మాత్రమూ సంతోషించలేదు. ఆ పైన శంకర్కి ఇరవై నాలుగుగంటలు టైమివ్వడమైతే ఆయనకి బొత్తిగా నచ్చలేదు.

చరిత్రకి చరిత్రే మారిపోవడానికి సెకన్లు చాలు. అలాంటిది ఇరవై నాలుగు గంటలంటే - ఎందరివల్ల పొరపాట్లు జరిగి తమకి ముప్పు తెచ్చిపెడతాయో ఊహించడం కష్టం.

హిరణ్యరావు ఆ రాత్రంతా గంట గంటకీ ఉస్మాన్ ఖాన్‌కి ఫోన్లు చేసి తెలుసుకుంటూనే ఉన్నాడు.

"మీరు అనవసరంగా హైరానా పడుతున్నారు" అన్నాడు ఉస్మాన్ ఖాన్. ఆయన గొంతు హిరణ్యరావుని మందలిస్తున్నట్లు లేదు. ఆత్మవిశ్వాసాన్ని ధ్వనిస్తోంది.

"హైరానాయే మరి. ఆ వనజేమో గుండెలు తీసిన బంటు. అప్పుడంత జరిగినా మళ్ళీ ప్రతీకారానికి పూనుకుందంటే - అందుకు తగ్గ బలమాయె సంతరించుకుని ఉండాలి. ఈసారి ఆ పిల్ల పొరపాటు చేస్తుందనుకోను. శంకర్‌లాంటి మాములు గూండాకి ఆమె అందదు. అరణ్యాని అందనివ్వదు. వాళ్ళనేం చేయలేని శంకర్ బెదిరిపోయి చివరికి పోలీసులకి లొంగిపోయి అప్రూవ్‌గా మారినా ఆశ్చర్యం లేదు. దాంతో మన కథకి తెర పడుతుంది. నీకేం అలా అనిపించడంలేదా?"

"శంకర్ పోలీసులకి లొంగడు. నాకా నమ్మకముంది. నేనిచ్చిన ఇరవై నాలుగ్గంటల్లోనూ కార్యం సాధించడానికి శాయశక్తులా కృషిచేస్తాడు. ఫెయిలయితే మాత్రం - ఉల్లన్‌లో పడడం సహజం అప్పుడు పోలీసులకి లొంగిపోదామా అని కూడా అనుకోవచ్చు. అందుకని నేను వాడిచేత ముందే విషం తినిపించాను. అది తిన్నాక వాడి ఆయువు ఇరవై నాలుగు గంటలు. అంతే!" నవ్వాడు ఉస్మాన్ ఖాన్.

ఆయన హిరణ్యరావు అనుమానం తొలగించి గర్వంగా చూడ్డానికి గది గోడలు నచ్చక, గుమ్మంవైపు చూస్తే - అక్కడ పెనుభూతంలా కనిపించాడు శంకర్. అతడి చేతిలో పిస్తోలు.

ఉస్మాన్ ఖాన్ చేతిలో ఫోనలాగే ఉంది. ఇరవై నాలుగు గంటలలోపే శంకర్ వచ్చే అవకాశముందని ఊహించని ఆయన అతడి చేతిలో పిస్తోల్నీ, కళ్ళలో ఎరుపునీ చూసి కెవ్వుమన్నాడు.

అప్పుడు శంకర్ మనసులో ఏ సందిగ్ధమూ లేదు. అతడి చేతిలో పిస్తోలు ఢాం మని పేలింది.

●●●

"హలో" అంది వనజ.

"నేను ఉస్మాన్ ఖాన్ ఇంటినుంచి మాట్లాడుతున్నాను. నా పక్కనే ఆయన శవముంది. విషానికి విరుగుడు సిద్ధంగా ఉంచి. ఇప్పుడే నీ ఇంటికొస్తున్నాను"

"ఓకే"

"మరో విషయం. నన్ను అర్జంటుగా ఓ మంచి డాక్టరుకి చూపించాలి"

"ఎందుకు?"

"నువ్వే కాదు. ఖాన్ కూడా నాకు విషాన్నిచ్చాడు" అంటూ శంకర్ ఆమెకి జరిగింది చెప్పాడు. వనజ తెల్లబోయింది, "ఐతే నువ్వు అర్జంటుగా వెళ్ళాల్సింది పోలీస్ స్టేషన్‌కి. జరిగింది చెప్పేస్తే వాళ్ళే నిన్ను డాక్టరు దగ్గరకి తీసుకెడతారు"

"మరి నీ విషానికి విరుగుడు కూడా ఆ డాక్టరే ఇస్తాడా?" అనుమానంగా అడిగాడు శంకర్.

"వెర్రివాడా! నిన్ను భయపెట్టాలని అలా అన్నాను. నేను నీకిచ్చిన చాక్లెట్లో ఏ విషం లేదు" అంతే - ఫోన్ కట్టయింది.

శంకర్ పోలీసులకి వాంగ్మూలమిచ్చినా వైద్యం జరిగేలోగానే చనిపోయినట్లు మర్నాడు వార్తల్లో తెలుసుకుంది వనజ.

## 24

**చాలాకాలం తర్వాత శ్యామలరావు వనజని కలుసుకున్నాడు.**

"అమ్మా! ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు కూడా హతమయ్యారు. రామాయణంలో యుద్ధకాండ రామరావణ యుద్ధం ఘట్టానికి చేరుకుంది. ఇందుకు నిన్నెలా అభినందించాలో నాకు తెలియడం లేదు" అన్నాడాయన.

"రఘు స్వయానా పోలీసు. డిపార్టుమెంటు అండ ఉండి కూడా నేరస్థులపై పోరాటంలో దారుణమైన చావుకి గురయ్యాడు. నేను మామూలు మనిషిని. ఆడపిల్లని. నేరస్థులతో పోరాడుతున్నా చెక్కు చెదరకుండా ఉన్నాను. విచిత్రంగా ఉంది." అంది వనజ భారంగా నిట్టూర్చి.

"యుద్ధంలో ప్రతి సైనికుడూ ప్రాణాలకి తెగించే పోరాడతాడు. కొందరు చస్తారు. కొందరు బ్రతుకుతారు. చనిపోయినవారి త్యాగం - బ్రతికున్నవారి సంకల్పాన్ని మరింత పటిష్టం చేస్తుంది. అందుకే మాటిమాటికీ నీకు రఘు గుర్తుకొస్తున్నాడు" అన్నాడు శ్యామలరావు.

"ఏమో - నా విజయాలు నాకు సంతోషం కంటే అసంతృప్తినే కలిగిస్తున్నాయెందుకో.."

శ్యామలరావు నవ్వి, "నీకు తృప్తి అనేదుండకూడదు. ఉంటే సమాజం ముందుకెళ్ళేదెలా?" అన్నాడు.

"ఇప్పుడు నాకు సమాజం కంటే అరణ్య గురించిన బెంగే ఎక్కువగా ఉంది. అతణ్ణి నేనెటు తీసుకుని పోతున్నానో నాకే తెలియడంలేదు" దిగులుగా అంది వనజ.

"నాగరిక ప్రపంచంలో తనకి తానుగా మసలగలగాలని అప్పుడప్పుడతణ్ణి ఒంటరిగా బయటకి పంపిస్తున్నాను. ఇప్పుడు బయటే ఉన్నాడు"

శ్యామలరావు ముఖంలో కంగారు, "అసలే అతణ్ణి చంపడానికి ఎందరో పథకాలు వేస్తుంటే - నువ్వేంటమ్మా - ఇలా చేసావ్?"

వనజ నవ్వింది. ఆ నవ్వులో ఆత్మవిశ్వాసం, "బాబాయ్ - నమ్మకాన్ని విడిచిపెడితే జీవితం దుర్భరమౌతుంది. కౌంటర్లో చెక్కు తీసుకున్న బ్యాంకు ఉద్యోగి - డబ్బివ్వకుండానే ఇచ్చేసానంటాడని అనుమానిస్తామా? హిరణ్యరావు అరణ్య ప్రాణాలకి పూచీ పడ్డాడు. నగరంలో అరణ్యని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. అందుకే అతణ్ణి చంపాలనుకున్నవారు కూడా నగరం పొలిమేరలు దాటించి అందుకు పూనుకున్నారు.."

"అది సరే కానీ - వేల సంవత్సరాల నాగరికతలో హిపోక్రసీని మేధావులే అర్థం చేసుకోలేకపోతున్నారు. ఆఫ్టరాల్ అరణ్య ఎంత? అతణ్ణిలా ఒంటరిగా బయటికి పంపడం మంచిది కాదు.."

వనజ బదులిచ్చేలోగా సెల్ రింగైంది. హలో అన్న మరుక్షణంలో ఆమె ముఖంలో రంగులు మారాయి.

ఆమె సెల్ ఆఫ్ చేయగానే, "ఎవరమ్మా?" అన్నాడు శ్యామలరావు.

"పేరు తెలియదు కానీ.." ఆగింది వనజ.

"ఊఁకానీ.." ఆత్రుతగా అడిగాడు శ్యామలరావు.

"నాగరికతలో హిపోక్రసీ గురించి మీరన్నది నిజం. అరణ్య ప్రమాదంలో ఉన్నాడు. అర్జంటుగా వెళ్ళాలి" అంటూ లేచింది.

●●●

"హలో" అందా అమ్మాయి.

అరణ్య ఆగాడు. ఆమెని ప్రశ్నార్థకంగా చూసాడు.

"అదే మా ఇల్లు" పక్కనున్న ఓ ఇల్లు చూపించిందామె.

అరణ్య ఆ ఇంటివైపోసారి చూసి మళ్ళీ ప్రశ్నార్థకంగా ఆమెని చూసాడు.

"ప్లీజ్ హెల్ప్ మీ" అంటూ అతడి చేయి పట్టుకుందామె.

అరణ్య ఆమెని ప్రశ్నార్థకంగా చూస్తూ, "నువ్వు ఎవరు?" అన్నాడు.

"శరణ్య.. అది నా పేరు" అంటూ ఆమె అతణ్ణి తన ఇంటివైపు లాగింది. ఇద్దరూ లోపలికి వెళ్ళాక, "నేను శరణ్య నువ్వు అరణ్య" అందామె.

ఆమె అన్న తీరు అతడికి నచ్చింది. కానీ చూపుల్లో ప్రశ్న ఇంకా అలానే ఉంది.

"నొప్పి ఎక్కడంటే" అంటూ ఆమె దుస్తులు విప్పసాగింది.

అరణ్య ఆమెనే కుతూహలంగా చూస్తున్నాడు.

అటువా ద్వీపంలో స్త్రీ అనుభవం అతడికి కొత్తకాదు. జంతువులతో కలిసి మెలిసి తిరగడం వల్లనో, నాగరికత వంటబట్టకపోవడం వల్లనో - అక్కడ స్త్రీ పురుష సంపర్కాన్ని ఋతుధర్మం ప్రభోదించేది. లేదా నాగరికతకి అందని మరేదో సంప్రదాయం శాసించేది. ఐతే ఆడదాన్ని బలవంతంగా అనుభవించడం అక్కడ నేరం. అరుదుగా జరిగే ఆ నేరాన్ని చూసినప్పుడు - ఆటవికులు నేరాన్నాపాలన్న ఆవేశానికి లోనౌతారే తప్ప కామోద్రేకానికి గురికారు. కానీ పరస్పరం ఇష్టమైనప్పుడు - తమ సంపర్కంలో ఇతరుల జోక్యాన్ని వాళ్ళు సహించారు. తమ అభీష్టాన్ని కొనసాగించడానికి వాళ్ళు ఎంతకైనా తెగిస్తారు.

శరణ్య అరణ్యని రెచ్చగొడుతోంది.

కామోద్రేకం మనిషిలోని మృగాన్ని బయటికి తెస్తుందంటారు. ఆ యువతి ప్రవర్తన అరణ్యలోని మనిషిని బయటకి తెస్తోంది. అంతవరకూ నాగరిక ప్రపంచంలో ఆడదాని జోలికెళ్ళని అరణ్య ఆ క్షణంలో నాగరిక పౌరుడయ్యాడు. అప్పుడతడి విషయంలో ఎవరైనా జోక్యం చేసుకున్నారా, అతడినాపాలని ప్రయత్నించారా - వారి ప్రాణాలు తీయడానిక్కూడా అతడు వెనకాడడు. ఆ విధంగా అతడు ఆటవికుడే!

ఆమె అతడికి అందీ అందకుండా ఊరిస్తోంది. అందాలతో రెచ్చగొడుతోంది.

ఉద్రేకం పరాకాష్ట చేరుకుందనడానికి నిదర్శనంగా - ఉన్నట్లుండి అరణ్య సింహనాదం చేసాడు.

ఒక్క దూకుతో అతడా అందీ అందని ఆడదాన్ని ఒడిసి పట్టుకున్నాడు. రెండు చేతులతో పైకెత్తి పక్కనే ఉన్న మంచం మీద పడేసాడు. మత్తగజం మీదకి దూకనున్న మృగరాజులా - అతడా మదవతి మీద పడనున్న సమయంలో.

"ఆగు అరణ్యా!" అన్న మాట వినిపించింది.

పరిచితమైన వనజ గొంతు విని ఆగాడతడు. వెనక్కి తిరిగి వనజని చూసి, "నేను అరణ్య" అన్నాడు.

తర్వాత మంచం మీద నుంచి లేచి కూర్చోబోతున్న యువతిని లేవకుండా ఆపి, "ఇది శరణ్య" అన్నాడు.

తన జీవితంలో అలాంటి దృశ్యాన్ని అంత దగ్గిరగా చూడాల్సొస్తుందని ఊహించలేదు వనజ.

మంచం మీద ఓ యువతి - నగ్నంగా. ఆమె ఎదుట అరణ్య అర్ధనగ్నంగా.

అరణ్య కళ్ళలో కోరికే తప్ప సిగ్గులేదు. అతడు ఆటవికుడు.

ఆమె కళ్ళలో లక్ష్యమే తప్ప సిగ్గులేదు. ఆమె నాగరికురాలు.

ఆ యువతి వనజని చూసి వళ్ళు కప్పుకునే ప్రయత్నం కూడా చేయలేదు. తన దృష్టిని అరణ్య మీదే కేంద్రీకరించింది. ఆ చూపుల్లో ఆహ్వానం..

"అరణ్యా ఇలారా!" వనజ ఆజ్ఞాపించింది.

"వనజా! నువ్వు పో!" అతడూ ఆజ్ఞాపిస్తే ఆ గొంతులో ఆశ్చర్యపడిందామె.

అరణ్య అప్పుడిక మాట వినే స్థితిలో లేడని వనజకి తెలిసిపోయింది, "భగవంతుడా! నేనిప్పుడేం చేయాలి? అరణ్య శీలం చెడిపోతుందన్న బెంగ నాకు లేదు. కానీ ఎయిడ్సున్న ఈ పిల్లతో సంపర్కం తన జీవితాన్నే నాశనం చేస్తుందని అతడికర్థమయేలా ఎలా చెప్పాలి?" అని వ్యథ చెందిందామె మనసులో.

"నువ్వు ఫో" అసహనంగా అరుస్తున్నాడు అరణ్య.

వనజ తెగించింది, "నేను పోను" అంటూ అతణ్ణి సమీపించింది.

అతడామెని తోసేసాడు. వనజ పట్టు విడవలేదు. మళ్ళీ అతడి దగ్గరకెళ్ళింది.

తానెవరో చెప్పకుండా ఓ వ్యక్తి తనకి ఫోన్ చేసి హిరణ్యరావు అరణ్య మీద ఎయిడ్సున్న యువతిని ప్రయోగించిన విషయం చెప్పాడు.

ఇప్పుడు అరణ్యని తనాపకపోతే అతడి నూరేళ్ళ జీవితం నిర్వీర్యమౌతుంది. అసలే ఆటవికుడు - ఎయిడ్సంటే అర్థం చేసుకోవడం కష్టం. అటువాకి తిరిగి వెళ్ళేక అతడి మూలంగా అక్కడివారందరికీ ఆ వ్యాధి అంటుకుంటుంది. ఫలితంగా అటువాద్వీపం ఎయిడ్సుకి బలైపోతుంది. ఆ విధంగా నాగరికత అటువాలపై సంధించిన మారణాస్త్రమౌతుంది ఎయిడ్స్.

ప్రాణానికి తెగించైనా ప్రతిఘటించి ఆ ఘోరాన్నాపాలనుకుంది వనజ.

అరణ్యకి వనజంటే ప్రేమ, అభిమానం. ఆ సమయంలో కామోద్రేకంలో మరొకరినైతే పట్టాకత్తికి బలిచేసి ఉండే అరణ్య - ఆమెని దగ్గరకొస్తే తోసేయడమే తప్ప గాయపరిచే ప్రయత్నం కూడా చెయ్యడంలేదు. కానీ ఆటవికుడైన అతడికి సహనం ఎంతోసేపుండదని ఆమెకు తెలుసు. అందుకే తొందరగా అతణ్ణక్కణ్నించి తీసుకుపోదామని ఆమె అనుకుంటుంటే - తొందరగా ఆమెనక్కణ్ణించి పంపేయాలని అరణ్య అనుకుంటున్నాడు.

వనజ అరణ్య చేత్తో లాగుతూ మధ్య మధ్య చేతికందిన తువ్వాలునో, దుప్పటినో ఆ యువతి వంటిమీదకి విసురుతోంది. ఆ యువతి వెంటనే వాటిని తోసిపారేస్తోంది.

అప్పుడు తన సహనానికే అంతం సమీపించగా, "నీకు సిగ్గులేదా?" అని అరిచింది వనజ.

"ఇలాంటప్పుడు మా మధ్యకొచ్చినందుకు - నువ్వు పడాలి సిగ్గు" అంటూ తనూ అరిచిందా యువతి.

ఇక లాభం లేదనుకున్నాడో ఏమో అరణ్య - వనజ నా గదిలోంచి బలవంతంగా గెంటేయాలనుకున్నాడు. అతడిది జంతుబలం. అప్పుడు వనజ అతణ్ణి తీవ్రంగా ప్రతిఘటిస్తే ఆమెది సంకల్పబలం.

ఇద్దరి మధ్యా పెద్దగా పెనుగులాటలో - ఆమె చీర ఊడింది. జాకెట్ చిరిగింది. అలాగే గుమ్మం దాకా లాక్కెళ్ళేక, "అరణ్యా! ప్లీజ్ - నీకేం కావాలన్నా ఇస్తాను. నువ్వా అమ్మాయిని వదిలి నాతోరా -" అంటూ ఆక్రోశంగా అరిచింది వనజ.

ఆ గొంతులోని ఆక్రోశానికి చలించాడో ఏమో - అరణ్య ఆమెని వదిలాడు. తదేకంగా ఆమెనే చూస్తున్న అతడి ముఖకవళికల్లో మార్పులు.

అతడెందుకు ఆగేడా అని ఆశ్చర్యపడిన వనజ అతడి చూపులనే అనుసరించి తన్ను తాను చూసుకుంటే - వనజ చాలా అందమైనది. ఆమె అందచందాలు ఏ పురుషుడి ఊహల్లోనూ బహిర్గతం కాలేదని చెప్పడం కష్టం. కానీ ఏ పురుషుడూ చూపులతో తాకని తన శరీర భాగాలిప్పుడు అరణ్య చూపులకి అందుబాటులో ఉన్నాయని గ్రహించి - ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది.

అరణ్య మార్చి మార్చి వనజనీ, శరణ్యనీ చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ కూడా ఆడవాళ్ళన్న స్పృహ అప్పుడే అతడిక్కలిగింది.

శరణ్య ఎవరో అతడికి తెలియదు. అతడు పురుషుడైతే ఆమె స్త్రీ.

వనజ అతడికి తెలుసు. ఆమె అంటే అతడికిష్టం కూడా. తను పురుషుడైతే ఆమె స్త్రీ అని మాత్రం అతడికీ ఆమెకీ కూడా ఇప్పుడే తెలిసింది.

అరణ్య వనజని చూస్తున్నాడు. ఆ చూపులు కొత్తగా ఉన్నాయి.

ఆ చూపులు వనజకి అర్థమై - ఒక విధమైన జుగుప్సాభావం కలిగింది. కానీ అంతలోనే అప్పుడా పరిస్థితుల్లో అరణ్య జీవితం నాశనం కాకుండా ఆపగల ఏకైక మార్గం కూడా ఆ చూపుల్లోంచే స్ఫురించింది.

"బాబాయ్ - నా కృషిలో నా వంతు త్యాగానికి సమయం వచ్చింది" అని మనసులో అనుకుని - "అది చెడ్డ. నేను మంచి. దాన్ని పొమ్మను" అంది వనజ చటుక్కున అరణ్యతో.

●●●

ఆ గదిలో - ఆ మంచం మీద - అరణ్య, వనజ - ప్రేమకి మారురూపాల్లా ఉన్నారు. శాంతించిన అరణ్య కళ్ళలో ఆమెపట్ల కృతజ్ఞతాభావం ప్రతిఫలిస్తోంది.

వనజలో ఆశ్చర్యం. సమాజపు సంప్రదాయం ప్రకారం తను తప్పు చేసింది. కానీ తనలో అపరాధభావం పుట్టదేం? పైగా మనసునిండా తృప్తి, సంతోషం, గర్వం - ఏమిటిది?

వనజ అరణ్యని దగ్గరగా లాక్కుని, "అరణ్యా! నేను నీ దాన్ని" అంది.

"నేను నీ వాణ్ణి" అన్నాడు అరణ్య వెంటనే. అతడి గొంతు ప్రేమకి నిర్వచనంలా ఉంది.

●●●

"ఈ దృశ్యం చూడ్డానికా నేను బ్రతికున్నది?" అనుకున్న ప్రహ్లాద్‌కి కళ్ళనీళ్ళాగడం లేదు.

వనజ తనది కావాలని అతడి కోరిక. ఆ కోరిక తీరుతుందని అతడి ఆశ. ఆ ఆశని నిజం చేసుకుందుకు - ఆమె ఆశయాన్నే తన ఆశయం చేసుకున్నాడు. ఆమె విజయానికి మెట్లు కడుతు ఆమె అభిమానం పొందాలనుకున్నాడు. ఆమె అటువా ద్వీపానికి వెళ్ళి అరణ్యని వెంటబెట్టుకొస్తే అతడు దిగులు పడలేదు. అరణ్య ఆమెకి ఆయుధమే తప్ప ప్రియుడు కాలేడని అతడి నమ్మకం. ఆ నమ్మకమిలా వమ్మవుతుందని కలలో కూడా ఊహించలేదు.

అరణ్య జీవితం నాశనమౌతుంటే ఆపాలని వనజకి కబురందించాడు. అరణ్యని ప్రమాదం నుంచి కాపాడ్డానికి తన మానాన్నే పణంగా పెట్టింది వనజ. దాంతో వనజపై తనకున్న ఆశలన్నీ భగ్నమయ్యాయి.

ఇప్పుడైనా వనజ అరణ్యని కాదని తన దగ్గరకొస్తే - మనస్ఫూర్తిగా ఆమెని స్వీకరించగలడు ప్రహ్లాద్. కానీ అతడికి వనజ వ్యక్తిత్వం తెలుసు. అరణ్య విషయంలో ఆమె క్షణికమైన తప్పు చేయలేదు. శాశ్వతానుబంధానికి సంబంధించిన ఓ నిర్ణయాన్ని ఆ క్షణంలో తీసుకుంది.

"వనజా! నిన్ను నేను శాశ్వతంగా కోల్పోయాను. కథకి ఇంతవరకూ వచ్చాక - ఉపేక్షించకూడదు. ఇక నేను చేయాల్సింది చేయక తప్పదు" అనుకున్నాడతడు.

తనవారందరూ పోయారని రావణుడు భోరున ఏడ్చినా రామరావణ యుద్ధం ఆగలేదు. తనవారందరూ పోయారని కంసుడు ఘొల్లుమన్నా కృష్ణుణ్ణి రెచ్చగొడుతూనే ఉన్నాడు. తనవారందరూ పోయారని దుర్యోధనుడు కలవరపడినా కురుక్షేత్ర యుద్ధం కొనసాగింది.

హిరణ్యారావు విషయంలోనూ చరిత్ర పునరావృతామైంది. సహచరులు ఒక్కొక్కరుగా సమసిపోతున్నా, రోజురోజుకీ మనసు బరువెక్కుతున్నా - ఆయన తన మార్గం వీడలేదు. వనజ మీద కూడా ఓ కన్నేసే ఉంచాడు. ఆ కన్నే - భీమన్న మాస్కులో తన రూపం ధరించి హింసాత్మకచర్యలకి పాల్పడుతున్న విషయాన్ని పట్టేసింది. ఆయన వలేసి భీమన్నని పట్టి తనవద్దకి రప్పించుకున్నాడు.

ముందు భీమన్న బుకాయించాడు. హిరణ్యారావు సామోపాయం నుంచి నేరుగా దండోపాయానికి మారిపోతుంటే అతడాయన కాళ్ళమీద పడిపోయాడు.

"చూస్తుంటే తెలుస్తోంది. ఇది నీ తలే. కళ్ళు నెత్తిమీదకనిపిస్తున్నాయి" అన్నాడు హిరణ్యారావు.

"కళ్ళు నెత్తికెక్కినా వాటి స్థానం మీ కాళ్ళ దగ్గిరే" అన్నాడు భీమన్న లేవకుండా.

"నేను మర్డరు చేయాలనుకున్నాననుకో. నాకది పోలీసులు చేసి పెడతారు. నువ్వేమో నా వేషమేసి వెధవ పనులు చేస్తే - వాళ్ళు నన్ను పట్టుకోరు. నా పని నేనే చేసుకుని తమ నోటి దగ్గర కూడు చెడగొడుతున్నానని ఏడుస్తారు. మరి ఏం సాధించాలని నువ్వీ పని చేసినట్లు?" అహంకరిస్తూ హుంకరించాడు హిరణ్యారావు.

"మీ గురించి నాకు తెలియదా? మిమ్మల్ని పోలీసులకి పట్టించాలని నేనీ పని చేయలేదు. చేయను కూడా. ఆ వనజ ఇలా చెయ్యమన్నప్పుడు కూడా - ఇది పోలీసులతో సంబంధంలేని వ్యవహారమని రూఢి చేసుకున్నాకే ఒప్పుకున్నాను" అన్నాడు భీమన్న.

"ఐతే ఇదంతా దేనికట? సినిమా షూటింగా?" వెటకారంగా అన్నాడు హిరణ్యారావు.

"అరణ్యకి మీరంటే ఇష్టమట. అతడు చాలా మంచివారనుకుంటున్నాట్ట. మీరు చెడ్డవారని నమ్మితే తప్ప అరణ్య మిమ్మల్ని ఏమీ చెయ్యడట. అందుకని వనజ నన్ను మీకులా నటించి చెడ్డపనులు చేస్తూ అరణ్య దృష్టిలో పడాలని చెప్పింది. పులిలాంటి మీకు అందువల్ల ఏ ప్రమాదమూ ఉండదని నాకు తెలుసు. నా విషయంలో మాత్రం అది పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటంలా మారింది. ఇప్పటికే చాలాసార్లు చావుతప్పి కన్ను లొట్టపోయింది. ఆ అరణ్య నన్ను వెంటాడుతున్నాడు. నేను ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తిరుగుతున్నాను" అన్నాడు భీమన్న.

హిరణ్యారావు స్టన్నైపోయాడు. ఒక ఆడది - అదీ కుర్రది - తన లక్ష్యాన్ని సాధించడానికి ఎంత గూఢంగా గాఢంగా పథకాలు వేస్తోంది! భారతి టీచర్ని బెంచీ ఎక్కించిననాడు పుట్టిన భావాలతో - ఇంతకాలం మనగలిగిన వనజని - తను చాలా తక్కువ అంచనా వేసానని గ్రహించాడాయన.

"ఇంతకీ - అరణ్యకి నా మీద ద్వేషం పుట్టించి ఏం సాధిస్తుందిట నీ మేడమ్?!" అన్నాడు హిరణ్యారావు.

"మీ దగ్గర ఏమీ దాచను" అంటూ తమ పథకం వివరించాడు భీమన్న.

అడవిలో భీమన్న నకిలీ హిరణ్యారావుగా సాటి మనుషుల్ని దారుణంగా హింసిస్తూ అరణ్య కళ్ళబడతాడు. వనజ అరణ్యకి సాయపడుతున్నట్లు నటిస్తూనే భీమన్న తప్పించుకునేలా చేస్తుంది. అరణ్య భీమన్నని వెంటాడతాడు. భీమన్న అతణ్ణి అసలు హిరణ్యారావు దిశకు మళ్ళిస్తాడు. అరణ్య, హిరణ్యారావు ఒకరికొకరు ఎదురుపడే సమయానికి భీమన్న తప్పుకుంటాడు. ఆలోచించే వ్యవధిలేని అరణ్య హిరణ్యారావు మీద దాడి చేస్తాడు. హిరణ్యారావు ఫినిష్.

"అంటే వేట అడవిలో మొదలై నగరంలో ముగుస్తుందన్నమాట! నేను నగరం నుంచి బయలుదేరి అడవికి వెడతాను. అడవి మృగానికి వేట రుచి చూపిస్తాను" అన్నాడు హిరణ్యారావు.

"మీ వేటకి నాసహకారముంటుంది" అన్నాడు భీమన్న.

"అంత సులభంగా నిన్ను నమ్ముతాననుకోకు. కానీ నీ సహకారాన్ని నమ్ముతాను. ఎందుకంటే దాన్నెలా, ఎంతవరకూ ఉపయోగించుకోవాలో నాకు తెలుసు" అన్నాడు హిరణ్యారావు.

●●●

భీమన్న నాటకాన్ని ఓ కన్నేసి పట్టానని హిరణ్యారావు అనుకున్నాడు. హిరణ్యారావుని అడవిలోకి రప్పించడానికి భీమన్న ద్వారా ఆడిన నాటకం ఫలించిందని వనజ సంతోషించింది.

హిరణ్యారావు యుద్ధసన్నాహాలతో అడవిలోకి బయల్దేరాడని తెలిసినా భయపడలేదు.

ఆమె స్థానబలం గురించి ఆలోచిస్తోంది.

నగరం నీరైతే నగరంలో హిరణ్యారావు మొసలి. అడవి నీరైతే అడవిలో హిరణ్యారావు మదగజం.

నగరంలో హిరణ్యారావు ప్రతాపం ఆమెకి ఎప్పట్నించో సుపరిచితం. అక్కడ ఆయన్నెదిరించడం ఇంచుమించు అసాధ్యం.

అడవిలో అరణ్యా ప్రతాపం ఆమెకి ఇటీవలే పరిచయం. అందుకే ఆ ఇద్దరూ ఒకర్నొకరు ఢీకొట్టడానికి అడవిని ఎన్నుకుందామె.

●●●

అడవిలో ఒకచోట నకిలీ హిరణ్యారావుగా భీమన్న నాటకం కొనసాగుతోంది. ఆ నాటకాన్ని చెట్ల చాటునుంచి హిరణ్యారావూ చూస్తున్నాడు. వనజ ఆయనమీద తనూ ఓ కన్నేసి ఉంచింది.

ఉన్నట్లుండి అరణ్యా భీమన్న మీద దాడి చేసాడు. ముందుగా అనుకున్న ప్రకారం వనజ జోక్యంతో భీమన్న అక్కణ్ణించి తప్పించుకున్నాడు. అరణ్యా అతడి కోసం వెతికాడు. భీమన్న దొరికినట్లే దొరికిపోయాడు. మళ్ళీ అరణ్యా అతడి వెంటబడ్డాడు.

అలా మొత్తం మూడుసార్లు భీమన్న దొరికినట్లే దొరికి తప్పించుకునేసరికి అరణ్యా ఆగ్రహోదగ్రుడయ్యాడు.

ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తోంది వనజ.

నాలుగోసారి అరణ్యాకి అసలు హిరణ్యారావు దొరికాడు.

అప్పుడు అరణ్యా కళ్ళలో నిప్పులు కురిసాయి. పట్టాకత్తి గాల్లోకి లేచింది.

"దేవతలారా దీవించండి" అనుకుంది వనజ.

ఎన్నో ఏళ్ళ తన లక్ష్యం. ఎన్నో త్యాగాల ఫలితం. ఈ క్షణం కోసం తను ఎంతగా ఎదురు చూసింది?

వనజ ఆ దృశ్యాన్నే చూస్తోంది. ఆమె చెవుల్లో వేదమంత్రాలు వినపడుతున్నాయి. ఆమె కళ్ళకి అరణ్యా రాముడిలా, కృష్ణుడిలా - అవతారాలు మారుస్తూ కనబడుతున్నాడు.

సరిగ్గా అప్పుడు..

అరణ్యా పట్టాకత్తి గాల్లోంచి కిందకి దిగి నడుముని అలంకరించింది.

"నువ్వు హిరణ్య.. నేను అరణ్యా.." అరణ్యా గొంతులో ఆప్యాయత, ప్రేమ, అభిమానం.

వనజ చూస్తుండగా హిరణ్యారావు, అరణ్యా ఒకరినొకరు కౌగిలించుకున్నారు.

క్షణం పాటు వనజకి బుర్ర పనిచేయలేదు. తానొకటనుకుంటే ఇప్పుడిక్కడ జరుగుతున్నదేమిటి?

ఐతే వనజలో ఏర్పడ్డ స్తబ్దత క్షణం మాత్రమే. అరణ్యాని అర్థం చేసుకుందుకు ఆమె మనసు అనునిత్యం కంప్యూటర్లా అతడి ప్రవర్తనని వివిధ కోణాలనుంచి విశ్లేషిస్తూనే ఉంటుంది.

మిగతా మృగాలకి భిన్నంగా రూపొందినంత మాత్రాన మనిషి మృగం కాకుండా పోడు. అందుకే ప్రతి మనిషిలోనూ ఎన్నో కొన్ని మృగలక్షణాలుంటాయి. అటువాలో పుట్టి పెరగడం వల్ల అరణ్యాంలో అవి బాగా ఎక్కువ

ఒకేలా కనిపించే కవల పిల్లల్ని ఎవరెవరో గుర్తించడానికి - మనిషి ఎంతో కష్టపడతాడు. కానీ కుక్క వాసనతో ఇట్టే పసికట్టేస్తుంది.

వాసన - అది మృగ లక్షణం. అది రూపు రేఖల్ని మించి స్వభావాన్ని పసికడుతుంది.

ఇప్పుడు అరణ్య వెదుకుతున్నది హిరణ్యరావుని కాదు. ఆయన వేషంలో ఉన్న భీమన్నని. ఎవరెవరో అతడు పసి కట్టేసాడు. అంటే ఇప్పుడేం జరుగుతుంది?

వనజ ఆలోచిస్తోంది. ఆలోచిస్తూనే అరణ్యని చూస్తోంది. ఆమె చూస్తూండగానే అతడు హిరణ్యరావుని విదిలించుకుని మరో వైపు పరుగెత్తాడు.

వనజకి గుండె గుభేల్మంది.

హిరణ్యరావు అరణ్య చేతికి చిక్కాడు కదా అని భీమన్న కాస్త రిలాక్సై ఉంటాడు. అప్రమత్తంగా ఉంటేనే అరణ్య నుంచి తప్పించుకోవడం కష్టం. అలాంటిది భీమన్న అజాగ్రత్తగా ఉంటే..!

"అమ్మో - భీమన్నని రక్షించుకోవాలి" అనుకుంటూ తనూ అటే పరుగెత్తింది వనజ.

అంతలోనే పెద్దగా ఆర్తనాదం.. అదీ ఒకసారి కాదు, వరుసగా రెండుసార్లు..

"భీమన్నా!" బిగ్గరగా అరిచింది వనజ. అది మూడో ఆర్తనాదంలా ఉంది.

●●●

ఆర్తనాదం హిరణ్యరావు కూడా విన్నాడు. అదాయనకి దగ్గర్లోంచి వచ్చింది. అందుకు సందేహం లేదు. తనకెంతో పరిచితమైన ఆ గొంతు విని, "బాబూ! ప్రహ్లాద్" అన్నాడు అప్రయత్నంగా. అది నాలుగో ఆర్తనాదం కావలసిందే కానీ భయమో, ఆవేదనో - ఆ మాట గొంతులోంచి అస్పష్టంగా, గొణుగుడులా బయటకొచ్చింది.

ఆర్తనాదం ఆయన రక్తాన్ని కదిలించింది. గుండెని కదిలించింది. కాళ్ళనీ కదిలించింది.

హిరణ్యరావు ఎన్నో అడుగులు వేయనేలేదు - రక్తపు మడుగులో ప్రహ్లాద్ కనిపించాడు.

ఆయన అక్కడే కుప్పకూలిపోయి, "బాబూ - ప్రహ్లాద్! ఏమిట్రా ఇది - ఏమైంది నీకు?" అన్నాడు. ఆ తర్వాత ఆయన గొంతు పూడుకుపోయింది.

"నీ మాట విననందుకూ, నిన్ను కాదని ఆ పాపిష్టి వనజని నమ్మినందుకూ - ఫలితమిది" అన్నాడు ప్రహ్లాద్.

"వనజా - అది ఇంత ఘోరం చేసిందా?" నమ్మలేనట్లు అన్నాడు హిరణ్యరావు.

"దానికి నీమీద పగ. నిన్నేం చెయ్యలేక - తన ప్రతాపం నా మీద చూపించింది.."

"అసలేం జరిగిందిరా?" ఆత్రుతగా అడిగాడు హిరణ్యరావు

"నువ్వు నన్ను ప్రేమించావు. నిన్నర్థం చేసుకోలేదు. నేను వనజని ప్రేమించాను. దాన్నీ అర్థం చేసుకోలేదు. అది అరణ్యని ప్రేమిస్తే ఆ తప్పు నాదా? తనకి నేనిష్టం లేదంటే ఆ మాట చెప్పొచ్చుగా - వాడికోసం నన్ను చంపేయాలా?" మాట రాక ఆగాడు ప్రహ్లాద్. హిరణ్యరావు ఏదో అనబోతే అతి కష్టం మీద చెయ్యెత్తి వారించి,

"ఇక నువ్వు చెప్పేదీ నేను వినేదీ ఏం లేదు నాన్నా! నాకు దక్కని వనజ ఆ అరణ్యకీ దక్కకూడదు. నువ్వు నీ శాయశక్తులూ ఉపయోగించి ఆ వనజని చంపేయ్. అదీ మామూలుగా కాదు. ఒక ఆడది ఎలాంటి అవమానాన్ని కలలో కూడా భరించలేదో అలాంటి అవమానం చేసి చంపేయ్.." అన్నాడు. క్రమంగా సన్నపడుతున్నా ఆ గొంతు కసిని మాత్రం పెంచుకుంటూ పలుకుతోంది.

"నువ్వు.. నువ్వేనా - ఇలా మాట్లాడుతోంది?" అంత విషాదంలోనూ హిరణ్యరావు గొంతులో అపనమ్మకం.

"ఇది నా ఆఖరి కోరిక. నా ఆత్మకి శాంతినిచ్చే కోరిక" కసి కూడా బలాన్నివ్వలేకపోతోందేమో - మాట మరీ నీరసంగా వచ్చింది.

"ఆత్మంటావేంటిరా - ఆ వనజ సంగతి తర్వాత - ముందు నిన్ను దక్కించుకుంటాను" ఆవేదన, ఆవేశాల మధ్య ఊగిసలాడుతూ అన్నాడు హిరణ్యారావు.

"నా పనైపోయింది నాన్నా! నన్ను బ్రతికించుకుందుకు దేవుడు కూడా నీకిప్పుడు సాయపడలేడు. నువ్వు చేయగలిగిందల్లా - నా ఆత్మకి శాంతి కలిగించడం ఆలస్యం చేయకు. ఇప్పుడు తప్పించుకుందంటే ఆ వనజ మళ్ళీ నీకు దొరకదు. నా ఆత్మకి శాంతి ఉండదు. వెంటనే వెళ్ళు నాన్నా!" ప్రహ్లాద్ తల పక్కకి వాల్చేసాడు.

కొన ఊపిరితో ఉన్న మనుష్యులు తటస్థపడడం హిరణ్యారావుకి కొత్తకాదు. వారి కొన ఊపిరికి తనే కారణమైన సందర్భాలూ కొత్తకాదు. కానీ ఇప్పుడు కొన ఊపిరితో ఉన్నది కన్నకొడుకు.

హిరణ్యారావు కళ్ళు ఎర్రబడ్డాయి. కొడుకునే చూస్తూ, "ఇన్నాళ్ళ నా కోరిక ఈనాడు నీ కోరిక కూడా అయింది. ఇక ప్రపంచంలో ఏ శక్తీనన్నాపలేదు. ఐపోయింది వనజ పని!" అన్నాడు.

ప్రహ్లాద్‌లో కదలిక లేదు. హిరణ్యారావు కాళ్ళు మాత్రం అక్కణ్ణించి వేగంగా కదిలాయి.

●●●

తలలేని మొండెం వికృతంగా నాట్యం చేస్తోంది. ఆ పక్కనే ఆ దృశ్యం చూడ్డానికా అన్నట్లు - రెప్పవాల్చని కళ్ళతో భీమన్న తల.

ఆ మొండేనికి ఎదురుగా అరణ్య. అతడి చేతిలో రక్తసిక్తమైన కత్తి. వేట జయప్రదంగా ముగించిన మృగతృప్తి అతడి కళ్ళలో ప్రతిఫలిస్తోంది.

అప్పుడే వచ్చి ఆ దృశ్యం చూసిన వనజకి వళ్ళు గగుర్పొడిచింది.

"నేను పాపిని. భీమన్నా - నిన్ను చేజేతులా నేనే చంపుకున్నాను" అనుకుందామె అప్పుడే తలకి కాస్త పక్కగా నేల కూలిన మొండేన్ని చూస్తూ. ముందామె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తర్వాత అవి ధారాపాతమై ప్రవహించాయి. వాటి హోరు గొంతులోంచీ బయటపడుతోంది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమెని అరణ్య గమనించాడు. పట్టాకత్తిని నడుముకి వేలాడదీసాడు. ఆమెకి దగ్గరగా వచ్చాడు. ఆమెని దగ్గరగా తీసుకున్నాడు.

వనజ అతడి గుండెపై తల పెట్టుకుని ఏడుస్తుంటే అతడామె తలని మృదువుగా నిమిరాడు.

కొద్ది క్షణాలు. అంతే!

వనజకి చటుక్కున గుర్తుకొచ్చింది. అరణ్య మనిషి కాదు, మృగం!

పెంపుడు జంతువు కూడా మనిషి సాహచర్యంలో - మనిషిలా ప్రవర్తిస్తుంది. కానీ తను చేరదీసిన ఈ మృగతుల్యుడు - తను ఎప్పటికీ మృగాన్నే అని ఋజువు చేసాడు.

ఆమెకి డేవిడ్ చెప్పిన పులి కథ గుర్తుకొచ్చింది. "క్రూర జంతువులతో మనిషికి వేట, ఆట రెండు ప్రమాదమే. అరణ్య క్రూరజంతువు. అతడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి" అన్న ఆయన మాటలు నేడు అక్షరాలా నిజమయ్యాయి.

"నో" అంటూ వనజ అతడి ఛాతీమీద పిడిగుద్దుల వర్షం కురిపించింది.

అరణ్య ఆమెని ముచ్చటగా చూసాడు. శరణ్య నుంచి దూరంగా తీసుకుపోవడానికి తననామె ఎలా ప్రతిఘటించిందో - చివరికేమిచ్చిందో అతడికి బాగా గుర్తుంది.

ఆమెకోపం, ప్రతిఘటన - అతడిలో శృంగార భావాలు రేకెత్తిస్తుంటే అతడామె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని బలంగా ముద్దుపెట్టుకున్నాడు.

ఆ ముద్దు - భగవంతుడుకిచ్చిన వరంలా అపురూపమై, తల్లి బిడ్డకందించిన ఆహారంలో అమృతోపమానమై, ప్రియుడు ప్రేయసికిచ్చిన కానుకలా ప్రేమభరితమై అలరించిందామెని.

ఒకపక్క భీమన్న శవం. మరో పక్క హిరణ్యారావు భయం. కానీ ఇప్పుడిదేమిటి?

నిజమైన ప్రేమ ఊహకందని అనుభూతి. వనజ పరిస్థితులని కూడా మరిచి ఆ ప్రేమకి కరిగిపోతోంది.

సరిగ్గా అప్పుడే ఎవరో ఆమెని అరణ్యానుంచి వేరు చేస్తూ వెనక్కి లాగారు. వెనక్కి చూస్తే - హిరణ్యారావు!

అరణ్య ఆయన్ని ఆశ్చర్యంగా చూస్తుంటే, "నేను హిరణ్యా.. నువ్వు అరణ్యా" అంటూ అరణ్యాని ప్రేమగా కౌగలించుకున్నాడయన. అరణ్య పట్టు విడిపించుకుని చిత్రంగా ఆయన్నే చూస్తుంటే - ఆయన చటుక్కున వనజ చేయి పట్టుకుని అక్కణ్ణించి పరుగెత్తాడు.

వనజకంతా అయోమయంగా ఉంది. ఆ అయోమయంలోనే హిరణ్యారావుతో పాటు పరుగెడుతోంది.

●●●

"ఇప్పుడు ఇక్కడ నిన్నెవ్వరూ రక్షించరు.."

హిరణ్యారావు చేతిలో కొరడా గాల్లోకి లేచింది. కానీ ఆయన ముఖం కొరడాని మించి భయపెడుతుంటే వనజకి నోటమాటరాలేదు.

"నాకు మచ్చ తేవాలనుకున్నావు. ఇప్పుడు చూడు - నీ వంటినిండా చెరిగిపోని మచ్చలెన్నో.."

వనజ కళ్ళు మూసుకుంది. కొరడా ఛెళ్ళుమంది. కెవ్వుమన్న కేక..

"నా అంతటివాడి కొడుకుని చంపావ్. నా అంతటివాడు స్వయంగా వేసే శిక్షెలాగుంటుందో రుచి చూడు" వనజ కళ్ళు మూసుకుంది. కొరడా ఛెళ్ళుమంది. కెవ్వుమన్న కేక..

"ప్రహ్లాద్ నిన్ను మనసారా ప్రేమించాడు. అందుకు నువ్విచ్చిన ప్రతిఫలానికి వందరెట్లు నేను నీకిస్తాను.."

వనజ కళ్ళు మూసుకుంది. కొరడా ఛెళ్ళుమంది. కెవ్వుమన్న కేక.

"నేను అరవకుండా కేకెలా వచ్చిందీ?" అని ఆశ్చర్యపడి కళ్ళు తెరిచిన వనజకి ఊహించని దృశ్యమెదురైంది.

హిరణ్యారావు చేతిలోంచీ గాల్లోకి లేచిన కొరడా ఇప్పుడూ అరణ్య చేతిలో ఉంది. భయంతోనో ఏమో - గంభీరమైన హిరణ్యారావు గొంతు ఇప్పుడు కీచుబోయింది. కెవ్వుమన్నది ఆయనే!

తొందరగానే వనజకి పరిస్థితి ఆకళింపుకి వచ్చింది.

మొదటిసారిగా హిరణ్యారావులో అసలు సిసలు రాక్షసత్వాన్ని చూసాడు అరణ్య. అదీకాక అతడిప్పుడు వనజపట్ల మోహంతో ఉన్నాడు. ఆవేశానికీ వివేకానికీ ఆమడ దూరం. ఆ పైన అతడు ఆటవికుడు, తను నాగరికుడు అన్న ధైర్యం! హిరణ్యారావు అరణ్యాని లొంగదీయగలననే అనుకున్నాడు. ఆయన చటుక్కున వనజ పక్కకి వెళ్ళి - జేబులోంచి పిస్తోలు తీసి ఆమెకి గురిపెట్టి, "నేను హిరణ్యా నువ్వు అరణ్యా వెళ్ళిపో" అన్నాడు.

అరణ్య ముందడుగు వేయబోయినవాడే ఆగిపోయాడు. అతడికి అర్థమైంది - వనజ ప్రాణాలు ఆపదలో ఉన్నాయని.

అరణ్య పట్టాకత్తిని, కొరడాని, వక్రదండాన్ని తలోవైపూ విసిరేసి - నేలమీద కూలబడి తల పట్టుకుని ఆయన్నే చూడసాగాడు.

"అరణ్య నాకు లొంగిపోయాడు. వాడి కళ్ళముందే ఇప్పుడు నీతో ఎలా ఆడుకుంటానో చూడు" అంటూ హుంకరించాడు హిరణ్యారావు.

ఒక చేతిలో పిస్తోలుంచుకుని రెండో చేత్తో ఆమె రెండు చెంపలూ వాయించాడాయన.

అరణ్య కళ్ళు ఎర్రబడ్డాయి.

"వాడి చూపుల వేడితో నీకే వాతలు పెడతాను" అంటూ ఆయన కాలెత్తి గట్టిగా ఆమె డొక్కలో తన్నాడు. ఆమె నేలకూలకుండా జుట్టు పట్టుకుని ఆపాడు.

అరణ్య చటుక్కున లేచి నిలబడ్డాడు.

"బుద్ధిగా కూర్చో. లేదా ఇప్పుడే చస్తుంది" అంటూ వనజ పీక పట్టుకున్నాడాయన.

సరిగ్గా అప్పుడు వెనకనుంచీ వచ్చి ఆయన్ని బలంగా తాకింది వక్రదండం. ఆ వెంటనే అరణ్య సింహనాదం. ఆ వెంటనే హిరణ్యరావు ఆర్తనాదం.

ఆ తర్వాత అరణ్య ప్రేమనాదంతో కానీ ఆ నాదాలు ఆగలేదు.

●●●

అప్పుడు అరణ్య ఉగ్రనరసింహుడు. వనజ చెంచులక్ష్మి.

రక్తసిక్తమైన శవాలు. భీకరారణ్యం. వెంటాడుతున్న ఘోరానుభవాలు.

ఆ సమయంలో కూడా వనజ మనసు చిక్కబట్టుకుంది. సంకోచాన్ని విడిచి అరణ్యకి సానుకూలంగా స్పందించింది. అతడు శాంతించాక తన వాళ్ళుండే శిబిరానికి వెళ్ళింది.

అక్కడ ప్రహ్లాదకి ప్రథమ చికిత్స జరుగుతోంది.

"డాక్టర్! అతడు బ్రతుకుతాడంటారా?" అడిగింది వనజ.

"అతడిదిప్పుడు చావు బ్రతుకుల మధ్య సన్నని తీగెపై నడక. జీవితేచ్ఛ ఉంటే బ్రతికే అవకాశం కొంతైనా ఉంది కానీ - అతడికది ఉన్నట్లు తోచదు" అన్నాడు డాక్టరు.

"అతడితో మాట్లాడొచ్చా?" అడిగింది వనజ.

"వనజా! నీతో మాట్లాడాలనే నేనింకా బ్రతికున్నాను" ప్రహ్లాద్ చటుక్కున కళ్ళు తెరిచి నీరసంగా అన్నాడు.

"నీ మంచి చెడ్డలు అంచనా వెయ్యలేక ఇన్నాళ్ళూ సతమతమయ్యాను. చివరి క్షణాల్లో నీ అసలు రంగు బయట పెట్టావు. నిన్నెవరు చంపారో నాకు తెలియదు కానీ - ఆ నేరం నా మీదకి నెట్టి నీ తండ్రిని నా మీదకి ఉసిగొల్పావు. ఎందుకు చేసావిదంతా?" గద్దిస్తున్నట్లే అంది వనజ.

"మంచి చేసి నీ చేత చెడ్డ అనిపించుకోవడం నా కిది మొదటిసారి కాదు. నీకోసం నేనేం చేసానో - వివరంగా ఉత్తరంలో వ్రాసి ఓ కవర్లో పెట్టాను. ఆ కవరిప్పుడు నా జేబులోనే ఉంది. అది చదివేలోగా నేను చెప్పే రెండు మాటలు విను. హిరణ్యమంటే బంగారమని తలిదండ్రులాయనకి హిరణ్యరావని పేరు పెట్టి ఉండొచ్చు - కానీ మా నాన్న నిజంగా హిరణ్యకశిపుడు. ఆ రాక్షసుడు బ్రహ్మనుంచి వరాలు పొందితే - మా నాన్న చట్టం నుంచి వరాలు పొందాడు. నరసింహుడిలా మనిషిలో మృగాంశ ఉన్నవాడు తప్ప వేరెవ్వరూ ఆయన్ని చంపలేరు. అలాంటి అవతారపురుషుడు నీ అరణ్య. క్రూరత్వాన్నే తప్ప మంచిని హింసించలేని అరణ్యకి - నాన్నని రక్షిస్తున్న వంచన అభేద్యమైంది. దాన్ని పగలగొట్టి ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టడానికి నీ ప్రయత్నాలు నువ్వు చేసావు కానీ ఒక్కటీ ఫలించలేదు. నా ప్రయత్నంగా నాకు నేనే ప్రాణాపాయం కల్పించుకుని - ఆ నేరం నీమీదకి నెట్టాను. అరణ్య ముందు ఆయన అసలు రూపం బయటపెట్టడానికి నాకు తోచిన మార్గమదొక్కటే! ఆ దెబ్బతో నాన్న పని సరి. ఆ పైన ఇక నీకూ నా అవసరముండదు కాబట్టి నేను హాయిగా కన్నుమూయొచ్చు. కానీ నువ్వు నన్నొక రాక్షసుడి కొడుకులాకాక - నిన్ను మనసారా ప్రేమించిన వ్యక్తిగా గుర్తుంచుకుని నీ హృదయంలో స్థానమిస్తేనే నా ఆత్మకి శాంతి" అన్నాడు ప్రహ్లాద్.

అప్పుడు వనజ కళ్ళలో తిరిగిన నీళ్ళు - ఆమె తనువునే కాదు, మనసునీ తడిపి ముద్ద చేసాయి.

భారతదేశంలో పుణ్యమూర్తులకి కొదవలేదు. మహాత్ముడి పిలుపుకి స్పందించిన సామాన్యులు - లాఠీలకీ, తుపాకి గుళ్ళకీ నిర్భయంగా ఎదురునిలిచారు. శత్రుదేశం యుద్ధనినాదానికి స్పందించిన సామాన్యులు - కుల మతజాతి విభేదాలు విస్మరించి ఒక్క త్రాటిపై నిలిచారు.

అలాంటి సామాన్యులు హిరణ్యారావులనెలా భరిస్తున్నారు? ఎందుకు ఎదిరించలేకపోతున్నారు?

"ప్రహ్లాద్ - నీకోసం కాకుండా - కేవలం నా కోసం జీవించిన నువ్వు నిస్సందేహంగా నిస్వార్ధపరుడివి. ఇక నువ్వు దేశాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి - వల్లకాదనిపిస్తే అదీ నాకోసమేననుకో. దేశం నీలాంటివాళ్ళతో నిండిపోతే - తీవ్రవాదులందరికీ హిరణ్యారావు గతే పడుతుంది. ఆలోచించు. నీ అవసరం దేశానికుంది. నువ్వు నన్ను ప్రేమిస్తే - ప్రాణమివ్వాల్సింది నాకోసం కాదు, దేశం కోసం! అప్పుడే నా మనసుకి శాంతి!" అంది వనజ.

కళ్ళుమూసుకుని ఉన్న ప్రహ్లాద్‌ని చూస్తూ - "అతడు వింటున్నాడు. కానీ మాట్లాడ్డానికి కొంత వ్యవధికావాలి" అన్నాడు డాక్టరు.

●●●

అడవిలో శిబిరం దగ్గరికి పోలీసుల్ని వెంటబెట్టుకొచ్చింది లీల. వివరాలు తెలిసిన పోలీసులు అరణ్యని అరెస్టు చేయబోయారు.

"హత్య చేసింది నేను. అతడు నా ఆయుధం మాత్రమే. మన చట్టం హంతకులనే తప్ప హత్యాయుధాల్ని శిక్షించదు. అతణ్ణి వెళ్ళనివ్వండి" అంది వనజ.

"అతడు హంతకుడా, ఆయుధమా అన్న విషయం న్యాయస్థానం తేలుస్తుంది. అతణ్ణి అరెస్టు చేయక తప్పదు" అన్నాడు ఇన్స్పెక్టరు.

"నేను మన చట్టాన్ని వ్యతిరేకించను. కానీ ఇతడు మన చట్టానికి అతీతుడు. తన చట్టం ప్రకారం తను ప్రవర్తించిన ఇతణ్ణి శిక్షించే అధికారం మనకి లేదు. మీరు అతణ్ణి మర్చిపొండి. నన్ను అరెస్టు చేయండి" అంది వనజ. ఈ సంభాషణ అరణ్య వింటున్నాడు. సారాంశం అతడికి అర్ధమౌతోంది. అతడామె పక్కన చేరాడు. ఆమెని దగ్గరగా తీసుకున్నాడు. ఆమె చేతులు బలంగా పట్టుకున్నాడు. ఆమెనెప్పటికీ వదలనన్నట్లు రెండు చేతులతోనూ పైకి ఎత్తాడు. అంతే - మెరుపులా అక్కణ్ణించి మాయమయ్యాడు.

పోలీసులు తుపాకులనెత్తితే లీల వాళ్ళ దారికి అడ్డంగా నిలబడింది.

"మీకు సిగ్గుందా? నా భర్త అధికారమదంతో మీలో కొందర్ని చంపాడు. మీ వాళ్ళకోసం తన ప్రాణాల్ని పణంగా పెట్టి నా భర్తనెదిరించింది వనజ. ఆమెకి సాయపడ్డాడు అరణ్య. అలాంటి వాళ్ళమీద తుపాకులెత్తుతారా? మీ గురించి మీరు ఆలోచించుకోండి. నా భర్త రాక్షసుడైతే ఆయనకి మీరు రక్షకులయ్యారు. నా భర్త దుష్టకార్యాలు చేస్తుంటే - ఆయనకి మీరు వందిమాగధులయ్యారు. క్రూరమృగమైనా - అది తిండికోసం సాధుజంతువు ప్రాణం తీస్తే - దాన్ని మృగరాజుని గౌరవిస్తాం. నీచ మృగమైన నా భర్తని చంపినా, సాధుమృగమైనా నా బిడ్డని చావుబతుకుల్లోకి నెట్టినా - ఆ అరణ్యని నేను మృగరాజుని గౌరవిస్తాను. ఆ ప్రకృతి పుత్రుణ్ణీ, అతణ్ణి అవతారపురుషుణ్ణి చేసిన దేవతామూర్తినీ - ఈ మృగాలమద్యనుంచి వెళ్ళనివ్వండి. తమకి నచ్చిన చోట జంటగా స్వేచ్ఛగా బ్రతకనివ్వండి. అదే మనకి మనం చేసుకోగల ప్రాయశ్చిత్తం" అందామె.

పోలీసులు ఎత్తిన తుపాకులు దించలేదు. వాటిని వాళ్ళు గాల్లోకి పేల్చారు. ఆ తర్వాత వారి తలలు నేలకి వంగాయి.

●●●

అహమ్మదాబాద్‌లో జరిగిన బాంబు పేలుళ్ళకి సంబంధించిన హెచ్చరిక - కెన్నత్ హేవుడ్ పర్సనల్ కంప్యూటర్నించి వెళ్ళింది. పోలీసులాయన్ని ప్రశ్నించాలనుకున్నారు. నేరస్థుడు కాకపోయినా, ఆ ప్రశ్నలయ్యేవరకూ ఆయన భారతదేశం విడిచి వెళ్ళడానికి లేదు. కానీ

ఆయన పబ్లిగ్గా టికెట్ కొనుక్కుని పబ్లిగ్గా విమానమెక్కి పబ్లిగ్గా అమెరికా చేరుకున్నాడు. ఆయన అంత సులభంగా దేశాన్నెలా విడిచి వెళ్ళగలిగాడని దేశంలో కాసేపు బాగుండదు మర్యాదకన్నట్లు సంచలనం.

కాబట్టి వనజ, అరణ్య అక్కడికెలా చేరారూ అన్నది అప్రస్తుతమే తప్ప అసంభవం మాత్రం కాదు.

అటువా దీవిలో వాళ్ళిద్దరూ నాగరికతకి దూరంగా - ప్రకృతి తన సంతానానికిచ్చిన వనరులతో - సుఖంగా, సంతోషంగా జీవిస్తున్నారు.

అప్పుడప్పుడు వాళ్ళు డేవిడ్, మార్గరెట్‌లని కలుసుకుంటారు.

"సుఖసంతోషాలకోసం ఈ దీవిదాకా రాగలిగాం. అదే మా ఘనత అనుకున్నాం. నువ్వు గెస్ట్ హౌస్ పరిమితులుమించి అటువా రేఖ దాటి మరో మెట్టు పైకి వెళ్ళావు. నీ స్థాయి చేరుకునేందుకు మాకెంతకాలం పడుతుందో!" అంటూ ఆ దంపతులామెని అభినందిస్తూంటారు.

"మనిషిని నాగరికత తీవ్రతనుంచి రక్షించే అటువా రేఖలు ఊరూరా వెలిసి - అటువాల స్థాయిలో మనిషి ప్రకృతి సంతానంగా వర్ధిల్లిన రోజున - ఈ భూమి దేవతలకే ఆదర్శ సామ్రాజ్యమౌతుంది. నాగరికత గొప్పతనాన్ని ప్రపంచమంతా గ్రహించే విధంగా అటువా రేఖకి అవతల అటువాలని తీర్చిదిద్దడమే నా ప్రస్తుతాశయం" అంటుంది వనజ.

ఆమె అటువాలని నాగరికత దారిలో నడిపించాలనుకుంటే - అటువేతరులని నాగరికత బారినుంచి రక్షించేవారి కోసం అన్వేషణ మొదలైంది సమాజంలో. ఎందుకంటే ఇప్పుడు మనమెరిగిన వనజ సమాజంలో లేదు మరి!

(సమాప్తం)